

# రైతు వాణి

## వడ్డే శోభనాద్రీశ్వర రావు



# రైతు వాణి

వడ్డే శోభనాద్రీశ్వర రావు

Blank Page



**NARA CHANDRABABU NAIDU**

**HYDERABAD**

**CHIEF MINISTER**
ANDHRA PRADESH

## సందేశం

వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విభిన్నాంశాలపై విషయ పరిజ్ఞానం గల, అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్. ఆయన 1991-96 మధ్య కాలంలో 10వ లోక్ సభలో చేసిన 71 ప్రసంగాలను ఏర్చి, కూర్చి "రైతువాణి" పేరుతో ఒక సంకలనాన్ని వెలువరించడం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

ఈ ప్రసంగాలలో ప్రస్తావించిన వాటిలో సామాజిక రంగం, మత సామరస్యం, ప్రజా జీవితంలో అవినీతి - అక్రమాలకు సంబంధించి తపనతో, ఆవేదనతో లోతైన భావాలను ప్రకటించినప్పటికీ, పుస్తకంలో 25 చర్చనీయాంశాలు రైతుల బాగుకు చెందినవే కావడం తొలి నుండీ శ్రీ శోభనాద్రీశ్వరరావు గారికి వ్యవసాయ రంగం పట్ల గల ఆసక్తిని, ప్రగాఢానుబంధాన్ని తెలియజేస్తోంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒక బాధ్యతగల ఎం.పి.గా.నిర్మాణాత్మకమైన, సహేతుకమైన, స్పష్టమైన భావాలను వ్యక్తీకరిస్తూ గ్రంధ కర్త చర్చించిన అంశాలు ప్రజాజీవితంలో భావితరాల నాయకులకు ముఖ్యంగా యువతరానికి మార్గదర్శకం కాగలవని ఆశిస్తున్నాను. ఈ పుస్తకం మిగతా భారతీయ భాషలలోకి, కనీసం ఆంగ్లం, హిందీ భాషలలోకి అనువదింప చేసి ప్రచురిస్తే మరింత మందికి ప్రయోజనకరంకాగలదని భావిస్తూ, శ్రీ శోభనాద్రీశ్వరరావుగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

(నారా చంద్రబాబు నాయుడు)

# Rythu Vani

*(Farmers Voice)*

***By Vadde Sobhanadreeswara Rao***

*Foreword by :*
*Sri Bhanu Pratap Singh*
*Former Union Minister for Food,*
*Former Governor of Karnataka*

*First Publication :*
***21st October, 2003***

*Price : Rs. 50/-*

*Cover page designed by*
*Raghu, Digital Thoughts*

*Printed at*
*Kalajoythi Process Pvt. Ltd.*
*RTC 'X' Roads, Hyderabad*

*Published by*
*V.V.A. Prasad*
*Sivalayam Street,*
***Vuyyuru***
*Krishna District*

# అంకితం

**నా** భార్య శ్రీమతి బసవ రాజ్యం 'సహధర్మచారిణి' అనే పదానికి సజీవ నిదర్శనంగా, నలభై వసంతాల మా దాంపత్యాన్ని ఒక మధుర స్వప్నంగా తీర్చిదిద్దింది. గత ముప్పై సంవత్సరాల నా రాజకీయ జీవితంలో మా ఇంటికి ప్రతి రోజూ, అన్ని సమయాల్లోను వచ్చే అనేక మంది సందర్శకులకు, అతిధులకు, తన శక్తికి మించిన శ్రమకు లోనవుతూ కూడా, ఏ క్షణంలోనూ విసుక్కోకుండా అందరికీ ఆత్మీయంగా ఆతిధ్యం అందిస్తూ, నేను కొన్ని వేల మంది ప్రేమాభిమానాలను పొందడానికి కారణమయ్యింది. నా రాజకీయ జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎన్నడూ, కించెత్తు అభద్రతాభావనకు లోను కాకుండా, భవిష్యత్తును గురించి ఏమాత్రం అందోళన చెందకుండా, ఏమీ కూడబెట్టలేక పోయామని, వారసత్వంగా వచ్చిన ఆస్తులను కూడా నిలుపుకోలేకపోయామన్న నిస్పృహకు గురికాకుండా నారాజకీయ జీవితాన్ని నిర్మలంగా, నిష్కళంకంగా, తీర్చిదిద్దుకోవడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించింది. నిరంతరం అంకిత భావంతో నాకు అన్నీ సమకూర్చిపెడుతూ నేను ప్రజలకు అంకిత భావంతో పని చేయడానికి వీలు కల్పించిన నా భార్య శ్రీమతి బసవరాజ్యంకు ప్రేమానురాగాలతో ఈ పుస్తకాన్ని అంకితం ఇస్తున్నాను.



వడ్డే శోభనాద్రీశ్వర రావు

# వ్యక్తిగత వివరాలు

| | | |
|---|---|---|
| పుట్టిన తేది | : | ది. 21.10.1943 |
| జన్మస్థలం | : | ఉయ్యూరు గ్రామం, కృష్ణాజిల్లా |
| తల్లిదండ్రులు | : | అన్నపూర్ణమ్మ, అంకయ్య |
| వివాహం | : | 17.5.1963 |
| భార్య | : | బసవరాజ్యం |
| పిల్లలు | : | లక్ష్మి అన్నపూర్ణ, అంకినీడు ప్రసాద్ |
| విద్యార్హతలు | : | బి.ఎస్‌సి, బి.ఇ. (మెకానికల్) |
| రాజకీయ ప్రవేశం | : | 1967 సం॥లో స్వతంత్ర పార్టీలో చేరిక |
| అభిమాన నాయకులు | : | ఆచార్య ఎన్.జి. రంగా<br>చౌదరీ చరణ్ సింగ్<br>ఎన్.టి. రామారావు |
| నిర్వహించిన పదవులు | : | 1978-83 శాసనసభ సభ్యులు, ఉయ్యూరు<br>1984-89 పార్లమెంట్ సభ్యులు, విజయవాడ<br>1989-91 1. భాను ప్రతాప్‌సింగ్ అధ్యక్షతన వ్యవసాయ రంగ విధానాలు మరియు కార్యక్రమాల అమలుపై నియమింపబడిన ఉన్నతస్థాయి కమిటీలో సభ్యులు<br>2. శరద్‌జోషి అధ్యక్షతన వ్యవసాయ స్థాయిసంఘం సభ్యులు<br>1991-96 పార్లమెంట్ సభ్యులు, విజయవాడ<br>1997-99 న్యూఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ, ప్రత్యేక ప్రతినిధి<br>1999 శాసనసభ సభ్యులు, మైలవరం<br>వ్యవసాయశాఖ మంత్రిగా నియామకం |
| పర్యటించిన దేశాలు | : | అమెరికా, ఇండోనేషియా, సింగపూర్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, జపాన్, కొరియా, చైనా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ |
| గ్రంథాలు | : | 1. ఆంధ్రరైతు ఆవేదన<br>2. ప్రజల ఎదురు తెన్నులు - పాలకుల తీరుతెన్నులు<br>3. రైతువాణి |
| చేపట్టిన కార్యక్రమాలు | : | 1. సంప్రదాయ వ్యవసాయ విధానాల అమలు<br>2. భూసార పెంపుదల<br>3. ఉత్పత్తి ఖర్చు తగ్గించి నికరాదాయ పెంపుదలకు కృషి<br>4. ఉత్పత్తుల నాణ్యత పెంచి అంతర్జాతీయ పోటీకి రైతాంగాన్ని సిద్ధం చేయడం<br>5. సమర్థ సాగునీటి యాజమాన్యం<br>6. డెయిరీ, పౌల్ట్రీ, ఆక్వారంగ అభివృద్ధి<br>7. బడుగు, బలహీన వర్గాల ప్రగతికి కృషి<br>8. గ్రామీణాభి వృద్ధి |

# కృతజ్ఞతాంజలి

స్వేచ్ఛావాద సిద్ధాంతాల పట్ల నాకున్న అచంచల విశ్వాసాన్ని ఒక రాజకీయ మార్గంగా తీర్చిదిద్దిన **ఆచార్య ఎన్. జి. రంగా** గారికి నేనెప్పటికీ ఋణపడి వుంటాను. రైతాంగ సంక్షేమానికి అంకితం కావడానికి నాకు స్ఫూర్తినిచ్చిన **చరణ్‌సింగ్** సైద్ధాంతిక ప్రతిభకు జోహార్లు అర్పిస్తున్నాను. రాజకీయ జీవితంలో నీతి, నిజాయితీలను, ఉన్నత విలువలను పునః ప్రతిష్టించడానికి దేశ వ్యాప్తంగా మహోద్యమం సాగించిన **లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్** బోధనలు నా ఆలోచనల్లో విడదీయ రానివిగా రూపొంది ఆయన్ను నిరంతరం స్మరించుకొనేలా చేశాయి. నా రాజకీయ జీవితంలో నేను ముందడుగు వేయడానికి, తొలిసారి శాసనసభ్యునిగా ఎంపిక కావడానికి, నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించి నాకు కొండంత అండగా నిలిచిన **సర్దార్ గౌతు లచ్చన్న** గారికి, **సుంకర సత్యనారాయణ** గారికి ఎప్పటికీ కృతజ్ఞుడిగా వుంటాను.

తెలుగుదేశంలో జేరినప్పటి నుండీ నన్ను అభిమానంతో ఆదరించి, భిన్నమైన వ్యక్తిగా నన్ను గౌరవించి, రెండుసార్లు లోక్‌సభ సభ్యునిగా ఎంపిక చేసిన **ఎన్.టి. రామారావు** గారికి నా కృతజ్ఞతాంజలి. తొలిసారిగా నాతోపాటు శాసనసభకు ఎన్నికై, గత పాతిక సంవత్సరాలుగా సోదరభావంతో అభిమానిస్తూ, నన్ను తన మంత్రివర్గంలో జేర్చుకొని, రైతుల సమస్యలను, ఎప్పుడు వారి దృష్టికి తెచ్చినా మరో ఆలోచన లేకుండా తక్షణమే వాటి పరిష్కారానికి ఉద్యమించే మన ప్రియతమ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు **శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి** నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. రాష్ట్రానికి చెందిన అనేక పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్ర అనుమతి పొందడానికి వీలుగా నన్ను ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధిగా నియమించినందుకు వారికి మరోసారి కృతజ్ఞతలు తెలుపు తున్నాను.

నేను ఎన్నికలలో పోటీ చేసిన ప్రతిసారీ, నా మిత్రులు, అభిమానులు, బంధువులు నాకు సహాయ సహకారాలందిస్తూ, తామే ఎన్నికలలో నిలబడ్డామన్న పట్టుదలతో చేసిన కృషిని ఎన్నటికీ మరువలేను. నా ఎన్నికల వ్యయభారాన్ని ఎప్పటి కప్పుడు అతి చిన్న ఆర్థికస్థితి వున్న కార్యకర్తలతో సహా, నా సన్నిహితులు తామే భుజాన వేసుకొంటుండడంతో నాకు నైతిక విలువల్ని కాపాడుకోవడం, స్వచ్ఛమైన రాజకీయ జీవితం గడపడం సాధ్యమయ్యిందని గర్వంతో ప్రకటిస్తున్నాను. వారందరికీ నా నమోవాకాలు.

ఇక నా వ్యక్తిగత జీవితంలో, నానుండి ఏమీ ఆశించకుండా, నేను చేయకలిగిన పనులు కూడా చేయలేకపోతున్నానని నిస్పృహ చెందకుండా, నన్నెప్పుడూ నిందించక, నా రాజకీయ, అధికారిక బాధ్యతలలో జోక్యం చేసుకోకుండా నన్ను అమితంగా ప్రేమించే **మా అబ్బాయి ప్రసాద్‌కు , మా అమ్మాయి అన్నపూర్ణ(అమ్మడు)**కు హృదయ పూర్వక అభినందనలు తెలుపుతున్నాను.

**- వడ్డే శోభనాద్రీశ్వరరావు**

# ప్రసంగపాఠాలు

## వ్యవసాయరంగం


1. డంకెల్ బారి నుండి మన రైతుల ప్రయోజనాలు పరిరక్షించుకొందాం..... 23
2. వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయికి కొనిపోదాం................................ 35
3. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి........................................................ 40
4. వ్యవసాయ రంగంలో ఎందుకు విఫలమవుతున్నాము?......................... 46
5. వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి........................ 51
6. ప్రపంచవాణిజ్య సంస్థకు భావితరాలను బలిచేయవద్దు.......................... 57
7. రైతులపట్ల ప్రభుత్వానికి సానుభూతిలేదు............................................ 61
8. భూ పరిమితి చట్టాలను ప్రభుత్వం నిజాయితీతో అమలుచేయాలి.......... 70
9. ఎరువులపై రాయితీలు కొనసాగించాలి................................................ 73
10. జాతీయ వ్యవసాయ విధానాన్ని సరిగ్గా రూపొందించండి........................ 75
11. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వాలి................................ 78
12. ప్రత్తి రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?........................................ 80
13. రైతులను క్రుంగదీస్తున్న మద్దతు ధరలు............................................ 81
14. పొగాకు రైతులను ఆదుకోవాలి........................................................ 82
15. వ్యవసాయానికి పెద్దపీట వేయాలి...................................................... 84
16. మనకు సరియైన వ్యవసాయ విధానం లేదు........................................ 87
17. నూతన ఆర్థిక విధానములో వ్యవసాయాన్ని ఏం చేయబోతున్నాం.......... 90
18. ఎరువుల ఫ్యాక్టరీలకు 12% లాభం! విద్యుత్ కంపెనీలకి 16% లాభం !........... 95
రైతుకు కనీస లాభం అక్కర్లేదా?
19. గ్రామీణ పేదరికాన్ని పారద్రోలటమెలా?................................................ 97
20. ఈ ప్రభుత్వం ఎవరికోసం? ఎందుకోసం?............................................ 100
21. కరువుకు శాశ్వత పరిష్కారం ఏది?.................................................... 106
22. చెరుకురైతుల ప్రయోజనాలను కాపాడండి............................................ 107
23. పులిచింతల ప్రాజెక్టు కట్టాలి.............................................................. 108
24. కరువు పరిస్థితులలో రైతును ఆదుకోవాలి.......................................... 109
25. వరదలవచ్చే నష్టాలను ఎలా నివారించాలి.......................................... 113


## సామాజిక రంగం


26. సామజిక అసమానతలను తగ్గించాలి.................................................... 117
27. ఖనిజ సంపదను సద్వినియోగ పరచుకొందాం.......................................... 120

28. చిన్నతరహా పరిశ్రమలను దెబ్బతీయవద్దు. మహాత్ముని మరిచిపోవద్దు..... 122
29. స్థానిక సంస్థలను బలోపేతం చేద్దాం.................................... 126
30. సంపూర్ణ అక్షరాశ్యత సాధించాలి.................................... 132
31. పారిశుధ్య కార్మికుల అభ్యున్నతికు కృషిచేద్దాం.................................... 137
32. విజయవాడ విమానాశ్రయం అభివృద్ధి .................................... 142
33. నిరుద్యోగులకు ఉపాధికల్పన జరగాలి.................................... 143
34. గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేయవద్దు.................................... 148
35. నిలువనీడ లేనివారిని పట్టించుకోరా?.................................... 151
36. జాతీయ గృహవిధానానికి ఆమోదం తెలపాలి (17.8.94).................................... 153
37. పేదలపై పెనుభారం పెరుగుతోంది.................................... 154
38. ఒకరు లేక ఇద్దరు చాలు .................................... 156
39. తల్లిబిడ్డల సంరక్షణ అతిప్రధానం.................................... 158

## ప్రభుత్వ విధానాలు - చట్టాలు

40. వినిమయదారుల పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి.................... 161
41. వినియోగదారుల చట్టాల విషయంలో ప్రజల్ని చైతన్య పరచాలి............ 165
42. ఎగుమతి-దిగుమతుల విధానం సవరించాలి.................................... 169
43. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ ఆర్డినెన్సు.................................... 172
44. ప్రజాప్రాతినిధ్య చట్టానికి సమగ్రమైన సవరణలు చేయాలి.................. 175
45. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించవద్దు. ఎన్నికల సంస్కరణలు కావాలి.. 180
46. ఎన్నికల సంస్కరణల అవశ్యకత.................................... 183
47. పేదలకు అందుబాటులో మందుల ధరలు వుండాలి.......................... 186
48. వన్యప్రాణుల సంరక్షణ చట్టంలో మార్పులు చేయాలి........................ 188
49. పాస్‌పోర్టు జారీలో జాప్యం కూడదు.................................... 189
50. రైల్వేల పనితీరు నిరుత్సాహం కలిగిస్తోంది.................................... 191
51. విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా తీర్చి దిద్దుకోవాలి.......................... 195
52. ఎన్.జి. రంగా, ఎన్.టి. రామారావు, మురార్జీదేశాయిగార్లకు నివాళులు.. 198

## శాంతి భద్రతలు

53. బలహీన వర్గాలపై దురాగతాలను అరికట్టాలి.................................... 203
54. మా నమ్మకాన్ని వమ్ముచేయవద్దు.................................... 207
55. జమ్మూకాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులు ఏర్పడాలి.................................... 209
56. నిరంకుశ టాడా చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాను.................................... 212
57. తీవ్రవాదుల ఆగడాలు అరికట్టాలి.................................... 216

58. చట్టానికి ఎవరూ అతీతులుకాదు........................................................ 217
59. ప్రముఖులకు రక్షణ కల్పించాలి........................................................ 219

## మతసామరస్యం

60. ఉమ్మడి పౌనస్మృతి ఇప్పుడే సాధ్యంకాదు............................................ 223
61. బాబ్రీమసీదు వివాదాన్ని పరిష్కరిద్దాం.................................................. 227
62. మతసామరస్యం ప్రమాదంలో పడింది.................................................. 238
63. మతాల మధ్య చిచ్చుపెట్టవద్దు.......................................................... 239

## కుంభకోణాలు

64. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేవారిని ఏంచేస్తారు?................................ 243
65. న్యాయమూర్తులే అక్రమాలకు పాల్పడితే ఏంచేయాలి?.......................... 246
66. బోఫోర్సు దర్యాప్తును ప్రక్కదోవ పట్టించవద్దు......................................... 249
67. నల్లధనాన్ని అరికట్టే ఉద్దేశ్యం ప్రభుత్వానికి వుందా?.............................. 254
68. కుంభకోణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.................................. 258
69. బ్యాంకింగ్ రంగం అవినీతికి ఆలవాలమయ్యింది................................ 265
70. అవినీతిపరులకు ప్రభుత్వమే పెద్ద రక్షణకవచం!.................................. 269
71. బ్యాంకులలో జరిగే కుంభకోణాలను నివారించాలి................................ 270
72. కోట్లరూపాయల ప్రజాధనాన్ని దోచుకుతింటున్నారు............................ 271

# పసిడి పలుకులు

భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తికి అనువైన వనరులు ప్రకృతి ప్రసాదించిన వరం. ఆహార పంటల విస్తీర్ణం సాగునీటి సౌకర్యం ఇతర దేశలలో కంటే మనదేశంలో విస్తారంగా వుంది. ప్రపంచంలోని మరే ఇతర దేశంలోను లేని అనుకూల వాతావరణం మనదేశంలో వుంది. దీనితో సంవత్సరం పొడవునా ఒక పంట కంటే ఎక్కువ పంటలు పండించే వీలుంది. ఇతర దేశాలలో దీర్ఘకాలంవుండే శీతల వాతావరణం వ్యవసాయ ఉత్పత్తిని దెబ్బతీస్తుంది. ఇన్ని అనుకూల పరిస్థితులున్నప్పటికీ ఆహార ధాన్యాల ఉత్పాదకతలో మన దేశంలో సగటు హెక్టారు దిగుబడులు ప్రపంచ సగటులో నాలుగింట మూడు వంతులు కంటే తక్కువగాను, వ్యవసాయకంగా అభివృద్ధి చెందిన దేశాల సగటుతో పోలిస్తే సగంకంటే తక్కువ దిగుబడులు మాత్రమే సాధించాం. హరిత విప్లవం అనంతరం కూడా తలసరి ఆహారధాన్యం లభ్యత ప్రపంచ సగటుతో పోలిస్తే మూడింట రెండు వంతులు కంటే తక్కువగా వుంది.

దురదృష్టకరమేమిటంటే, 9వ ప్రణాళిక కాలంలో జనాభా పెరుగుదల రేటు కంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో వృద్ధి రేటు తక్కువగా వుంది. ఋతు పవనాలు సహకరించనందువలన 9వ ప్రణాళిక కాలంలో వ్యవసాయరంగ అభివృద్ధి అంత ఆశాజనకంగా లేదు. గత 5 సంవత్సరాల సగటు వర్షపాతం సాధారణ వర్షపాతంతో పోలిస్తే 92% నుండి 106% మధ్యనే వుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో వృద్ధిరేటు తగ్గటం వలన మన తలసరి ఆహారధాన్యాల లభ్యత అవసరమైన పౌష్టికాహారమునకు కావలసిన కనీస క్యాలరీల వినియోగం తగ్గిపోయింది. మానవ అభివృద్ధి సూచిక 2003 ఆధారంగా భారతదేశంలో పౌష్టికాహార లోపం వున్న జనాభా గత కొన్ని సంవత్సరాల క్రితం 21 శాతం వుండగా అది ప్రస్తుతం 24 శాతానికి చేరింది. చైనా జనాభా భారతదేశ జనాభా కంటే 26శాతం అధికంగా వున్నప్పటికీ, ఆ దేశ జనాభాలో పౌష్టికాహార లోపంవున్న ప్రజలు

కేవలం 9 శాతం మాత్రమే. ప్రపంచమంతటికీ భారత దేశంలోనే అత్యధిక పౌష్టికాహారలోపం వున్న ప్రజలు వుండటం మనకెంతో సిగ్గుచేటు.

**గత** ప్రభుత్వాలు అనేక సంవత్సరాలుగా వ్యవసాయ రంగం పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యం, సవతి తల్లి ప్రేమ వలన వ్యవసాయ అభివృద్ధి కుంటుబడింది. గ్రామీణ పేదరికం పెరిగింది. వ్యవసాయం, అనుబంధ వ్యాపకాలు, గ్రామీణాభివృద్ధి మరియు సాగునీటి రంగాలకు మొదటి ప్రణాళిక కాలంలో 37 శాతంగా వున్న ప్రణాళిక వ్యయం 9వ ప్రణాళిక నాటికి 19.4 శాతానికి పడిపోవడమే దీనికి చక్కని ఉదాహరణ. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులపై వడ్డీలు, వ్యవసాయ కూలీరేట్లు, విత్తనాలు, రసాయనిక ఎరువుల ధరలు ఏ ఏటి కాయేడు పెరుగుతుండగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మాత్రం నియంత్రించబడుతున్నాయి.

**దే**శంలోని మొత్తం పెట్టుబడులలో వ్యవసాయ రంగానికి పెట్టే పెట్టుబడి 1980-81 సం॥లో 15.49 శాతం వుండగా 1999 - 2000 నాటికి 7.1శాతానికి పడిపోయింది. బ్యాంకులు ఇస్తున్న మొత్తం ఋణాలలో కేవలం 8వ వంతు మాత్రమే వ్యవసాయదారులకు అందుతున్నాయి.

**మ**న ఆహార భద్రతా వ్యవస్థ కూడా తన ప్రధాన లక్ష్యాలను సాధించడంలో విఫలమైంది. రైతుల ఉత్పత్తులకు కనీస మద్ధతు ధర ఇవ్వడంలోను, పేదలకు సహాయపడడంలోను ఇది విఫలమైంది. దేశంలోని మొత్త వ్యవసాయ ఉత్పత్తులో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యాన రాష్ట్రాలు కేవలం 27 శాతం ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం తన మొత్తం కొనుగోళ్లలో 80 శాతాన్ని ఈ రాష్ట్రాల నుండే కొనుగోలు చేస్తోంది. దేశంలో మిగిలిన 73% ఉత్పత్తులకు రైతులు కనీస మద్దతు ధర పొందలేకపోతున్నారు. చాలా మంది రైతులు విధిలేని పరిస్థితుల్లో తమ అవసరాల నిమిత్తం అతి తక్కువ ధరలకు తమ ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. భారత ఆహార సంస్థ గిడ్డంగులలో పేరుకుపోతున్న ఆహార నిల్వలు దేశంలోని పేదల ఆకలినిగాని, పౌష్టికాహార లోపాన్ని గాని తీర్చలేకపోతున్నాయని ప్రణాళిక సంఘమే పేర్కొంది.

**జా**తీయ స్థూల ఉత్పత్తిలోని పెరుగుదల పేదల బ్రతుకులను ఏ మాత్రం మెరుగుపర్చలేకపోతోంది. 1993-94 ధరల ప్రకారం గత 5

సంవత్సరాలలో మన జాతీయ స్థూల ఉత్పత్తి 3,04,139 కోట్ల రూపాయలకు పెరిగినా అందులో కేవలం 7.6 శాతం, అంటే సుమారు 23,242 కోట్ల రూపాయలు మాత్రమే వ్యవసాయ రంగం వాటాగా వుంది. గత 5 సంవత్సరాలుగా, మన జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ వృద్ధి రేటు కేవలం 1.67% మాత్రమే. అంటే వ్యవసాయదారుల జనాభా పెరుగుదల రేటు కంటే ఇది తక్కువ. ఒకవైపు జాతీయ స్థూల ఉత్పత్తి అభివృద్ధి చెందడం సంతోషం కలిగిస్తున్నా, మరోవైపు ఆర్థికంగా వ్యవసాయ రంగం దిగజారి పోతోందని అర్థమవుతోంది.

ఆర్థిక ప్రగతిని పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి వినియోగించాల్సిన అవసరం ఎంతైనా వుంది. మన రాజ్యాంగం ఆదేశించినట్లు ఆర్థిక అసమానతలను తగ్గించడంలోను, వివిధ ప్రాంతాలు, వివిధ రంగాలలోవున్న ప్రజల మధ్య అసమానతలు తొలగించి అందరికీ సమానావకాశాలను, సదుపాయాలను, హోదాను కల్పించడానికి ప్రభుత్వం కృషి చేయాలి.

రాజ్యాంగంలో పొందుపరచిన ఈ ఆదేశిక సూత్రాన్ని గనుక ప్రభుత్వం నిజాయితీగా అమలు పర్చినట్లయితే, పట్టణాలకంటే గ్రామీణ భారతంలో నిరక్షరాస్యత రెండు రెట్లు అధికంగా వుండేది కాదు. స్వాతంత్ర్యం లభించిన 50 సంవత్సరాల తర్వాత కూడా మొత్తం శిశు మరణాల శాతం పట్టణాల కంటే గ్రామాలలో రెట్టింపుగా వుండేది కాదు.

తన జీవితం మొత్తం రైతాంగ సమస్యలకై పోరాడుతున్న శ్రీ వడ్డే శోభనాద్రీశ్వర రావు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వుండడం నాకెంతో ఆనందంగా వుంది. ఆంధ్రప్రదేశ్ రైతుల అభివృద్ధి కోసం ఆయన తన శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్న నమ్మకం నాకుంది.

అభినందనలతో,

**- భాను ప్రతాప్‌సింగ్**

లక్నో
ఉత్తరప్రదేశ్

# నివేదన

"గ్రామాలు అభివృద్ధి చెందిన నాడే మన భారతదేశం నిజమైన ప్రగతిని సాధించినట్లవుతుంది. పేదరికం నిర్మూలించబడాలి. సామాజిక అసమానతలు తొలగాలి, అందరికీ విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రావాలి. వ్యవసాయం, అనుబంధ వ్యాపకాలు అభివృద్ధి చెంది గ్రామాలు స్వయం పోషకత్వాన్ని సాధించాలి. గ్రామీణ, కుటీర, చిన్న పరిశ్రమల అభివృద్ధి, చేనేత రంగ వ్యాప్తి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు ప్రజలందరికీ లభించాలి. అందరికీ సమాన న్యాయం అందేలా, ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యకరంగా పనిచేస్తూ మరింత బలపడాలి. పరాయి పాలన నుండి అసంఖ్యాక వీరుల అసమాన త్యాగాల ఫలితంగా స్వాతంత్రం సాధించిన మన మాతృభూమి సర్వతోముఖాభివృద్ధిని సాధించి పూర్వపు ఔన్నత్యాన్ని సాధించాలి".

70వ దశకంలో కొద్దిపాటి సామాజిక అవగాహన వున్న యువకులందరినీ అలరించిన ఆదర్శాలు అవే! దేశాభ్యున్నతికై వ్యక్తిగత స్థాయిలో నేనేం చేయాలి? ఇంజనీరింగ్ చదువుతున్న రోజుల్లోనే నన్ను సతమతం చేసిన ప్రశ్న ఇది. అప్పుడే దేశ రాజకీయాలను నిశితంగా పరిశీలించడం నా కలవడింది.

అవి విభిన్న రాజకీయ విధానాల మధ్య తీవ్రమైన సైద్ధాంతిక ఘర్షణలు జరుగుతున్న రోజులు. ఉత్పత్తి సాధనాలను ప్రభుత్వపరం చేయడం ద్వారా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ప్రజాసంక్షేమం సాధ్యమన్న సామ్యవాద సిద్ధాంతాలను దేశమంతటా అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తుండేది. భూస్వామ్య లక్షణాలున్న సమాజాన్ని పారిశ్రామికీకరణం చేయడం ద్వారా కార్మికులు సంఘటితమై శ్రామిక విప్లవాన్ని కొని తెచ్చి, శ్రామిక వర్గ నియంతృత్వాన్ని నెలకొల్పి సమాజంలో పేదరికాన్ని, అసమానతలను తొలగిస్తామని కమ్యూనిస్టులు వాదించేవారు. ఈ వాదనలకు

భిన్నంగా స్వేచ్ఛాయుతమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన పోటీ, ప్రభుత్వ జోక్యం తక్కువగా వున్నప్పుడే, అన్ని రంగాలలోను దేశం పురోగమిస్తుందని, వ్యక్తులలో చొరవ పెరుగుతుందని, మానవవనరులని పెంపొందించడం ద్వారానే దేశ సంపద పెంపొందుతుందని, అలాగే మహాత్మాగాంధీ ప్రవచించిన అధికార వికేంద్రీకరణ, కుటీర, చిన్న పరిశ్రమల విస్తరణ, గ్రామ స్వరాజ్యం దేశాభివృద్ధికి మూలకందాలని స్వతంత్ర పార్టీ అందరి దృష్టికి తెచ్చేది. అలాగే దేశ స్వాతంత్ర్యోద్యమ సారధి మహాత్మాగాంధీ ప్రవచించిన చిత్తశుద్ధి, నిజాయితీ, రుజువర్తన, పారదర్శకత ప్రతి నాయకుడికి అనుసరణీయమని స్వతంత్రపార్టీ ఉద్భోదించేది. వివిధ విధానాల మధ్య సైద్ధాంతిక ఘర్షణలు, వాదోపవాదాలు జరుగుతున్న నేపధ్యంలో నేను రాజకీయాల పట్ల ఆకర్షితుడ్ని కావటం జరిగింది. పరిశ్రమలను ప్రభుత్వీకరణ చేసి, ప్రభుత్వ జోక్యం మూల మూలలకు విస్తరించి లైసెన్సు, పర్మిట్, కోటా రాజ్యం ఏర్పడడం వలన అవినీతిపరులైన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు మాత్రమే లబ్ధిపొందకలుగుతున్నారని నేను గుర్తించాను. కమ్యూనిస్టు సిద్ధాంతాలు అమలవుతున్న దేశాలలోని స్థితిగతులు క్రమంగా దిగజారుతున్నాయని తెలిపే అనేక వార్తలు, వ్యాసాలు పత్రికలలో రాసాగాయి. స్టాలిన్ హయాములో సోవియట్ రష్యాలో అత్యంత క్రూర సంఘటనలను గురించి కొన్ని పుస్తకాల్లో చదివాను.

అపసవ్య ప్రభుత్వ విధానాల ద్వారా దేశం తిరోగమిస్తోందని, ఈ స్థితిని సరిచేయడానికి బాధ్యత గల ప్రతి ఒక్కరూ ఉద్యుక్తులు కావాలని నేను విశ్వసించాను. కమ్యూనిస్టు పార్టీలను, కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రభావంతో అరిష్టదాయక విధానాలు దేశంలో ప్రవేశ పెడుతున్న కాంగ్రెస్ పార్టీని నేను వ్యతిరేకించేవాడిని.

80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడిన ప్రజలున్న మన వ్యవసాయక దేశం ఆహారధాన్యాల దిగుమతులపై ఆధారపడవలసిన దుస్థితి నన్నెంతో కలవరపరచింది. వ్యవసాయాన్ని కోట్లాది గ్రామీణ ప్రజల జీవనాధారంగా తీర్చిదిద్దడానికి బదులు, వ్యవసాయ రంగాన్ని వెర్రిమొర్రి ఆలోచనలతో అతలాకుతలం చేయడానికి ప్రయత్నించడాన్ని నేను సహించలేక పోయాను. కానీ కాంగ్రెస్ దేశంలో ఏక ఛత్రాధిపత్యాన్ని వహిస్తోంది. ఇంతటి విస్తృతమైన పార్టీలో ప్రజాస్వామ్యయుతమైన చర్చలకు చోటులేదు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పినదే వేదంగా భావిస్తున్న రోజులవి.

కాంగ్రెస్ రాజకీయాలే అసలు రాజకీయాలుగా చలామణి అవుతున్న రోజులవి. ప్రజలందరూ కాంగ్రెస్ మత్తులో జోగుతున్న రోజులలో సహకార వ్యవసాయం వంటి కృత్రిమ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రొఫెసర్ ఎన్.జి.రంగా అత్యంత ప్రతిభావంతంగా, శక్తివంతంగా తన గళాన్ని విప్పి ప్రభుత్వ వాదనలను త్రిప్పి కొట్టడం నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఇంజనీరింగ్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడినైన తరువాత నేను రాజాజీ, రంగాజీ, కె.యం. మున్షీ, యం.ఆర్.మసానీ వంటి నాయకుల సారధ్యంలోని స్వతంత్ర పార్టీలో చేరాను. వ్యవసాయ రంగ ప్రగతే, దేశ ప్రగతిని అప్పటికీ, ఇప్పటికీ నేను విశ్వసిస్తాను.

అప్పట్లో నేను రాజకీయాలలో చేరింది అధికారం పొందటానికి కాదు. అధికారంలో ఉన్న వారి ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించడానికి. ఎలాగోలా ప్రజామోదం పొంది ఎన్నికలలో గెలవడం నా ధ్యేయం కాదు. ప్రజలలో చైతన్యాన్ని రగిలించి తమ అభ్యున్నతికి దోహదం చేసే విధానాలేమిటో వారిచేతే గుర్తింప చేయడానికి. నేను రాజకీయాలలో ప్రత్యక్షంగా పాల్గొనాలని నిర్ణయించుకొన్నది అప్పటి రాజకీయ నాయకులంతా కొట్టుకుపోతున్న ఒరవడిలో ఇమిడిపోవటానికి కాదు. ఆ ఒరవడిని మళ్ళించ డానికి, ప్రత్యామ్నాయ విధానాలను సూచించడానికి. అధికారానికి రావడం ద్వారా అద్భుతాలు చేయడం సాధ్యమని అప్పటికీ, ఇప్పటికీ నేను విశ్వసించడం లేదు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములని చేయడంద్వారా, పారదర్శక పాలన ద్వారా, సామాజిక ప్రాధాన్యతలు సరిగా నిర్ణయించడం ద్వారా మాత్రమే దేశ ప్రగతి సాధ్యమని నేను విశ్వసిస్తాను.

నేను రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు కాంగ్రెస్ పార్టీని ఓడించడమన్నది అసలు ఊహకే అందని విషయం. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజలని మోహరించడం అసాధ్యంగా అన్పించేది. అందుకే ప్రజలలో చైతన్యం రగిలించడానికి వారి ఆలోచనలలో మార్పు తీసుకురావడానికి నేను రాష్ట్రంలోని మేధావులను ఆహ్వానించి రాజకీయ తరగతులు నిర్వహించాను. అనేక సభలు, చర్చాగోష్టులు నిర్వహించాను. ఈ పుస్తకానికి ముందుమాట వ్రాసిన శ్రీ భాను ప్రతాప్‌సింగ్ గారిని ఎమర్జెన్సీ కాలంలోనే (1976) విజయవాడ ఆహ్వానించి ధాన్యం ఉత్పత్తిదారుల మహాసభను ఏర్పాటు చేశాను. శ్రీమతి ఇందిరాగాంధీ అలహాబాద్ హైకోర్టు తీర్పు అనంతరం తన అధికారాన్ని నిలుపుకునేందుకు విధించిన అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా

కరపత్రాలు, లోక్‌నాయక్ సందేశాలను, రచనలను పంపిణీ చేశాను. అనేక నియంతృత్వ వ్యతిరేక సమావేశాల్లో పాల్గొన్నాను.

లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ వంటి మహానాయకులు అవినీతికర నియంతృత్వ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రగిలించిన చైతన్యం కారణంగా, నా వంటి లక్షలాది మంది వ్యక్తులు దేశ వ్యాప్తంగా చేసిన కృషి ఫలితంగా, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఏకత్రాటిపైకి రావడంవలన కాంగ్రెస్ పార్టీ పరాజితమయ్యింది. కేంద్రంలో మొట్టమొదటి పర్యాయం కాంగ్రేసేతర జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పట్లో ఖచ్చితంగా ఓటమి తప్పదని తెలిసి కూడా పార్టీ అభ్యర్థిగా 1977లోక్‌సభ ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేశాను. తరువాత నేను 1978లో మొదటి సారి జనతాపార్టీ శాసనసభ్యునిగా ఎన్నికయ్యాను.

జనతాపార్టీలో చీలిక సంభవించినప్పుడు రైతు నాయకుడు చౌదరి చరణ్‌సింగ్ నాయకత్వంలోని భారతీయ లోక్‌దళ్‌లో బడుగు వర్గాల నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న, శ్రీ సుంకర సత్యనారాయణల నేతృత్వంలో చేరాను. త్యాగధనుడు, నిజమైన సామ్యవాది స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న గార్ల స్ఫూర్తితో శాసనసభ్యునిగా పలు రైతాంగ సమస్యలపై శాసనసభ లోపల, వెలుపల నా వంతు కృషి చేశాను.

జనతా ప్రయోగం విఫలమవ్వడం దేశంలో ప్రజాస్వామ్యానికి పెద్ద విఘాతం. ఇంగ్లండ్, అమెరికా వంటి దేశాల్లోలాగా మనదేశంలో కాంగ్రెస్, జనతా రెండు బలమైన రాజకీయ పార్టీలుగా పనిచేసే అవకాశం చేజారిపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన కొద్దికాలానికే మహాత్మాగాంధీ చనిపోవడం తీరని నష్టం. అలాగే బ్రిటీష్ పాలనలో కన్నా దుర్మార్గమైన అత్యవసర పరిస్థితిని, ఇందిరా నియంతృత్వాన్ని మట్టికరిపించి ప్రజాస్వామ్యాన్ని పునః ప్రతిష్టించిన మహానాయకుడు జయప్రకాష్ కలలను వమ్ముచేస్తూ జనతాపార్టీ ప్రభుత్వం పతనం కావడం అత్యంత దురదృష్టకరం.

నేను 1983లో తెలుగుదేశం పార్టీలో చేరాను. తెలుగుదేశం పార్టీనుండే రెండు సార్లు తెలుగుతేజాన్ని లోకానికి తెలియజెప్పిన మహామనీషి యన్.టి.ఆర్. ఆశీస్సులతో లోక్‌సభకి ఎంపికయ్యాను. నేను లోక్‌సభ సభ్యునిగా వున్న రెండుసార్లు, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో వుంది ఎనిమిదవ లోక్‌సభలోని నా ప్రసంగాలను 'ప్రజల ఎదురుతెన్నులు-పాలకుల తీరుతెన్నులు' పేరిట గ్రంధరూపంలో ప్రచురించటం జరిగింది.

పదవ లోక్‌సభ ప్రసంగాలను ఇప్పుడీ 'రైతువాణి' గ్రంథంలో సంకలనం చేయటం జరిగింది. నేను పదవ లోక్‌సభ సభ్యునిగా వుండగానే ప్రపంచం లోనూ, దేశంలోనూ అనేక చారిత్రక మార్పులు చోటుచేసుకొన్నాయి. భూతల స్వర్గం నిర్మించాలన్న ఆకాంక్షతో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వం రష్యాలో కుప్పకూలి పోయింది. అలాగే తూర్పు యూరప్‌లో కూడ కమ్యూనిస్టు ప్రభుత్వాలు పేక మేడల్లా కూలిపోయాయి. ఆయా ప్రభుత్వాల పట్ల ప్రజాగ్రహం పెల్లుబికింది. ఈ నేపథ్యంలో మనదేశంలోని కాంగ్రెసు ప్రభుత్వం కూడా నాలుగు దశాబ్దాలపాటు దేశ ప్రగతిని స్తంభింప జేసిన సామ్యవాద విధానాలకు, ఆర్థిక పారిశ్రామిక నియంత్రణలకు తిలోదకాలిచ్చింది. స్వేచ్ఛాయుత ఆర్థిక విధానాన్ని ప్రవేశ పెడుతూ సంస్కరణలు తీసుకువచ్చింది.

యువ్వన ప్రాయం నుండి నేను విశ్వసించిన సిద్ధాంతాలకు లభించిన అపూర్వ విజయంగా దీనిని నేను పరిగణిస్తాను. క్రమంగా దేశంలోని అన్ని పార్టీలు స్వేచ్ఛాయుత ఆర్థిక విధానాలనే సమర్థించుతున్నాయి. ఇక దేశంలో సైద్ధాంతిక ఘర్షణల పర్వం ముగిసింది. అన్ని రంగాలలోను ప్రభుత్వ జోక్యం అనర్థాలకు త్రోవతీస్తుందని అందరూ గుర్తించారు. దేశంలో స్వేచ్ఛాయుత వాతవరణం కల్పించడానికి పూర్వరంగం సిద్ధమైంది. దేశ రాజకీయ చరిత్రలో నూతన అధ్యాయం మొదలయ్యింది.

అదే సందర్భంలో సరళీకృత ఆర్థిక విధానాల ముసుగులో అధికారంలో వున్నవారు తమకులాభం చేకూర్చే కార్యక్రమాలను చేపట్టడం, ప్రజాధనాన్ని భాద్యతా రహితంగా ఖర్చుచేయడం, అక్రమ మార్గల్లో ప్రజాధనాన్ని దోచుకోవడం జరుగుతోంది. సామ్యవాద విధానాలకు స్వస్తి పలుకుతూ సంస్కరణలను కొనితెచ్చిన తరువాత, చట్టాలను, పాలనా పద్ధతులను అందుకనుగుణంగా సంస్కరించని సంధికాలంలో మనం వున్నాము. అన్ని రంగాలనూ పారదర్శకం, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే విధివిధానాలను మనం ఖచ్చితంగా ఇంకా రూపొందించుకోలేదు. ఈ సంధికాలంలో జరిగే అవకతవకలను, నూతన మార్పులకు అనుగుణంగా తనను తాను తీర్చిదిద్దుకోలేని ప్రభుత్వ యంత్రాంగపు జడత్వాన్ని, అన్ని రంగాలలో విపరీతంగా జరుగుతున్న కుంభకోణాలను నేను పదవ లోక్‌సభలో ప్రముఖంగా ప్రస్తావించడం జరిగింది.

మనం స్వాతంత్ర్యం సాధించి ఏభై అయిదు సంవత్సరాలు నిండినా, ఈనాటికీ కోట్లాది మంది ప్రజలు అర్ధాకలితో, సరైన నీడలేక మురికి కూపాలలో, అత్యంత దయనీయ స్థితిలో జీవితాల్ని గడుపుతున్నారు. ఇదే సమయంలో ప్రపంచీకరణ, ప్రైవటీకరణ ముసుగులో కనీవినీ ఎరుగని రీతిలో, అన్నిస్థాయిలలోను అవిఘ్నంగా అవినీతి కుంభకోణాలు చోటు చేసుకొంటున్నాయి. ప్రజా సంపదతో, ప్రభుత్వ ధనంతో ఏర్పడిన అనేక ప్రభుత్వసంస్థలు, సహకార సంస్థలు కొందరు వ్యక్తుల చేతుల్లోకి కారు చౌకగా వెళ్ళిపోతున్నాయని, ఆర్థిక రంగంలో 2001 నోబుల్ బహుమతి గ్రహీత జోసఫ్ స్టిగ్ లిట్జ్ 'ప్రపంచీకరణ-దాని విపరిణామాలు' అనే గ్రంథంలో పేర్కొనడం జరిగింది.

నూటికి డెబ్బై మంది ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయం, అనుబంధ వ్యాపకాలపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం, దేశంలో స్వాలంబన సాధించడం, మన రైతుల ప్రయోజనాలు కాపాడడానికి మనం అనుసరించాల్సిన విధానాలను కూడా నిర్దేశించే డంకెల్ డ్రాఫ్టు, గాట్ ఒప్పందం, మనదేశ ప్రజలపై దాని ప్రభావం వంటి కీలక అంశాలపై లోక్ సభలో రైతువాణిని వినిపించాను. వేదకాలం నుండి సర్వధర్మ సమభావమనే ఆదర్శం పునాదిగా గల దేశం మనది. సర్వమత సహనాన్ని భరతదేశ సందేశంగా స్వామి వివేకానందుడు ప్రపంచానికి అందించి మనదేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు చేకూర్చాడు. అందుకు విఘాతం కల్గించే బాబ్రీమసీదు విధ్వంసం వంటి సంఘటనలు మనదేశానికి తీరని మచ్చలుగా మిగిలి పోయాయి. ఇటువంటి అనేక అంశాలను ఈ పుస్తకంలో పొందుపరచాను.

వివిధ పార్టీల మధ్య సైద్ధాంతిక విభేదాలు క్రమంగా సమసి పోతున్నాయి. ఈ సందర్భంలోనే మహాత్మాగాంధీ ప్రవచించిన నైతిక విలువలకు అమిత ప్రాధాన్యత ఏర్పడుతోంది. నిజాయితీ, చిత్తశుద్ధి, పారదర్శకత, ప్రజాసమస్యల పట్ల అంకితభావం, ప్రజల సంక్షేమాన్నే ఏకైక లక్ష్యంగా ఎంచుకోవడం వంటి ఉన్నత విలువలే నా రాజకీయ జీవితంలో నన్ను ముందుకు నడిపించాయి. నేను మనస్ఫూర్తిగా విశ్వసించిన నైతిక, రాజకీయ, వైయుక్తిక విలువలు నేడు వేళాకోళం చేయబడుతున్నాయి. ఇప్పుడు రాజకీయాలకు అర్థాలు మారిపోతున్నాయి. అయినా నాకు అరవై ఏళ్ళు నిండుతున్న సమయంలో నా రాజకీయ ప్రస్థానాన్ని సమీక్షించుకొంటూ నేను పూర్తిగా సంతృప్తి చెందుతున్నాను. కర్షకుల, కార్మికుల సర్వతో

ముఖాభివృద్ధికి, సంక్షేమానికి దోహదం చేసే విధానాలను వ్యాప్తి చేయడంలో, కొన్నింటికి రూపకల్పనలో భాగస్వామి నైనందుకు గర్విస్తున్నాను.

ఇప్పుడు రాజకీయ రంగంలో నైతిక విలువలను, నిజాయితీని పున ప్రతిష్ఠించడం కోసం పోరాటం జరపవలసిన అవసరం వుంది. దేశాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి తగిన విధానాలను రూపొందించడంలో మాతరం విజయం సాధించింది. ఇక దేశాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దడం రాజకీయ వాదులు ఉన్నత విలువలకు అంకితమైనప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది. నేటి యువతరం ఇందుకై ఉద్యమించవలసిన అవసరాన్ని మరోసారి నొక్కివక్కాణించడం నా బాధ్యతగా పరిగణిస్తాను.

దేశ స్వాతంత్ర్య సముపార్జనకోసం అనాటి నాయకులు అసమానమైన త్యాగాలు చేశారు. ఆరోజుల్లోనే లక్షల రూపాయల సంపాదనను వదలుకొని, సంవత్సరాల తరబడి కారాగారాల్లో గడిపి తమ కుటుంబ భవిష్యత్తును గురించి క్షణకాలం ఆలోచించకుండా, స్వాతంత్ర సంగ్రామంలో లక్షలాది మంది సమిధలయ్యారు. భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ల ఆత్మబలిదానం మనజాతికి నిరంతరం స్ఫూర్తిని ప్రసాదిస్తుంటుంది. ఆ మహనీయులందించిన స్ఫూర్తిని ఆలంబనగా గైకొని నేటియువతరం సరైన మార్గంలో, అసలైన ప్రాధాన్యతలతో, సత్వర సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదం చేసే కృషి చేయాలి. లక్ష్యంతోపాటు ఆ లక్ష్యసాధనకు అనుసరించే మార్గాలు సైతం పవిత్రంగా వుండాలని పూజ్యబాపూజీ చెప్పినది మనందరికి అన్ని వేళలా శిరోధార్యం.

ముూడుదశాబ్దాలుగా నా అభిమాన మిత్రుడు, ప్రముఖ రచయిత, నా లోక్‌సభ ప్రసంగాలను ఈ పుస్తకంగా తీర్చిదిద్దిన శ్రీ చల్లగుళ్ళ నరసింహారావు గారికి, ఈ పుస్తకాన్ని అందంగా ముద్రించిన, కళాజ్యోతి ప్రెస్ అధినేత శ్రీ ఆలపాటి బాపన్న గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.


**- వడ్డే శోభనాదీశ్వరరావు**



# వ్యవసాయ రంగం



ఎన్.టి. రామారావు తో వడ్డే




కృష్ణా జిల్లా పర్యటనలో
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో  వడ్డే

# డంకెల్ బారి నుండి మనరైతుల ప్రయోజనాలు పరిరక్షించుకొందాం

సాంప్రదాయకంగా గత కొన్ని సంవత్సరాల తరబడి రైతులు తమ ఉత్పత్తిలోంచి కొంత ధాన్యాన్ని విత్తనాలుగా నిల్వచేసి వాటిని తమ పొరుగు రైతులకు అమ్ముకోవడం, సాంప్రదాయకంగా వస్తున్న విధానమని, నూతన పద్ధతి వారి సనాతన హక్కుకు అవరోధం కలిగిస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీరు ముందు సభకు స్పష్టం చేశారు. ఇక్కడ నేను గౌరవనీయులైన మంత్రిగారి దృష్టికి ఒక విషయం తీసుకురాదల్చాను. ఈ విషయమై ఒక బాధ్యతాయుతమైన అధికారి వివరణ ఇస్తూ, కమిటీకి 'గ్యాట్' వివరణ ఇస్తూ పారిశ్రామిక దేశాలు మనదేశంలో అమలవుతున్న విత్తన వినిమయం రైతుల మధ్య అనధికారికంగా, దొంగచాటుగా జరగడానికి వీలు లేదని తెల్పారు.

స్వాతంత్ర్యం వచ్చి 4 దశాబ్దాలు గడిచినప్పటికి ఇప్పటి వరకు జాతీయ విత్తన సంస్థలుగాని , ఇతర ప్రైవేట్‌రంగ కంపెనీలు గాని పూర్తిస్థాయిలో రైతులకు విత్తన అవసరాలను తీర్చలేక పోతున్నాయి. ఈ సంస్థలు కేవలం 38 శాతం మేరకు

విత్తన అవసరాలను తీర్చగలుగుతుండగా మిగతా రైతువిత్తన అవసరాలు మన సనాతన రైతుల విత్తన వినిమయం వల్లే జరుగుతోంది.

నాభయమల్లా! ఈ సనాతన హక్కును కాపాడకపోతే మనదేశంలో 70 కోట్ల మంది రైతులు ఉన్నారు. ఇందులో 75 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే అంతేకాక సరిగ్గా అందుబాట్లో రోడ్లులేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సన్నకారు రైతులు తాహసిల్దార్ కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు, పెద్ద పట్టణాలకు విత్తనాలను కొనుగోలు చేయడానికి ఎలా పోగలుగుతారు. ఇదే నా ప్రధాన ఆందోళన...

మంత్రిగారు వివరణ ఇస్తూ ఈ 'ధంకెల్ డ్రాఫ్టు'తో సూయిజెనరిస్ సిస్టమ్ (పాతదానికి పూర్తి విభిన్నమైన విధానాన్ని) క్రమంగా ఆచరణలోకి తేవాలి. ఇది పాత విధానానికి పూర్తి ప్రత్యామ్నాయమైంది. అది మన అవసరాలను పరిగణలోకి తీసుకుంటుంది అన్నారు. ఇది వాస్తవమే.... కానీ మీ మంత్రిత్వశాఖ సభ్యులకు పంచిన 'నోట్' లోని 12వ పేజీలో మీరు వివరణ ఇస్తూ...

''మొక్కల పరిరక్షణకు ఉద్దేశించి తీసుకువస్తున్న 'సూయిజెనిరిస్ రక్షణ' విషయమై 'ధంకెల్ టెక్స్ట్' లో ఎక్కడ ఒక అంతర్జాతీయ సమ్మేళనపు ప్రస్తావన లేదు. ''ఉపోవ్'' (UPOU) అనే అంతర్జాతీయ సమ్మేళనంలో సూచించిన వివిధ అంశములను మార్గదర్శకాలుగా తీసికోవచ్చును.

ఈ సందర్భంగా నేను ఒక ప్రశ్నను మంత్రిగారిని అడగాలనుకుంటున్నాను. మనం నూతనంగా ప్రవేశపెట్టాలనుకుంటున్న 'సూయిజెనరీస్ విధానం' 1978 నాటి 'యుపోవ్' ను అనుసరించి ఉంటుందా?

1978 'యుపోవ్' సమ్మేళనం ప్రకారం మనలాంటి వర్ధమాన దేశాలకు చెందిన రైతులు, విత్తన ఉత్పత్తిదార్లకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా మినహాయింపులను ఒక స్థాయి వరకు ఇవ్వడం జరిగింది.

కానీ 1995 తర్వాత పరిస్థితి ఏంటి?

'యుపోవ్' నిర్ణయాలు 1995 వరకే అమలులో వుంటాయా? లేక 1995 తర్వాత రైతులకున్న మినహాయింపులను, విత్తన ఉత్పత్తిదార్ల మినహాయింపులను, పరిశోధకుల స్వేచ్ఛను పూర్తిగా హరించిన 1991 యుపోవ్ అమల్లోకి వస్తుందా? ఒకవేళ అదేగనుక జరిగితే మనం దాన్ని తీవ్రంగా అడ్డుకొనవలసి వుంటుంది. ఎందుకంటే దీని వలన మన వ్యవసాయ ప్రయోజనాలకు విఘాతం కల్గుతుంది కాబట్టి.

ఇది ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం గత కొన్ని సంవత్సరాలుగా మనం సగటున సుమారు 12 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నామని చెబుతుంది. ఈ సంవత్సరం కూడా మనం 30 లక్షల టన్నుల ఆహారధాన్యాల దిగుమతికి కాంట్రాక్ట్ చేసుకున్నాం. ఇవన్నీ దిగుమతి చేసుకోకపోవచ్చు. కానీ ఇప్పటికే కాంట్రాక్ట్ (ఒప్పందం) చేసుకున్నాం. ఈ పరిస్థితుల్లో మనం మన సనాతన విత్తన వినిమయ హక్కును ఎట్టి పరిస్థితుల్లోను తప్పక పరిరక్షించుకోవాలి. ఇది మంత్రి గారి 'ద్వారా ప్రభుత్వానికి' వినయ పూర్వక సూచన.

దీనికి సమాధానం ఇచ్చే సమయంలో మంత్రిగారు స్పష్టంగా ఈ హక్కుల విషయంలో ఉన్న సందేహాలను నివృత్తి పర్చాల్సిందిగా కోరుతున్నాను.

వాతావరణం, వివిధ చీడపీడలకు అనుగుణంగా సరైన విత్తనాలను రైతులు ఎంచుకొనేందుకుగాను ఈ హక్కు పరిరక్షిస్తుందన్న అంశంపై కూడా ఆ సమాధానంలో వివరణ ఇవ్వాలి.

మంత్రిగారు ఈ సనాతన హక్కు పరిరక్షణ చేపడతారా? అలా కాకుండా విత్తన ఉత్పత్తిదారుల ప్రయోజనాలు కాపాడితే ఏమౌతుంది?

అధ్యక్షా! భారతదేశంలోని వ్యవసాయ పరిశోధనల్లో ఎక్కువ భాగం ఇక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లోనో పరిశోధన కేంద్రాల్లోనో సమన్వయ ప్రాజెక్టుల ద్వారానో జరుగుతున్న విషయం మీకు తెలుసు. మొక్కల రకాలను ఉత్పత్తి చేసేవారికి పెద్ద మొత్తంలో రాయల్టీలు చెల్లించాల్సి వుంటే యిందుకు వీలుండదని భావించవచ్చు. ఈ అంశంపై కూడా గౌరవనీయులైన మంత్రిగారి నుంచి వివరణను కోరుతున్నాను.

మొక్కల ఉత్పత్తిదార్ల హక్కులను పరిరక్షించేటప్పుడు రైతుల హక్కులను కూడా రక్షించాలని కొంతకాలం కిందట ఆహార వ్యవసాయ సంస్థ ఆమోదించిన తీర్మానం చెబుతోంది. ఈ విషయం నేనిప్పుడు ఎందుకు చెబుతున్నానంటే, మనదేశంలో వేపచెట్లు సమృద్ధిగా ఉన్నాయి. ఎక్కడ పడితే అక్కడున్నాయి. అమెరికాకు చెందిన గ్రేస్ కంపెనీ ఇప్పుడు ఆ వేపచెట్ల నుంచి 'మార్గోసోనో' అనే బయోక్రిమిసంహారక మందును ఉత్పత్తి చేస్తోంది. మన రైతులు కూడా ఇప్పటివరకు సాంప్రదాయ పద్ధతులలో ఆపని చేస్తూనే ఉన్నారు. కొన్ని రకాల పురుగుల నుంచి పంటను కాపాడడానికి వేపగింజల నుంచి తయారు చేసే ఒక ద్రావణాన్ని

వాడుతున్నారు. ఇప్పుడా పనిని గ్రేస్ కంపెనీ చేస్తోంది. ఆ క్రిమిసంహారక మందుపై ఈ కంపెనీ ఇప్పటికే పేటెంటు హక్కును పొందింది. ఈ పరిస్థితుల్లో, ఆహార వ్యవసాయ సంస్థ నిర్ణయం ప్రకారం, వేపచెట్లు అధికంగా ఉన్న మనదేశానికి కూడా దీనిలో వాటా ఉండాలి. కేవలం ఒక ఉత్పత్తిపై పేటెంట్ హక్కులను పొంది బిలియన్లను సంపాదించడం ద్వారా ఆ గ్రేస్ కంపెనీ మనని మోసం చేయడానికి వీలుండరాదు. గౌరవనీయులైన మంత్రిగారు ఈ విషయాన్ని వివరించాలి.

ఇక సబ్సిడీల అంశానికొస్తే, సబ్సిడీ సదుపాయం భారతదేశ వ్యవసాయానికి ఓ వరం లాంటిదని మంత్రిగారు, కొంత కాలం పాటు వాణిజ్యమంత్రిగా ఉన్న సభ్యులు పి. చిదంబరం గారు ఇద్దరూ చెబుతారు. అంతర్జాతీయ ధరలతో పోలిస్తే ఇన్నేళ్ళూ మన రైతులు చాలా తక్కువ ధరను పొందారనీ, ఇప్పుడు గాట్ ఒప్పందం ద్వారా ఇతర దేశాలకు ఎగుమతులు పెరిగి వీరు ఎక్కువ ధరను పొందగలరనీ శ్రీ పి. చిదంబరం అన్నమాటలు నాకెంతో బాధను కలిగిస్తున్నాయి. ఇంతకంటే అభ్యంతరకరమైన వ్యాఖ్యఉంటుందా? రైతులకు న్యాయమైన ధర లభించేలా చూడడానికి మీకు 'గాట్ ' ఒప్పందం అవసరమా? ఈ సందర్భంలో నేనొక విషయం చెప్పదలచుకున్నాను.

దయచేసి వినండి, రాజ్యాంగంలోని ఆదేశసూత్రాల్లో ప్రజలకు మనమొక వాగ్దానం చేశాం. "ఆదాయాల్లో అసమానతలను తగ్గించడానికీ, వ్యక్తుల మధ్యనే కాక, వివిధ ప్రాంతాల్లో నివసించే, లేదా వివిధ వృత్తులలో స్థిరపడ్డ వ్యక్తి సమూహాల మధ్య కూడా స్థాయికి, సౌకర్యాలకు, అవకాశాలకు సంబంధించిన అసమానతలను తొలగించడానికి రాజ్యం కృషి చేస్తుంది (అంతరాయం).

చార్లెస్ గారూ, దయచేసి వినండి, మీ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు నేను అభ్యంతరపెట్టలేదు. నాకు సమయం తక్కువగా ఉంది. నన్ను అడ్డగించకండి. సహనం వహించండి. మీరు రైతుమిత్రులనుకుంటాను.

అధ్యక్షా! మీరు రైతు కుటుంబం నుంచి వచ్చారు. 1970-71తో పోల్చినప్పుడు వ్యవసాయ రంగానికీ వ్యవసాయేతర రంగానికీ ఆదాయాల మధ్య నిష్పత్తి 1:2 నుంచి యిప్పుడు 1:4 కి పెరిగిందని మీకు తెలుసు.

జపాన్ రైతు అంతర్జాతీయ మార్కెట్లోని బియ్యం ధరకు అయిదురెట్లు అధికధరను పొందుతున్నాడని నామిత్రుడు ఇప్పుడే అన్నారు. ఉత్పాదకతను

పెంచేందుకు, వ్యవసాయేతర రంగాలలోని వారితో సమానమైన ఆదాయాన్ని పొందేందుకు జపాన్ రైతులకు ప్రభుత్వం తోడ్పడుతుందని 1961 వ్యవసాయ చట్టం హామీ ఇవ్వడమే దీనికి కారణం. ప్రభుత్వమే సహాయపడుతున్నప్పుడు అధిక ధరలను చెల్లించడానికి జపాన్ ప్రజలు వెనుకాడరు. రైతులు కూడా గౌరవ మర్యాదలతో మంచి పరిస్థితులలో బతకాలని వారు కోరుకుంటారు. మన ప్రభుత్వం ఇన్నేళ్ళూ ఆ పని చేయలేదు. కేవలం 20 శాతం మాత్రమే సబ్సిడి తగ్గుతుందని తగ్గిస్తామని ఆయన చెబుతున్నారు. అయితే మనదేశంలో ఇచ్చే సబ్సిడీ ధనిక దేశాల్లో అతి స్వల్పం. 1980లో అమెరికా తన వ్యవసాయ రంగానికి 70 బిలియన్ డాలర్ల సబ్సిడీ ఇచ్చింది. యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీ 134 బిలియన్ డాలర్లను సబ్సిడీగా ఇచ్చింది. కేవలం రెండు శాతం ప్రజలు వ్యవసాయ రంగంలో ఉన్న అమెరికా వారికి 150 డాలర్ల తలసరి సహాయాన్ని అందిస్తోంది. యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీ అందించే తలసరి సహాయం 240 డాలర్లు. కానీ జపాన్లో తలసరి సహాయం 260 డాలర్లు. మరి మనదేశం సంగతేమిటి? తొమ్మిది డాలర్ల తలసరి సహాయం కూడా ఇక్కడ అందడం లేదు. ప్రభుత్వం రూ. 30,000 కోట్లను సబ్సిడీగా ఇవ్వగలిగితే డంకెల్ ప్రతిపాదనలు అడ్డురావని మంత్రిగారు కొద్ది కాలం కిందట ఇదే సభలో చెప్పినట్లు నాకు గుర్తు. మంచిది. అయితే ఎరువులపై సబ్సిడీని మీరు ఎందుకు తగ్గించినట్లు? ఎరువులపై సబ్బిడీని తగ్గించడం వల్ల ఫాస్పరస్, పొటాష్ ఎరువుల ధరలు వందశాతం పెరిగాయి. పొటాష్ ఎరువులయితే వందశాతం పైగా పెరిగాయి. ఫలితమేమిటి? ఎరువుల వినియోగం 24 శాతం తగ్గిపోయిందని వ్యవసాయ మంత్రే ఒప్పుకున్నారు. ఈ 24 శాతం ఉత్పాదకతపై, ఉత్పత్తిపై తగ్గుదల ప్రభావం చూపదా? ఈ విషయంలో నాకు అసంతృప్తి ఉంది.

వ్యవసాయ విద్యుత్తు ధరను యూనిట్‌కి యాభై పైసలకు పెంచాలని ప్రభుత్వం ఇప్పుడు ఉత్సాహపడుతోంది. శ్రీవైద్యనాథన్ నేతృత్వంలో కొంత కాలం కిందట ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఎకరానికి సగటున 68 రూపాయలు భారతదేశంలో నీటి ఛార్జీలుగా వసూలవుతుందని వారు లెక్కగట్టారు. దాన్ని 340 రూపాయలకు పెంచాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధినుంచి, ప్రపంచ బ్యాంకు నుంచి ఒత్తిళ్ళ కారణంగా రైతులకు సహాయాన్ని తగ్గించే అవసరం లేదని తెలిసి కూడా మీరు ఎరువుల సబ్సిడీని తగ్గిస్తున్నారు. సబ్సిడీల వ్యవహారాన్ని పూర్తిగా అంతం చేయాలని ప్రభుత్వం ఉత్సుకతతో ఉందని

మన ఆర్థిక మంత్రి వివిధ వేదికలపై ఉద్ఘాటించడం నేను పలుమార్లు విన్నాను. ఈ పరిస్థితుల్లో మనం మన వ్యవసాయోత్పత్తుల్ని ఎగుమతి చేయగలమా? ధర విషయంలో ఇప్పుడున్న వెసులుబాటు ఉత్పత్తి వ్యయం పెరగడంవల్ల ముందు ముందు ఉండకపోవచ్చు. మన బియ్యం, గోధుమ, పత్తి ధరలు పెరిగితే ప్రపంచ మార్కెట్లో మనం పోటీపడలేకపోవచ్చు. ఎందుకంటే అప్పటికి అంతర్గత సబ్సిడీ స్థాయి కేవలం 20 శాతమే తగ్గిస్తారు. 64 శాతం ఎగుమతి సబ్సిడీ అలాగే ఉంటుంది. 64 శాతం వాణిజ్య నియంత్రణ కూడా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఇది వ్యవసాయ రంగానికి వరంగా కాక శాపంగా పరిణమించవచ్చని నా భయం. రాజకీయ కారణాలవల్లో, ప్రభుత్వాన్ని తప్పు పట్టడానికో నేనీ విషయం చెప్పడం లేదు. రైతుల పట్ల నిజమైన సానుభూతితో చెప్తున్నాను. ఇతరదేశాల్లోనూ, మనదేశంలోనూ అందించే సహాయాన్ని తానిచ్చే సమాధానంలో అంకెల రూపంలో పొందుపరచాలని మంత్రి గారిని కోరుతున్నాను.

ఉత్పత్తి ప్రత్యేక సహాయాన్ని గురించి మీకు చెబుతాను. మూడు తప్పించి మిగిలిన అన్ని పంటలకు ఉత్పత్తి ప్రత్యేక సహాయం పది శాతం కంటే తక్కువని గౌరవనీయులైన మంత్రి, చిదంబరం గారు చెబుతున్నారు. దీనిపై మాకు విబేధాలు లేవు. కాని చెఱకు విషయంలో, భారత ప్రభుత్వం నిర్ణయించిన కనీసధర ప్రకారం గుణిస్తే అది పదిశాతం కంటే తక్కువ ఉండవచ్చు. లాభదాయకమైన ధర కానందున రాష్ట్రప్రభుత్వాలన్నీ ఆయా రాష్ట్రాల్లో నిర్ణయించిన సలహా ధరల్నే అమలు చేస్తున్నాయన్న విషయం మీకు తెలుసు.

శ్రీ.ఎ.చార్లెస్ (త్రివేండ్రం) : మీ రాష్ట్రంలో దీన్ని అమలు చేస్తున్నారు. మీరు ధనికరైతుల తరపున మాట్లాడుతున్నారు.

శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు : ఎవరైనా వ్యవసాయం గురించి మాట్లాడితే వారు ధనికరైతని అర్థమా? మీ వైపు సభ్యులలో చాలా మంది కంటె నేను చాలా చిన్నవాణ్ణి. అలా అపార్థం చేసుకోకండి. రైతుల తరపున మాట్లాడినంతమాత్రాన నేను ధనిక రైతునని కాదు. మీరు రైతు ప్రయోజనాలను విస్మరించడమే బాధాకరం.

చైర్మన్ : దయచేసి మీరు చెప్పదలచుకొన్నది క్లుప్తంగా చెప్పండి.

శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు : ఇది చాలా ముఖ్యమైన అంశం. ప్రత్యేక పంటలను వేయడానికి, కొన్ని ప్రత్యేక పరిస్థితుల నెదుర్కోవడానికి రైతులను ప్రోత్సహించే

హక్కును దీనివల్ల ప్రభుత్వం కోల్పోతుంది. రాష్ట్రాలు సూచించిన ధరల విషయమే తీసుకుంటే వేరుశనగ, చెఱకు పంటలకు ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా రాష్ట్రాలలో ఇచ్చే ఉత్పత్తి ప్రత్యేకమైన సహాయం గురించి తన సమాధానంలో చెప్పాల్సిందిగా మంత్రిగారిని నేను ప్రత్యేకించి కోరుతున్నాను. 1986, 1987, 1988 సంవత్సరాల గణాంకాలను మేము పరిగణనలోకి తీసుకున్నాం. ఇన్నేళ్ళుగా వంటనూనెలను మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం కాబట్టి ఈ సహాయం పది శాతం కన్నా ఎక్కువగా ఉందనేది నాకు తెలిసిన సమాచారం. నూనెగింజలపై ప్రభుత్వం ఒక టెక్నాలజీ మిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇది మంచి పని. ఇంకా ఎక్కువ చేయవచ్చు. కానీ నేను దీన్నేమీ తప్పుపట్టడం లేదు. దీనివల్ల ఈనాడు భారతదేశం స్వయంసమృద్ధిని దాదాపుగా సాధించింది. కానీ ఇప్పుడు, జాతీయ ప్రయోజనాలనాశించి ఏదైనా ప్రత్యేక పంటను ప్రోత్సహించే హక్కును డంకెల్ ముసాయిదా ప్రతిపాదనల వల్ల ప్రభుత్వం కోల్పోవలసివస్తోంది.

ఇది వాస్తవమో కాదో చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

ఈ సహాయాన్ని కొంతవరకు తగ్గించాల్సి వస్తుందని తెలిసి, ఇప్పటికీ యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీ వారు దానికి బదులుగా పరిహారాత్మక చెల్లింపుల పద్ధతిని ప్రవేశపెట్టారని సమాచారం. ఈ చర్చలలోనే దానికి రూపకల్పన చేశారు. యూరోపియన్ కమ్యూనిటీ దేశాలలో ఈ చెల్లింపులు ఒక హెక్టారుకి రూ. 8000 వరకు ఉన్నాయని నాకు తెలిసిన సమాచారం. ఆ సహాయం తగ్గింపు నెదుర్కోవడానికి ఈ ప్రభుత్వాలు నిజంగానే చర్యలు తీసుకున్నాయో లేదో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. ``అభివృద్ధి చెందుతున్న దేశాల్లారా, మీ దగ్గర డబ్బుంటే మీ రైతులకు చెల్లించండి. కానీ ఉత్పత్తి పెంచమని మాత్రం వారిని అడగొద్దు '' అని చెప్పే అభివృద్ధి చెందిన దేశాల లక్ష్యం గురించి మన చర్చలలో తెలుసుకున్నపుడు నాకు నవ్వొచ్చింది.

వ్యవసాయ రంగం బాగుండాలని, రైతులకు లబ్దిచేకూరాలని మీరు నిజంగా భావిస్తుంటే, ఇతర దేశాల్లో రైతులకిస్తున్న రాయితీలలాగా మనదేశంలోనూ ఇవ్వాలని నా డిమాండ్ ఫ్రాన్స్‌లో 6 శాతం మందే వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. అయినా దేశ ప్రయోజనాల కోసం, రైతుల ప్రయోజనాల కోసం అది అన్ని రాయితీలను కల్పిస్తోంది. మన దేశంలో 65 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నా మీరేమీ పట్టించుకోవడం లేదు. రైతులకేమీ చేయడం లేదు.

మొన్న ఇంద్రజిత్ గుప్తా గారు ఒక ముఖ్యమైన విషయాన్ని లేవనెత్తారు. 'వ్యవసాయం' రాష్ట్ర జాబితాలోకి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఏ రంగంలోనైనా జోక్యం చేసుకోవచ్చని సహచర మిత్రుడు చెప్పారు. తమ పిల్లలకు తగిన అబ్బాయిని లేదా అమ్మాయిని చూసి పెళ్లిచేసే హక్కు తల్లిదండ్రులకు ఉంటుంది. అయినా పిల్లలకే ఆ అవకాశం ఇస్తారు. నీ కిష్టమా లేదా అని 'సంబంధం' గురించి పిల్లలను అడుగుతారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాన్ని అడగకుండా కేంద్రం తన ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకొంటున్నది. రాష్ట్రాలకు సంబంధించిన విషయాల్లో మీరు జోక్యం చేసుకోవాలనుకుంటున్నారు. వ్యవసాయం, ఆరోగ్యం లాంటి ముఖ్యమైన రంగాల విషయంలో నేను చెప్పేది ఏమిటంటే మీరు (కేంద్ర ప్రభుత్వం) రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోవాలని అనుకోవడం లేదు.

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి - ప్రధానమంత్రికి - రాష్ట్రాల అభిప్రాయాలను స్పష్టం చేయనీయండి, అభిప్రాయాలు చెప్పడానికి రాష్ట్రాలకు అవకాశం ఇవ్వండి - అంటూ లేఖ రాశారని మిత్రులు చెప్పారు.

స్పీకర్ : దీనిని నన్ను స్పష్టంగా చెప్పనివ్వండి. మనమిప్పుడు 'డంకెల్ ప్రతిపాదనల' గురించి చర్చిస్తున్నాము. ఈ చర్చను మీరు మూడు రోజులు కొనసాగించలేరు. చెప్పిన విషయాన్ని మళ్ళీ మళ్ళీ చెప్పకూడదనే విషయాన్ని మీరు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. మీరు చెప్పిన విషయాన్ని ఇంద్రజిత్‌గుప్తా గారు బలంగా చెప్పారు. మీరు మళ్ళీ చెప్పాల్సిన అవసరం లేదు. దయచేసి ముగించండి.

వడ్డే : రాష్ట్ర ప్రభుత్వ, శాసనసభల అభిప్రాయాలను తీసుకోవాలి. దీనిని ప్రభుత్వం అంగీకరించకుండా తిరస్కరించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన విషయం నాకు బాగా గుర్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

స్పీకర్ : అర్ధగంట సేపటి నుంచి మీరు మాట్లాడుతున్నారు.

వడ్డే : సహచర సభ్యులు చెప్పిందే నేను చెప్పడం లేదు. నాలుగైదు నిముషాలు తీసుకుంటాను.

5-6-1993 న నేను ఒక ముఖ్యమైన విషయం మీ దృష్టికి తెచ్చాను.

మనదేశంలో తలసరి ఆదాయం 1255 డాలర్లు ఉందని అంతర్జాతీయ ద్రవ్యసంస్థ (ఐఎంఎఫ్) లెక్కగట్టింది. ఇక్కడేమో అధికారక లెక్కల ప్రకారం 330 డాలర్లే ఉంది. అయితే వాళ్లు ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా లెక్కగట్టారు. ఎన్నిసార్లు కాఫీ తాగుతారు, ఎన్నిసార్లు భోజనం చేస్తారు, మందులు వేసుకుంటారు... తదితర విషయాలను వారు పరిగణించారు. ఈవిషయాల ఆధారంగా తలసరి ఆదాయాన్ని 1255 డాలర్లుగా లెక్కగట్టారు.

ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే

మన తలసరి ఆదాయం 1000 డాలర్ల కంటే తక్కువా కాదా అనే విషయాన్ని ఐఎంఎఫ్ నిర్ధారించబోతుందా లేక మనం బేలన్స్ ఆఫ్ పేమెంట్స్ సమస్యను ఎదుర్కొంటున్నామా లేదా అనే విషయాన్ని ఎవరు నిర్ణయించబోతుంది?

క్లిష్టమైన ఆర్థిక పరిస్థితి ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని చేపడితే ఇప్పుడు విదేశీ మారక ద్రవ్య నిలువలు తగినంతగా ఉన్నాయని ఆర్థిక మంత్రి ఎప్పుడూ చెబుతుంటారు. ఈ విషయాన్ని దేశంలోనే కాక, విదేశాల్లోనూ చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఐఎంఎఫ్ భావమేమిటి? మనదేశం చెల్లింపుల సమస్యను ఎదుర్కొంటువుందనా లేక మన తలసరి ఆదాయం 1000 డాలర్ల లోపేననా?

ఈ నిర్ణయానికి ఐఎంఎఫ్ ఎలా వచ్చిందనే విషయాన్ని తెలుసుకోవడానికి ప్రభుత్వం దానిని (ఐఎంఎఫ్)ను క్లారిఫికేషన్ అడిగిందా లేదా అనే విషయాన్ని మీరు స్పష్టం చేయండి?

1986, 87, 88లలో మనం వంటనూనెలు, చక్కెరను చాలా ఎగుమతి చేశాం. ఇప్పుడు కూడా అదే స్థాయిలో ఉన్నాం. క్వాంటమ్‌లలో అది ఏ స్థాయిలో ఉంటుంది? వీటి విలువ ఎంత?

చివరగా, ఆరోగ్యం గురించి ఒక వాక్యం చెబుతాను.

ప్యారిస్ కన్వెన్షన్ నిర్ణయాలు భారత రాజ్యాంగంలోని అంశాలకు అనుగుణంగా లేవని జస్టిస్ షా కొంతకాలం క్రితం అభిప్రాయపడ్డారు. ఇప్పుడు డంకెల్ ప్రతిపాదనలు కూడా ప్యారిస్ కన్వెన్షన్‌కు సన్నిహితంగా ఉన్నాయి. మీరు దానిని మొదలు పెట్టబోతున్నారా?

జాతీయ ప్రయోజనాలు, సామాన్యుల ప్రయోజనాలు కాపాడాలి కాబట్టి

మనం ప్యారిస్ కన్వెన్షన్ మీద సంతకం చేయకూడదని ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక నిర్ణయానికొచ్చిందా? అసలు మన విధానం ఏమిటనే విషయం మమ్మేలను తెలుసుకోనివ్వండి.

ఈ ఒక్క విషయంతో నేను ముగిస్తాను. చాలా మంది సభ్యులు అడిగినట్లు, గ్యాట్ నుంచి బయటకొస్తే మన స్థితి ఏమిటి?

గ్యాట్ నుంచి బయటకు రమ్మని మేము ప్రభుత్వాన్ని అడగం. అయితే జాతీయ ప్రయోజనం చాలా ముఖ్యమైన విషయం. దీనిని పరిరక్షించడంలో మేము ముందు వరుసలో ఉండాలి.

నేనొక విషయం చెబుతాను. గత శనివారం ఒక వార్త వచ్చింది. గ్యాట్ చర్చల్లో మూడో ప్రపంచ దేశాలది బండ వ్యవహారమని దాని సారాంశం. నేనొక వాక్యం చెబుతాను. పారిశ్రామిక దేశాలలో మార్కెట్ అవకాశాలు తగ్గడంతో అభివృద్ధి చెందుతున్న దేశాలు కష్టాలను ఎదుర్కొంటున్నాయని ఉరుగ్వే చర్చల్లో భారతదేశం దూత చెప్పారు. ఇదీ పరిస్థితి. ఈ చర్చల నుంచి 217 బిలియన్ డాలర్ల లబ్ధి పొందగలమని ఆ దేశాలు అంచనా వేస్తున్నాయి. అందులో భారత్ వాటా కేవలం 4.6 బిలియన్ డాలర్లు. పారిశ్రామిక దేశాలు 140 బిలియన్ డాలర్ల సింహభాగాన్ని పొందనున్నాయి.

ఇది ఎవరి లబ్ధికోసం? దయచేసి ఈ దేశ రైతుల, సామాన్య పౌరుల ప్రయోజనాలు తాకట్టు పెట్టవద్దు.

ఆరోగ్యం కోసం మీరు కేవలం 1.7% మాత్రమే కేటాయించారు. మందుల ధరల్లో 45% మాత్రమే పెరుగుదల ఉందని ఆయన చెబుతున్నారు. అయితే వాస్తవం ఏమిటంటే ధరలు 300 నుంచి 500 శాతం వరకు పెరిగాయి. మందులను కొనుగోలు చేసే సామర్థ్యం లేక దిగువ, మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజలు చావుకు సిద్ధం కావలసి ఉంటుంది. కాబట్టి జాతీయ ప్రయోజనాలను మనసులో ఉంచుకోండి.

మన డిమాండ్లను గ్యాట్ ఒప్పుకొని తన ముసాయిదాను మార్చడానికి, సవరణలు ఆమోదించడానికి ముందుకొస్తే మన ప్రయోజనాల రక్షణకు సంతకం చేయండి. దానికంటే ముందు సగం రాష్ట్రాలనయినా ఒప్పించండి. లేకపోతే మనదూత

అక్కడ సంతకం చేసినా ప్రజలు క్షమించరు. దానిని ఒప్పుకోరు. పోలీసులు లేదా అమలు చేసే అధికారులు రైతుల వద్దకు వెళితే వారిని తన్నితరిమేస్తారు. రైతులను ఇబ్బందిపెట్టే ఈ రకమైన ఒప్పందాలను ప్రజలు సహించరు.

ఈ అంశాలపై తదుపరి చర్యగా ఇప్పుడు జాతీయ ఏకాభిప్రాయాన్ని కూడగట్టాల్సి ఉంది. అన్ని రాజకీయ పార్టీల నేతల అభిప్రాయ సహసంబంధితోనే భారత్ ఒక నిర్ణయాన్ని తీసుకొనగలుగుతుంది.

ఇక మూడో విషయం, మనం సంతకం చేసాము కావున మనం తప్పకుండా అమలుపర్చి ఆచరించాలని ఏమీలేదు. ఇందుకు సంబంధించి నేనో అంశాన్ని ఉదహరించాలనుకుంటున్నాను...

అది టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్ (టెక్సాస్ అధికార పత్రం) గురించి ఈ టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్ జపాన్‌లోని పేటెంట్ హక్కులకు సంబంధించింది...

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా జపాన్ కంప్యూటర్ చిప్‌ను రూపొందించింది. ఈ టెక్సాస్ ఇన్స్ట్రుమెంట్ క్రింద మేధోపరమైన సంపత్తి హక్కులకు సంబంధించింది. దీనికి అనుగుణంగానే కంప్యూటర్ చిప్‌కు చెందిన పేటెంట్ హక్కులను ఇతరులకు ఇవ్వడానికి జపాన్ 17 సంవత్సరాలు తీసుకుంది. ఈ 17 సంవత్సరాలలో అమెరికా కంప్యూటర్ చిప్స్ పరిశ్రమలు సంక్షోభం ఎదుర్కొని చాలా వరకు తుడిచి పెట్టుకుపోయాయి. దీన్ని జపాన్ పూర్తి స్థాయిలో సొమ్ము చేసుకుంది. ఈ విషయాన్ని సభ్యులందరూ పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా కోరుచున్నాను. అంటే దీనర్థం తాకట్టుపెట్టినట్లు కాదు దేశం, పార్లమెంట్, ప్రభుత్వం అన్ని తమ వాస్తవ స్థిత్వంలోనే ఉంటాయి. అలాగే మన జాతి ప్రయోజనాలను కాపాడేందుకు వ్యవస్థీకృతమై ఉన్న సంస్థలన్నీ యథావిధిగా వాస్తవ స్థిత్వంలో ఉంటాయి. ఏవో కొన్ని నిర్బంధాల వల్ల, వితండవాదం ......వల్ల మనల్ని ఈ నిర్ణయాత్మక దిశకు పురిగొల్పుతుంది. మనం 'గ్యాట్' ఒప్పందం నుంచి వైదొలగ వద్దు. ఎందుకంటే అమెరికా, ఐక్యరాజ్యసమితి పై ఆధిపత్యధోరణి ప్రదర్శిస్తున్నందున ఈ ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి కళ్లెం వేయడానికి ఏర్పడ్డ 'గ్యాట్' నీవు దీని నుంచి వైదొలగవద్దు అన్నది సరైన ధోరణి కాదు. దీనికిగాను మనం ప్రపంచ దేశాల నిర్ణయాల్ని పరిగణలోకి

తీసుకోవాలి. దానిని అనుసరించే మనం మన నిర్ణయాన్ని నిర్ధేశించుకోవాలి. కాలానికి తగ్గట్టుగా మనదేశం పరిపుష్టిగా ఎదగాలి. దీని ద్వారనే అనిశ్చిత ప్రపంచంలో కూడా మన దేశం తన ఉనికిని నిలుపుకోగలిగేలా ఉండాలి.

అందుకే నేను సభకు ఈ విషయమై మరో మారు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రస్తుత పరిస్థితులను అర్థంచేసుకొని సురక్షితమైన భారత భవిత విషయమై ప్రభుత్వం ఒక సరైన నిర్ణయం తీసుకునేలా సహకరించాల్సిందిగా కోరుతున్నాను.

ఇంతటితో నా ఉపన్యాసం ముగిస్తున్నాను. నాకీ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు.

□

## రైతులకు నష్టం - ఫ్యాక్టరీలకు లాభం

క్వింటాల్ చెరకుకు చట్టబద్ధ కనీస ధరను 26 రూపాయిలుగా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని సంవత్సరాలుగా, కేంద్రం ప్రకటిస్తున్న చట్టబద్ధ కనీసధర, వాస్తవంగా చెరకును ఉత్పత్తి చేయడానికి అయ్యే వ్యయంను సరిగా ప్రతిబింబించడం లేదు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సలహా ధరలను ప్రకటించడమే దీనికి కారణం. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలకు 55 రూపాయిలను అదనంగా చెరకు ఉత్పత్తిదారులకు చెల్లించమని ఫ్యాక్టరీలకు సూచించింది. కాని ఈ ఏడాది మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధ కనీసధరకు అదనంగా కేవలం 35 రూపాయిలను మాత్రమే ప్రకటించింది ఫలితంగా చెరకు ఉత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. అందువలన వచ్చే ఏడాది చెరకు ఉత్పత్తి తగ్గించవచ్చు. కాబట్టి కేంద్రప్రభుత్వం, చెరకు ఫ్యాక్టరీలు చెప్పిన దానిని నమ్మకంగా, చెరకు ఉత్పత్తిదారులను చెల్లించే అదనపు ధరకు సంబంధించిన సవరించిన భార్గవ ఫార్ములాను కేంద్రప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలి. ఎందుకంటే, ఫ్రీసేల్ సుగర్ కోటా శాతం 35 శాతం నుంచి 80 శాతం పెరిగింది. మోలాసిస్ ధర పెరగగా, ఇండస్ట్రియల్ ఆల్కహాల్ ఉత్పత్తిని లైసెన్స్ పరిధి నుంచి తప్పించారు. ఫ్యాక్టరీలు పెద్ద మొత్తంలో ఆర్జించుచున్న లాభాలలో కనీసం 70 శాతం వరకు వ్యవసాయదారులకు చెల్లించాలి. విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి అవసరమైన ఎక్కువ చక్కెర కోసం, ప్రభుత్వం ఈ చర్య ద్వారా చక్కెర ఉత్పత్తిని తప్పనిసరిగా పెంపొందించాలి. □

# వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయికి కొనిపోదాం

ఆహార ధాన్యాలు, వ్యవసాయోత్పత్తులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఎగుమతి చేయడంపై వర్త అడ్డంకులున్నాయి. ఇలాంటి నిబంధనలను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వ్యవసాయరంగ కేటాయింపులు తగ్గుతున్నాయి. మొదటి ప్రణాళికలో 22% ఉన్న ఇవి 8వ ప్రణాళిక నాటికి 8%కి తగ్గిపోయాయి. నీటి పారుదల సౌకర్యం కల్పించని ప్రాంతాల్లో దాన్ని మరింత విస్తరించాలి.

రైతుల రుణావసరాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. కేవలం 10% రైతులు మాత్రమే ఋణసౌకర్యాన్ని పొందగలుగుతున్నారు. వ్యవసాయ రంగానికి, ఇతర అనుబంధ రంగాలకు ఈ శతాబ్దాంతానికి వాణిజ్య బ్యాంకులు 64,000 కోట్లు, సహకార బ్యాంకులు 46,000 కోట్లు అందించాలని రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ పరపతి సర్వే అంచనా వేసింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో సభకు తెలియచెప్పాలి.

మనదేశంలో హెక్టారుకి ఎరువుల వాడకం 72 కేజీలు మాత్రమే. ప్రపంచ సగటు మాత్రం 87 కేజీలుగా ఉంది. ప్రభుత్వం ఈ విషయంలో సాధించిన దానితో సంతృప్తి చెందకూడదు.

వ్యవసాయ యంత్రాలు, పరికరాల విషయానికొస్తే - మనదేశంలో ట్రాక్టర్ల సంఖ్య చాలా తక్కువ ఉంది. జపాన్, కొరియాలనుంచి చిన్న ట్రాక్టర్లను దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతించాలి. స్థూల దేశీయోత్పత్తిలో కేవలం 0.23% మాత్రమే మనం వ్యవసాయ పరిశోధనలపై ఖర్చు చేస్తున్నాం. పరిశోధన కేటాయింపులను ప్రభుత్వం హెచ్చించాలి. ప్రస్తుతం 140 కృషి విజ్ఞాన కేంద్రాలు కె.వి.కెలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రతి జిల్లాలోను ఒక కె.వి.కె. తప్పకుండా ఉండాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, కె.వి.కెలకు - రైతులకు మధ్య దేశంలోని ప్రతి ప్రాంతంలోను సంబంధాలు నెలకొనాలి. రైతులలో అవగాహన పెంచడానికి ఇది తోడ్పడుతుంది. ఈ శతాబ్దాంతానికి 3 కోట్ల క్వింటాళ్ళ విత్తనాలు అవసరమవుతాయి. నూనె గింజల విత్తనాలు, పప్పు ధాన్యాల విత్తనాల విషయంలో శ్రద్ధ తీసుకోవాలి.

నూనె విత్తనాలు టెక్నాలజీ మిషన్‌ను రాజీవ్‌గాంధీ ఏర్పాటు చేశారు. ఇది మంచి ఫలితాలను ఇస్తుంది. నూనె దిగుమతుల బిల్లును తగ్గించడంలో పామాయిల్ మనకు ఉపకరిస్తుంది. పండ్లతోటల రంగానికి కల్పించిన సదుపాయాన్ని ఈ రంగానికి కూడా కల్పించాలి. ఆయిల్‌పామ్ గెలలకు కనీస మద్ధతు ధర కల్పించాలి. పంచదార పరిశ్రమల రంగం పొందుతున్న లాభాలు రైతుల వరకూ వెళ్ళినట్లయితే, మనదేశం పంచదార ఎగుమతుల ద్వారా అధిక విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించే స్థితిలో ఉండేది. మొలాసిస్ మీద ప్రభుత్వం నిబంధనలు తొలగించడం మంచిదే. దాని ప్రకారం అదనపు లాభంలో 50% మొత్తం రైతులకే చెందాలి. కాని దురదృష్టవశాత్తు ఈ విషయంలో ఎటువంటి అధికారిక నిర్ణయం చేయలేదు. ప్రభుత్వం ఈ విషయం గమనించి సరైన చర్యలు తీసుకోవాలి. కోళ్ళు, పశువులు, చేపల పెంపకం రైతుల ఆదాయాల్ని పెంచడానికి సహాయపడుతున్నాయి. కానీ కొన్ని బ్యాంకులు చిన్న రైతులకు సహాయకారిగా లేవు. ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యల పెంపకం 6,000 హెక్టార్ల నుంచి 54,000 హెక్టార్లకు పెరిగినా ఇది రైతులు స్వయం కృషి వల్ల జరిగింది. వాణిజ్య బ్యాంకులు బడాకంపెనీలకు, పెద్ద, మధ్య తరగతి రైతులకే తప్ప చిన్న రైతులకు రుణ సహాయం అందించడం లేదు.

వ్యవసాయ వ్యయాన్ని లెక్కించేటపుడు వ్యవసాయంలో ఉండే రిస్కని కూడా పరిగణలోకి తీసుకోవాలి. ప్రభుత్వం సవరించిన పంటల భీమా పథకాన్ని ప్రకటించింది. కాని అది ఇంకా అమలు కావాల్సి ఉంది. ఈ నమూనా సహకార

చట్టం అత్యావశ్యకం. మిగిలిన రాష్ట్రాలన్నీ ఈ చట్టాన్ని అమలు పరిచేలా ప్రభుత్వం ఒత్తిడి తేవాలి.

గాట్ ఒప్పందం తరువాత వ్యవసాయ సబ్సిడీలు తగ్గుతాయంటున్నారు. అంతర్జాతీయ ఎగుమతుల ద్వారా లాభాన్ని పొందాలంటే ఉత్పత్తి వ్యయం తక్కువ ఉండాలి. ఇందుకు సబ్సిడీలు కొనసాగించాలి. మామిడి, ఇతర ఫలాలు, కూరగాయలు, పుష్పాలు ఎగుమతులకు సంబంధించి విమానరవాణా ఛార్జీల్లో రాయితీలలో పురోగతి కనిపిస్తుంది. ఎగుమతుల అభివృద్ధి కొనసాగాలంటే ఈ రాయితీలు ఉండాల్సిందే. దశాబ్దం నుంచి ఈ విషయం పరిశోధనలలో ఉంది. ఈ విషయంపై త్వరితగతిని నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరుతున్నాను.

ఆర్థికమంత్రి కీటకనాశనులు, వీటి తయారీకి ఉపయోగించే పదార్థాలు, అంత్య ఉత్పత్తులు ప్రత్యేకించి మోనోక్రోటోఫాస్‌లపై పదిశాతం ఎక్సైజ్ డ్యూటీ విధించారు. రైతులకు ప్రధానంగా అవసరమైన కీటకనాశనులలో మోనోక్రోటోఫాస్ ఒకటి. ఇది వరకే మీరు పెంచిన ఎరువుల, అనుబంధ ఉత్పాదకాల ధరలు రైతులపై భారం మోపాయి. ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా కీటకనాశనిలను వినియోగిస్తుంది. ప్రభుత్వం దీనిని మరొకసారి పరిశీలించమని మనవి చేసుకుంటున్నాను. హవాయి, 126 రూపాయలుకన్నా తక్కువ ధరగల చెప్పులపై ఎక్సైజ్ డ్యూటీ విధించారు. ఎల్‌పీజీ, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచారు. బియ్యం, గోధుమల ధరను అధికం చేశారు. దేశంలోని వినియోగదారులపై ఇవన్నీ కలిసి నాలుగువేల కోట్ల రూపాయల మేర భారం మోపనున్నాయి. ప్రభుత్వం దీనిని పరిశీలించాలి.

కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల వనరుల్లోకి అక్రమంగా చొరబడుతున్నది. పన్నులలో కేంద్రం వాటా పదిహేను శాతం పెరిగినప్పటికీ, రాష్ట్ర ప్రణాళికలకు మీ ఆర్థికసాయం తగ్గింది.

29.3.1994 ఉరుగ్వేలో జరిగిన బహుపక్షీయ వ్యాపార సంప్రదింపుల ఫలితంగా రూపొందించిన ద్వంద్వ చట్టం : పేటెంట్లకు సంబంధించి మన ప్రభుత్వం ప్రతిసారీ ఎవరైనా కొత్త విషయాన్ని కనుగొంటే అతని ప్రతిభను గుర్తిస్తున్నది. అదే సమయంలో నూతన పరిశోధన ఫలితాలు దేశంలోని ప్రజలందరికీ అందాలి. ఇందుకోసమే పేటెంట్ చట్టం 1970ను నిర్దేశించారు. మనం శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతికి ఈ ఇరవయ్యేళ్ల పేటెంట్ల కాలము నష్టదాయకమైనది. పూర్తిగా తయారైన

వాటి పేటెంట్ల కోసం మనకు పదేళ్లు పట్టింది. ఈ విషయంలో ఇరవయ్యేళ్ల కాలము మన ప్రగతికి తప్పనిసరిగా అవరోధమే. తప్పనిసరి లైసెన్సు కు ప్రొవిజన్ ఉన్నప్పటికీ, ఈ ప్రొవిజన్లో ఇప్పటి వరకు మార్పులు లేకపోవడం మూలాన ప్రభుత్వ అధికారాలు క్రమంగా తగ్గాయి. మనదేశ ప్రయోజనాలకు ఇది పెద్ద అవరోధము. ఏప్రియల్ పదిహేనో తారీఖున వాణిజ్యశాఖ మంత్రి ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోబోతున్నారో తెలుసుకోవాలనుకుంటున్నాను. డిసెంబర్ 15,1993న కుదుర్చుకున్న ఒప్పందంపై ఆయన ఇదేరోజున సంతకం చేయనున్నారు.

వ్యవసాయానికి సంబంధించి కొద్ది రోజులు క్రితం వ్యవసాయశాఖ మంత్రి పై విషయాలపై చర్చించేందుకు మమ్మల్ని ఆహ్వానించారు. కొందరు ప్రభుత్వ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరైనారు. ఇది వారిపై ఎలాంటి ప్రభావం చూపదన్నారు. విత్తనాలను క్రితం పంట నుంచి సేకరించి దాచిపెట్టుకొన్న రైతులే ప్రస్తుతం విత్తుకోగలరు. మిగతా రైతులు విత్తనాలున్న రైతులనుంచి కొనుగోలు చేసి విత్తుకుంటారు. ఇటువంటి పురాతనమైన సాంప్రదాయహక్కు కనుమరుగవుతుందేమోనని మా భయం. ఈ విషయంలో వాణిజ్యశాఖ మంత్రి నుంచి స్పష్టమైన సమాధానాన్ని కోరుతున్నాం.

మనదేశంలో లభించే అరుదైన జన్యువిత్తనాలను ఇప్పటివరకు అభివృద్ధి చెందిన దేశాలు వినియోగించుకున్నాయి. ప్రస్తుతం వారు బయోటెక్నాలజీ జెనెటిక్ ఇంజనీరింగ్‌ల మీద కొంత ధనాన్ని వెచ్చించారు. వీటిని వారి స్వార్థానికి ఉపయోగించుకోవాలను కుంటున్నారు. మనం వారికిచ్చినవి కేవం ఢిల్లీలోని నేషనల్ జెనిటిక్ బ్యాంకులోనివి మాత్రమే కాదు, మనీలా, ఇతర ప్రదేశాలలోనివి కూడా. ఈ మూల పదార్థాల కోసం వారు మనకు డబ్బు చెల్లిస్తారా? ప్రభుత్వం దీనికి గ్యారంటీనిస్తుందా? వాణిజ్యశాఖ మంత్రి నుంచి విపులమైన సమాధానాన్ని కోరుతున్నాను.

తాజా సమాచారం ప్రకారం మనదేశంలో వ్యవసాయ సబ్సిడీలను తగ్గించమన్న కమిటీ ఇంతవరకు లేదు. అయితే ఈ ప్రభుత్వం ఖచ్చితంగా విద్యుత్తు, నీటి ఛార్జీలను పెంచుతుంది. అప్పుడు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఇది మన వ్యవసాయ ఉత్పత్తులను అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేసే ప్రయోజనకర పరిస్థితిని కల్పించదు. అన్ని కాలాల్లోను వ్యవసాయ టారిఫ్, నీటి

ఛార్జీలను పెంచవద్దని కోరడం లేదు. ఇవి క్రమంగా పెరుగుతూ ఉండాలి. ఇందువల్ల రైతులకు కూడా పెద్దగా బాధనిపించదు. అదే సమయంలో మనం దేశీయంగా ఉత్పత్తిని పెంచడంతోపాటు, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే స్థితికి చేరుకోవాలి.

చైనా 'గ్యాట్' ఒప్పందంలో సంతకం చేయనప్పటికీ తన ఎగుమతులను 20 బిలియన్ డాలర్ల నుండి 80 బిలియన్ డాలర్లు వరకు పెంచుకోగలిగింది. మనం కేవలం విదేశీ అప్పులను చెల్లించే స్థితికి మాత్రమే చేరుకోగలిగాం. వ్యవసాయ రంగంపై సవితి తల్లి ప్రేమ చూపడమే ఇందుకు కారణం. దీనిపై మరింత దృష్టి సారించి అవసరమైన మార్పులు తీసుకురావాలి.

'ట్రిమ్స్' ఒప్పందం ప్రకారం మనం 1995తో ప్రారంభించి వరసగా ఆరేళ్ల కాలానికి 40 శాతం డ్యూటీని తగ్గించాలి. అయితే మన ఆర్థికమంత్రి ఇప్పటికీ మూలధన ఉత్పత్తులు, ముడిపదార్థాలపైన కస్టమ్స్ డ్యూటీని తగ్గించడం ప్రారంభించారు. ఇదే సమయంలో యూరోఇష్యూ, యూరో బాండ్ల ద్వారా మన పరిశ్రమల్లోకి విదేశీయులకు 24 శాతం ఈక్విటీని అనుమతిస్తున్నారు. దీనివల్ల దేశీయ పరిశ్రమలపై వారి పట్టు మరింత పెరుగుతుంది తైవాన్, చైనా దేశాలు పరిశ్రమల్లో విదేశీయుల ఈక్విటీని గరిష్టంగా పదిశాతం మాత్రమే అనుమతించేలా సీలింగ్ విధించారు. మనదేశం ప్రభుత్వం కూడా అటువంటి జాగ్రత్తలు తీసుకోకున్నట్లయితే, మరిన్ని ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

మొన్నటి రోజున ప్రమాదకరమైన వార్త వెలువడింది. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి వచ్చే సరుకులను అనుమతించరాదట. శ్రామికులకు ఎక్కువ జీతాలను ఇవ్వకపోవడమే దీనికి కారణంగా పేర్కొంటున్నారు. ఈ రూపేణా అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవరోధాన్ని కలిగించనున్నాయి. మనం ఎట్టి పరిస్థితుల్లోను దీనికి ఒప్పుకోకూడదు. ఇవి మారనంత వరకు మన ప్రభుత్వం వ్యవసాయం, మేథో సంపత్తి హక్కుల విషయమై తన నిర్ణయాన్ని మార్చుకోకూడదు. ఈ గాట్ ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా ప్రభుత్వం ప్రస్తుత తరాన్నేకాక భవిష్యత్తు తరాలను కూడా తాకట్టుపెడుతున్నది.

□

# ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ఉభయ గోదావరి, విశాఖపట్టణం, ప్రకాశం తదితర జిల్లాలలోని బంగాళాఖాతంను ఆనుకొని ఉన్న కోస్తా ప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాలు చేపల పెంపకానికి అనుకూలం. పంటలు పండించడానికి అనుకూలం కాదు. కాబట్టి ఈ ప్రాంతరైతులు రొయ్యలు, చేపలు పెంచడానికి చెరువులు తయారు చేసుకొంటున్నారు. మత్స్య పరిశ్రమలో అభిరుచి ఉన్న కొందరు ఇక్కడ పొలాలు కొని పెట్టుబడులు పెట్టారు. వీళ్ళను ఈ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టి, వేలాది ఎకరాల భూముల్ని బాడా వ్యాపారులకు కట్టబెట్టాలని చూస్తోంది. బెస్తవారు (పట్టపోళ్లు), షెడ్యూల్డ్ కులాలు, వెనకబడిన కులాలు తదితర బలహీన వర్గాలు ఇప్పుడిక్కడ సాగుచేసుకొంటున్నారు. ఈ పేదవారిని బలవంతంగా అక్కడ నుంచి పంపించి వేయడానికి స్థానిక అధికార యంత్రాగం ప్రయత్నిస్తోంది. దీనివల్ల ఆ ప్రాంతాలలో ఆందోళనలు జరుగుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడిపెట్టిన వీరికి చెడ్డచేయవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇవ్వాలని నేను కేంద్రాన్ని కోరుతున్నాను.

సముద్ర ఉత్పత్తుల అభివృద్ధి సంస్థ (MPEDA) కు మరిన్ని నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. చేపల, రొయ్యల సాగును రైతులు

సశాస్త్రీయంగా చేయడానికి, ఎక్కువ ఆలస్యం కాకుండా రొయ్య రైతులకు వ్యాపార బ్యాంకులు ఆలస్యం కాకుండా రుణాలు మంజూరు చెయ్యడానికి ఈ నిధులు దోహదపడతాయి.

అధ్యక్షా ! చాలా ముఖ్యమైన ఈ విషయంపై చర్చకు అనుమతించినందుకు మీకు నా కృతజ్ఞతలు. మీరు తీసుకున్న నిర్ణయాల అనంతర పరిణామాలను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిశీలించాల్సి ఉంది. గత రెండు సంవత్సరాలలో మాత్రమే బియ్యాన్ని ఎగుమతి చేయగలిగాం. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించాం. ఈ సంవత్సరం సుమారు రూ. 1500 కోట్లు వెచ్చించి 3 మిలియన్ టన్నుల గోధుమల్ని దిగుమతి చేసుకునే పరిస్థితి దాపురించింది.

దీనికి తోడు, నా సహచరులు ఇంతకు ముందే చెప్పినట్టు వందల కోట్ల విలువచేసే బియ్యాన్ని కూడా మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇది ఈ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానమని నేను స్పష్టం చేస్తున్నాను. ఇది చాలా దురదృష్టకరమైన విషయం. మన వ్యవసాయ మంత్రి డా॥ బలరామ్ జక్కర్ అంటే నాకు చాలా గౌరవం, ప్రేమా ఉంది. రైతుల పట్ల ఆయనకు గల శ్రద్ధ, ప్రేమలపై నాకేమాత్రం సందేహం లేదు. రైతాంగంపై కాకుండా ఇతర వర్గాలపై ఇటువంటి విధానాన్ని అమలు చేయడానికి ఈ ప్రభుత్వం సాహసించ గలదా? గత సంవత్సరమే మీరు ఎరువుల ధరలు 30 శాతం పెంచారు. వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే, ఎరువుల ధరలపై వేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక సమర్పించింది. వెంటనే ప్రభుత్వం ఫాస్ఫేట్, పొటాష్ ఎరువుల ధరలపై నియంత్రణ తొలగించినట్లు ప్రకటించింది. ఎక్స్‌టెంటెండ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఐ.ఎం.ఎఫ్.ను ఒప్పించి మూడోసారి అప్పు తేవడానికి ఆర్థిక మంత్రి వెళ్ళడం నిజం కాదా? వాళ్ళ మెప్పుకోసం వారి షరతుల్ని ఈ ప్రభుత్వం అమలు చేయడంలో శ్రద్ధ చూపడం నిజం కాదా? వారి షరతుల్ని అమలు జేస్తానని తాను చేసిన వాగ్దానాల్ని నిలబెట్టుకోవడానికే ఆర్థిక మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు? లేకపోతే కారణాలు ఏమిటో దయచేసి చెప్పండి? సరిగ్గా ఈ సమయంలోనే ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకొంది? దీనితో పొటాష్ ధర రూ. 88 నుంచి రూ. 210 కి పెరిగింది. డీ.ఏ.పీ. ధర రూ. 230 నుంచి రూ. 440కి పెరిగింది.

ఎరువుల ధరలపై వేసిన జె.పి.సీ. ప్రతిపాదనలను అమలు చేయాల్సిన అవసరముందని నా తోటి సభ్యులు సావంత్, దిగ్విజయ్ సింగ్‌లు పేర్కొన్నారు. మేము

దీనిని అభినందిస్తున్నాం. కానీ ఈ ప్రభుత్వం వాటిని ఎందుకు పరిశీలించడం లేదు? జే.పీ.సీ. ప్రతిపాదనలు అమలు చేయటంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైంది?

సంయుక్త పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదనలు ప్రభుత్వం పరిశీలించకపోగా ఎరువుల కంట్రోళ్ళను తొలగించింది. దీనిమూలంగా రైతులు ఎక్కువ ధరలకు ఎరువులను కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీని తర్వాత మరికొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఇవి రైతులకు ప్రయోజనకరంగా లేవు. సూపర్ ఫాస్ఫేట్, ఇతర ఫాస్ఫేట్ ఎరువులపై వెయ్యిరూపాయల సబ్సిడీ ఇవ్వాలనే నిర్ణయం కూడా వ్యాపారస్తులకు రాజకీయనాయకులకే లాభం చేకూరుస్తుంది, కాని రైతులకు కాదు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల గురించి దిగ్విజయ్ సింగ్ కొన్ని విషయాలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇందుకు మినహాయింపు కాదని నేను సభకు తెలియజేస్తున్నాను. గత సంవత్సరం కేంద్రప్రభుత్వం పంపించిన రూ. 69 కోట్లలో ఒక్క రూపాయికూడా ఆంధ్రప్రదేశ్ రైతులకు దక్కలేదు. ఎరువులపై టన్నుకు వెయ్యిరూపాయిల సబ్సిడీ ఇవ్వాలనే నిర్ణయం మంచి ఉద్దేశంతో కూడుకున్నదే. ఎరువులపై కంట్రోల్‌ను తొలగించే ముందే ఈ నిర్ణయం తీసుకుంటే రైతులకు లాభం కలిగేది. ఎరువులపై కంట్రోల్‌ను తొలగిస్తే కలిగే పరిణామాల గురించి ప్రభుత్వ ఏమైనా ఆలోచించిందా. కంట్రోల్ తొలగించకముందే, ఎరువుల ధరలు 30 శాతం పెంచక ముందే రైతులు లాభం పొందేవారు. ఆ సమయంలో కూడా మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో కంటే మనదేశంలోనే ఎరువుల ధరలు ఎక్కువగా ఉన్నాయి.

మన దేశంలో రైతు ఒక కిలో యూరియాకు మూడు కిలోల ధాన్యాన్ని వెచ్చించాల్సి వస్తోంది. పాకిస్థాన్‌లో రెండు కిలోల ధాన్యం రేటుతో ఒక కిలో యూరియా లభిస్తోంది. కొరియాలో 0.8 కిలోలకు, జపాన్‌లో 0.3 కిలోలకు ఒక కిలో యూరియా లభిస్తోంది.

మన దేశంలో ఎరువుల వినియోగం చాలా తక్కువగా ఉంది. హెక్టారుకు 73 కిలోల ఎరువులను వినియోగించడమే గగనం. పాకిస్థాన్‌లో హెక్టారుకు 78 కిలోల ఎరువులను వినియోగిస్తున్నారు. గత సంవత్సరం మీ తప్పుడు విధానం మూలంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 9 మిలియన్ టన్నులు తగ్గిపోయింది. దీనికి 30 శాతం

ఎరువుల ధరలు పెంచడమే పూర్తిగా కారణం కాకపోవచ్చు. కానీ ఇది ప్రధాన కారణాల్లో ఒకటి. ఈ విషయాలన్నీ మీకు తెలుసు. ఎరువుల వినియోగం తగ్గినప్పటికీ తాజా అంచనాల ప్రకారం చూస్తే ఈ సంవత్సరం ఆహారధాన్యాల ఉత్పత్తి కొద్దిగా మెరుగుపడవచ్చని తెలుస్తోంది. ఋతుపవనాలు ఆలస్యంగా రావడం, వరదల మూలంగా దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఇంకా కొన్ని రాష్ట్రాల్లో పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఇవి ఇలా ఉన్నప్పటికీ 2001 వరకు మన అవసరాలకు 240 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఎరువులను తక్కువగా వినియోగిస్తే మన అవసరాలకు సరిపోను ఉత్పత్తిని ఎలా సాధించగలం? ఎరువుల వినియోగాన్ని పెంచితే తప్ప ఎకరాకు దిగుబడిని ఏ విధంగానూ పెంచలేం.

ఏడో ప్రణాళిక కాలంలో వ్యవసాయానికి రూ. 8000 కోట్లు ఖర్చు చేసినప్పటికీ కేవలం నాలుగు లక్షల హెక్టార్ల భూమి మాత్రమే కొత్తగా సాగులోకి వచ్చింది. వ్యవసాయ వనరులు పెంచడానికి ప్రయత్నించినప్పటికీ దానిపైనే మనం ఆధారపడకూడదు. ఎకరాకు దిగుబడిని పెంచటానికి, మొత్తం ఉత్పత్తిని పెంచటానికి ఎరువుల వినియోగం పెంచడమే ప్రత్యామ్నాయ మార్గం. కంట్రోళ్ళ తొలగింపు, ధరలపెంపు వంటి నిర్ణయాలు మన ఆహార అవసరాలను సాధించటానికి అడ్డంకిగా మారాయి.

మనం స్వయం సమృద్ధి సాధించామని గౌరవనీయులైన సభ్యులు చాలామంది చెప్పారు. ఇది నిజం కాదు. మనదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నారు. ఎందుకంటే వారికి కొనుగోలు శక్తి పూర్తిస్థాయిలో లేదు. మనదగ్గర సరిపోయినన్ని నిల్వలున్నాయి. ఒకవేళ మనం ప్రతీ ఒక్కరికి సంవత్సరానికి 181 కిలోల ఆహారధాన్యాన్ని పంపిణీ చేయగలిగితే అది వారి కనీస పోషకాహార అవసరాన్ని తీర్చగలిగేది. కానీ మనం దానికి చాలా దూరంలో ఉన్నాం. కేలరీల విషయంలో తక్కువలో తక్కువ 2600 కాలరీలు ప్రతీ ఒక్కరికీ అవసరం కాగా 2200 కేలరీలు మాత్రమే తీసుకుంటున్నారు. పరిస్థితులు ఈ విధంగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రపంచబ్యాంకు తప్పుడు సలహాలను ప్రభుత్వం ఎందుకు అనుసరిస్తోంది.

యూరోపియన్ దేశాల్లోనూ, అమెరికాలోనూ తలసరి సబ్సిడీ 200 డాలర్లుగా ఉందని మిత్రుడు సావంత్ అన్నారు. ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే ఇది వాస్తవాన్ని

పూర్తిగా ప్రతిబింబించడం లేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మనదేశంలో వ్యవసాయంపై 75 శాతం ప్రజలు ఆధారపడ్డారు. మనదేశంలో రైతులకు ఇస్తున్న సబ్సిడీని గణిస్తే తలసరి సబ్సిడీ 6 డాలర్లు గానే ఉంది. అమెరికాలో 2 శాతం ప్రజలు మాత్రమే వ్యవసాయంపై ఆధారపడ్డారు. అక్కడి రైతుల తలసరి సబ్సిడీని గణిస్తే 22000 డాలర్లుగానూ, యూరోపియన్ ఆర్థిక సమాజం దేశాలు ఇస్తున్న తలసరి సబ్సిడీ 16000 డాలర్లుగా ఉంది. రైతుకు 22000 డాలర్లు సబ్సిడీగా ఇస్తున్న వారు మనదేశంలో రైతుకు సబ్సిడీ రూపంలో లభిస్తున్న స్వల్పమద్దతును తొలగించమంటున్నారు. ఇది న్యాయమేనా? దీని పరిణామాలు ఎలా ఉంటాయో మీరు ఆలోచిస్తున్నారా? ఇప్పుడే కాదు భవిష్యత్తులో కూడా ఆహారధాన్యాల దిగుమతికి ఆ దేశాలపై ఆధారపడాల్సి వస్తుంది. మీరొక డాక్టర్. మంచి ఆర్థిక వేత్తలు మీరేమని భావిస్తున్నారో చెప్పండి. మీ దృష్టిలో సబ్సిడీ అంటే ఏమిటి? మీరు అంతర్జాతీయ ధరలకంటే ఎక్కువ ధరలకి ఇస్తున్నప్పుడు అది సబ్సిడీ అనిపించుకుంటుందా? మనదేశంలో రైతుకు సబ్సిడీ లభించడంలేదు. వారు దోపిడీకి గురి అవుతున్నారు. (ప్రావిడెంట్‌ఫండ్‌కు 0.8 శాతం ఇస్తుండగా, పారిశ్రామిక రంగానికి 1.4 శాతం ఇస్తున్నారు) రైతులకు తమ ఉత్పత్తులకు రావాల్సిన ధరకన్నా రైతులకు తక్కువ ధర లభిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వం ఎరువులను తక్కువ ధరకు అందజేసే విధానాన్ని కొనసాగించింది. మనదేశంలో రైతు బిచ్చగాడు కాదు. స్వీయ గౌరవం కలవాడు. ప్రభుత్వం ధర్మం చేయాల్సిన అవసరంలేదు.

ఎరువుల ధరల పెంపు సమంజసంగా ఉండాలి. రైతులు భరించే విధంగా ఉండాలి. మద్దతు ధర పెంచి కొంత అసమానతలు తగ్గించటానికి ప్రయత్నించారు కానీ ఎందరు ప్రయోజనాన్ని పొందగలరు. బహిరంగ మార్కెట్లో పీడీఎస్ పథకంకింద ఎఫ్.సి.ఐ.కి అమ్మేవారు మాత్రమే మద్దతుధర పొందుతారు. 80 శాతం రైతులు చిన్న, సన్నకారు రైతులే. వారి అవసరాలకు తగినంత మాత్రమే ఉత్పత్తి ఉంటుంది. వారు. 4, 5 క్వింటాళ్ళ ధాన్యం మార్కెట్లో అమ్మడం గగనమే. ధాన్యం మద్దతు ధర పెంపుతో వారికి ఏ మాత్రం లాభం కలగదు.

ప్రభుత్వం దీనిని పరిశీలించాలని నేను సూచిస్తున్నాను. మీరు చేసింది తప్పని మీ హృదయాంతరాళానికి తెలుసు. కానీ, ఐ.ఎమ్.ఎఫ్. ప్రపంచ బ్యాంకులకు చేసిన వాగ్దానాలకు తల ఒగ్గి ప్రభుత్వం రైతాంగానికి అన్యాయం చేస్తోంది.

దయచేసి పునఃపరిశీలించి ధరల పెంపుకు ముందు ఉన్న స్థితికి తీసుకురావాలి. మీరు పెంచాలనుకుంటే 100-90 శాతం కాక 10 శాతం ధరలు పెంచవచ్చు. ఎందుకంటే దీర్ఘకాలంలో ఇది ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. రైతులే కాదు అందరూ అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది.

వరితో పాటు ఇతర ఆహార ఉత్పత్తుల రవాణాపై నియంత్రణ, అడ్డంకుల్ని పూర్తిగా తొలగించాలని నా సూచన. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని మొన్న హైదరాబాద్‌లో మీరు చెప్పారు. కానీ, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి, ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు ధాన్యాన్ని రవాణా చేసేందుకు నిబంధనలు సడలించలేదు. ఈ పరిస్థితిని వ్యాపారస్తులు దుర్వినియోగం చేస్తున్నారు. రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటున్నారు. కాబట్టి ఈ నిబంధనలు తొలగించాలి.

రైతులు సంతోషంగా ఉండే పరిస్థితులు సృష్టించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రభుత్వం ఎరువుల ధరలను తగ్గించకపోతే, మంచి ధర లభించే ఇతర దేశాలకు ధాన్యాన్ని అమ్మకుండా రైతులను ఎలా ఆపగలరు?

□

లిబరలైజేషన్, ఆర్థిక విధానాల గురించి ప్రభుత్వం చెబుతున్న సందర్భంలో రైతులు ఎరువుల ధరలు ఎక్కువగా ఉంటే భరించలేరని ప్రభుత్వానికి తెలియ జేస్తున్నాను.

ఎరువుల ఉత్పత్తి దారులకు ఎరువుల ఉత్పత్తిపై 12 శాతం నికరలాభం ఇస్తున్నారు. నిజానికి అంతమొత్తం వారు ఉత్పత్తి చేయడం లేదు. ఎక్కువ సబ్సిడీ పొందడానికి తప్పుడు లెక్కలు చూపిస్తున్నారు. కానీ రైతుకు ఏ లాభమూ దక్కడంలేదు. వారికి 12 శాతం లాభం ఇవ్వాలని కోరుతున్నాను.

సీ.ఏ.సి.పీ. గణాంకాలు ఐదారు సంవత్సరాల క్రితం నాటివి. తాజా గణాంకాలు కాదు. వ్యవసాయ కూలీల వేతనాలు, వ్యవసాయ పెట్టుబడులలో చాలా మార్పులు వచ్చాయి. వరి, గోధుమల ధరలను సవరించాలని కోరుతున్నాను. 1970-71 సంవత్సరం ఆధారంగా ధరల సామ్యాన్ని సవరించి వ్యవసాయ పరికరాల ధరలను నిర్ణయించాలని కోరుతున్నాను. దీని ద్వారా రైతులకు కొంత న్యాయం జరుగుతుంది. ప్రజా పంపిణి వ్యవస్థకు తమ ఉత్పత్తులను ఇవ్వడానికి ప్రభుత్వానికి రైతులు సహకరించ గలుగుతారు. ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు.

# వ్యవసాయ రంగంలో ఎందుకు విఫలమవుతున్నాము ?

అధ్యక్షా ! వ్యవసాయ శాఖకు కావలసిన సాధారణ నిధుల డిమాండ్లపై కొద్దిసేపు మాట్లాడే అవకాశ మిచ్చినందుకు నా ధన్యవాదాలు.

ఈ సంవత్సరం రైతులకో పీడకల. ఫాస్పేట్, పొటాష్ ఎరువుల ధరలు పెరిగినయ్. డీజిల్ ధర పెరగటంతో రవాణా ఛార్జీలు పెరిగాయి. వ్యవసాయ విద్యుత్ ఛార్జీలు, కూలీ రేట్లు, సాగుకయ్యే ఖర్చులు సయితం పెరిగినాయి. వీటన్నింటి దృష్ట్యా వ్యవసాయానికయ్యే ఖర్చు గణనీయంగా పెరిగింది. కాని రైతు పంటకు అతి తక్కువ డబ్బును పొందుతున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఈ పరిస్థితి మిగిలిన రాష్ట్రాల్లో కూడా ఉందనుకుంటున్నాను.

ధాన్యం కనీస మద్దతుధర పెంచినప్పటికీ, బహిరంగ మార్కెట్లో 75 కిలోల ధాన్యం ధర రూ. 240ల నుంచి రూ. 220లకు పడిపోయింది. ఈ విషయాన్ని గౌరవనీయ వ్యవసాయ మంత్రి దృష్టికి తెస్తున్నాను. మినుములు ధర గతంలో క్వింటాలుకు రూ. 800 ఉండేది. నేడది రూ. 600లకు పడిపోయింది. పొడుగు దారాన్నిచ్చే పత్తి ధర రూ. 1500ల నుంచి రూ. 1000లకు చేరింది క్వింటాలు మిరపకాయల ధర గత సంవత్సరం రూ. 4000లు ఉంటే ప్రస్తుత మది రూ. 1500లు ఉంది. పరిస్థితుల్ని

చూస్తుంటే ఈ ధరలు మరింత తగ్గేలా కన్పిస్తున్నాయ్. గత సంవత్సరంలో పొగాకు కిలో సరాసరిధర రూ. 27లు ఉండగా, ఈ సంవత్సరం రూ. 20ల లోపే ఉంది. ఎఫ్.సి.వి. పొగాకు ధర గత సంవత్సరం రూ. 40 ఉంది నేడది రూ. 30లయ్యింది. దాన్నిబట్టి పొగాకు రైతులు ఎంత నష్టపోయారో మంత్రి వర్యులు అర్థంచేసుకోవచ్చు. వేరుశనగ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమిలేదు. ఈ కారణాలతో రైతుల ఆర్థిక స్థితి పూర్తిగ క్షీణించింది. దీనివల్ల బ్యాంకు రుణాలను చెల్లించలేక పోతున్నారు.

మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల్లోని పొగాకు రైతులు కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీని సందర్భంగా ఈ రోజు ప్రచురితమయిన ఒక వార్తను మంత్రి వర్యుల దృష్టికి తెస్తున్నాను. ఇది ప్రముఖ తెలుగు దినపత్రిక 'ఈనాడు'లో ప్రచురిత మయ్యింది.

అనంతపురం జిల్లా హిందూపురం మండలం ములుగు గ్రామానికి చెందిన అంజప్ప అనే పట్టు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై గౌరవనీయ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగొండ ఆర్.డి.ఓ.ను విచారణకు ఆదేశించారు పట్టుగూళ్లకు సరైన ధర లభించని కారణంగా అంజప్ప బ్యాంకు అప్పు చెల్లించలేక పోయినందువల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడని విచారణలో వెల్లడయ్యింది.

ప్రభుత్వ దృష్టికి తెస్తున్న ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. పొగాకు రైతు విషాధ గాధ మరింత దుర్భరమైంది. కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కొందరు పొగాకు రైతు ప్రతినిధులతో విత్తమంత్రిని, ప్రధానమంత్రిని కలిశారు. పొగాకు రైతుల కడగండ్లు తీర్చే చర్యలను తక్షణం చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పొగాకు ఉత్పత్తులపై ప్రభుత్వం ఏటా రూ. 2400 కోట్లు ఎక్సైజ్ ఆదాయాన్ని పొందుతోంది. కానీ పొగాకు రైతులు మాత్రం దుర్భర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాడు.

సిగరెట్ తయారీ దారుల నుంచి 1% ఎక్సైజ్ పన్నును వసూలు చెయ్యమని గతంలో ప్రభుత్వాన్ని కోరాం. రైతు కూడా తన వైపు నుంచి అంతే మొత్తాన్ని ఎక్సైజ్ సుంకం చెల్లించేందుకు అంగీకరించారు. వీటితో సమానంగా ప్రభుత్వం తనవాటాగా జమచేస్తే రూ. 52 కోట్లవుతుంది. దీంతో పొగాకు రైతులను సంక్షోభ సమయంలో ఆదుకునే వీలుంటుంది.

ఆయా ప్రతినిధులు ప్రధానిని కలసినపుడు పరిస్థితులను చక్క దిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. కానీ విచారకరమయిన విషయమేమిటంటే ఆ తరువాత ధరలు మరింతగా తగ్గినాయి. దీంతో రైతుల ఆశలు అడుగంటినాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పొగాకు రైతుల్ని ఆదుకునేందుకు సమాయత్తమవ్వకపోతే, రైతులు రైల్‌రోక్, రాస్తారోకో వంటి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అందువల్ల ప్రభుత్వం దీనిపై తక్షణం స్పందించ వలసిందిగా కోరుతున్నాను.

వ్యవసాయ మంత్రి లోక్‌సభలో వ్యవసాయంపై గత సంవత్సరం ముసాయిదా పాలసీని ప్రవేశపెట్టారు. గత సంవత్సరం ఇదో ముఖ్య ప్రగతి. కాని, అది పాతకుండలో పాత నీరులాంటి పాలసీగా వర్ణించేందుకు నేను వెనుకాడటంలేదు. ఒకవేళ అలాకాని పక్షంలో ఆ విధానం కొత్త కుండలో పోసిన పాత నీరేనని నా అభిప్రాయం. ప్రభుత్వ విధానంలో రైతు సంక్షేమంకోసం ఉపయోగపడే అంశం ఒక్కటి కూడా లేదని చెప్తున్నందుకు నన్ను అపార్థం చేసుకోవద్దని మనవి.

దేశంలోని భూమిలో 50 శాతంలో పండిస్తున్నాం. నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. కష్టించే రైతులున్నారు. సంవత్సరంలో 2-3 పంటలు పండించేందుకు అనుకూలమైన వాతావరణం ఉంది. అయినప్పటికీ భారతదేశపు వెనుకబాటు తనానికి కారణం అర్థం కావటంలేదు. కావలసిన మౌలిక సదుపాయాలన్నీ ఉన్నాయి. భారతదేశం వ్యవసాయపరంగా ప్రపంచంలో ప్రధమ స్థానానికి ఎదిగే అవకాశముంది. కాని మనం ఎందుకు విఫలమవుతున్నాం. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పటంలో వ్యవసాయ ముసాయిదా విఫలమయ్యింది. కాబట్టి దేశం వ్యవసాయంలో వెనుకబడింది. ఈ పరిస్థితిపై నేను విచారం వ్యక్తం చేస్తున్నాను.

ముసాయిలో ప్రస్తావించిన కొన్ని అంశాలను పక్కనుంచి, సాగుకు కేటాయింపుల విషయాన్ని సభముందుంచేందుకు ప్రయత్నిస్తాను. ప్రభుత్వరంగ ప్రణాళికా వ్యయంలో వ్యవసాయ రంగానికి కేటాయింపు గత కొన్ని పంచవర్ష ప్రణాళికల నుంచి గణనీయంగా తగ్గిపోతున్నాయి. సహకారంగానికి కేటాయింపుల్ని సయితం తగ్గించేశారు.

వ్యవసాయానికి సాగునీటిపారుదల ఆయువు పట్టు. సక్రమ సాగునీటి వనరులవల్ల దిగుబడులు వృద్ధిచెంది వ్యవసాయోత్పత్తులు పెరుగుతాయి. కానీ ఈ రంగానికి కేటాయింపుల పరిశీలించండి ! మొదటి ప్రణాళికలో 22 శాతమున్న

కేటాయింపులు ఆరోప్రణాళికలో 12.5 శాతం, ఏడో ప్రణాళికలో 9.4 శాతం, ఎనిమిదో ప్రణాళికలో 7.5 శాతానికి దిగజారినాయి.

కేటాయింపుల పరిస్థితి ఇలా ఉంటుంటే వ్యవసాయ రంగంలో అద్భుతాలు జరుగుతాయని మేమెలా ఆశిస్తాము?

కోరికలు, వరాలు, విధానాలతోటి ఈ దేశవ్యవసాయ రంగంలో మార్పులు రావు. దానికి నిర్దిష్ట ప్రణాళిక అవసరం.

50 వేల రూపాయల విలువ చేసే పొలమున్న ఓ రైతు బ్యాంకుకిగానీ, సొసైటీగాని పోతే 2 వేల రూపాయల రుణం ఇవ్వటం లేదు. రైతులకు 10 వేల రూపాయల వరకు రుణాలివ్వమనే నిబంధన ఉందికదా? కానీ ఓ పారిశ్రామిక వేత్త నిబంధనలు లేకుండా ఎంత రుణమైనా పొందగలుగుతున్నాడు. రైతు ఏం పాపంచేశాడు? రైతుల మీద ఎందుకింత సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారు?

60 కోట్ల రైతులకు ప్రభుత్వం కేవలం 16 శాతం బ్యాంకు రుణ సదుపాయాన్ని కల్పించారు. కానీ అతి కొద్ది మందున్న మధ్యతరగతి పారిశ్రామిక వేత్తలకు 36% బ్యాంకు రుణసదుపాయాన్నిచ్చారు. ఎగుమతి దారుల కిచ్చే ఋణ సదుపాయాన్ని రిజర్వుబ్యాంకు మరో 10 శాతం పెంచమని ఉత్తర్వులిచ్చింది. ఉత్పత్తులను పెంచే లక్ష్యాన్నాశించి ఈ నిర్ణయాలు చేశారా? వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి కాకుండా ఎగుమతులెలా పెంచగలరు? అందువల్ల ఎగుమతులను పెంచాలనే ప్రభుత్వ ప్రయత్నం నెరవేరదు. దీన్ని నేను ఖచ్చితంగా చెప్పగలను.

రైతులపై సవతి తల్లి ప్రేమ చూపించవద్దని రైతుల క్షేమం దృష్టితోనే కాక, దేశ శ్రేయస్సు రీత్యా విధాన నిర్ణయాలు చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ దృష్ట్యా మీరు మరింత ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరముంది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవన ప్రమాణాలు మెరుగుపడకుండా మీరాశించే పారిశ్రామికాభివృద్ధి సాధ్యంకాదు. పారిశ్రామిక ఉత్పత్తులకు, వినిమయ వస్తువులకు డిమాండ్ ఎక్కడుంది? అందువల్ల ప్రభుత్వం బూటకపు ప్రతిష్టకు పోకుండా, సంకోచించకుండా విధాన పరంగా ఏర్పడ్డ కొన్నిలోటు పాట్లను గమనించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది ప్రభుత్వపు తప్పుకాక పోవచ్చు. వ్యవసాయ మంత్రి పొరపాటు అంతకన్నా కాక పోవచ్చు. ఈ దుస్థితికి కారణాలు బీజం గతంలోనే ఏర్పడి ఉండవచ్చు. కానీ పరిస్థితుల్ని చక్కదిద్ది వ్యవసాయ రంగాన్ని దారిన పెట్టేందుకు ప్రయత్నించండి.

కొద్ది, విదేశీ బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం దేశంలోని కోట్లాది రైతు కుటుంబాల భవిష్యత్తును తాకట్టుపెట్టే పద్ధతిని 'డంకెల్' ప్రతిపాదన చెబుతుంది. రైతులు తమ కిష్టమొచ్చినట్టుగా పండించుకునేందుకు, సొంత అవసరాలకు కొంత దాచుకునేందుకు వ్యాపారికి కొంత అమ్మేందుకు హక్కు ఉంది. విత్తనాల విషయాన్ని ఆఖరి అంశంగా ప్రస్తావిస్తున్నాను.

ప్రస్తుతం రైతులు తమకు అవసరమయ్యే విత్తనాన్ని పండించుకోవటమే కాకుండా, అవసరమయ్యే వారికి ఇచ్చే స్థాయిలో ఉన్నారు. కానీ రైతు తనకవసరమయ్యే విత్తనాల్ని బహుళ జాతి సంస్థల్నుంచి కొనుక్కోవలసి వస్తుంది. ఇప్పుడున్న మార్కెట్ ధోరణులు వ్యవసాయరంగంలో సంచలనం కలిగించేలా ఉన్నాయ్. మనకు అవసరంకాని కొన్ని ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకుంటున్నాం. దిగుమతులిలా చేసుకుంటూ పోతే మార్కెట్లో ధరలు గణనీయంగా తగ్గుతాయ్. దీంతో రైతు స్థితి మరింత దిగ జారుతుంది.

ప్రస్తుతమీ పరిస్థితి వంటనూనెల రంగంలో ఈ సంవత్సరంలో జరిగింది. రాజీవ్ గాంధీ హయాంలో బహుకష్టం మీద సాంకేతిక సంస్థను నెలకొల్పారు. ధరల నియంత్రణ చేసేలా ఈ సంస్థను కురియన్, ఎన్.డి.డి.బి. నిర్వహించారు. దీంతో రైతులు కొంత ఆనందించారు. వంటనూనెల గింజలు అధికంగా పండించారు. కానీ ఈ రంగంలో నేటికీ మనం స్వయం సమృద్ధి సాధించలేక పోయాం.

ఈ సంవత్సరం మనం వేల టన్నుల వంటనూనెల్ని దిగుమతి చేసుకున్నాం. దీనివల్ల స్వదేశంలోని వేరుశనగ నూనె ధరలు, పొద్దుతిరుగుడు విత్తనాలతోపాటు ఇతర నూనె గింజల ధరలు తగ్గాయి. పైన చెప్పిన పరిస్థితికి ఇదో చక్కని ఉదాహరణ. అందువల్ల, అన్ని రకాలైన ఆహార పదార్థాల దిగుమతుల్ని అనుమతించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఒకవేళ ఆహార పదార్థాలు బాగుంటే, అటువంటి వాటిని ఉత్పత్తి చేసే విధానాలను తెలుసుకుందాం. అంతే గానీ అన్నిరకాల ఆహార పదార్థాలకు అనుమతివ్వరాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఒక వేళ వీటిని కాదని మీరు ఏదైనా ఒప్పందం మీద సంతకాలు చేసినా, రైతులా ఒప్పందాన్ని అంగీకరించరు. వాటికి కట్టుబడి ఉండరు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి స్పష్టంచేస్తున్నాను. □

# వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి

ప్రస్తుత ద్రవ్యోల్బణ స్థాయిని దృష్టిలో పెట్టుకొని ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలి. మధ్యతరగతి, స్థిరాదాయవర్గాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ పరిమితిని రూ. 42,000లకు పెంచాల్సిన అవసరం ఉంది. కనీసం రూ. 36,000లకైనా పెంచాలి. ప్రిజంప్టివ్‌టాక్స్ ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదన ఆహ్వానించదగినది. పన్ను వసూలు యంత్రాంగం వల్ల ఇబ్బందులు పడుతున్న చిన్న వ్యాపారులకు ఇది ఊరట నిస్తుంది. వాణిజ్య పన్నుల వసూళ్ళ విషయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్రాలకు కేంద్రం తగిన సూచనలివ్వాలని నేను కోరుతున్నాను. కొన్ని ప్రాంతాలలో సహాయ వాణిజ్య పన్నుల అధికారి, డిప్యూటీ వాణిజ్య పన్నుల అధికార్లు నెలకు రూ. 1,00,000లను అక్రమంగా సంపాదించడం తెలిసిందే. ఈ అక్రమ సంపాదన భారమంతా అంతిమంగా వినియోదారుడి మీదే పడుతుంది. కాబట్టి ఆవిధమైన పన్నుల సంస్కరణలు చేపట్టే దిశగా ప్రభుత్వం ఆలోచించాలి. సంస్కరణలు ఇక్కడితోనే ఆగిపోకూడదు.

ప్రభుత్వం చెప్పిన దానికి వాస్తవంగా బడ్జెట్‌లో కేటాయించిన దానికి చాలా వ్యత్యాసముంది. ఆర్థిక మంత్రి ప్రసంగంలోని ఈ కింది బాగాన్ని ( ఏ) చూస్తే ఈ విషయం తెలుస్తుంది.

"శ్రమ సాంద్రత గల ఉత్పత్తి విధానాల్ని అనుసరించి ఉద్యోగావకాశాలు కల్పించడం, అధికాదాయ ఉద్యోగాల సంఖ్యను పెంచడం, గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య ఆదాయ వ్యత్యాసాలను తగ్గించడం మా దీర్ఘ కాలిక లక్ష్యం".

ఎనిమిదో ప్రణాళికలో ప్రాధాన్యతాంశాలుగా పేర్కొన్నవి ఈ శతాబ్దాంతానికి అందరికీ ఉద్యోగావకాశాలు, ప్రజా సహకారంతో జనాభావృద్ధిని అరికట్టడం, దీనికోసం ప్రోత్సాహకాల్ని, శిక్షల్ని ప్రవేశపెట్టడం, వ్యవసాయరంగంలో వైవిధ్యం ద్వారా వృద్ధిరేటును పెంచి ఆహార ధాన్యాల స్వయం సమృద్ధిని సాధించడం, ఎగుమతుల కోసం మిగులు ఉత్పత్తుల్ని సాధించడం.

కానీ ఈ లక్ష్యానికనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు లేవు. గత బడ్జెట్లో వ్యవసాయానికి రూ. 1858 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 1879 కోట్లు కేటాయించారు. గ్రామీణ, నీటి పారుదల రంగాల కేటాయింపులు కూడా ఇలాగే ఉన్నాయి. కానీ పారిశ్రామిక రంగానికి మాత్రం రూ. 1,000 కోట్లు ఎక్కువగా కేటాయించారు. గత బడ్జెట్లో రూ. 7117 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం దాన్ని రూ. 8198 కోట్లకు పెంచారు.

ఇలా ఎందుకు జరుగుతుంది? మన ఆర్థిక మంత్రి దేశంలోని ప్రముఖ ఆర్థిక వేత్తలలో ఒకరు. పెరుగుతున్న మూలధన ఉత్పత్తి నిష్పత్తి వల్ల వ్యవసాయ రంగానికి అధిక ప్రయోజనం చేకూరుతుందని ఆయనకు తెలిసినా వ్యవసాయ రంగానికి ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు?

వ్యవసాయరంగంలో మూలధన ఉత్పత్తి నిష్పత్తి 3.2% ఉండగా, పరిశ్రమల రంగంలో ఇది 14.3%గా ఉంది. ఇదే పెట్టుబడి వ్యవసాయరంగంలో పెడితే మరింత ఉత్పత్తి సాధించగలం.

ఏడో పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ. 12,869 కోట్లు ఖర్చు పెట్టారు. పరిశ్రమలు, ఖనిజాల కోసం రూ.

29, 965 కోట్లు ఖర్చు పెట్టారు. ఇది వ్యవసాయ రంగానికి ఖర్చు పెట్టిన మొత్తం కంటే రెండున్నర రెట్లు ఎక్కువ. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు కేటాయించిన దానికంటే పరిశ్రమలు, దాని అనుబంధ రంగాలకు కేటాయించిన మొత్తం నాలుగురెట్లెక్కువ.

ఈ వ్యత్యాసం కొన సాగుతూనే ఉంది. ప్రభుత్వం మాత్రం వ్యవసాయ రంగానికే ప్రాధాన్యమని తన పాటతాను పాడుతూనే ఉంది. చిన్న సన్నకారు రైతులపై అమితమైన ప్రేమ ఉందని చెబుతున్నారు. నేనొక చిన్న ప్రశ్న అడుగుతాను. ఆహారం లేకుండా ఎవరైనా జీవించగలరా? ఎవరైనా తమశక్తిని పెంచుకోగలరా?

వ్యవసాయ రంగానికి తగినన్ని నిధులు కేటాయించకుండా అది సత్వర అభివృద్ధి సాధించాలని ఎలా భావించగలం? గత సంవత్సరం పంచదార, బియ్యం, పత్తి, గోధుమలను ఎగుమతి చేయడం ద్వారా ప్రభుత్వం కొన్ని వందల కోట్లు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది కాని ఈ సంవత్సరం కొన్ని ప్రాంతాలలో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మనమే పత్తి, గోధుమలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈ ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకొని ఒక పంటకాలం, ఒక సంవత్సరం నిలబడగలిగే స్థాయికి మన వ్యవసాయ రంగం చేరుకోలేదు. అందుచేత వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

నీటి పారుదలకి సంబంధించిన ఆందోళనకర విషయం మరొకటుంది. భారీ మధ్య తరహా ప్రాజెక్టుల ద్వారా సేద్యపునీరు అందించడానికి ఒక హెక్టారుకి అయ్యే వ్యయం రూ. 40,000. అదే చిన్న నీటి ప్రాజెక్టుల ద్వారా అయితే ఇది కేవలం రూ. 10,000 నుంచి రూ. 15,000లు మాత్రమే. ఇటీవల పత్రికలలో ఆందోళన కరమైన వార్తొకటొచ్చింది.

జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు, వాణిజ్య బ్యాంకులు నీటి పంపు బట్టి విద్యుద్దీకరణ పథకానికిస్తున్న సహాయాన్ని నిలిపేయడంతో అది డోలాయమానంలో పడింది. ప్రత్యేక వ్యవసాయ ప్రాజెక్టు కింద భారీగా పంపుసెట్ల విద్యుద్దీకరణ కోసం నాబార్డ్, వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థలు గతంలో ఋణ సహాయాన్ని అందించాయి. గతంలో విద్యుత్ మంత్రిత్వ శాఖ వెలువరించిన పత్రంలో ఈ ఆర్థిక సంస్థలు తమ హాయాన్ని క్రమేణా తగ్గించుకుంటూ

పూర్తిగా నిలిపివేయాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నాయి. వ్యవసాయ రంగంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. వ్యవసాయోత్పత్తిపై ప్రభావం చూపే పంపుసెట్ల విద్యుద్దీకరణకు ఋణ సహాయం లభించక పోవడం ఈ రంగానికి పెద్ద దెబ్బ. బ్యాంకులను సహాయం చేసేలా ఒప్పించడానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ, ప్రణాళికా సంఘం, గ్రామీణ విద్యుదీకరణ సంస్థ చేసిన ఉమ్మడి ప్రయత్నాలు ఇంత వరకూ ఫలించలేదు.

ఇది చాలా అందోళన కలిగించే విషయం, ఇది నిజం కాదని నేను ఆశిస్తున్నాను. ఒకవేళ ఇదే నిజమైతే, మన దేశం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయం పట్ల తగినంత శ్రద్ధ తీసుకొని పంపుసెట్లకు విద్యుద్దీకరణ కార్యక్రమానికి ఋణ సహాయం కొనసాగించేలా చూడాలని నేను ఆర్థిక మంత్రిని కోరుతున్నాను.

నేను ప్రభుత్వానికి ఒక హెచ్చరిక కూడా చేస్తున్నాను. వ్యవసాయ రంగానికిస్తున్న సబ్సిడీలను హఠాత్తుగా రద్దు చేయవద్దు. ఇప్పుడు ప్రపంచబ్యాంకు చెప్పొచ్చు, ఐ.ఎమ్.ఎఫ్. చెప్పొచ్చు. మీరు ఒక్కసారిగా సబ్సిడీలను రద్దు చేస్తే, అది మన వ్యవసాయ రంగ ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచబ్యాంకులు మనదేశంలో సబ్సిడీలను నిలిపివేయమని చెపు తున్నాయి. అమెరికా వ్యవసాయ రంగానికి 90 బిలియన్ల సబ్సిడీ ఇస్తుంది. యూరోపియన్ యూనియన్ కమ్యూనిటీ కూడా 134 బిలియన్ డాలర్ల సబ్సిడీనిస్తుంది. మనదేశంలో సబ్సిడీల మొత్తం 7 బిలియన్ డాలర్లు కూడాలేదు. మళ్ళీ దీనిలో ఇతర రంగాలకు ఇచ్చేదే ఎక్కువ. దీనివల్ల రైతులు అంతగా లాభం పొందలేదు ఉదాహరణకు ఎరువులను తీసుకోండి. అధిక భాగం ప్రయోజనాలు తయారీ దారులకు, ప్రభుత్వానికీ పోతున్నాయి. నాఫ్తా, బొగ్గు, విద్యుత్ ఇతర వస్తువులు ధరలు పెంచడం ద్వారా ప్రభుత్వమే ప్రయోజనాలు పొందుతుంది.

దేశంలో 2/3వ వంతు ప్రజలకు ఆసరాకల్పిస్తూ, జాతీయాదాయంలో 1/3వ వంతు ఆదాయాన్ని సమకూరుస్తున్న వ్యవసాయంలో మూలధన సమీకరణ మాత్రం చాలా తక్కువుగా వుంది. ఇది పెరగడానికి బదులు తగ్గిందని అర్థమయినప్పుడు మీరు బాధపడుతారు. పది సంవత్సరాల క్రితం 18.7% ఉన్న

మూలధన సమీకరణ 1989-90 నాటికి 9.6% మాత్రమే ఉంది. ఫలితంగా వ్యవసాయరంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వెయిటెడ్ ఏవరేజ్ ప్రొడక్షన్ కో-ఎఫిషియంట్ వ్యవసాయరంగానిది 0.8% ఉండగా, పారిశ్రామిక రంగానిది 1.4%గా ఉంది. దీనర్థం మీరు పారిశ్రామిక రంగానికి రక్షణలు కల్పిస్తున్నారుగానీ, వ్యవసాయ రంగానికి మాత్రంలేవు. పైగా తక్కువ మద్దతు ధరలను నిర్ణయించటం ద్వారా రైతులకు నష్టం చేస్తున్నారు. వాస్తవ ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా మద్దతుధర కల్పించక పోవడం, వ్యవసాయ ఉత్పత్తులు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి స్వేచ్ఛగా తరలించడానికి అడ్డంకులు, నిర్బంధలేవీ వంటి చర్యలతో రైతును ఇబ్బందులు పెడుతున్నారు. ఐతే ఆర్థిక మంత్రి ప్రతిపాదించిన ఆగ్రోబిజినెస్ కన్సార్టియాను మేము స్వాగతిస్తున్నాం. ఇది రైతులకు కొంతవరకూ ప్రయోజనం కలిగించొచ్చు. ఐతే ప్రస్తుతం మాత్రం వారు ఏ విధమైన ప్రత్యక్ష ప్రయోజనం పొందడంలేదు. నగరాలలో నివశిస్తున్న ఎగుమతిదారులు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారు. ఐతే పరిస్థితి చక్కదిద్దడానికి ఇప్పుడు చేస్తున్న ప్రయత్నం మంచిదే. కాని వ్యవసాయ రంగానికి తగినంత రుణ సౌకర్యం కల్పించనిదే, పరిస్థితి మెరుగుపడదు. అదే విధంగా మీరు వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారు. ఇలాంటప్పుడు మరిన్ని కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రారంభించి రైతులకు విస్తరణ సేవలు ఎలా అందించగలరు? కాబట్టి ఈ ప్రతిపాదనల్ని సవరించి వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలని సూచిస్తున్నాను. కేవలం కొన్ని పద్ధతులు మార్చడం ద్వారా అభివృద్ధి జరుగుతుందని ఆర్థిక మంత్రి భావిస్తున్నారా? ఉత్పాదకతను పెంచే పద్ధతుల్ని ప్రారంభించక పోతే మీరు ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచలేరు. చైనాలో జాయింట్ వెంచర్స్ కోసం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. అలాంటి జాయంట్ వెంచర్స్‌లో కార్మికుల్ని తీసుకోవడానికి, పనిచేయకపోతే తీసేయడానికి మేనేజర్‌కు అధికారం ఉంటుంది. భారతదేశంలో కూడా అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, మరెక్కడైనా పనిచేయకపోతే తొలగించే పద్ధతిని ప్రవేశపెట్టేవరకు అభివృద్ధి జరగదు. అప్పుడే కార్మికుడు జాతి పురోభివృద్ధికి శ్రమిస్తాడు. ఈ సంస్కరణలన్ని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడితే మేం తప్పకుండా వాటిని స్వాగతిస్తాము. కానీ

మన ఆలోచన వేరొక కోణంలో పోతుంది. ప్రస్తుతం కోకో కోలా కంపెనీ మనదేశంలో ప్రవేశించడానికి సిద్ధంగా ఉంది. బీర్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి కేర్లస్ బెర్గ్ కంపెనీ కూడా సిద్దంగా ఉంది. మనం తగినంత పెట్టుబడి, యంత్రాలు కలిగిన ఇటువంటి రంగాల్లో వారు ప్రవేశించడానికి ఎందుకు అనుమతినివ్వాలి? మనం తగినంత పెట్టుబడి కలిగి ఉన్న రంగాల్లో వారి ప్రవేశాన్ని అనుమతించకూడదు. ఏ రంగంలో అయితే మూలధనం, విదేశీ పరిజ్ఞానం అవసరమౌతాయో ఆ రంగాల్లోకి వారిని ఆహ్వానించాలి. సిమెంటు, వంట గ్యాస్‌ల ధరలను తగ్గించాలని నేను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

ప్రస్తుత బడ్జెట్ ధనికులకే గాని పేద ప్రజలకేమాత్రం సహాయపడదు. ఈ బడ్జెట్‌ను నేను వ్యతిరేకిస్తున్నాను.

సిమెంటు, వంటగ్యాస్‌ల ధరలు పెంచాలన్న ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఇప్పటికే సిమెంటుపై 20 రూపాయలు ధర పెంచారు. నల్లధనం ఉన్నవారు, ధనికులు దీనివల్ల నష్టపోరుకాని మధ్యతరగతి వర్గంపై మాత్రం ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది.

ఈ దేశంలో నివాస యూనిట్ల కొరత మిలియన్ల సంఖ్యలో ఉంది. సమయాభావం వల్ల నేను ఆవివరాల జోలికి వెళ్ళను.

అదే విధంగా వంటగ్యాస్ విలాస వస్తువు కాదు. ప్రతి కుటుంబానికి కావలసిన కనీసావసరమిది. ధర తగ్గించాలని నేను ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాను.

ఈ బడ్జెట్ నిజంగా పేదల బడ్జెట్టే అయితే, నల్లధనాన్ని వెలికి తీయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంటే వంద రూపాయల నోట్లని మీరెందుకు రద్దు చేయరు? దేశంలో లక్ష కోట్ల రూపాయలకంటే ఎక్కువ నల్లధనం ఉంది. వంద రూపాయల నోట్లను రద్దు చేస్తే. నిజాయితీగా పన్ను చెల్లిస్తున్న మధ్యతరగతి పౌరుల్ని, సామాన్యుల్ని బాధించాల్సిన అవసరంలేదు.

పేదలకు హాని చేస్తుంది కాబట్టి ఈ బడ్జెట్‌ని నేను వ్యతిరేకిస్తున్నాను. ప్రభుత్వానికి వారి సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధివుంటే నా సూచనలను అంగీకరించి, ఈ విషయంలో ఖచ్చితమైన ప్రతిపాదనలతో ముందుకు రావాలి.

□

# ప్రపంచ వాణిజ్య సంస్థకు భావితరాలను బలిచేయవద్దు

బడుగుదేశాలను తమ చెప్పుచేతల్లో ఉంచుకోనేందుకు, ప్రపంచవ్యవసాయ విపణిలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకొనేందుకు సంపన్నదేశాలు ఈ డంకెల్ డ్రాఫ్టను ఓ సాధనంగా వాడుకొంటున్నాయి. దీనివల్ల భారత వ్యవసాయరంగానికి పెనుముప్పు తప్పదు.

వ్యవసాయరంగానికిచ్చే అనవసర రాయితీల్ని ఉపసంహరించవచ్చని ఇంతకుముందు ఛార్లెస్ చెప్పారు. ఈ అంశంపై అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. మనవద్ద ఉన్న విదేశీ మారక నిల్వలతో ఎంతోకాలం దిగుమతులు సాగవు.

డంకెల్ ప్రతిపాదనలననుసరించి వ్యవసాయరంగానికి ఇస్తున్న రాయితీలను తగ్గిస్తే వచ్చే ముప్పేమిలేదు. అయితే ప్రభుత్వం ఆ రంగానికి చేయూతనిచ్చేందుకు నిర్దిష్టమైన చర్యలు గైకొనాలి. వరి, గోధుమ, చెరకు తదితరాల కనీస మద్దతుధరను తగిన రీతిలో సవరించాలి. తరవాతి అంచనాలకొరకు సబ్సిడీలను కొనసాగించాలా! వద్దా? అనేది నిర్ణయించవచ్చు.

అంతర్జాతీయ మార్కెట్ ధరలతో పోల్చిచూస్తే మనదేశ వరి, గోధుమల ధర కాస్త తక్కువే! మన దగ్గర మిగులు ధాన్యాలున్న పక్షంలో వాటిని ఎగుమతి చేద్దాం.

మనదేశంలో వినియోగం, ఉత్పాదకత తక్కువస్థాయిలో ఉంది. వరి, గోధుమలను దిగుమతి చేసు కొంటున్నాం. దీని మూలంగా అభివృద్ధి చెందిన దేశాలు బడుగుదేశాలపై ఆధిపత్యాన్ని చలాయిస్తున్నాయి.

వ్యవసాయ దారులకిచ్చే ఎరువుల సబ్సిడిపై ప్రభుత్వం కోత విధించింది. ఆ వివరాల్లోకి నేను వెళ్ళదలచుకోలేదు. అగ్రరాజ్యాల నిర్హేతుక వైఖరికి అద్దం పట్టే ఓ ఉదాహరణను మీ ముందుంచుతాను. గాట్ (GATT) పరిధి నుండి వ్యవసాయ రంగానికి మినహాయింపు నివ్వాలని గతంలో అమెరికా, జపాన్‌లు కోరాయి. యూరోపియన్ ఆర్థిక మండలి కూడా అదే బాటను అనుసరించింది. కానీ అవే దేశాలు నేడు గాట్ పరిధిలోకి వ్యవసాయరంగాన్ని కూడా చేర్పించాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ వ్యవసాయోత్పత్తులను తక్కువ ధరలకే ఎగుమతి చేస్తున్నాయి. ఇది తమకు పోటీగా పరిణమించింది. దీని కొరకు అంతర్జాతీయ వ్యవసాయ మార్కెట్‌లో తమస్థానాన్ని పరిరక్షించుకోవాలని అమెరికా సెనేటర్ బోల్ష్‌విర్జో తనదేశాన్ని హెచ్చరించాడు. ఆయన గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌కు వ్యవసాయరంగ సలహాదారులుగా పనిచేశారు.

అగ్రరాజ్యాలు తమ రైతులకు పెద్దమొత్తంలో సబ్సిడీలనందిస్తున్నాయి. అతి తక్కువ ధరలకే వారి ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లోకి గుమ్మరిస్తున్నాయి. ఈ దేశాలతో పోటీపడలేని వర్ధమాన, బడుగుదేశాల పరిస్థితి నానాటికి క్షీణిస్తోంది. దీనికి చక్కటి ఉదాహరణను వివరిస్తాను.

అమెరికన్ బహుళజాతి సంస్థ అయిన కార్గిల్ నుంచి నైజీరియా భారీ పరిమాణంలో గోధుమల్ని దిగుమతి చేసుకొనేది. అనంతరం కొంతకాలానికి నైజీరియా తమ దేశ్రైతుల అభ్యున్నతి దృష్ట్యా గోధుమదిగుమతులకు స్వస్తి చెప్పింది. ఈ చర్యపట్ల ఆగ్రహించిన అమెరికా ''మా గోధుమల్ని దిగుమతి చేసుకోనట్లయితే మీ వస్త్రాలను మేము దిగుమతి చేసుకునే ప్రశ్నే లేదని'' తేల్చి చెప్పింది. ఇలా ఉంటుంది అగ్రరాజ్యాల వైఖరి. ప్రపంచం మొత్తం మీద ఉత్పత్తయ్యే గోధుమల్లో 85 శాతం వాటా అమెరికా, యూరప్‌లదే కావడం గమనార్హం. మొక్కజొన్న పంటలో ఈ వాటా మరో పదిశాతం అధికం. కాబట్టి ఈ బలమైన దేశాల నుంచి వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకోవాలి.

ప్రభుత్వం మరో అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని నా సలహా. ఇప్పటివరకు వ్యవసాయరంగానికి సంబంధించిన పేటంటు చట్టంలో వివిధరకాల

వంగడాలు, జన్యుమార్పిడి వంగడాలకు పేటెంట్లు నమోదు కాలేదు. వర్ధమాన దేశాల్లో, ప్రత్యేకించి మనదేశం, శ్రీలంకలు మేలుజాతి వంగడాలను రూపొందించుకున్నాం. మేలుజాతి వంగడాలను క్రాస్ బ్రీడ్‌చేసి అధిక దిగుబడినిచ్చే రకాలను సంపాదించుకున్నాం. ప్రస్తుతం సంపన్న దేశాలు బయోటెక్నాలజీ సాయంతో ఈ పని సులువుగా చేసుకొంటున్నాయి. వాటికి పేటెంటు పొందడానికి నమోదు చేయనున్నాయి. ఒకసారి పేటెంటు హక్కుల్ని పొందిన తరవాత దానిపై వారికే సర్వాధికారాలు దఖలుపడతాయి. ఆ దేశాల బహుళ జాతి సంస్థలు అమ్మే విత్తనాలను కొనగలిగే స్థోమత మన రైతులకు దాదాపు లేదు. ఈ అంశాలపై లోతుగా చర్చ జరగాలి. ఈ సమస్యకు నిర్మాణాత్మకమైన పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది.

మానవాళి సంక్షేమం కోసం శతాబ్దాలుగా కృషి జరుగుతోంది. దురదృష్టవశాత్తూ అభివృద్ధి ఏ కొందరి చేతుల్లోనో కేంద్రీకృతమవుతోంది. దీని మూలంగా మునుముందు వర్ధమాన దేశాల రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది.

మనలో ఉన్న అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థలో అధిక దిగుబడినిచ్చే వరి, ఇతర వంగడాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. అనేక మంది శాస్త్రవేత్తలు ఈ పరిశోధనల్లో పాలు పంచుకొంటున్నారు. వీటిపై ఎవరికీ పేటెంటు హక్కులేదు. ఈ వరిని ఏ రైతైనా ఆంక్షలు లేకుండా పండించుకోవచ్చు. భవిష్యత్ అవసరాల కోసం నిల్వ చేసుకోవచ్చు. ఈ వరి అమ్మకంపై నిబంధనలు కూడా విధించలేదు. మనం ఈ డ.బ్లు.టి.ఓ. వల్ల బహుళ జాతి సంస్థల పేటెంటు చట్టాన్ని ఆమోదించవలసి వస్తుంది. అటువంటి పరిస్థితి తలెత్తకుండా చూడవలసిందిగా నేను అభ్యర్థిస్తున్నాను.

సహచరుడు డి.పి. పాల్ పేర్కొన్నట్టు విచక్షణా రహితంగా మనం అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాల ఫలితంగా దేశం సమస్యల్ని కొని తెచ్చుకొంటోంది. ముందు జాగ్రత్తలను మరచి ఈ విధానాలను అమలు పరచరాదని నా మనవి.

మన దేశ దిగుమతులు పెరుగుతున్న తరహాలో ఎగుమతులు వృద్ధి చెందడం లేదు. పర్యవసానంగా రాబోయే రోజులలో చెల్లింపుల సమతౌల్యం ఒడిదుడుకులకు లోనవుతుంది. విదేశీ ఋణాలపై ఆధారపడాల్సిన దుస్థితి దాపరిస్తుంది. ఇప్పటికే దేశంపై రెండులక్షల కోట్ల రూపాయల విదేశీ ఋణభారం పడింది.

తత్ఫలితంగా భవిష్యత్ తరాలపై భరించలేనంతటి భారం మిగులుతుంది. వారు చెల్లించాల్సిన ఋణాలు అధికమవుతాయి. ప్రభుత్వం ఈ అంశంపై తీవ్రంగా

చర్చించి తగు నిర్ణయం గైకొనాలి. గాట్, డంకెల్ ప్రతిపాదనలను ఆమోదించి అమెరికాకు తలొగ్గరాదని నా అభ్యర్థన.

దేశ ప్రజల అంగీకారం, పార్లమెంటు ఆమోదం లేకుండానే ఈ చట్టాన్ని బలవంతంగా తేవాల్సిన అవసరం ఏమిటి? ప్రజల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా వారికి గుదిబండలాంటి ఈ (నల్ల) చట్టాల్ని ఆమోదించరాదని నా ప్రార్థన. ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ప్రతిపక్షంలో ఇతర సభ్యుల సూచనలను కూడా ప్రభుత్వం మన్నిస్తుందని ఆశిస్తున్నాను. □

# చెరుకు రైతులకు అదనపు సాయం అందించాలి

శ్రీ వడ్డే శోభనాద్రీశ్వర రావు (విజయవాడ) :- అధ్యక్షా, ప్రస్తుత సీజన్‌లో చెరకు పంటకు చట్టబద్దంగా మద్దతు ధరగా 8.5 శాతం రికవరీపై రూ. 31లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పంచదార ఇచ్చేధర సైతం కేజీకి రూ. 6.90 లను నుంచి రూ. 8.30లుగా పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది. లేవీ పంచదారను గతంలో ఇచ్చే 45 శాతం నుంచి 40 శాతం తగ్గించారు. పంచదార పరిశ్రమలు భార్గవ ఫార్ములా అనుమతించిన ప్రకారం స్వేచ్ఛావిపణిలో 35 శాతం స్థానంలో 60 శాతం పంచదారను అమ్ముకుంటూ లాభాల్ని పొందుతున్నారు. ఎరువులు, పురుగు మందులు, డీజిల్, విద్యుత్ ఛార్జీలు, నీటిధర, పంట ఖర్చు, రవాణా ఛార్జీలు గత సంవత్సరంలో విపరీతంగా పెరిగినాయి. అందువల్ల వీటిని దృష్టిలో ఉంచుకుని, 8.5 శాతం రికవరీతో రూ. 39 చట్టబద్ధ కనీస ధరను (క్వింటాలుకు) నిర్ణయించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా పంచదార పరిశ్రమల వారికి లాభాలు పెరిగిన దృష్ట్యా చెరుకు రైతుల కిచ్చే అదనపు లాభాలలో 50 శాతంను 70 శాతానికి పెంచేలా పరిశీలించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. □

# రైతుల పట్ల ప్రభుత్వానికి సానుభూతి లేదు

అధ్యక్షా, అదనపు అభ్యర్థనలను ఆమోదించే తీర్మానాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. ఎరువులకు సంబంధించి 250 కోట్ల అదనపు సహాయనిధులను ఆమోదించేందుకు మంత్రి తీర్మానించారు. ధరల పెంపు వర్తించని చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ కోసం ఇంతకు ముందు తీర్మానాలల్లో ఆర్థికమంత్రి రూ. 400 కోట్లను ఇప్పటికే కేటాయించారని ప్రభుత్వం దృష్టికి నేను తెస్తున్నాను. తాను సన్నకారు రైతునని ధృవీకరించే పత్రాల కోసం తహసీల్ కార్యాలయానికి వెళ్ళవలసిరావడం వల్ల ఎక్కువ మంది సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోరు. తహసీల్ కార్యాలయంలో చేతులు తడపకుండా ధృవీకరణ పత్రాలను పొందడం ఎవరికీ సాధ్యం కాదు. డబ్బు ఇవ్వకుండా అక్కడ ధృవీకరణ పత్రాలను పొందడం ఒక షెడ్యూల్డ్ తరగతికి చెందిన వ్యక్తికి కూడా కష్టమే. అక్కడ పత్రాన్ని పొందిన తరువాత వ్యవసాయశాఖకు రైతు వెళ్ళవలసివస్తుంది. అప్పుడే కాస్త డబ్బులభిస్తుంది. అది కూడా కష్టం మీద రూ. 20 లేదా రూ. 30 లభిస్తుంది. సన్నకారు రైతుల్లో చాలా మంది ఈ సహాయాన్ని పొందే పరిస్థితిలోలేరు. కేటాయించిన రూ. 400 కోట్లలో ఎక్కువ భాగం ప్రభుత్వం వద్దనే ఉండిపోతుంది. కనుక, 250

కోట్ల ఈ అదనపు సహాయనిధులు అవసరం లేదు. ఎరువుల విషయంలో ద్వంద్వ ధరల విధానం ఆచరణరీత్యా అసాధ్యమని నేను ముందే చెప్పాను. చిన్న రైతులకు ఒక ధరకు, ఇతర రైతులకు ఒక ధరకు విక్రయించడం కుదరదు. ఇతర రైతులు ఎవరు? 20 ఎకరాల మాగాణీ లేదంటే 40 ఎకరాల మెట్టభూమి ఉన్న రైతులు ఒక శాతమో రెండు శాతమో ఉంటారు. ఎక్కువ మంది రైతులు మధ్యస్థాయికి చెందినవారే. ప్రతిష్టకు పోయి అనవసరమైన ఆలోచనలకు పోకుండా ద్వంద్వ ధరల విధానాన్ని రద్దు చేసి హేతుబద్ధమైన సమాన ధరల విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి నా సూచన. పగలూ, రాత్రీ కష్టపడి, అన్ని ప్రకృతి వైపరీత్యాలనూ ఎదుర్కొనే రైతుపట్ల మీకు సానుభూతి లేదు. పరిశ్రమలను అసమర్ధంగా నడిపించే పారిశ్రామిక వేత్తలకు 250 కోట్లను ఇవ్వాలని మీరు తీర్మానిస్తున్నారు. ఏ కరెంట్ మీటరో, డీజిల్ పంపో వేయడానికి పొలానికి వెళ్ళిన రైతులు పాముకాట్లకు గురవ్వవలసివస్తుంది. కొన్ని సార్లు రైతులు ప్రాణాలనే కోల్పోతారు. కాని మీకు మాత్రం వారిపట్ల సానుభూతి లేదు. ఇప్పటికే ఎన్నో ప్రయోజనాలను పొందుతూ, మీకు తప్పుడు లెక్కలను చూపిస్తున్న పారిశ్రామిక వేత్తలకు సహాయం చేయడానికి మీరు పూనుకున్నారు. పరిశ్రమలు ప్రభుత్వ ఖజానాను ఏవిధంగా మోసగిస్తున్నదీ నా సీనియర్ సహచరుడు శ్రీజార్జి ఫెర్నాండ్జ్ సభలో చెప్పారు. కొన్ని వేల కోట్ల రూపాయల మేరకు వారు ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారు. కనుక, ఈ ద్వంద్వ ధరల విధానాన్ని గురించి పునరాలోచించండి. రామగుండంలో ఒక ప్రభుత్వ రంగ ఎరువుల పరిశ్రమ ఉంది. కర్మాగారానికి ఒకవైపు బొగ్గు ఉత్పత్తి చేస్తారు. మరోవైపు ఎన్టీపీసీ వారి విద్యుత్ప్లాంటు ఉంది. కాని ఆశ్చర్యకరంగా ఎరువుల కర్మాగారానికి కావలసిన విద్యుత్, బొగ్గు సరఫరా కావడం లేదు. ఉత్పత్తిలో నష్టాలను ఎదుర్కొని ఆ ఎరువుల కర్మాగారాన్ని చాలా రోజుల పాటు మూసి ఉంచవలసివచ్చింది. ఇటువంటి తప్పులను సరిదిద్దితే రైతులకు సహాయం చేసినవారవుతారు. ఎరువులను సరైన ధరకు రైతులకు అందించ గలుగుతారు. కెమికల్స్, పెట్రోకెమికల్స్ రంగంపై మరో సూచన. ఇంత వృధాను సహించి ప్రభుత్వం ఎందుకు ఊరుకుంటుందో నాకర్థం కావడం లేదు. కొవ్వూరు నుంచి నరసాపురం వరకు ఓఎన్జీసీకి చెందిన గ్యాస్ పైప్లైన్ ఒకటి ఉంది. చాలాసార్లు పైప్లైన్లో లీకేజి ఉండడంవల్ల, కొన్ని సార్లు పైప్ లైన్లో పగుళ్ళు రావడం వల్ల చాలా గ్యాస్ వృధా అవుతోంది. చుట్టుపక్కల ఉన్న ప్రజలకు ఇబ్బందిగా ఉంది. విలువైన గ్యాస్ వృధా అవుతోంది. గ్యాస్ పైప్లైన్లో లీకేజీవల్ల, గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ఆంధ్రప్రదేశ్లోని

విజ్జేశ్వరం విద్యుత్‌ప్లాంట్‌ను మూసివేయవలసి వచ్చింది. దయచేసి లీకేజీలను ఆపడానికి కావలసిన చర్యలను తీసుకోండి. దయచేసి గ్యాస్‌వృధాలను అరికట్టి దాన్ని సద్వినియోగ పరిచేందుకు చర్యలు తీసుకోండి. వ్యవసాయ మంత్రికి నేనొక విషయం చెప్పదలచుకున్నాను. జాతీయ వ్యవసాయ కమీషన్ ఛైర్మన్ హోదాలో మన రైతు నేత శ్రీనాథూరాం మీర్ధా ఏనాడో సిఫారసు చేశారు. నేటికీ కేవలం దాదాపు 100 కృషి విజ్ఞాన కేంద్రాలను మాత్రమే మీరు ప్రారంభించగలిగారు. అశేష ప్రజల అవసరాలను తీర్చేందుకు కావలసిన వ్యవవసాయోత్పత్తులను ఉత్పత్తి చేయడానికి వీలుగా వ్యవసాయ పరిశోధన ఫలాలు రైతులకు ఎలా అందుతాయి? తమ ప్రయత్నాల్లో, చేతల్లో చిత్తశుద్ధితో వ్యవహరించి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి నా సలహా. దేశప్రజలపై అనవసరంగా భారం మోపకండి. గత బడ్జెట్లో మంజూరు చేసిన నిధుల్లోనే ఎంతో పొదుపుకు అవకాశం ఉంది. కనుక సహాయనిధికై అదనపు అభ్యర్థనలను నేను వ్యతిరేకిస్తున్నాను.

దేశంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ప్రత్యేకించి ఇటీవల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలలో పెరుగుదల లోటు , ఆర్థికవిధానం, విదేశీ మారక ద్రవ్య సంక్షోభం, అంతర్జాతీయ ద్రవ్యనిధి పేర్కొంటున్న షరతులు

వడ్డే : నాముందు సీనియర్ సభ్యులు చెప్పిన విషయాలను తిరిగి చెప్పాలనుకోవటం లేదు. కాని ప్రభుత్వాన్ని ఒక ప్రశ్న అగడాలను కుంటున్నాను. ముందు వెనుకలు ఆలోచించకుండా కొంతమంది వ్యాపారస్తులు వ్యవసాయదారులను, వినియోగదారులను మోసం చేస్తున్నపుడు, ఎంతకాలం మీరు మౌన ప్రేక్షకుడిలా ఉంటారు?

బెంగుళూర్ నగరంలో, బెంగుళూరు హార్టికల్చర్ గ్రోయర్స్ కోఆపరేటివ్ సొసైటీ కొన్ని సంవత్సరాలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న విషయం మీకు తెలిసే ఉంటుంది. ఇప్పుడు సొసైటీ కేవలం 20.25 లక్షల పెట్టుబడితోనే, కర్నాటకలోని బెంగుళూరు, మైసూర్‌లలోనూ ప్రధాన పట్టణాలలోని 80 రిటైల్ అవుట్‌లెట్‌ల ద్వారా కూరగాయలను, పండ్లను పంపిణీ చేయగలుగుతోంది. వినియోగదారులకు నిర్ణయించిన ధరలో 80 శాతం వరకు కూరగాయలను, ఉత్పత్తిచేస్తున్న వ్యవసాయదారులకు ఈ సొసైటీ ఇస్తోంది. కాని ప్రైవేట్ వ్యాపారస్తులు మాత్రం కొనుగోలు చేసిన ధరకంటే 50 శాతం అధికంగానే కొన్ని సార్లు వందశాతం, మూడు వందల శాతం వరకు ఎక్కువగా ధరలకు అమ్ముకొంటున్నారు. స్వాతంత్ర్యం

సంపాదించి 44 సంవత్సరాలు గడిచిన నేటికైనా ఈ ధోరణిని అడ్డుకోవడానికి కొన్ని చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వానికి నా సూచన. ఈ వ్యాపారస్తులు ఒకటి రెండు ఏండ్లల్లోనే ఊహించనంత డబ్బును సంపాదిస్తున్నారు. ఏదో కొద్ది పాటి ప్రయత్నం వలన లాభం లేదు. ధరల పెరుగుదలను, కొంతవరకు ద్రవ్యోల్బణాన్ని నియంత్రణచేయడం, ఉత్పత్తిదారులను, వినియోగదారులను ఒకేచోటకు తీసుకొని వచ్చే ఇటువంటి సహకార సంఘాలను తప్పనిసరిగా ప్రోత్సహించాలి. న్యూఢిల్లీ నగరంలో, ఏర్పాటుచేసిన సూపర్‌బజార్‌లు మొదట మనం ఆశించిన రీతిలో పనిచేయలేకపోతుండవచ్చు. కాని అన్ని చోట్ల ఇదే పరిస్థితి లేదనే విషయాన్ని మీరు గమనించాలి. విజయవాడలో ఉన్న విజయకృష్ణ సూపర్ బజార్ కొంతకాలం వరకు బాగా పనిచేయలేదు. కాని చిత్తశుద్ధి, అంకితభావం సేవచేయాలనే తపన నిబద్ధత ఉన్న అధికారి దీని బాధ్యతలను చేపట్టినప్పటి నుంచి ప్రజలకు మంచిసేవలను అందించగలుగుతోంది. కేవలం విజయవాడ ప్రజలేకాదు, ఆచుట్టుప్రక్కల ఉన్న గ్రామ ప్రజలుకూడా నిత్యావసర వస్తువులను తక్కువ ధరకే పొందగలుగుతున్నారు. అందువలన ప్రభుత్వం చిత్తశుద్ధితో, కోపరేటివ్ సూపర్ బజార్‌లకు సమర్థులైన అధికారులను నియమించినట్లయితే, సందేహం లేదు, కథ మళ్ళీ మొదటికే వస్తుంది. ప్రతిభను నిరూపించుకొన్న వారి జాబితా మీ దగ్గర ఉంటుంది. అటువంటి అధికారులకు ఈ బాధ్యతను అప్పగించినట్లయితే కొంత వరకు ధరల పెరుగుదలను నియంత్రించగలం. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని అడ్డుకోగలుగుతారు.

విదేశీ మారక ద్రవ్య సంక్షోభం, చెల్లింపులకు సంబంధించి, మనం మనదేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత నివ్వాలి కాని, రాజకీయాలకు, భావజాలానికిగాని కాదు. మనదేశంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, మన ప్రజల సంక్షేమం మనకు ముఖ్యం. ఈ ప్రయత్నంలో మనం ఆచరణాత్మకమైన, ప్రయోజనకారైన దేశ అవసరాలను తీర్చే విధానాన్ని మనం అవలంబించాలి. ఈ సందర్భంగా నేను చైనాకు సంబంధించిన విషయాన్ని మీకు చెబుతాను. వందకోట్లకు మించిన ప్రజలున్న ఈ దేశం, త్వరితగతిన అభివృద్ధిని సాధిస్తోంది. అనేక రంగాలలో పురోగమిస్తున్న ఈ దేశాన్ని చూసి ఆనందించుదాం.

కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఆ దేశం ఏకాంత ధోరణిలో ఉండేది. 1974లో ఒకసారి మన విదేశీ వాణిజ్యశాఖ మంత్రి, చైనా విదేశీ పెట్టుబడులను ఆకర్షించలేదని, దేశీయ విదేశాలలో ఉన్న సహజ వనరులను ఇతర దేశాల

సహకారంతో వినియోగించుకోలేదని ఇతర దేశాలలో సంయుక్త యాజమాన్యానికి సిద్ధంగా లేరని అన్నారు. పెట్టుబడిదారి దేశంలో ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితి పరోక్షంగా సోవియట్ యూనియన్‌ను నిందిస్తోందని, విదేశీ రుణాలు తీసుకోలేని పరిస్థితి ఉందని చెప్పారు.

కొన్ని సంవత్సరాల తర్వాత మారిన పరిస్థితిని గుర్తించిన ఆ దేశం తమ మార్కెట్ ద్వారాలను తెరిచింది. మావో కాలం తర్వాత చైనా దేశంలోని నాయకులందరూ తమ మార్కెట్ ద్వారాలను తెరవాలనే నిర్ణయానికి వచ్చారు. తర్వాత మాత్రమే తమ ఆర్థిక వ్యవస్థను, ప్రజల శ్రేయస్సును పెంపొందించగలమని భావించారు. ఈ విధంగా చైనా ఒక నిర్ణయాన్ని తీసుకుంది.

తమ మార్కెట్ ద్వారాలను తెరవడంపై కొంతమంది నాయకులు, ప్రజలు తమ ఆందోళనలను వ్యక్తం చేసారు. ఏదైనా చెడు జరగవచ్చునేమోనన్న భయాన్ని వ్యక్తం చేసారు. మన మార్కెట్ ద్వారాలను తెరిచినట్లయితే, ప్రతికూల పరిణామాలు సంభవించవచ్చునని కొందరు సీనియర్ నాయకులు భయాలను వ్యక్తంచేసినా, చైనా గొప్ప నాయకుడు డెంగ్, ఎదురయ్యే ప్రతికూల పరిణామాలను నిరోధించగలమని చెప్పారు. వారు ఈ విషయమై నిర్భయంగా లేనట్లయితే తాను ఆ పదవిని విడిచిపెడతానని డెంగ్ అన్నారు. విదేశీపెట్టుబడులను దేశంలోకి అనుమతించడం, ఇతర దేశాలలో కలిసి వ్యాపారాన్ని నిర్వహించడం వలన ప్రజలు లబ్దిపొందాలికాని, పెట్టుబడిదారులు మాత్రం కాదనేది ఈ సందర్భంగా ముఖ్యమైన అంశం. చైనా వంటి ఒక దేశం, ఇతర దేశాలకు తన మార్కెట్‌లో అవకాశాన్ని కల్పించి, విదేశీ మూలధనాన్ని, పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దమొత్తంలో అంటే మనదేశం గత 44 సంవత్సరాలలో సాధించిన పెట్టుబడులకంటే ఎక్కువగా ఆకర్షించగలిగింది. కొన్ని సంవత్సరాలలోనే వారువిదేశీ పెట్టుబడిని, మూలధనాన్ని ఆకర్షించగలిగారు. ఆర్థికమంత్రి పంపిణీచేసిన పత్రాలను నేను చదివాను. ఈ పత్రాల్లో పేర్కొన్న చర్చలతోనే దేశాన్ని అభివృద్ధి చేయగలమనే ఆశలతో నేను ఏకీభవించడం లేదు. చాలా కాలం నుంచీ వీటిని చెబుతూనే ఉన్నారు. నా స్నేహితుడు మణిశంకర్ నెహ్రూ విధానాన్ని కొనసాగించాలని గట్టిగా చెబుతున్నారు. కొన్ని దశాబ్దాలు నెహ్రూ విధానం కొనసాగింది. కాని దురదృష్టవశాత్తు తన జీవిత చరమాంకంలో నెహ్రూజీ, మహాత్మాగాంధీ చూపిన మార్గం నుంచి పక్కకుతప్పుకొని, తప్పుడు మార్గంలో పయనించి తప్పుచేసానని తెలుసుకున్నారు.

మొత్తం జనాభా మూడువంతులలో రెండు వంతుల మంది వ్యవసాయాన్ని చేస్తున్నారు. వీరిలో సింహ భాగాన్ని ఆక్రమించిన గ్రామ ప్రజల జీవన శైలిని, జీవన ప్రమాణాలను ఏ విధంగా మార్చగలరనేది నాప్రశ్న. ఈ ప్రతాలలో వ్యవసాయం గురించి ఏ ఒక్కమాట స్పష్టంగా లేదు. స్థూల జాతీయోత్పత్తిలో మూడోవంతు భాగాన్ని అందిస్తున్న వ్యవసాయ రంగంపై కనబరిచినట్లయితే, ఒకవేళ నూతన ఆర్థిక విధానం, (ఇదే విధంగా సవతితల్లి ప్రేమను) వ్యవసాయ విధానాన్ని ప్రభావితం చేయనట్లయితే, నూతన ఆర్థిక విధానం ఇంతకు ముందు అమలుచేసిన విధానంలో మార్పులు తీసుకొని రానట్లయితే, ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ నూతన ఆర్థిక విధానం మనల్ని మరింత సమస్యల్లోకి నెడుతుంది. ఎందుకంటే మొత్తం జనాభాలో రెండొంతులువున్న వ్యవసాయదారులకు వ్యవసాయకూలీలకు వ్యసాయరంగమే జీవనోపాధినిస్తుంది.

ఐ.ఎం.ఎఫ్ సహాయాన్ని పొందిన దేశాలు ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాల పరిస్థితి మరింత దిగజారిందనే భయాలను కొందరు ప్రజలు వ్యక్తం చేశారు. ఇది వాస్తవం కావచ్చు.

అయితే ఆయా దేశాలు ఎక్కడ తప్పటడుగులు వేశాయో అధ్యయనం చేసి అ అంశాలలో మనం జాగ్రత్తలను తీసుకోవాలి. అప్పుడు మనదేశం అటువంటి తప్పులు చేయదు. ఐ.ఎం.యఫ్ కాని, ప్రపంచ బ్యాంకు సహాయాన్ని కాని పొందిన కొన్ని దక్షిణాసియా దేశాలు పెద్ద ఎత్తున ఆర్థికాభివృద్ధిని సాధించాయి. ఈ దేశాల అనుభవాలను మనం నిర్లక్ష్యం చేయకూడదు. మన సిద్ధాంతాలకోసమో, మన ఇజంల కోసమో గుడ్డిగా వ్యవహరించవద్దు.

వ్యవసాయరంగంలో పెట్టుబడులు చాలా తక్కువగా ఉండటమే ఈ సమస్యకు కీలకం. మీరు విశ్వసించే ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఎనిమిదో దశకంలో ముఖ్యంగా ఆరోదశకం తర్వాత వ్యవసాయానికి పెట్టుబడులు గణ నీయంగా తగ్గిపోయాయి. ఏదో దశకం రెండో భాగంలో దేశాన్ని పాలించిన జనతా ప్రభుత్వం రెండున్నర ఏళ్ళలో వ్యవసాయ రంగానికి అత్యధికంగా పెట్టు బడులు లభించాయి. తర్వాత అంతా నిర్లక్ష్యమే.

ప్రభుత్వ పెట్టుబడులు తరిగిపోవడంతో, ఈ పెట్టుబడులలో అధిక భాగం, డామ్‌లు, కాలువలు, వరద నియంత్రణ పనుల మీద చేసే వ్యయం కూడా తగ్గిపోయింది. అది మాత్రమే కాదు. మొత్తం పబ్లిక్ ఇన్వెస్టిమెంట్ తగ్గిపోయింది.

వ్యవసాయదారులకు లాభసాటికాని వ్యాపార నిబంధనల వలన ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ సైతం తగ్గిపోయింది. వారు తమ ఉత్పత్తులను అమ్మితే వచ్చిన ధరకంటే ఎక్కువ మొత్తాన్ని వాటిని ఉత్పత్తిచేయటానికే వ్యయం చేయాల్సివస్తోంది. ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ మరింత తగ్గిపోతుంది. ఈ విషయాన్ని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. అందువలన ఇన్ని సంవత్సరాలుగా అమలుచేస్తున్న ఈ తప్పుడు విధానాన్ని ఇక మీదనైనా మార్చనున్నారా అని ఆశిస్తున్నాను. ప్రైవేట్ అగ్రికల్చర్ ఇన్వెస్ట్‌మెంట్ చెప్పుకోతగినంతగా లేకపోవడం, ప్రోత్సాహకాల విధానంపై ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు. ఎందుకంటే మీరు పారిశ్రామిక రంగానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను ఇస్తున్నారు. కాని వ్యవసాయ రంగంలో ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ చాలా బాగా తక్కువగా ఉంది ఈ విషయాన్ని కూడా నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వ్యవసాయ లాభశాతం క్షీణించిపోవచ్చు. ఫలితంగా గ్రామీణ పెట్టుబడి ఏర్పడటం తగ్గిపోయింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి కనీసం ఈ అన్యాయాన్ని, దానిలోని అసమానతలను సరిచేయాలి. ఈ చర్య ద్వారా వ్యవసాయ రంగానికేకాక, మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థకే సహాయం చేసిన వారవుతారు.

వ్యవసాయదారులు చిన్న, సన్నకారు వారేమీ భిక్షను అడగటం లేదు.

మీరు మాకు సబబయిన, కనీస ధరను ఇచ్చినట్లయితే, ఎటువంటి సబ్సిడీకోసం అడగాల్సిన అవసరం లేదు. కాని, దురదృష్టవశాత్తు, వ్యవసాయ మంత్రి ఎన్ని ప్రగల్భాలు పలికినప్పటికీ ఏ ఒక్కటీ వాస్తవంగా జరగలేదు. భాను ప్రతాప్‌సింగ్ కమిటీ ఈ విషయమే విచారణ చేసినపుడు సి.ఎ.సి.పి ఇచ్చిన సమాధానాన్ని నేను వివరిస్తాను. వ్యవసాయం చేయడానికి అయిన వ్యయంలో లాభశాతం స్థిరమైన శాతంగా ఉందా? ఒకవేళ అలా అయితే ఆ శాతమెంతని భానుప్రతాప్‌సింగ్ కమిటి సి.ఎ.సి.పి.ని అడిగినప్పుడు, వ్యవసాయానికి అయ్యే ఖర్చులో లాభశాతం స్థిరశాతంగా లేదని, కమీషన్ ఒక నిర్ణయానికి వచ్చేందుకు ఇటువంటి స్థిరమైన మేథమాటికల్ నమూనా లేదని చెప్పింది. కమీషన్ అధికారికంగా ఇచ్చిన సమాధానమిది.

ఫెర్టిలైజర్లను పారిశ్రామికవేత్తలు ప్రస్తుతం చాలా అసమర్థత ప్రమాణాలతో ఉత్పత్తి చేస్తున్న విషయం మీ అందరికీ తెలుసు. అయినప్పటికీ వారికి 12 శాతం లాభాన్ని గ్యారంటీగా ఇచ్చారు. ప్రభుత్వం కాని, సి.ఎ.సి.పి. కాని, కనీసం మూడు శాతం, ఐదుశాతం గాని, ఆరుశాతం గాని, కొంతవరకు సబబైన లాభశాతాన్ని వ్యవసాయదారులకు ఇవ్వాలని ఆలోచించడం లేదు.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి, వ్యవసాయదారులకు కనీసధరను, అవసరమైన ఋణాన్ని కూడా అందచేయాలి. ఫెర్టిలైజర్ల గురించి ఇంతకు ముందు చెప్పిన వాటిని తిరిగి చెప్పను.

ఇప్పుడు స్టేట్ ఎలక్ట్రిసిటి బోర్డుల గురించి చెప్పాలను కొంటున్నాను.

ప్రతిపాదిత ఐ.ఎం.ఎఫ్ షరతులను నేను పరిశీలించాను. స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులకు ఎక్కువగా నష్టాలు వస్తున్నాయని షరతుల్లో ఉంది.

విద్యుత్ ధరను పెంచడంలో న్యాయం ఉందనుకుంటే మీరు మధ్యస్థంగా పెంచండి. ఫెర్టిలైజర్లకు చేసినట్లుగానే, ఐ.ఎం.యఫ్ చెప్పిందికదాని, మొత్తం భారాన్నంతా వ్యవసాయదారులమీదకు నెట్టివేయవద్దు.

కొంతమంది వ్యక్తులు కల్తీ చేసిన ఫెర్టిలైజర్లను తయారుచేస్తున్నారు. గుంటూరులో ఇటీవల కల్తీచేసిన ఫెర్టిలైజర్లను కనుగొన్నారు. దేశంలోని వ్యవసాయదారుల నుంచి వందల కోట్లను కొల్లగొడుతున్న ఉత్పత్తిదారులు ఉన్నారు. అందువలన ధర సబబుగా ఉండాలి. ఒకేసారి భారాన్నంతా వ్యవసాయదారులపై మోపకూడదు.

ఉపాధి విషయమై, నితీష్‌కుమార్, అన్నాజోషి చెప్పినదానికి నేను ఏకీభవిస్తున్నాను. నూతన వ్యవస్థీకృత సంస్కరణలు, దేశంలోని నిరుద్యోగులకు సహాయమందించనట్లయితే సామాజిక ఉద్రిక్తతలకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలో అనేక చోట్ల, పంజాబ్, జమ్మూ కాశ్మీర్‌లోనూ, మా రాష్ట్రం ఆంధ్రలోనూ నిరుద్యోగులైన పేద యువత మిలిటెంట్లవైపు, నక్సలైట్లవైపు ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా సామాజిక ఉద్రిక్తతలు చోటు చేసుకొంటున్నాయి. శాంతికి భంగం కలిగించే ధోరణి గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణాలలో సైతం ఆందోళన కలిగించే స్థాయిలో ఉంది. కనీసం ఇప్పటి నుంచి అయినా, గ్రామీణ పరిశ్రమల, చిన్న తరహా, కుటీర పరిశ్రమలను సాధ్యమైనంతవరకు ప్రోత్సహించినట్లయితే, ఎక్కువ సంఖ్యలో ప్రజలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇలా చేయనట్లయితే ఆర్థిక విధానం వారికి ఎటువంటి సహాయం చేయలేదు.

అన్ని కోణాల్లో వ్యవసాయాభివృద్ధి జరగనట్లయితే దేశం ప్రగతిని సాధించి

అభివృద్ధి చెందలేదు. చైనాలో ఏం జరిగింది? 1978లో వ్యవసాయ రంగంలో సంస్కరణలను చైనా నాయకత్వం ఆమోదించిన తర్వాత ఐదు సంవత్సరాల్లో రెండింతలు ఉత్పత్తిని సాధించింది. ఐదు సంవత్సరాల్లోనే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుచు కోగలిగింది. కాని మనం గత 25 సంవత్సరాలలో దీనిని మాత్రం సాధించలేక పోయాం. వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమల రంగాలలో చైనా మంచి అభివృద్ధి సాధించింది. 1983లో స్థూల జాతీయోత్పత్తిలో 13 శాతం గ్రామీణ పరిశ్రమల వాటా, రెండు సంవత్సరాలలో మరో ఐదు శాతం పెరిగింది. చైనా దానిని సాధించగలిగినపుడు మనదేశం ఎందుకు సాధించలేదు? ఖచ్చితంగా మనం సాధించగలం. ఈ దేశ ప్రజలు, వ్యవసాయదారులు ఈ లక్ష్యాన్ని సాధించగలరు.

ఎగుమతులకు సంబంధించి నా వినతి. మీరు కేవలం తయారీ రంగంపైనే ఆధారపడుతున్నారు. పారిశ్రామిక రంగంతో మాత్రమే చెల్లింపుల శేషం సమస్యను మీరు ఎదుర్కొనలేరు. ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించినట్లయితే ఈ విషయంలో వ్యవసాయ రంగంమీకు సహాయం చేయగలదు. ఇందుకోసం భానుప్రతాప్‌సింగ్ కమిటీ చేసిన సిఫారసులను అమలుచేసి వ్యవసాయ రంగంలో ఎగుమతులను ప్రోత్సహించాలి. అవసరమైన అన్ని మౌళిక సౌకర్యాలతో నాణ్యమైన ఉత్పత్తులను ఉత్పతి చేయగలిగినపుడు ఎగుమతుల రంగంలో సైతం ఈ సిఫారస్సులను అమలుచేసినపుడు మనదేశం ఖచ్చితంగా ప్రగతిని సాధిస్తుంది. ఇది ప్రజల స్థితిగతులను మెరుగుపరచడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థను సైతం అభివృద్ధి చేస్తుంది. అందువలన అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయంలో పూర్తి స్వాతంత్ర్యం వద్దు. ఋణాలను గాని, పరిజ్ఞానాన్ని, పెట్టుబడులను గాని తీసుకోవడంలో సందేహాలు వద్దు. కాని అన్ని రకాల ముందు జాగ్రత్తలను తీసుకోవాలి. అప్పుడు ఈ ప్రజల స్థితి గతులను మెరుగుపరుచుకొని, నిరుద్యోగ యువతకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలనుకల్పించగలం. ప్రస్తుతం మనదేశంలో 40 మిలియన్‌ల నిరుద్యోగులైన ప్రజలు ఉన్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ఏ విప్లవమో చెలరేగి మనం ప్రజాస్వామ్య మార్గం నుంచి ప్రక్కకు తప్పుకోవలసి వస్తుంది. చివరికి మరికొన్ని సామాజిక ఉద్రిక్తతలు, తిరుగుబాట్లు చెలరేగుతాయి. ప్రస్తుత వ్యవస్థ దీర్ఘకాలం కొనసాగలేదు.

□

# భూపరిమిత చట్టాలను ప్రభుత్వం నిజాయితీతో అమలుచేయాలి

రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో భూపరిమితి ప్రస్తావన ఉందని వ్యవసాయ విధానం చర్చలో సభ్యులు చెప్పారు. కేవలం ప్రస్తావన ఉంటే సరిపోదు. విధాన మేమిటనేదే ప్రశ్న? అమెరికా, ఆస్ట్రేలియా, ఆగ్నేయ ఆసియాల మాదిరి విస్తృత వ్యవసాయ విధానాన్ని భారతదేశం అనుసరిస్తుందా లేదా? భూ పరిమితిని పెంచుతానని పంజాబ్ ముఖ్యమంత్రి ఇటీవల చెప్పారు. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఈ బాటలో నడవాలనుకొంటున్నాయి. 9వ షెడ్యూల్‌లోని భూసంస్కరణలు వాటికి సహాయపడతాయి. దేశంలో అందరూ చిన్న సన్నకారు రైతులు కాబట్టి భూపరిమితి చట్టాన్ని వారిని దృష్టిలో పెట్టుకొనే రూపొందించాలి. రెండు నుంచి ఐదుఎకరాల భూమి ఉండి, అది పది లేక పన్నెండు ముక్కలుగా ఉన్న రైతులకు ఆ భూమిలో ఆధునిక వ్యవసాయ విధానాలు అమలు చేయడం కష్టం. భూసేకరణ చట్ట ప్రకారం అమలు చేయాలి. చిన్నరైతులకు కావలసిన భూములను ఎంచుకునే అవకాశం

వారికే ఇవ్వాలి. దీని ద్వారా భూస్వాములు చిన్నరైతుల భూమి ఆక్రమించకుండా గ్యారంటి ఇవ్వొచ్చు. కొత్త ఆర్థిక విధానం మనపై రుద్దుతున్నారు. ఆ విధానంపై ప్రభుత్వ అభిప్రాయం కూడా పరిమితంగానే ఉంది.

1950వ సంవత్సరంలో 5 కోట్లటన్నుల ఆహారధాన్యాలు దేశంలో పండించేవారు. ప్రస్తుతం అది 19 కోట్లటన్నులకు పెరిగింది. కొన్ని భూ సంస్కరణలు అమలు చేశారు. కొన్ని భూపరిమితులు వర్తిస్తాయి. భూమి ఎంత ఉండాలి అనేదానిపై చట్టాలు అమలు చేశారు. భూస్వామ్య వ్యవస్థ కొంతవరకు తగ్గింది. అయితే పూర్తిగా అమలు చేయలేదు. కొంతమేరకు మాత్రమే అభివృద్ధి జరిగింది. భూ సంస్కరణలు అమలు చేస్తే మన ఉత్పత్తులు మరింత పెంచుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజాస్వామ్యం బలపడుటకు ఇది సహాయపడుతుంది. మన సమాజ నిర్మాణం పిరమిడ్ ఆకారంలో ఉంది. పెద్ద భూస్వాములు బాగా పలుకుబడి కలిగి ఉన్నారు. వీరు చిన్నరైతులపై ఆర్థిక సామాజిక అరాచకాలు సృష్టిస్తున్నారు. భూసంస్కరణల ద్వారా వీటిని కొంతవరకు తగ్గించవచ్చు. పోలింగ్ బూత్‌లను ఆక్రమించడం వంటి సంఘటనలు తగ్గుతాయి. సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్య అభివృద్ధికి ఈ చట్టం కావాలి. భూసంస్కరణల అవసరాన్ని మండల కమీషన్ నొక్కిచెప్పింది. అయినప్పటికీ రిజర్వేషన్లే సామాజిక అంతరాలను తగ్గిస్తాయని మనమిత్రులు నమ్ముతున్నారు. సమాజంలోని భూతారతమ్యాల గూర్చి వారు ఏమిచెప్పలేరు. వాటిని అర్థం చేసుకోలేరు. ఇవన్నీ కేంద్రప్రభుత్వం భూ సంస్కరణలను కఠినంగా అమలు చేసేటట్లుచేస్తాయి. ఇది రాష్ట్ర జాబితాలోనిదని కేంద్రం చెప్పవచ్చు. అయితే కేంద్రపాలిత ప్రాంతాలలో అమలు చేయుటకు అభ్యంతరాలు ఏమిటి? ప్రభుత్వం కొంత హృదయపూర్వకంగానూ కొంత రాజకీయ లబ్ధికోసం పనిచేస్తున్నది.

భూ పరిమితులకు సంబంధించి తెలంగాణలో రైతులు ఆందోళనలు చేపట్టారు. అదే సమయంలో భూధానోద్యమం విజయవంతం అయింది. నేను ఒక ఉదాహరణ చెబుతాను. దర్భంగా సంస్థానానికి అత్యధికంగా భూమి ఉండేది. ఈ సంస్థానం వారు వినోభాజీకి 125 లక్షల ఎకరాల భూమిని దానం చేశారు. పెద్దపెద్ద భూస్వాముల నుండి భూమిని పొంది దానిని పేదలకు పంచే విధానాన్ని మనం అనుసరించాము. కనీసం ఒక చెట్టు కూడా లేని నిరుపయోగ అటవీ ప్రాంతం

బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రాలలో ఉంది. ఈ భూమిని చట్టవిరుద్ధంగా అటవీ అధికారులు ఇతరులకు లీజుకు ఇచ్చారు. ఈ భూమిని భూసంస్కరణల కిందికి తేవాలి. స్థానిక గిరిజనులకు, ఆర్థికంగా వెనుకబడిన వారికి పంచి పెట్టాలి.

మహంత్‌ల ఆక్రమణలోనున్న భూములను భూపరిమితి చట్టం కిందకి తేవాలి. ఎందుకంటే చాలామంది మహంతాలు పెళ్ళిళ్ళు చేసుకున్నారు. వారికి బిడ్డలు కూడా ఉన్నారు. వక్ఫ్‌బోర్డు ఆద్వర్యంలోని భూమినికూడా ఈ చట్టం పరిధిలోకి తేవాలి. ఎందుకంటే ఈ భూమి సమాజానికి చెందినది. ఇది సమాజ ఆస్థి (మధ్యలో అభ్యంతరాలు ) నేను చేప్పేది ఏమిటంటే మత భూములను భూపరిమితి చట్టాల నుంచి తొలగిస్తూ రెండున్నర సంవత్సరాల క్రితం ఒకచట్టం చేశారు. మహంతాలు పెళ్ళిళ్ళు చేసుకున్నారు. బిడ్డలు పుట్టినప్పటికి భూపరిమితి గురించి మాట్లాడుతున్నారు. చట్టపరంగా భూమిని స్వాధీనం చేసుకునే హక్కువాళ్ళు పొందారు. ఈ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి కూడా అయిన ఆయనకు భూ చట్టాల వలన చిక్కులు ఏమిటో తెలుసు. కమ్యూనిటీ భూములపై వక్ఫబోర్డ్స్, పెళ్ళి అయిన మహంతాల పెత్తనాన్ని తొలగించాలి.

ప్రభుత్వం నిజాయితీగా ఈ చట్టాలు అమలు చేస్తుందని నేను ఆశిస్తున్నాను. భూసేకరణ పూర్తి చేసి కేంద్రపాలిత ప్రాంతాలలో భూ సంస్కరణలు అమలు చేయాలి. పట్టణ భూ పరిమితి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. పట్టణాలలో కూడా పెద్దపెద్ద భూస్వాములున్నారు. వారిని కూడా 9వ షెడ్యూల్ కిందకు చేర్చాలి. ఈ విధంగా బిల్లును సమర్థిస్తున్నాను.

అలాగే బీహార్ రాష్ట్రానికి సంబంధించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో మరిన్ని భూ చట్టాలు చేర్చడానికి ఉద్దేశించిన 81వ రాజ్యాంగ సవరణ బిల్లును నేను సమర్థిస్తున్నాను. ఈ భూ చట్టాలు చేయడం వలన బీహార్‌లో కొన్ని సమస్యలు తలెత్తవచ్చు. భూస్వాములు ప్రైవేట్ సైన్యాన్ని కలిగి ఉన్నారని అందరికి తెలిసిన విషయమే. అలాగే భూమిలేని పేదలు, వెనుకబడిన వారు కూడా సాయుధ గ్రూపులుగా మారారు. ఈ రెండు గ్రూపుల మధ్య ఎన్నోసార్లు కొట్లాటలు జరిగాయి. ఒకరిని ఒకరు చంపుకున్నారు. నా దృష్టిలో ఇవి మంచి విషయాలు కావు.

□

# ఎరువులపై రాయితీలు కొనసాగించాలి

1987లో జి.వి.కె.రావు కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం దాన్ని పరిశీలించాలని కోరుతున్నాను. ఇందులో వరుసగా మూడు సంవత్సరాలు ఎరువుల వాడకం పెరిగితే, 5 నుంచీ 7 శాతం ఎరువుల ధరలో పెరుగుదల ఉండవచ్చునని తెలిపింది. రైతులు ఈ భారాన్ని ఎలా భరించగలరు? సగటు భారతీయుడిగా కొంత వరకు భరించడానికి సిద్ధంగా ఉన్నాడు. కానీ ఉద్దేశ్య పూర్వకంగా ఈ విధంగా పెంచడం సరికాదు. యంఆర్‌టీపీ చట్టంపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయడం వల్ల వినియోగదారులపై రూ. 100 కోట్ల నుంచీ సుమారు రూ. 1000 కోట్ల వరకు భారం పడుతోంది. ఈ విధంగా ఆంక్షలను ఎత్తివేయడం వల్ల రైతులను మాత్రమే శిక్షించే విధంగా ఉంది.

దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఒక రైతుగా ఎరువులకు ఇచ్చే రాయితీలను కొనసాగించాలని కోరుతున్నాను. ఎరువులపై ఇచ్చే రాయితీలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను.

ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఒక విషయాన్ని గుర్తు చేయదలచుకున్నాను. జపాన్, దక్షిణకొరియా, ఆసియాలోని మన పొరుగు దేశాలతో పోలిస్తే మనం హెక్టారుకు

ఎరువుల వాడకం తక్కువ. హెక్టారుకు 55 కి.గ్రాలు మాత్రమే వాడుతున్నారు. దీన్ని బట్టి ఈ విషయం ప్రాముఖ్యత మీకు అర్థమై ఉంటుంది.

చిన్న, సన్న కారు రైతులకు ఎరువుల ధరలో కొంతమేరకురాయితీలను ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు పత్రికల్లో వార్త వచ్చింది. భూ గరిష్ట పరిమితి చట్టం వచ్చిన తరువాత చిన్నకారు, భూస్వాములు, మధ్యతరగతి రైతులు అనే బేధాలు లేవని ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. రైతులమధ్య విభేదాలు సృష్టించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

కొంతమంది రైతులకు ఒక ధరకు, కొంతమందికి మరొక ధరకు ఎరువులను పంపిణీ చేయడమనేది ఆచరణలో సాధ్యపడదు.

జి.వి.కె.రావు కమిటీ ఈ అంశాన్ని లోతుగా అధ్యయనం చేసి ఆచరణలో సాధ్యపడదని సలహానిచ్చింది. కాబట్టి రైతులందరికి ఒకే ధరకు ఎరువులను అందించాలి.

ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఒక విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఒక తండ్రి తన కుమార్తెకు వివాహం చేయదలచుకున్నప్పుడు ఒక రైతు కొడుక్కు ఇచ్చి చేయడం కన్నా ఆఫీసులో పనిచేసే ప్యూనుకు ఇచ్చి చేయడానికే ఇష్టపడతాడు. ఎందుకంటే రైతుకు సంవత్సరంలో ఆదాయం వస్తుందో, రాదో తెలియదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట మొత్తం దెబ్బతినవచ్చు. ఇలాంటి వారికి ప్రభుత్వం ఎటువంటి సహాయం చేయడంలేదు. ఇది ఆశ్చర్యకరమైన విషయం.

ఈ రోజు పత్రికల్లో ఎరువుల ఉత్పత్తిదారులకు 65 శాతం, రైతులకు 35 శాతం రాయితీలు ఇస్తున్నట్లు ఉంది. ఎరువుల తయారీదారులకు 65శాతం రాయితీలను ఇవ్వడమంటే వారు సరిగాపనిచేయడం లేదని అర్ధమవుతోంది. ఎస్.ఎస్. మార్థే నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ యూరియా వాడే రైతులకు ఇచ్చే రాయితీలను క్రమబద్ధీకరించాలని సూచించింది. నత్రజని ఆధారిత ఎరువుల తయారీ సంస్థలకు వర్తించే ధర-రాయితీల పథకమును అనుసరించి, అంతిమ ధరలో 12 శాతానికి పైగా రాబడి గల సాధారణ పరిశ్రమలకు ప్రభుత్వం రాయితీలను ఇవ్వాల్సి ఉంది.

పరిశ్రమ వర్గాల వారికి మేలు చేకూరే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అంచనాలను పెంచి చూపిస్తూ ఎక్కువ లాభాలను జేబుల్లో వేసుకుంటున్న వ్యాపార వర్గాలకు ప్రభుత్వం వరాల జల్లులు కురిపిస్తోంది.

దయచేసి ప్రభుత్వం పునరాలోచించి బడ్జెట్‌కు ముందున్న యథాస్థితిని కొనసాగించాలని కోరుతున్నాను.

# జాతీయ వ్యవసాయ విధానాన్ని సరిగ్గా రూపొందించండి

వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడానికి మీరు ఎటువంటి చర్యా ఇప్పటివరకు తీసుకోలేదు, ఇప్పుడూ తీసుకోవడం లేదు. వీటన్నిటివల్ల దేశం ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెదుర్కొంటోంది. స్వల్పకాలంలోనే రూపాయి విలువను రెండుసార్లు తగ్గించడంతో చెల్లింపుల సమస్య తీవ్రతరమయింది. స్వల్పకాలంలోనే మూడుసార్లు మన బంగారపు నిల్వలను దేశం వెలుపల కుదవపెట్టాం. మనజాతీయ పాదుపురేటు ప్రపంచస్థాయిలోని అత్యున్నత ప్రమాణాలలో ఒకటిగా ఉన్నా, ఇటువంటి పరిస్థితులేర్పడ్డాయి. ప్రస్తుత పరిస్థితుల నుంచి భారతదేశాన్ని రక్షించాలంటే తప్పనిసరిగా ఒక జాతీయ వ్యవసాయ విధానాన్ని అనుసరించాలి. కనీసం శ్రీ వి.పి. సింగ్ ప్రభుత్వ హయాంలో, స్థాయీ సలహా సంఘం రూపొందించిన జాతీయ వ్యవసాయ విధాన ముసాయిదా పత్రం ఆధారంగా దీనికి నాంది పలకడం నాకెంతో ఆనందంగా ఉంది.

ఆ ముసాయిదా ప్రతిని ప్రభుత్వానికి సమర్పించారు. దాన్ని పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించామని గౌరవనీయులైన వ్యవసాయశాఖ మంత్రి శ్రీ బలరాం జక్కర్ ఇటీవల చెప్పారు. ప్రభుత్వం దీనిపై ఎక్కువ ఆసక్తి చూపి జాతీయ వ్యవసాయ విధాన తీర్మానం రూపొందేటట్లు కృషి చేయాలనేది నా సూచన.

జాతీయ వ్యవసాయవిధాన తీర్మానాన్ని ఆమోదించే ముందు కొన్ని ప్రధాన వ్యూహాలను అందులో చేర్చవలసిన అవసరం ఉంది. నేటి వరకు ప్రభుత్వాలు వ్యవసాయదారుల పట్ల పక్షపాత ధోరణిని అవలంభిస్తున్న విషయం మీకు తెలుసు. ఉత్పత్తి దారులకు, పారిశ్రామిక వేత్తలకు సంబంధించినంత వరకు ఒక పెన్సిల్‌ను తయారుచేసే ఉత్పత్తిదారుడికి కూడా దాని ధరను నిర్ణయించే హక్కుంటుంది. కానీ వ్యవసాయదారుడి విషయానికొచ్చేసరికి ధరలను మీరు నిర్ణయిస్తున్నారు. వ్యవసాయ వ్యయ, ధరల సంఘం సిఫారసు చేసిన ధరపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

అమ్మకం విషయంలో రైతుకు స్వేచ్ఛ ఉందని గౌరవనీయులైన మంత్రి అన్నారు. కానీ వాస్తవానికి అలా లేదు. అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర రవాణా పరిమితులవల్ల ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాకు గానీ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ లెవీ బియ్యం సరఫరా చేయగలిగితేనే రైతు తన బియ్యాన్ని బియ్యంగా అమ్ముకోగలడు. ఆదాయం విషయంలో కూడా వాణిజ్య నిబంధనలు రైతులకు ప్రతికూలంగానే ఉన్నాయి.

వ్యవసాయరంగం నుంచి, వ్యవసాయేతర రంగాల నుంచి వచ్చే సగటు ఆదాయాల మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. వ్యవసాయ వ్యవసాయేతర రంగాల నుంచి వచ్చే ఆదాయాల మధ్య నిష్పత్తి 1970-71 లో 0.43 శాతం ఉండగా 1989-90లో 0.786కి పెరిగిందని ఈ మధ్య గౌరవనీయులైన మంత్రి గారే బదులిచ్చారు. ఇది దాదాపు రెండింతలు పెరిగింది. సదుపాయాల విషయానికొస్తే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఏమీ బాగాలేదు. వ్యవసాయదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. నేనిప్పుడే కొన్ని ఉదాహరణలను చెప్పాను. సమయాభావం వల్ల నేను వాటిని మళ్ళీ చెప్పదలచుకోలేదు. స్వయం సమృద్ధి సాధించడంతోనే సంతృప్తి చెందేటట్లుగా మన విధానాలు ఉండకూడదు. కొత్త శతాబ్దంలోకి అడుగిడే నాటికి మనదేశ జనాభా రమారమి వందకోట్లు ఉంటుంది. అప్పుడు మనకి 225

నుంచి 245 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు కావలసివస్తాయి. ఈ సంవత్సరం మనం నిరుటి కంటే కాస్త ఎక్కువగా దాదాపు 176 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తిచేయగలిగాం. నీటిపారుదల రంగంలో వ్యయం ఒక్కసారిగా పెరిగిపోవడం వల్ల ఈ రంగం పరిమితంగానే విస్తరించింది. దీనివల్ల వ్యవసాయరంగం భవిష్యత్తు ఆందోళనకరంగా కనిపిస్తోంది. భారీ ఆనకట్టలపై వ్యయం విపరీతంగా పెరిగిపోతున్నది. ఒక ఎకరానికి నీటిపారుదల సౌకర్యం కల్పించడానికి దాదాపు రూ. 35,000 ఖర్చవుతోంది. ముందు ముందు నీటిపారుదల సామర్థ్యాన్ని చాలా తక్కువ ప్రాంతానికి మాత్రమే విస్తరించగలుగుతాం. కాబట్టి ఇన్నేళ్ళూ పెరిగినట్లు ఆహారధాన్యాల ఉత్పత్తి రేటు ఇకముందు పెరగదు. ఇకపై అది అతి తక్కువగా ఉండబోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయోత్పత్తిని మెరుగుపరచేందుకు అనుకూలమైన చర్యలు కొన్ని మనం తీసుకోవలసి ఉంది. స్వయం సమృద్ధి దశను దాటి మిగులు ధాన్యాన్ని పండించగలిగినప్పుడే పేదరికం, నిరుద్యోగం, వాణిజ్యలోటు వంటి ముఖ్య సమస్యలను మనం పరిష్కరించుకోగలుగుతాం.

ఎరువుల విషయమై మరొక సంగతి. పన్నుకట్టకముందు లాభాల్లో 12 శాతం మార్జిన్‌ను పారిశ్రామిక వేత్తలకు అనుమతించామని మంత్రి చెప్పారు. దీనిపై ఇంత రభస జరిగిన తర్వాత కూడా లాభాల్లో మార్జిన్‌ను తగ్గిస్తామనిగానీ, ఉత్పత్తిదారులకు సబ్సిడీలను తగ్గిస్తామనిగానీ ప్రభుత్వం చెప్పలేదు. ఆ అదనపు 30 శాతం వ్యయభారాన్ని మీరు వ్యవసాయదారులపై నెట్టేశారు. తన చేతుల్లోలేని ప్రకృతి వైపరీత్యాలను, తెగుళ్ళనుంచి తుఫానుల వరకు అనేక విపత్తులను రైతు ఎదుర్కొంటున్నాడు. పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ ఉత్పత్తిదారుల పరిధిలో, వారి నియంత్రణలోనే ఉంటుంది. వ్యవసాయానికి సంబంధించి మన చేతుల్లో ఏమీ ఉండదు. అయినా మనం ఆహరహం శ్రమిస్తున్నాం. ఈ పరిస్థితుల్లో ఉత్పాదక వ్యయాన్నే కాక లాభాల్లో మార్జిన్ కూడా పరగణలోకి తీసుకోవాలి.

వ్యవసాయ ధరల నిర్ణయానికి సంబంధించి భానుప్రతాప్‌సింగ్ కమిటీ సిఫారసులను పరిశీలించండి. వ్యవసాయదారులకు లాభాల్లో నిర్ణీత మార్జిన్ పేర్కొంటున్నాము. ఈ అంశాలనన్నింటినీ పరిగణనలోకి తీసుకొని చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని మేం కోరుతున్నాం. □

# వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వాలి

అధ్యక్షా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు సహాయం చేయడానికి జాతీయ వ్యవసాయ పరపతి సహాయనిధిని ఏర్పాటు చేస్తామని ఫిబ్రవరి 29, 1988 నాటి బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. అదనపు కార్యదర్శి శ్రీ పి. త్రిపాఠీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ చేసిన సిఫారసులను ఎందుచేతనో అమలు చేయలేదు. ఈ ప్రతిపాదన గురించి ఆలోచించి జాతీయ వ్యవసాయ పరపతి సహాయనిధిని ఏర్పాటు చేయవలసిందిగా ఆర్థికమంత్రికి నా విజ్ఞప్తి. ఇది లేకపోతే కోస్తా ఆంధ్ర, ఒరిస్సా, తమిళనాడు, బెంగాల్‌ల లోని తీర ప్రాంతాలలో రైతులు ఎన్నో కష్టాలకు గురవవలసివస్తోంది. ముఖ్యంగా కోతల సమయంలో తుఫానులు, ఉప్పెనలు ఎంతో నష్టాన్ని కలుగజేసి రైతుల వెన్ను విరుస్తున్నాయి.

మీరు ఇటువంటి ప్రతిపాదనతో ముందుకు రాకపోతే రైతులకు రక్షణలేదు. చక్కెర కర్మాగారాలకు అనుమతుల జారీ విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌కు ఉత్పాదక సామర్థ్యం ఎంతో ఉంది. కానీ గత ప్రభుత్వాలు ఎందుచేతనో దానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఆధునాతన సాంకేతిక నవ్యతను దృష్టిలో ఉంచుకుని

చక్కెర, కాగితం, ఇతర వస్తువులను ఉత్పత్తిచేసే ఏకీకృత యూనిట్లకు అనుమతులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి నా సూచన.

అధ్యక్షా, వ్యవసాయ రంగంలో వడ్డీ రాయితీల విషయానికొస్తే ఆంధ్ర ప్రదేశ్‌లో గడువు లోపల ఋణాల వాయిదాలు చెల్లించిన రైతులకు గతంలో మా తెలుగుదేశం ప్రభుత్వం 5 1/2 శాతం రాయితీనిచ్చింది. ఈ రాయితీ మంచి ఫలితాలనిచ్చింది. రైతులకు పంపిణీ చేసిన ఋణాలు మూడురెట్లు పెరిగాయి. ఆర్థిక క్రమబద్ధీకరణకు ఇది తోడ్పడుతుందని నా అభిప్రాయం. రైతులనుంచి ఋణాల వసూళ్ళను మెరుగుపరచేందుకు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నేను సూచిస్తున్నాను.

వ్యవసాయ రంగం పట్ల ఇప్పటివరకు కేంద్రప్రభుత్వం చూపుతున్న వివక్ష మనదేశంలో ఇంకా ఉన్న పేదరికానికి కారణమయ్యే కోణం నుంచి దీన్ని పరిశీలించాలని నేను ప్రభుత్వానికి, గౌరవనీయులైన ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇన్నేళ్లూ వరుసగా ప్రభుత్వాలు వ్యవసాయరంగంలో చాలినంతగా పెట్టుబడులు పెట్టకపోవడమే దీనంతటికీ కారణం. 1977-78, 1978-79 సంవత్సరాలలో జనతా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్ప ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వ్యవసాయ పెట్టుబడులు తగ్గుతూనే వస్తున్నాయి. దీని వల్లనే వ్యవసాయ ఉత్పాదనలో పూర్తి సామర్థ్యాన్ని మనం సాధించ లేకపోతున్నాం.

ఎరువుల ధరల విషయమై దయచేసి మరోసారి ఆలోచించవలసిందిగా ప్రసంగాన్ని ముగించే ముందు తిరిగి ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. రైతులకు ఇది ఎంతో కష్టనష్టాలను కలుగజేస్తుంది. దీన్ని ప్రభుత్వ ప్రతిష్టకు సంబంధించిన అంశంగా పరిగణించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు దాన్ని 5 లేదా 7 లేదా గరిష్టంగా 10 శాతం పెంపుకు పరిమితం చేయండి. లేదంటే రైతులు చాలా నష్టపోవలసి వస్తుంది. దేశ వ్యవసాయోత్పత్తి కూడా కుంటుపడుతుంది. ఇది దేశ ప్రయోజనాలకు భంగకరం.

ఈ సమస్యపై పునరాలోచించి ఎరువుల ధరలను తగ్గించాల్సిందిగా ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు ధనికులుగా భావిస్తున్న రైతులు ధనికులు కారనీ,. వారిలో చాలా మంది చిన్న, సన్నకారు రైతులేనని నేను చెప్పదలచుకున్నాను. □

# ప్రత్తి రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

గుంటూరు, ప్రకాశం జిల్లాల పత్తి రైతులు ఈ దేశానికి అందిస్తున్న సహకారం ఎంతో గొప్పది. మన దేశం పత్తి ఎగుమతి చేసేలా వారు దోహదపడుతున్నారు. ప్రభుత్వం వారిని పట్టించుకోక పోయినప్పటికీ వారీకృషి సలుపుతున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం ఆంధ్రలో ఆత్మహత్య చేసుకున్న పత్తి రైతులతో సహా 60 మంది పత్తి రైతులపై అప్పటి ప్రభుత్వం వారి రుణాలను మాఫీ చేయలేదు. వీ.పి. సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. రైతుల ప్రయోజనార్థం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రిని నేను కోరుతున్నాను. భారత పత్తి సంస్థ (సీసీఐ)లో ఒక్క పత్తి రైతుకు కూడా ప్రాతినిధ్యం లేదు. అందరూ వ్యాపారులే. పత్తిరైతుల ప్రయోజనాలు వారికక్కరలేదు. అందువల్ల భారత పత్తిసంస్థ (సీసీఐ)లో దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి అవసరమైనంత మేర పత్తి రైతుల ప్రాతినిధ్యం ఉండాలి. స్వర్గీయ రాజీవ్ గాంధీ దీర్ఘకాలిక టెక్స్‌టైల్ పాలసీని తెచ్చారు. ఐతే దురదృష్టవశాత్తూ పత్తి ధరలను తగ్గించేందుకు మిల్లర్లు, టెక్స్‌టైల్ వ్యాపారులు చాలా సార్లు ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం పత్తి ఎగుమతులపై ఆంక్షలు విధించేలా చేశారు. రైతులు సాధ్యమైనంత మేరకు తక్కువ ధరకు పత్తి అమ్మడమే వారికి కావాల్సింది. రైతుల వద్ద తక్కువ ధరకు కొని బడామిల్లర్లు భారీస్థాయిలో లాభాలనార్జిస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం తీవ్రంగా యోచించాలి. ఆ లాభాలు చేనేత కార్మికులకు చేరేలా ప్రభత్వం చర్య తీసుకోవాలి. వివిధ పథకాల కింద విడుదలయ్యే నిధులను ప్రభుత్వం పర్యవేక్షించాలి.

పంటల బీమా పథకం పత్తి పంటకు వర్తించడం లేదు. ఆంధ్రప్రదేశ్ పత్తి రైతులు అనేక కష్టాలకు గురవుతున్నారు. పత్తి రైతులు ఎక్కువ మొత్తంలో పురుగు మందులు, ఎరువులు వాడుతున్నారు. సరైన విధానాలు అవలంభించక భారీస్థాయిలో పంట నాశనమవుతోంది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రితో చర్చించాలని నేను గౌరవ మంత్రిని కోరుతున్నాను. □

# రైతులను క్రుంగదీస్తున్న మద్దతు ధరలు

ఇది చాలా ముఖ్యమైన విషయం దేశంలోని 70% ప్రజలను ఇది ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధర చాలినంతగా లేదని రైతులు భావిస్తున్నారు. వస్తూత్పత్తిదారుడు తాను తయారు చేసిన వస్తువుకు తానే ధరను నిర్ణయిస్తాడు. కానీ రైతుల విషయంలో అలాకాదు. ప్రభుత్వమే వ్యవసాయ ఉత్పత్తుల ధరను నిర్ణయిస్తుంది. ఈ ధర దేశమంతా ఒకే రీతిగా ఉంటుంది. సంటను పండించడానికి అయ్యే ఖర్చు ప్రాంతాన్ని బట్టి, రైతును బట్టి, నీటి వసతిని బట్టి మారుతూ ఉంటుందనే విషయం ఇక్కడ గమనార్హం. ధరను నిర్ణయించేటప్పుడు పరిగణలోకి తీసుకొనే గణాంకాలూ తాజావికావు. రెండేళ్ళనాటి, మూడేళ్ళనాటి, ఒక్కోసారి నాలుగేళ్ళనాటి పాత గణాంకాలను బట్టి మద్దతు ధరను నిర్ణయిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎరువుల సగటు వాడకాన్ని బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. నీటి పారుదల రుసుము కింద ప్రభుత్వం, పంటకు రూ. 40 మాత్రమే వసూలు చేస్తోంది. కానీ బోరు బావి కింద రైతులు, నీటి పారుదలకు రూ. 500 ల నుంచి రూ. 1000 ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎందుకంటే విద్యుత్ ఛార్జీలు ప్రతి రాష్ట్రానికీ మారుతూ ఉంటాయి. వీటన్నింటినీ శాస్త్రీయంగా పరిగణనలోకి తీసుకోవడంలేదు. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం ఎప్పుడూ చిన్నచూపే చూస్తోంది. వ్యవసాయదారుల చాలీచాలని సంపాదనను పారిశ్రామిక రంగంలోకి షేర్లు, పెట్టుబడుల రూపంలో తరలించడమే ప్రభుత్వ ధ్యేయంగా కనబడుతోంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడుల విషయమై ప్రభుత్వానికి ఏ చింతా లేదు. రైతాంగానికి రుణ సదుపాయాన్ని కల్పించడంలోనూ ప్రభుత్వం ఇదే రీతిని వ్యవహరిస్తోంది. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం తన వ్యవసాయ విధానాన్ని రూపొందించుకుంటే, ప్రపంచలోనే అగ్రగామి వ్యవవసాయ దేశంగా భారత్ రూపుదాలుస్తుంది. ఆ వనరులూ మనకున్నాయి. కాబట్టి మంత్రివర్యులు, సభలో వ్యక్తమైన ఈ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తుల ధర నిర్ధాయక విధానంలో తదనుగుణమైన మార్పులు చేయాలి. □

# పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పొగాకు వాణిజ్య సంస్థను నెలకొల్పడానికి గతంలో మీరు సుముఖత చూపలేదు. టీ బోర్డు ఉంది. టీ వాణిజ్య సంస్థ ఉంది. అలాంటపుడు పొగాకు వాణిజ్య సంస్థ ఏర్పాటు చేయడానికి ఎందుకు అంతగా ఇష్టపడడం లేదు? పొగాకు ఉత్పత్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకి 2600 కోట్ల రూపాయలు లభిస్తున్నాయి. సుమారు 200 కోట్ల నుండి 300 కోట్ల రూపాయల వరకు విదేశీ మారక ద్రవ్య రూపేణా లభిస్తుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రంగంలో సంక్షోభం తలెత్తినపుడల్లా రైతులు గొడవ చేస్తారు. అప్పుడు పొగాకు బోర్డుగాని, రాష్ట్ర వాణిజ్య సంస్థ (ఎస్‌టిసి) గాని కొంతమేరకు ఈ మార్కెట్‌లో జోక్యం చేసుకుంటుంది. అంతేగాని మీరు అత్యధిక ఆదాయం పొందుతున్న ఈ రంగంలో పొగాకు రైతుల ప్రయోజనాలు పరిరక్షించేందుకు కట్టుదిట్టమైన వ్యవస్థ ఏదీలేదు.

కేంద్ర ప్రభుత్వ ఖజానాకి ఏటా 2600 కోట్ల రూపాయలు అందజేస్తున్న రంగమిది. అలాంటపుడు దీనిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు ఎందుకు వదిలేస్తున్నారు? వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడానికి, కొనుగోళ్ళు జరపడానికి పొగాకు బోర్డు చట్టం సవరించడం గాని, పొగాకు వాణిజ్య సంస్థ ఏర్పాటు చేయడంగాని ఎందుకు చేయడంలేదు? ఎలాగూ పొగాకు బోర్డు ఉండనే ఉంది. అధికారులున్నారు, శాస్త్రజ్ఞులున్నారు, సాంకేతిక నిపుణులన్నారు. చాలా గొప్ప వ్యక్తులున్నారు. వారి సేవలను వినియోగించకోండి అలా చేస్తే రానున్న కొన్ని సందర్భాలలోనైనా పొగాకు రైతులకది తోడ్పడుతుంది.

అధ్యక్షా! ఈ అంశంపై వివరణ ఇవ్వాల్సిందిగా నేను గౌరవ మంత్రివర్యుల్ని కోరుతున్నాను. కనీస ఎగుమతి ధరపై పొగాకు బోర్డు చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. సి.ఎ.సి.పి. కనీస మద్ధతు ధరగా కిలోకి 11 రూపాయలు ఇవ్వాలని సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. వారి సిఫార్సులన్నీ వాస్తవ పరిస్థితికి అసలేమాత్రం అనుగుణంగా ఉండవన్న సంగతి గోధుమ ఉత్పత్తిదారుడిగా, వరి పండించే రైతుగా మీకు తెలిసిందే. వాళ్ళు అయిదేళ్ళ క్రితంనాటి గణాంక వివరాలు తీసుకొని, వాటికి కొన్ని శాతాలు కలిపేసి, కొన్ని కూడికలు తీసివేతలు చేసి ప్రభుత్వానికి ఏదో ధర సిఫార్సు చేయడానికి తగిన సంస్థగా మీరు భావిస్తున్నారు.

ఈ పరిస్థితిలో కనీస ఎగుమతి ధర సిఫార్సు చేసే అధికారం సి.ఎ.సి.పి. నుంచి తొలగించి పొగాకు బోర్డుకి ఎందుకు అప్పగించడంలేదు? ఇది తప్పక జరగాలి. ఎందుకంటే వాళ్ళు సమస్యకి మూలకారణం తెలిసినవాళ్ళు. ఆ రంగానికి దగ్గరగా ఉన్న వాళ్ళు. వ్యవసాయానికి ఎంత ఖర్చవుతుంది, రైతుల బాధలేమిటి దేశసగటు ఉత్పత్తి ఎంత వంటి విషయాలు వారికి క్షుణ్ణంగా తెలును. ఈ సంస్థ సమర్థవంతమైనదే అయినా దానిని ప్రస్తావించడానికి ఇది వేదిక కాదు. సందర్భమూ కాదు. అంత సమయం కూడాలేదు. కాని ఆసంస్థతో నాకున్న కొద్దిపాటి అనుభవంతో అది సమర్థవంతమైన సంస్థ అని ధీమాగా చెప్పగలను. రైతులకు ఇది చేసే ఎలాంటి సేవలోనైనా ఏదీ సరిపోలదు. అందువలన కనీస మద్దతు ధర విషయంలో తగు మార్పు తీసుకురావాలని గౌరవ మంత్రి వర్యుల్ని నేను అభ్యర్థిస్తున్నాను.

ప్రభుత్వం దృష్టికి, గౌరవ మంత్రివర్యుల దృష్టికి మరో అంశం తీసుకు రావాలనుకుంటున్నాను. మీరు కనీస ఎగుమతి ధర 50 శాతం పెంచారు. కాని ప్రభుత్వం ఇచ్చిన దానికంటే అదనంగా 8 శాతం చెల్లించడానికి రష్యన్లు అంగీకరించారన్నది నాకు తెలిసిన సమాచారం. ఈ వాస్తవాల నేపథ్యంలో మీరు ఈ అంశాన్ని పరిష్కరించాలి. ఎందుకంటేగత ఏడాది. రైతులు, పొగాకు ఉత్పత్తిదారులు వచ్చి కలిసినపుడు వారిలో ఆశలు కలిగించారు. కావున సగటుధర 33 రూపాయలు రైతులకు ఇప్పించే అంశాన్ని గౌరవ వాణిజ్యశాఖ మంత్రి పరిశీలించాలని కోరుతున్నాను. అంతవరకు రైతులకు బాధతప్పదు. మీ సలహా మేరకు గత ఏడాదిలా కాకుండా ఈ ఏడాది రైతులు పొగాకు అధికంగా పండించారు. కావున వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మీ భుజస్కందాలపై ఉంది. అంటే మీ అధీనంలోని పొగాకు బోర్డు పెరిగిన పొగాకు ఉత్పత్తికి బాధ్యురాలు. ఆ బాధ్యతనుండి తప్పుకోకుండా సగటు ధరగా కిలోకి 33 రూపాయలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. నాకీ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలతో నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

ఛైర్మన్‌గారు, గౌరవ మంత్రి వర్యులు దీనిని పరిశీలించినందుకు చాలా ఆనందంగా ఉంది. మీరు కేటాయించిన కొద్ది సమయంలో నేను అది చెప్పలేకపోయాను. ఇక అసలు విషయానికి వస్తే పొగాకు బోర్డులో 120 మిలియన్ల కిలోలను లక్ష్యంగా నిర్ణయించారు. నేను అనుబంధ ప్రశ్నవేసే సమయంలోనే ప్రొడక్షన్ కమిటీ దానిని 145 మిలియన్ల కిలోలకు పెంచేసింది. ఈ ఉత్పత్తి లక్ష్యాన్ని తగ్గించాల్సిందిగా కోరుతున్నాను. 145 మిలియన్ల కిలోలంటే అది పొగాకు రైతుల జీవితాలతో ఆడుకోవడమే.

□

# వ్యవసాయానికి పెద్దపీట వేయాలి

మాకు కష్టంచేసే వాళ్లున్నారు. కావలసినంత వ్యవసాయం ఉంది. నీటి పారుదల సౌకర్యాలున్నాయి. వాతావరణం అనుకూలిస్తే ఏటా రెండు సార్లు పండిచగలం.

సభ్యుల ప్రైవేటు బిల్లు సభ ముందుకు తెచ్చినందుకు 'రావత్' ను అభినందిస్తున్నాను. ముఖ్యమైన విషయాన్ని సభలో చర్చించడానికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తోంది. ఇక్కడ చర్చించిన విషయాల్ని మంత్రిగారు పట్టించుకుంటారని భావిస్తున్నాను. వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించే విధానంలో తగిన మార్పులు తీసుకొస్తారని భావిస్తున్నాను. మిత్రుడు 'రావత్' ఉద్ధేశం కూడా అదే.

విదేశీ, స్వదేశీ ఋణభారం పెరుగుతున్నది. ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్మాణానికై తీసుకున్న విదేశీ ఋణాలను సరైన రీతిలో ఉపయోగించుకోలేకపోతున్నాం. సాధ్యమైనంత త్వరగా ఈ నిధులను ప్రయోజనకరంగా ఖర్చు చేయాల్సి ఉంది. దేశంలో ఎగుమతులు 15 శాతం పెరుగుతుండగా దిగుమతులు 20 శాతం వరకూ ఉంటున్నాయి.

అన్ని రకాల విలాసవంతమైన కార్లను దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తూ, చిన్న సైజు ట్రాక్టర్ల దిగుమతికి మాత్రం అనుమతి నిరాకరిస్తున్నారు. నియంత్రణలు తొలగిస్తూ లైసెన్సులు అవసరంలేని స్వేచ్ఛా వాణిజ్య విధానాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనితో బహుళజాతి సంస్థలు తమ మందీమార్బలంతో దేశంలోకి ప్రవేశించేందుకు వీలు ఏర్పడింది. అన్ని రంగాలలో దేశం పటిష్టంగా రూపొందాలన్నదే మన అంతిమ లక్ష్యంగా ఉండాలి.

దేశంలో సూపర్‌హైవేల నిర్మాణానికి విదేశీ సంస్థల నుంచి ఋణాలు తీసుకుంటున్నాం. కానీ గ్రామీణాభివృద్ధి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చి 47 సంవత్సరాలు దాటుతున్నా దేశంలోని పలు గ్రామాలు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేక పోతున్నాయి. మన స్వేచ్ఛా వాణిజ్య విధానాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉండాలి.

పెట్రోలియం ఉత్పత్తుల విషయానికొస్తే, మన చమురు సంస్థలు అన్ని అంశాలలో అత్యంత సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయినప్పటికీ విదేశ కంపెనీల వైపు మొగ్గు చూపుతున్నాం. అదేవిధంగా టెలికమ్యూనికేషన్ల రంగం కూడా బహుళ జాతి సంస్థలకు అహ్వానం పలుకుతోంది.

విద్యుత్ పరికరాల రంగంలో భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ఎంతో ప్రగతి సాధిస్తోంది. 'భెల్' కు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తే అది ఒక పెద్ద బహుళజాతి సంస్థగా తయారవుతుంది.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలలో కేవలం 5 శాతం మందికి మాత్రమే 'ఎపెడా' సహాయపడుతోందని చెప్పటానికి నేను విచారిస్తున్నాను. ప్రస్తుతం బ్యాంకులు కూడా వీరికి అంతగా సహకారాన్నందిచటం లేదు. ఆర్థిక సంస్కరణలు వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకపోవటం ఆశ్చర్యకరంగా ఉంది. ఈనాటికీ ప్రభుత్వం పంటల భీమా పథకానికి సంబంధించి ఒక కొత్త విధానాన్ని రూపొందించలేదు. 2000 నుంచి 4000 లోపు కోళ్లు ఉన్న కోళ్ళ పరిశ్రమలకు ఋణాలు మంజూరు చేయవద్దంటూ బ్యాంకుల ఉన్నతాధికారులు తమ శాఖలకు ఆదేశాలిస్తున్నారు. ఉప్పునీటిలో రొయ్యల సాగు ద్వారా రైతాంగం రూ. 2500 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్నారు. అయినప్పటికీ రొయ్యల సాగుకు భీమా సౌకర్యం లేకపోవటం దురదృష్టకరం. మనం వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యాన్ని తదుపరి గ్రామాల అభివృద్ధి, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ద్వితీయ ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సి ఉంది. భారీ పరిశ్రమలకు చివరిగా మాత్రమే ప్రాధాన్యమివ్వాలి.

ఎన్నికల సంస్కరణలకు సంబంధించి గతంలో గోస్వామి, సర్కారియా కమీషన్లు తమ నివేదికలో సూచించిన అంశాలను ప్రభుత్వం అమలు చేయలేదు.

1983తో పోలిస్తే నేరాల సంఖ్య 27 శాతం పెరిగింది. కొన్ని రాష్ట్రాల్లో నేరాల పెరుగుదల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర బలహీన వర్గాల వారిపై జరిగే అత్యాచారాలు, దాడులకు సంబంధించిన నేరాలు అధిక మయ్యాయి.

వివిధ రాజకీయ పార్టీలు అందిస్తున్న ప్రోత్సాహం రాజకీయాలు నేరమయం కావటానికి ప్రధాన హేతువుగా ఉంది. నేరగ్రస్త చరిత్ర కలిగిన వ్యక్తులు చట్టసభలలో సభ్యులుగా ఉంటే సామాన్య మానవుల సంక్షేమం కోసం పాటుపడాలన్న లక్ష్యం సక్రమంగా నెరవేరదు. దురదృష్టవశాత్తు రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారు.

ప్రస్తుత ఎన్నికల విధానంలో కొన్ని మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. నైష్పత్తిక ప్రాతినిధ్య విధానంలో ప్రస్తుతం పార్టీలు, నాయకులు అనుసరిస్తున్న పలు తప్పుడు పద్ధతులను చాలా వరకు అరికట్టే వీలుంది. వోహ్రా కమిటి ప్రతిపాదనలు సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు పార్లమెంటు సభ్యులతో ఒక కమిటి ఏర్పాటు చేయాలని నేను కోరుతున్నాను. నేరస్థులను ప్రధానంగా మన దేశం సరిహద్దు రాష్ట్రాలలోని జాతి వ్యతిరేక శక్తులను మనం ప్రోత్సహించకూడదు.

□

## ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి

దేశ పేదప్రజల జీవితాల్ని రక్షించే మంచి సామర్థ్యం గల అత్యవసర రోగ నిరోధక మందులు సహేతుకమైన ధరలకు అందించాలి. దేశ ప్రజలకు గొప్ప హాని తలపెట్టబెట్టబోతున్న మందుల్ని చూసి నేను ఆందోళన చెందుతున్నాను.

అందువలన, దేశంలో గల పేద ప్రజలకి అమోదయోగ్యమైన ధరల్లో మందులను అందుబాటులోకి తేవాలన్న ప్రాథమిక లక్ష్యంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిందిగా నేను కోరుతున్నాను. అలాగని ధరల్లో మార్పులు తీసుకురావద్దని నేను అనడం లేదు. సాధారణంగా ఉత్పత్తిదారుడు తాను పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా తగు లాభాన్ని పొందాలి. అదే సందర్భంలో ప్రాసెస్ పేటెంట్ సిస్టమ్‌పై పట్టుబట్టి ప్రాథమిక లక్ష్యాలను పూర్తిగా గాలికొదిలేయవద్దు. ప్రొడక్ట్ పేటెంట్ సిస్టమ్‌ని అంగీకరించొద్దు.

# మనకు సరైన వ్యవసాయ విధానమే లేదు

మనదేశంలో 75 శాతం ప్రజానీకం ప్రత్యక్షంగా లేక పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కాని ప్రణాళికలు రూపొందించే వ్యక్తులు గానీ సరైన వ్యవసాయ విధానాన్ని రూపకల్పన చేయలేకపోయారు. మొదటి సారిగా 1989 -90 లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వ్యవసాయ విధానాన్ని తయారుచేసేందుకు చొరవ తీసుకుంది. తర్వాత దీనిని మార్పుచేసి ఒక పేలవమైన విధానాన్ని ప్రస్తుతం రూపొందించారు. ప్రస్తుత వ్యవసాయ ముసాయిదా అస్పష్టంగా ఉండి భారత వ్యవసాయ రంగంలోని లోపాలను, వెనుకబాటుతనానికి కారణాలను గుర్తించలేదు. మనదేశంలో 178 మిలియన్ హెక్టార్ల భూములకు నీటివసతి కల్పించే అవకాశమున్నా కేవలం 49 మిలియన్ హెక్టార్లకే సాగునీటి సౌకర్యం ఉంది. మిగిలిన భూమికి నీటి సౌలభ్యం కల్పించలేక పోయినందుకు ప్రణాళికా కర్తలను, అధికారంలో ఉన్న ప్రభుత్వాలను తప్పుపట్టాల్సి ఉంది.

మొదటి ప్రణాళికలో వ్యవసాయ రంగానికి 15 శాతం కేటాయించగా 8వ ప్రణాళికలో 5.2 శాతానికి కేటాయింపు తగ్గిపోయింది. వ్యవసాయ రంగంపై

చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని ఇది స్పష్టం చేస్తోంది. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు లభ్యమైతే ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు మరింతగా పెరిగే అవకాశముంది.

గిట్టుబాటు ధర, రైతుకు ఎందుకు లభించకూడదు? కొంత వరకైనా గిట్టుబాటు ధర కల్పించాలన్న సూచన అందుకే వొచ్చింది. మొత్తం చెల్లింపుల్లో పదిశాతం నిర్వహణ వ్యయంగా రైతు వద్ద ఉండాలన్నదే ఆ సూచన. దీన్ని ప్రభుత్వం ఆమోదించింది. చట్టం ప్రకారం వ్యవసాయ కార్మికులకిచ్చే కనీస వేతనం విషయంలో కూడా మరో సూచన వొచ్చింది. చట్టబద్ధ కనీస వేతనం, నిజవేతనాల్లో ఏది ఎక్కువ వుంటే దాన్ని పరిగణనలోకి తీసుకోవాలనీ అలాగే వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం లభించేలా రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర వొత్తిడి తీసుకురావలని ఈ సూచన పేర్కొంది.

అధ్యక్షా! ఈ రెండు సూచనలకు సంబంధించి రూపొందించిన నిబంధనలను పరిశీలిస్తే .... రైతులకు వ్యతిరేకంగా కావాలని తయారుచేసినట్లుగా అవి ఉన్నాయి. వ్యవసాయ రంగాన్ని ఎటువంటి ఆదాయం గానీ లాభాలు గానీ లేని రంగంగా తయారు చేయాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఎల్లప్పుడూ వ్యవహరిస్తోంది. వ్యవసాయదారుడు ఏ కొంచెమో సంపాదించినా.... ఆ కాస్త డబ్బునూ షేర్ల రూపంలోనో మరే ఇతర పెట్టుబడి రూపంలోనో పారిశ్రామిక రంగానికెలా తరలించాలన్నదే ప్రభుత్వ ఆలోచన. వ్యవసాయ రంగంలో పెట్టుబడుల విషయమై ప్రభుత్వం ఏనాడూ పట్టించుకొన్న పాపాన పోలేదు.

వ్యవసాయరంగాన పెట్టుబడుల విషయమై ఈ సభలో పేర్కొన్న సమాధానం మీద నేను కొంత మాట్లాడతాను. 1988-89లో వ్యవసాయ రంగంలో ప్రైవేట్ పెట్టుబడి రూ. 2,985 కోట్లుండగా ప్రభుత్వ పెట్టుబడి రూ. 1,680 కోట్లుంది. మొత్త కలిపి రూ. 4,665 కోట్లు. 1991-92 నాటికి ప్రైవేట్ పెట్టుబడి కొద్దిగా పెరిగింది. ఆ రంగం నుండి రూ. 3,500 కోట్ల పెట్టుబడి ఉండగా..... ప్రభుత్వ రంగం నుండి మాత్రం ఆశ్చర్యకరమైన రీతిలో రూ. 1,360 కోట్లకు తగ్గిపోయింది. ఈ విధంగా వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య భావాన్ని ప్రదర్శిస్తోంది. అంతర్జాతీయ ధరల పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వ వైఖరి మనకు మరింత స్పష్టం కాగలదు.

వాణిజ్యశాఖ మాజీ కార్యదర్శి శ్రీ ఎ.వి. గణేశన్ హిందూ పత్రికలో ఇటీవల

కొన్ని వ్యాసాలు రాశారు. డంకెల్ ఒప్పందాన్ని మనం అంగీకరించాలన్నది ఆయన అభిప్రాయం. దీనిపై మనం గతంలో చర్చించాం. మరోసారి చర్చించనున్నాం. ఇప్పుడా విషయం మీద మాట్లాడాల్సిన అవసరం లేదు. సరే...... ఆయన అభిప్రాయాన్నిలా పక్కన ఉంచితే ఆయన వ్యాసాల్లోని ఒక అంశాన్ని మీ దృష్టికి తేవాలనుకుంటున్నా. అంతర్జాతీయ ధరలను పరిగణనలోకి తీసుకోవడం వల్ల వరి, గోధుమ - కేవలం ఈ రెండు పంటల పైనే భారతీయ రైతు రూ. 16 వేల కోట్ల మొత్తాన్ని కోల్పోతున్నాడని గణేశన్ అంగీకరించారు. రైతులకు సబ్సిడీ లేదు...... వరికొచ్చే లాభాల నుండీ వారు దూరం చేయబడుతున్నారు. కేవలం రెండు రకాల పంటలపై వొచ్చే రూ. 16 వేల కోట్ల మొత్తమూ వారికి దక్కడం లేదు. మనదేశంలో ఇటువంటి పరిస్థితులు కొనసాగుతున్నాయి. అందుకే నా మిత్రుడు ఈ బిల్లును తీసుకొచ్చాడు.

వ్యవసాయదారునికున్న రుణసౌకర్యాన్ని పరిశీలించినా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. 1991-92 లో వ్యవసాయ రంగానికి రూ. 16.500 కోట్ల ఋణాన్నివ్వాలన్నది లక్ష్యం కాగా ఇచ్చింది మాత్రం కేవలం రూ. 11,200 కోట్లు మాత్రమే. ఇటువంటి పరిస్థితుల్లో మన వ్యవసాయ రంగం ఎలా అభివృద్ధి చెందుతుంది? పెరిగిపోతున్న మన జనాభా అవసరాల్నెలా తీర్చగలం? ఎగుమతి లక్ష్యాలనెలా చేరుకోగలం?

మీ దృష్టికి ముందే తీసుకొచ్చినట్లుగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకర్షణీయమైన ధరలున్నాయి. ఎగుమతి చేస్తే మంచి లాభాల్ని సంపాదించగలం. మనకు సరిపోను నిల్వలుంటే మిగిలిన ధాన్యాన్ని ఎగుమతి చేయవచ్చు. అయితే, ఇన్నేళ్ళుగా అమలవుతోన్న తప్పుడు విధానాలకు ప్రభుత్వం స్వస్తి పలకవలసి ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలే గాక మరెన్నో అడ్డంకులను ఎదుర్కొని రైతు చెమటోడ్చి పండించిన పంటకు కనీస ధరల్లేవు. ఎన్నో సార్లు వ్యవసాయదార్లు తమ భార్యల వొంటి మీది ఆభరణాలను బ్యాంకుల్లో కుదవబెట్టి డబ్బులు తెచ్చుకుంటున్నారు. అయినా వారి ఉత్పత్తులకు హేతుబద్ధమైన ధరలు లభించడం లేదు. ప్రభుత్వం తన మౌళిక విధానాన్ని మార్చుకొని వాస్తవ పరిస్థితుల కనుగుణంగా దీర్ఘదృష్టితో వ్యవహరించాలి. అప్పుడు భారతదేశం యావత్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన వ్యవసాయిక దేశంగా ఎదగగల్గుతుంది. మన దగ్గర అటువంటి వనరులున్నాయి.

□

# నూతన ఆర్థిక విధానంలో వ్యవసాయాన్ని ఏం చేయబోతున్నాం ?

శ్రీ ఇంద్రజిత్ గుప్తా రుణభారాన్ని గురించి మాట్లాడారు. కానీ నేను ఆ విషయం ప్రస్తావించ దలుచుకోలేదు. అయితే వృథావ్యయ నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకొన్నారు. అలాగే అనవసర విదేశీ యాత్రలు మానుకొన్నారా? మీ మంత్రివర్గ సభ్యులు, అధికారుల తరచూ విదేశీ పర్యటనల వల్ల ఎంత ధనం ఖర్చు అవుతుంది? ప్రభుత్వం ఈ వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు ఏమైనా తీసుకొందా? దురదృష్టావశాత్తూ ఉదార ఆర్థిక విధానం, నూతన ఆర్థిక విధానంపై ఎక్కువగా చెప్పారు. ఆర్థిక ఉదార విధానాలను రాజీవ్ గాంధీ హయంనుంచే అమలు చేస్తున్నారు. అయితే శోచనీయకరమైన అంశమేమిటంటే చిన్నచిన్న వస్తువులు సైతం దిగుమతి చేసుకుంటున్నాం. ఉదా : వాషింగ్ మిషిన్‌కు సంబంధించిన విడిభాగాలను బయట నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ అసెంబ్లింగ్ చేస్తున్నాం. రాజీవ్ గాంధి పాలన నుంచే మనకు చెల్లింపుల సమస్య ఎదురవుతోంది. ఈసమస్య అధిగమించేందుకు విదేశీ రుణాలను తెస్తున్నాం. నేడు మన విదేశీ రుణ భారం దాదాపు 1 లక్ష కోట్ల రూపాయలకు

పైగా ఉంది. మన వ్యవసాయ రంగంపై చిదంబరం వ్యాఖ్యానించారు. వాస్తవానికి వ్యవసాయ రంగం మనదేశంలో అత్యంత కీలకమైంది. ప్రభుత్వం వ్యవసాయానికి తనవంతు చేయూతనిస్తే ప్రపంచంలోనే మనదేశం అగ్రస్థానంలో ఉండగలదు. ప్రస్తుతం మనదేశం ఆ దిశగా ఏం చేస్తోంది? చిదంబరం హార్టీకల్చర్ గురించి, ఆహారం, సముద్ర ఉత్పత్తుల గురించి మాట్లాడారు. మీ గుండెలపై మీరు చేయివేసుకొని ఈ అభివృద్ధంతా మీవల్లనే జరిగిందా అని చెప్పండి. ప్రభుత్వం వ్యవసాయానికి వెచ్చిస్తున్న దాంట్లో కనీసం 10 శాతం కూడా రైతాంగానికి చేరడంలేదు. అలాగే చేపలు తదితర సముద్రోత్పత్తులు పెంచే రైతులకు కనీసం ఐదు శాతం కూడా ప్రభుత్వ సాయం అందడంలేదు. ఈ విషయంలో ప్రస్ఫుటంగా ఓ విషయం మనవిచేస్తాను దేశంలోకి తీరప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, తమిళనాడు, కేరళ, గుజరాత్ రాష్ట్రాలలో అనేక వేల గంగపుత్రులున్నారు. సముద్రోతత్తుల ఎగుమతి వల్లనే కొన్ని వేలకోట్ల విదేశీ మారక ద్రవ్యం దేశానికి లభిస్తోంది. కానీ ప్రభుత్వం వారికెలాంటి సహాయం చెయ్యక వారి మానానా వార్ని వదిలేస్తున్నారు. బ్యాంకు రుణాలలో 17 శాతం వ్యవసాయరంగాని కిస్తున్నారా? వ్యవసాయం ఎంతో ప్రాధాన్యమున్న రంగం. మరి వారికి ఎలాంటి రుణసౌకర్యాలు కల్పిస్తున్నారు? ఈ విషయం మీరు ప్రకటించాలి. ఇప్పటికే దేశంలో స్థూల జాతీయోత్పత్తికి 30 నుంచి 33 శాతం వరకు వ్యవసాయ రంగం దోహదం చేస్తున్నది. అదే పారిశ్రామిక రంగం స్థూలజాతీయోత్పత్తికి ఇస్తున్నది కేవలం 20 శాతమే ఐనా బ్యాంకు ఋణాల్లు వీరిది 36 శాతం. ఈ అంకెలనుబట్టి ప్రభుత్వం వ్యవసాయరంగంపై సవతి తల్లి ప్రేమ చూపుతుందనేది మనకు అవగతమవుతోంది. కేవలం అందమైన పదాలతో ఆంగ్లంలో మాట్లాడటం వల్ల ఈ సమస్యను పరిష్కరించలేము. గౌరవనీయులైన వ్యవసాయ శాఖామాత్యులు ఇక్కడున్నారు. ఆయనంటె నాకు గౌరవం. రెండు సంవత్సరాల ముందు వ్యవసాయ విధానంపై నాథురామ్ మిర్ధా చేసిన ప్రతిపాదన మేరకు వ్యవసాయంపై జాతీయస్థాయి కమిషన్‌ను ఏర్పాటు చేసారా అని అడుగుతున్నాను. అలాగే మిర్ధా దేశంలోని ప్రతిజిల్లాలోనూ కృషి విజ్ఞాన కేంద్రాలు పెట్టాలని ప్రతిపాదించారు.

మీరిప్పటికే అధికారంలోకి వచ్చి రెండేళ్ళయింది. ఈ ప్రతిపాదనలను మీరు ప్రవేశపెట్టారా? ఉదార ఆర్థిక విధానం, నూతన పారిశ్రామిక విధానం, వ్యాపార విధానం లాంటివి ప్రవేశపెట్టారు? మరి వ్యవసాయ రంగం సంగతేమిటి? వ్యవసాయ రంగంలో ప్రభుత్వం ఎలాంటి విధానాలను ప్రవేశ బెట్టబోతుంది?

దేశానికి పెట్టుబడులైనా, సాంకేతిక పరిజ్ఞానమైనా ఉండాలని మన్మోహన్ సింగ్ ప్రస్తావించారు. మేము అవి లేకుండా మన దేశం అభివృద్ధి చెందదనే అభిప్రాయంతో మేము ఏకీభవిస్తున్నాం. ఈ విషయంలో మీరు ఒక విధానాన్ని అవలంభించాలి.

మనదేశంలోకి వచ్చిన పెట్టుబడులకంటే దాదాపు తొమ్మిది రెట్లు ఎక్కువగా చైనాలో పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం వచ్చాయి. కొన్ని రంగాలలో మాత్రమే చైనాలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. కానీ మన దేశంలో అన్ని రంగాలలోనూ అవకాశం కల్పిస్తున్నారు. ఇలాంటి విధానంవల్ల విదేశీ వ్యాపార సంస్థలు మన దైనందిక జీవితంలో వాడే వినియోగ వస్తువుల రంగంలో ప్రవేశిస్తారు. ఎక్కువ లాభాలు గడిస్తారు. ఇలా అన్ని రంగాలలో విదేశీయుతను ఆహ్వానించడంద్వారా మన జాతీయు ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ఇలాంటి చర్యలు మనకు ఉపయుక్తం కావు.

శ్రీ చిదంబరం జపాన్ దేశాన్ని ప్రస్తావించారు. ఈ విషయంలో ఆయన్ని సూటిగా ఒక ప్రశ్న అడుగుతాను. జపాన్ ప్రపంచంలో బలీయమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం. ఈ నాటికీ వారు తమ పరిశ్రమలను బహుళజాతి సంస్థలనుంచి తప్పించేందుకు సంరక్షక విధానాలను వాడుతున్నారు. ధాన్యం ధరలను తగ్గించేలా ఉన్న డంకెల్ ప్రతిపాదనలను వారిప్పటికి అంగీకరించడం లేదు.

జపాన్ రైతాంగానికి ఆ దేశ ప్రభుత్వం ధాన్యం దిగుబడి పెంచేందుకు అధిక ధరలిస్తున్నది. డంకెల్ ప్రతిపాదనల్ని వారు ఒప్పుకోవడం లేదు. ఈ విషయంలో వారి ప్రవర్తనను మనం గుర్తు చేసుకోవాలి.

ప్రభుత్వం ఇలాంటి విధానాలను అనుసరిస్తున్నందువల్లే దేశప్రజలకు ఎంతో నష్టం జరుగుతోంది. మంత్రి వర్గంలోని సభ్యులనేక మంది డంకెల్ ప్రతిపాదనలకి మద్దతు పలికారు.

ప్రణబ్ ముఖర్జీ విత్తనాల పేటెంటుకు అంగీకరించడంలేదన్నారు. అంతవరకు బాగానే ఉంది. డంకెల్ ప్రతిపాదనల్ని సవరణ చేసేంతవరకు మనమూ అంగీకరించమంటున్నారు. 1992 యుపోవ్ సమావేశం ప్రకారం విత్తనాల పేటింటంగ్‌కు విత్తన ప్రత్యేకత సంరక్షణకు ఎక్కువ తేడాల్లేవు.

ఈ డ్రాఫ్టులోని రెండు కీలక అంశాలను తొలగించడం ద్వారా మన దేశ రైతులు బహుళజాతి కంపెనీలపై, ఆధారపడక తప్పదు. ఈ విధానంతో తరతరాలుగా తమకు లభించిన స్వేచ్ఛను రైతాంగం కోల్పోనున్నది. ప్రభుత్వం ఇలాంటి విధానాలను అవలంభించుతున్నది. వాటివల్ల వ్యవసాయ రంగం ఇక్కట్లలో పడనుంది. ఫలితంగా సామాన్యుల జీవితాలు మరింతగా ఇబ్బందులకు గురికానున్నాయి. 1970 పేటెంట్ చట్టస్థానంలో నూతన పేటెంట్ చట్టం అమలుద్వారా, ఔషధాల ధరలు ఎక్కువ పెరుగుతాయి. మందుల ధరల భారంతో ప్రజల జీవనం అనేక ఇక్కట్లకు గురవుతుంది. సామాన్యుడు ఈ మందులు కొనుగోలు చేయక పోవడంతో ప్రజల ఆరోగ్య విధానం దెబ్బతినవచ్చు. ప్రభుత్వాన్ని ఒక ప్రశ్న అడుగుతున్నాను. మీరు డంకెల్ ప్రతిపాదనలపై సామాన్య ప్రజలను చైతన్య వంతం చేసారా? ఈ విషయంపై సమగ్ర సమాచారాన్ని పార్లమెంటు సభ్యులకే అందజేయలేదు. ఇది సిగ్గుచేటు వ్యవహారం. వాణిజ్య శాఖమంత్రి చెప్పినది కొంతే. బడ్జెట్ సమావేశాల్లో వేలాది పుస్తకాలు వృథా అవుతాయి. డంకెల్ ప్రతిపాదనలపై పుస్తకం ప్రచురించడం వృథా అని భావిస్తున్నారా?

ఇది ముఖ్యమైన విషయం. మీరు ప్రజల జీవితాలను మరింతగా చీకట్లోకి నెట్టుతున్నారు. దేశ అవసరాలను కుదవ బెట్టుతున్నారు. కనీసం రానున్న తరానికి ఉపయుక్తంగా ఉండేందుకైనా మీ ప్రభుత్వం దిగిపోవాలి. డంకెల్ ప్రతిపాదనల వల్ల ప్రజలపై పడే భారం మీకక్కరలేదు. అందుకనే మీరు వాటిపై సంతకాలకు సిద్ధమవుతున్నారు. అందుకనే మేము వాటివి వ్యతిరేకిస్తున్నాం.

అవినీతి వ్యవహారంపై జానకిరామన్ కమిటి తనరిపోర్టులో దాదాపు ఐదువేలకోట్లరూపాయలను బ్యాంకులు నష్టపోయాయని తెలిపింది. 2 లక్షల కోట్ల రూపాయలు మారకంలో 0.5 శాతం కమిషన్ తీసుకోవడం జరిగింది. వాణిజ్య సంస్థలు, బ్యాంకులు మధ్యే సీ.ఎల్.ఆర్. నిర్వహిస్తారు. ఇప్పటికి దీనిపై సమాచారంలేదు. తప్పుడు పద్ధతులద్వారా నష్టపోయిన 6000 కోట్ల రూపాయలను వెనుకకు తీసుకువచ్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు? ఈ విషయంలో మరింత లోతుగా పోదల్చుకో లేదు ఎందుకంటే ఈ విషయంపై శ్రీ వి.పి. సింగ్ ఇతరులు వ్యాఖ్యానించిఉన్నారు.

కుంభకోణాల్లోకెల్లా పెద్దదైన ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ప్రభుత్వ వాటాల ఉపసంహరణ గురించి ప్రస్తావిస్తాను. ప్రభుత్వానికి ఎలాంటి నిబద్ధతలేదు. ఈ సభలో ఒక విషయం చెప్పదలుచుకున్నాను (మంత్రి మండలిపై అవిశ్వాస తీర్మానం 540). సెక్యురిటిల కుంభకోణాలలో కీలక వ్యక్తి అయిన హర్షద్ మెహతా గురించి అందరికి

తెలియక పోవచ్చు. కానీ ఒక రిక్షా కార్మికుడికి సైతం పి.వి. నరసింహారావు కోట్లరూపాయలు తీసుకున్నాడనే భావనవుంది. ఇది నిజం.

ప్రజలు ఏమనకుంటున్నారో మీకు తెలుసా? పారిశ్రామిక వేత్తలు కోట్లాది రూపాయలు తీసుకున్నట్టే ఆయన సైతం తీసుకున్నారు. అతను తన పార్టీకోసం తీసుకున్నాడని చెప్పాలి. ఈ ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకున్న విశ్వసనీయతను కోల్పోయింది.

దేశంలో మతసామరస్యానికి తీవ్ర విఘాతం కలుగుతున్నా ప్రభుత్వం ప్రేక్షకుడిలాగా ఉండిపోయింది. నా స్నేహితుడు ఇంద్రజీత్ గుప్తా చెప్పిన ప్రసంగంలోని వ్యాఖ్యలను నేను ఉదహరించడంలేదు. ఈ గాయం మానుతుందని మన్మోహన్ సింగ్ చెప్పున్నారు. గాయ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? రాజ్యాంగంలోని 138 (2) అధికరణం ప్రకారం కాకుండా 143వ అధికరణం ప్రకారం ఈ సమస్యకు పరిష్కారం చూస్తున్నారు. ప్రభుత్వం అన్ని మతాలకు దూరంగా ఉండాలి. కానీ మీరు ఆ పని చేయడం లేదు. మతోన్మాదుల అభిప్రాయాలకు అనుగుణంగా మీరు నడుచుకుంటున్నారు.

అందువల్లనే మీరింకా అధికారంలో కొనసాగే అర్హతలేదు. నేను అవిశ్వాస తీర్మానికి మద్దతు తెలుపుతున్నాను. □

# విధ్వంస శక్తుల్ని అణచి వేయాలి

అధ్యక్షా, మనకు మంచి మిత్రుడయిన శ్రీలంక ప్రధాని దౌర్జన్యకర సంఘటనలో మృతి చెందటంపై తెలుగుదేశం పార్టీ తరపున నాప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నాను. ప్రేమదాసను బలిగొన్న శక్తులే భారతదేశపు ముద్దుబిడ్డ రాజీవ్‌గాంధిని సయితం పొట్టన పెట్టుకున్నాయ్. ఇటువంటి విధ్యంసకర శక్తుల పీచమణచేందుకు భారతదేశం ఇతర దేశాలతో కలసి కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. □

# ఎరువుల ఫ్యాక్టరీలకు 12 శాతం లాభం!
# ఎన్రాన్ కంపెనీకి 16 శాతం లాభం!
# రైతుకు కనీస లాభం అఖర్లేదా?

లాభం గురించి మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. మీకు తెలుసు, ఈ ఎరువుల ఉత్పత్తిదారులకు పన్ను తర్వాత 12 శాతం స్థూల లాభం ఉంటుంది. అందుకోసం ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ ఇస్తోంది.

ప్రభుత్వం ఇప్పుడు మహారాష్ట్ర విద్యుత్ బోర్డుతో ఎన్రాన్ కంపెనీ ఒప్పందానికి అంగీకారం తెల్పబోతోంది. పన్ను చెల్లించిన తర్వాత 16 శాతం లాభం వుంటుందని ప్రభుత్వం ఈ విదేశీ పెట్టుబడిదారులకి హామీ ఇస్తోంది.

అంటే వారికి స్థూల, నిర్వహణ మూల ధనాలపై 16% లాభాన్ని ప్రభుత్వం అనుమతిస్తున్నది. ఇప్పటికే వారు మూల ధన వ్యయాన్ని పెంచారు. వారికి అధిక లాభాలు రాబోతున్నాయి. ఐనా అది వేరే విషయం.

నేను చెప్పాలనుకుంటున్నది ఏంటంటే ఎరువుల ఉత్పత్తిదారులకు, విదేశీ పెట్టుబడి దారులకు అంతంత లాభాల్ని హామీ ఇస్తున్న ప్రభుత్వం కనీసం ఒక్కశాతం లాభాన్నైనా రైతులకు ఇవ్వాలనే ఉద్దేశం సిఏసీపీకి ఉందా?

వ్యవసాయ విధానాలు, కార్యక్రమాలపై వేసిన భానుప్రతాప్‌సింగ్ కమిటీలో నేను సభ్యుడ్ని. ఏ కొంత శాతాన్నైనా రైతులకు లాభంగా ఇవ్వడానికి సీఏసీపీ అనుమతిస్తుందా? అనే విషయాన్ని తెల్సుకోవాలని సీఏసీపీకి అప్పుడు మేమో లేఖ రాసాం. దానికి వారు జవాబిచ్చారు. వాటిలోని కొన్ని అంశాలను మీ దృష్టికి తీసుకువస్తాను. ''మార్చి 30, 1990 తేదీతో ఉన్న మీ లేఖ కమిటీకి అందింది. కృతజ్ఞతలు - మీరు పంపిన సమాచారమే కాకుండా మేం మరికొంత సమాచారం తెల్సుకోవాలనుకున్నాం. రైతుకు ఉత్పత్తి ఖర్చుపై లాభశాతాన్ని ఎంతైనా నిర్ణయించారా? - నిర్ణయిస్తే అది ఎంత శాతం?, నిర్ణయించకపోతే, ఎందుకు నిర్ణయించలేదు? వస్తువు ఆధారిత ధరల సమానత్వం ప్రాంత ఆధారిత ధరల సమానత్వం పెట్టుబడి, ఉత్పత్తి వ్యయాల సమానత్వం, అలాగే రైతు చెల్లించిన, పుచ్చుకున్న ధరల సమానత్వం' అనే వివిధ రకాల విధానాలను సి.ఏ.సి.పి ఎలా పరిగణనలోకి తీసుకుంది?

పై విధానాలన్నింటిని ఒకే ధరల సమానత్వ సూచిగా రూపొందించారా ? - రూపొందించి ఉంటే - ఎలా రూపొందించారు?

కమిటి అడిగిన ఈ ప్రశ్నలకు సమాధానంగా సి.ఎ.సి.పి. ''ఫలానా తేదీన మీరు రాసిన లేఖకు సమాధానం - రైతులకు ఉత్పత్తి వ్యయంపై స్థిరమైన లాభశాతం ఏమీలేదు. అలాగే ధరల నిర్ణయానికి ఓ కచ్చితమైన గణిత సూత్రం, విధానమంటూ ఏమీ లేదు'' అని లేఖ రాసింది.

రైతులకు తమ ఉత్పత్తులపై ఖచ్చితమైన లాభశాతం నిర్ణయించడానికి ఒక సరైన విధానం గాని, ఇవ్వాలన్న ఉద్దేశం గానీ లేవని సీఏసీపీ తేల్చి చెప్పింది. ఈ విషయాన్ని నేను మీ దృష్టికి తీసుకురావాలనుకున్నాను, అధ్యక్షా, ఐతే హనుమంతరావు కమిటీ ఈ విషయమై కొన్ని సూచనలు చేసి శరద్‌జోషి నేతృత్వంలోని స్థాయీ సలహా సంఘానికి పంపింది. ఈ సలహా సంఘంలో నేనూ సభ్యుణ్ణే. రెండు విషయాలపై కమిటీ సూచనలు చేసింది. □

# గ్రామీణ పేదరికాన్ని పారద్రోలడమెలా?

అనేక రాష్ట్రాల్లో కాస్త అటూ ఇటూగా వ్యవసాయ భూముల సీలింగ్ నియంత్రణలు అమలయ్యాయి. దీనికి సంబంధించి వివరాల్లోకి నేను వెళ్ళడంలేదు. గౌరవనీయులైన సభ్యుల సందేహాలకు ఇంతకు ముందే సమాచారం అందించాను. మొత్తం మీద 70 నుంచి 80 శాతం వరకూ ఈ వ్యత్యాసం ఉంటుంది. ఒక్కోసారి ఈ తేడా 100 శాతం వరకూ ఉంటుంది. దీనికి సంబంధించి ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య ఒక కొత్తచట్టాన్ని తెచ్చింది. ఎగుమతుల ప్రోత్సాహకాల పేరుతో, వ్యవసాయ పంటల విస్తృతిని పెంచడానికని బడా కంపెనీలకు వందల ఎకరాల భూమిని దారాదత్తం చేసే వీలు ఈ చట్టం కలిపిస్తోంది. కంపెనీలకు ఇలాంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఏంటో నాకు అర్థం కావడం లేదు. 1950 కల్లా జమీందారులు, రాజాలు కనుమరుగయ్యారు. వాళ్ళ భూములలో అధిక భాగాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1960లో మరో చట్టం వచ్చింది. 50 నుంచి 100 ఎకరాల భూములున్న బడా భూస్వాములనూ, ఈ చట్టం కింద భూపరిమితి నియంత్రణ పరిధిలోకి తెచ్చారు. 1972లో మరో భూ పరిమితి నియంత్రణ చట్టాన్నీ చేశారు. బ్యాంకుల జాతీయీకరణలోగాని, ఇతర రంగాల్లోని ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు గాని, నష్ట పరిహారాన్ని 20 నుంచి 25

రెట్ల ఆదాయాన్ని నష్టపరిహారంగా లెక్కిస్తారు. అనేక మంది వ్యవసాయదారులూ, వారి తండ్రులూ, తాతలూ ఆ భూములను అభివృద్ధి చేయడానికి శ్రమించారు. ఆ భూములను చదును చేసి, వ్యవసాయ యోగ్యం చేసి, ఈ దేశంలోని ప్రజలకు వ్యవసాయ ఫలాలను అందించడానికి వారు తోడ్పడ్డారు.

వారికి అందుతున్న నష్ట పరిహారం అంతంత మాత్రంగానే ఉంది. అందుకే వారు చట్టంలోని లొసుగులను వెదుకుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం లోని బలహీనతలను పట్టుకుంటున్నారు. అందుకే అలా జరిగింది.

భూమి(పొలం) మీద పరిమితి విధించడం ద్వారా, ఆదాయంపై కూడా పరిమితి విధిస్తున్నారనేది నా వాదన. టాటా, బిర్లా, గోయెంకా, దాల్మియా, సింఘానియా లాంటి బడా పారిశ్రామిక వేత్తల ఆస్తులు అంతకంతకూ పెరుగుతున్నాయనేది వాస్తవం. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో వీరి ఆస్తులు 20 లేదా 15 కోట్ల రూపాయలుగా ఉండేవి. ఈ రోజు 60,000 కోట్ల రూపాయలను వారు సముపార్జించారు. గతంలో ఒక సామాన్య గుమాస్తాగా ఉన్న వ్యక్తి, నేడు 6,000 లేదా 8,000 కోట్ల రూపాయల ఆస్తికి అధిపతి. ఈ దేశంలోనే అత్యంత సంపన్నుడు కాబోతున్నాడు. అంతటితో వీళ్ళు సంతృప్తి చెందడం లేదు. చమురు క్షేత్రాలను ప్రభుత్వం వీరికి దారాదత్తం చేస్తోంది. ప్రభుత్వం అపారంగా పెట్టుబడులు పెట్టిన కె.జి. బేసిన్ పరిస్థితి ఇలానే ఉంది. చముదు ఉత్పత్తిని ప్రయివేటు కంపెనీల చేతుల్లో పెట్టారు. బడా కంపెనీల పట్ల వాళ్ళకు అంత ప్రేమ ఎందుకు? బడా కంపెనీలు మరింతగా భూములను సముపార్జించుకోవాలని మీరు భావిస్తున్నారు. హార్టీకల్చర్ ఉత్పత్తుల ద్వారా విదేశీ మారక ద్రవ్యార్జన పేరుతో బడా కంపెనీలను ప్రోత్సహిస్తున్నారు. రైతుల పరిస్థితినీ మీరు తప్పక పరిగణలోకి తీసుకోవాలి. రైతును వివక్షకు గురి చేయవద్దని నా మనవి.

రైతుల శ్రమను సఫలీకృతం చేయడానికీ, ఉత్పాదకతను పెంచడానికీ భూ కమతాలను ఏకీకృతం చేయడమే సరైన మార్గం. ఉత్తరప్రదేశ్, హర్యానా లాంటి కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో కొంత వరకూ ఇది అమలవుతోంది. కానీ దక్షిణాది రాష్ట్రాలలో ఇది ఇంకా శుభారంభం చేయాల్సి ఉంది. ఈ విషయంలో కర్ణాటక, కాస్త పురోగతిని సాధించింది. ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలు ఇంకా వెనుకబడే ఉన్నాయి. భూ కమతాల ఏకీకృతం వేగంగా జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలను తప్పక తీసుకోవాలి.

గ్రామీణ పేదరికాన్ని రూపుమాపడానికి ఇది ఒక్కటే మార్గం కాదు.

పేదరికాన్ని రూపుమాపే మార్గాల గురించి మీరు ఆలోచించాలి. గ్రామీణ పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడానికి మరిన్ని నిధులు కేటాయించాలి. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడానికి, ఆదాయాన్ని పెంచడానికి ఈ పరిశ్రమలు దోహదం చేస్తాయి. ఇలాంటి విధానపరమైన మార్పు రావాలి.

రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలనే ఈ ప్రతిపాదనలను సమర్థిస్తున్నాను. భూమిలేని నిరుపేదలు, సేద్యం చేయడానికి భూమిని సముపార్జించుకొని భూమికి సొంతదారులు కావడానికి ఇవి దోహదం చేస్తాయి.

వివిధ రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన భూ పరిమితి చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం ముదావహం. నా సహచరులనేకులు చెప్పినట్లుగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భూ సంస్కరణ అనేది నినాదంగా ఉంది. ఆచరించడం కంటే అతిక్రమించడం ద్వారానే ఈ నినాదం అమలవుతోంది. భూ సంస్కరణల అమలు వల్ల 6 కోట్ల ఎకరాల మిగులు భూమిని పొందుతామని మనం భావించాం. కానీ అలా జరగలేదు. లక్షల ఎకరాల భూమి లిటిగేషన్ల (కోర్టు తగాదాలలో)లో ఇరుక్కుని ఉంది. అలాగే భారతదేశంలోని కోట్లాది మంది పేదలూ భూమిలేని వారిగానే మిగిలి పోయారు. వారి కలలను మనం సాఫల్యం చేయలేక పోయాం. మిగులు భూమిని, వృథాగా పడి ఉన్న భూమిని మనం భూమిలేని నిరుపేదలకు పంచలేక పోయాం. మిగులు భూమిని భూమిలేని అభాగ్యులకు పంచడమే భూ సంస్కరణల ముఖ్యోద్దేశం. (అందువల్ల) తదనుగుణంగా సంపద అందరికీ పంపిణీ జరిగి అందరు ఆ ఫలాలను అనుభవించాలి.

ఆ విధంగా వారిలో కొనుగోలు శక్తి పెరుగుతోంది. మార్కెట్ నిడివి విస్తృతమవుతుంది. తదనుగుణంగా దేశంలో పారిశ్రామికీకరణ చోటు చేసుకుంటుంది. పారిశ్రామికీకరణకూ, దేశాభివృద్ధికీ భూ సంస్కరణలే మూలం. భూ సంస్కరణల నిగూడార్థం ఇదే. కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేనందువల్లే ఇవి అమలు కాలేదు. కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ మంత్రులు అనేకులు భూస్వాములు అయినందువల్లా, రాష్ట్రాలలో ఉన్న కాంగ్రెస్ మంత్రులు 90% మంది భూస్వాములు అయినందు వల్లా భూ సంస్కరణలు అమలుకు నోచుకోలేదు. వాళ్ళు భూస్వాములు అయినందున, ఈ చట్టాల అమలుకు ఆసక్తి చూపలేదు. అందుకే పశ్చిమ బెంగాల్, కేరళలో తప్ప మిగతా దేశమంతటా అనేకచోట్ల ఈ సంస్కరణలు విఫలమయ్యాయి. ఇదీ ప్రస్తుత పరిస్థితి. వివాదాల్లోకి నేను వెళ్ళదలచుకోలేదు.

□

# ఈ ప్రభుత్వం ఎవరి కోసం ? ఎందుకోసం ?

అధ్యక్షా ! ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞుడిని. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది దాటింది. ఏ రంగంలో తీసుకున్నా ప్రభుత్వం పనితీరు బాగాలేదు. ప్రత్యేకంగా ధరల పెరుగుదల విషయంలో ఏమీ బాగలేదు. వారు ప్రజలకిచ్చిన హామీలు 100 రోజుల్లో నిలబెట్టుకోలేక పోయారు, కనీసం ఏడాది గడిచినప్పటికీ నిలబెట్టుకోలేక పోయారు.

ద్రవ్యోల్బణం రేటు 11.4% ఉందని ఆర్థిక మంత్రి చెబుతున్నారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఒక సామాన్యుడు నిత్యావసర సరుకులు కొందామని మార్కెట్టుకు వెళితే, ధరలన్నీ ఆకాశానికి అంటుతున్నాయి. ధరల పెరుగుదల ఇలాగే కొనసాగడం వల్ల సామాన్యుడి జీవితం దుర్భరమవుతోంది.

ద్రవ్య విధానానికి సంబంధించి ప్రభుత్వం చాలా మార్పులు తీసుకొచ్చింది. పరిశ్రమల రంగం లేదా వ్యాపార రంగంలో అది చాల మార్పులు తీసుకొచ్చింది. మధ్యలో 'చిదంబరం' కల్పించుకుంటూ, బిజేపీ వారి విధానాల్ని సమర్థించింది అన్నారు. ఇదిసరే ! రాజాజీ చెప్పిన నిజాన్ని తెలుసుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి మూడు దశాబ్దాలు పట్టింది. ఈ లైసెన్స్-పర్మిట్ రాజ్ విధానం పోవాలని, దీనివల్ల దేశాభివృద్ధి సాధ్యం

కాదని ఆయన చెప్పారు. రాజకీయ నాయకత్వానికి సన్నిహితంగా మెలిగిన కొందరు వ్యక్తులకే కాంగ్రెస్ అనుసరించిన విధానాలు మేలు చేశాయి. అంతకు ముందు ఏమీలేనివారు కూడా తర్వాత కోట్లకు పడగలెత్తారు. ఈ ప్రభుత్వం అనుసరించిన విధానాలవల్ల కొందరు పారిశ్రామికవేత్తలు వారి ఆస్తుల్ని రూ. 4000 కోట్లకు పెంచుకోగలిగారు. అయినప్పటికీ, ప్రభుత్వం, కాంగ్రెస్‌పార్టీ సోషలిస్టు నమూనా సమాజాన్ని ఏర్పరుస్తామని చెబుతోంది. అయితే, నిజమేమిటంటే, మొత్తం జాతీయ ఆదాయంలో 34% సమాజంలో ఉన్న 10% అత్యున్నత వర్గాలది. అమెరికాలాంటి పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్న దేశాల్లో సైతం ఈ 10% ఉన్నతవర్గాల ఆదాయం 22% కూడాలేదు. ఫ్రాన్సులో గాని, జర్మనిలోగాని ఇది ఇలానే ఉంది. అభివృద్ధి చెందుతున్న చాలా దేశాల్లో కూడా 22% నుంచి 24%కి మించలేదు. ఇక్కడేమో అది 34% ఉంది. అదే సమయంలో, దారిద్ర్యరేఖకు దిగువన జీవించే వారి సంఖ్య పెరుగుతూ ఉంది. కాంగ్రెస్ పార్టీ విధానాలు మనల్ని ఎక్కడికి తీసుకెళ్లాయో తెలుస్తోంది. సామాన్యుడు, ప్రత్యేకించి పేదవాడు ఈ దేశంలో ఎదుర్కొంటున్న కష్టనష్టాల గురించి చెప్పబోవడం లేదు.

ఆర్థికరంగాన్ని క్రమబద్దీకరించకుండా ఉండటానికి ప్రభుత్వం కొంతవరకు ప్రయత్నిస్తోంది. రెడ్-టేపిజాన్ని, పాలనలో అధికారుల జోక్యాన్ని తగ్గించడానికి ప్రయత్నించడం కొంత సంతోషించదగిన విషయమే. ఆ చర్యల్ని మేము స్వాగతిస్తాం. అలాంటి విధానాలపట్ల మాకు అభ్యంతరం లేదు.

అయితే ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల పట్లే మేము భయపడుతున్నాం. ప్రభుత్వ ప్రస్తుత పనితీరు మనల్ని ప్రమాదకర పరిస్థితులలోకి తీసుకుపోతోంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకులు నిర్దేశించిన విధానాలను తాము అనుసరిస్తున్నామని ప్రభుత్వం అనేక సందర్భాలలో చెప్పింది. అవి అట్లాఉంచితే, ఈ మధ్య కాలంలో ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు దేశాన్ని ప్రమాదకర పరిస్థితుల్లోకి తీసుకుపోతున్నాయి. దీనికి నేను మూడు ఉదాహరణలు ఇస్తాను.

ఈ వివాదాల్లో ఒకదాన్ని మనం పాక్షికంగా చర్చించాం. పూర్తిగా చర్చించలేదు. పూర్తి వివరాల్లోకి వెళ్లను. రూ. 400 కోట్ల ఎలక్ట్రిక్ లోకమోటివ్ కాంట్రాక్టును బెల్ (BHEL)కు ఇవ్వడానికి కేటగిరీ (1) కిందికి అది రాలేదని రైల్వే మంత్రి చెప్పారు. టెండరు కమిటీ BHEL ధరఖాస్తును రెండుసార్లు పరిగణనలోనికి తీసుకున్నా, రైల్వేమంత్రి మాత్రం BHEL కేటగిరీ (1) క్రిందికి రాదని చెప్పారు. బెల్ అలాంటి

వాటిని భారత్‌లో ఉత్పత్తి చేయబోతోంది. అయినా అది ధరల వివరాల్ని సమర్పించలేదని దానిని తిరస్కరించారు. రైల్వేమంత్రి కావాలనే ఆసియా బ్రౌన్ బొవేరీ (ABB) లోపాలను విస్మరించారనేది జగద్విదితం. ఇది చాలా సీరియస్ విషయం. ఈ కాంట్రాక్ట్ దానికి ఇచ్చి ఉండకూడదు. అయినా దానికే కాంట్రాక్ట్ దక్కింది.

రూ. 1200 కోట్ల రూపాయాల 615 మెగావాట్ల గ్యాస్ ఆధారిత పరిశ్రమకు సంబంధించింది. దీనిని 'మరుబని-ఏబీబీ'కి కట్టబెట్టారు. 'సీమెన్స్-బెల్'కు తిరస్కరించారు. రూ. 1200 కోట్ల రూపాయల ప్రాజెక్టును ఒకే ఒక్కరోజులో మంజూరు చేయడం మాకు ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. దీనికి సంబంధించి కొన్ని వాక్యాలు చెప్పడానికి మీరు అనుమతించండి.

1992 మార్చి 26 సాయంత్రం 3.30-5 గంటల మధ్య ఒక ప్రభుత్వరంగ సంస్థ రిటైర్డ్ మేనేజింగ్ డైరెక్టరును 'మరుబని-ఎబీబీ' కాంట్రాక్టుకు సంబంధించిన చర్చలకు పిలిపించింది. అతనిపేరు నేను చెప్పను. వారి మధ్య చర్చలు జరిగాయి. అనంతరం కాంట్రాక్టు వారి వశం అయింది. ఇదంతా 24 గంటల్లో జరిగింది.

ఈ విషయంలో మేము ఆందోళన చెందుతున్నాం. ఇప్పటికీ, బెల్ థర్మల్ పవర్ ప్లాంట్లను నెలకొల్పడంలో యంత్ర సామగ్రిని సరఫరా చెయ్యడంలో ముందుంది.

వేలాది మంది పనిచేస్తున్న, కోట్లాది రూపాయాల ప్రజాధనాన్ని పెట్టుబడిగా పెట్టిన బెల్ లాంటి కంపెనీలు ఇలాంటి ప్రభుత్వ నిర్ణయాలతో వాటి భవిష్యత్తు ఏమవుతుందో మేము తెలుసుకోవాలి. చాలాకాలంగా సంస్థకు సేవచేస్తున్నవారి పరిస్థితి ఏంకావాలి?

నేను ఇంకో ఉదాహరణ చెబుతాను.

ఎగువ కృష్ణ ప్రాజెక్టు కింద ఒక కాలువ తవ్వడానికి గాయిత్రి కన్స్ట్రక్చన్స్ అనే కంపెనీకన్నా రెండున్నర కోట్లరూపాయలు తక్కువగా ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థ టెండరు వేస్తే, రూ. 69 కోట్ల రూపాయల కాంట్రాక్టును 'గాయత్రి'కే కర్ణాటక ప్రభుత్వం కట్టబెట్టింది. అన్ని నిబంధనల్ని పక్కనబెట్టి, ఆ కాంట్రాక్టు సదరు సంస్థకే దక్కితే ఆసియా అభివృద్ధి బ్యాంకుకు సిపార్సు చేశారు. రాష్ట్ర శ్రేయోభిలాషి అయిన ఒక ప్రజాప్రతినిధి కోర్టుకెళ్లాడు. సదరు బ్యాంకుకు విషయం తెలియజేశాడు. కాని అది వేరే విషయం.

నేను సభకు చెప్పాలనుకుంది ఏమిటంటే, ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేది అందరికీ తెలిసినట్లు ఆయా కంపెనీల్లో పాలకులకు సంబంధించిన వారు ఉండటం ఒకటేకాకుండా ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇతర ఆర్థిక సంస్థల్ని ప్రసన్నం చేసుకోవడానికి కూడా.

వ్యవసాయశాఖా మంత్రి, ఆర్థికమంత్రి ఇక్కడలేరు. ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా వ్యవసాయ విధానాన్ని రూపొందించడంలో విఫలమైందని నేను చెప్పదలుచుకున్నాను. వ్యవసాయ విధానాన్ని తీసుకొస్తామని చెబుతున్నారు. కాని అలాంటి విధానమేమీ లేదు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధలేదని తెలుస్తోంది. మొదటినుంచి, దేశం స్వాతంత్ర్యం పొందినప్పటినుంచీ వ్యవసాయం వెనుకబడిన రంగమే. దురదృష్టవశాత్తూ, నెహ్రూ హయాం నుంచీ ప్రభుత్వం వ్యవసాయ రంగంపై సవతి తల్లి ప్రేమనే కనపరుస్తోంది. వ్యవసాయాభివృద్ధికి అవసరమైన నిధులనెప్పుడూ కేటాయించలేదు. నీటిపారుదల రంగానికి అవసరమైన కేటాయింపులు జరగలేదు. ప్రపంచంలో సరాసరి 11% వ్యవసాయ భూమి ఉంటే మనదేశం విస్తీర్ణంలో 51% వ్యవసాయ భూమి ఉంది. మొదటినుంచి వ్యవసాయరంగానికి ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించిందా? ప్రాధ్యాన్యతా రంగంగా పరిగణించిందా? పరిశ్రమల రంగానికి అందించిన సహాయ సహకారాలను అందించిందా? అలా చేసి ఉంటే వ్యవసాయరంగం అభివృద్ధి చెంది ఉండేది. దేశం వ్యవసాయకంగా శక్తివంతమైనదిగా మారేది. దురదృష్టవశాత్తూ అలా జరగలేదు.

కనీస వినియోగ సామర్థ్యం కూడా ఈ రోజు ప్రజలకు లేదు. 2600 కేలరీల ఆహారం ఒక మనిషికి రోజుకు అవసరమైతే, ప్రస్తుతం మనదేశంలో 2100 కేలరీలే లభ్యమయ్యే పరిస్థితి ఉంది. ఏటా 180 కేజీల ఆహార ధాన్యాలు తలసరి వినియోగం అవసరమైతే 173 కేజీలే లభ్యమవుతున్నాయి. వ్యవసాయాన్ని ఏ విధంగా పరిగణించాలో ప్రభుత్వం ఆ విధంగా పరిగణించకపోవడమే దీనికంతటికీ కారణం. వివిధ రంగాల్లో చేసిన మార్పులు వ్యవసాయానికి అనుగుణంగా ఉన్నాయోలేదో ప్రభుత్వం ఆలోచించలేదు. ఇప్పటికీ దానిని కదిలించాలనుకోవడంలేదు. ఇప్పటికే, వ్యాపార విషయాలు వ్యవసాయానికి ప్రతికూలంగానే ఉన్నాయి. చాలా సంవత్సరాలుగా ఇది దాదాపు 0.8గా ఉంది. కొద్దో గొప్పో లాభాలు రైతులకొచ్చినా దీనివల్ల అవి పరిశ్రమల రంగానికి అవి తరలిపోతున్నాయి. ఫలితంగా వ్యవసాయరంగంలో ప్రైవేటు పెట్టుబడులు

క్షీణించాయి. దీంతోపాటు, ప్రభుత్వరంగ పెట్టుబడులు నీటిపారుదల రంగంలోగాని లేదా మౌలిక సదుపాయాల రంగంలోగాని అవసరాలకు తగినట్లు లేవు.

అధ్యక్షా ! వ్యవసాయం గురించి ఆర్థిక మంత్రి చాలా మాట్లాడారు. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో ఆయన ప్రతిపాదించిన కేటాయింపులు ఏడో పంచవర్ష ప్రణాళికతో పోల్చినపుడు చాల తక్కువగా ఉన్నాయి. ఇవి ఏమాత్రం సరిపోవు.

ఏడో పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి 5.9%, నీటిపారుదలకు 9.4%, మొత్తంగా చూస్తే 15.3% కేటాయించారు. అయితే, 8-7-1992న ఆర్థికమంత్రి లోక్‌సభకు చెప్పిన సమాధానంలో కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిసి వ్యవసాయానికి కేటాయించిన మొత్తం రూ. 54,992.50 కోట్లు అని చెప్పారు. ఇది 12.6% కూడా కాదు. "దీనిని బట్టి, ప్రభుత్వం వ్యవసాయరంగానికి కేటాయింపులు పెంచాలనే ఆలోచనతో లేదు. రైతులకు అవసరమైన రుణాలను అందించడానికి కావలసిన నిధిని సమకూర్చలేదు." బయోటెక్నాలజీ, దాని విస్తృతి గురించి ఆయన చాలా చెప్పారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఏమిచేసిందని నేను ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాను. వ్యవసాయ విస్తృత కార్యక్రమానికి వారు అవసరమై నిధులకు ఎంత కేటాయించారు? ఈ సంవత్సరం కృషి విజ్ఞాన కేంద్రాలని ఎన్నింటిని మంజూరు చేయబోతున్నారు? శాస్త్ర సాంకేతిక ఫలితాలను పల్లెల్లోని రైతుల వద్దకు తీసుకెళ్ళడానికి మీరేమి చేయబోతున్నారు?

ఈ ప్రభుత్వం తన దృక్పథం ఏమాత్రం మార్చుకోలేదని నా అభిప్రాయం. ప్రభుత్వంలో ఆ మార్పు వచ్చేవరకు దేశంలో ఇలాంటి బాధలు కొనసాగుతూనే ఉంటాయి. కొన్ని విషయాలు భవిష్యత్‌లో కూడా కొనసాగుతాయి.

ప్రభుత్వాన్ని నేను హెచ్చరించాలనుకుంటున్నాను. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, లేదా అలాంటి సంస్థల సలహాలపై వ్యవసాయ రంగానికిస్తున్న రాయితీలను మీరు ఉపసంహరించుకోబోతున్నారు. మీరు రైతులకు తీవ్రమైన అన్యాయం చేయనున్నారు. వ్యాపార ప్రతికూల విధానాల వల్ల రైతులు చాలా నష్టపోతున్నారు. 'చైనా' లాంటి దేశంలో సైతం ఉద్దేశపూర్వకంగా వ్యాపార విధానాలను రైతులకు అనుకూలంగా చేశారు. వారింకా దీనిని పెంచాలనుకుంటున్నారు, తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతాయి. మనదేశంలో 140 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూమిలో 170 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలనే మనం ఉత్పత్తి చేయగల్గుతున్నాం.

చైనాలో 100 మిలియన్ హెక్టార్ల భూమిలో 360 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయగల్గుతున్నారు. దీనిని బట్టి విప్లవాత్మక విధానం అక్కడుందని తెలుస్తోంది.

మనదేశంలో రైతులకిస్తున్న రాయితీలు 7 బిలియన్ డాలర్లు. అంటే తలసరి ఒక్కొక్కరికి 4.4 డాలర్లు. అదే అమెరికాలో అయితే 150 డాలర్లు. ఐరోపా ఆర్థిక సమాజంలో 240 డాలర్లు ఉంది.

రాయితీలను ఉపసంహరించుకుంటే రైతులను నష్టాల ఊబిలోకి నెట్టినట్లే, రైతులే కాదు దేశానికీ నష్టమే. ఎందుకంటే, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడం సాధ్యంకాదు. విదేశీ మారక ద్రవ్యం ఎక్కువ సంపాదించడం సాధ్యంకాదు.

చివరిగా, సెక్యూరిటీల కుంభకోణం వివరాలజోలికి వెళ్ళడంలేదు. అయితే, సామాన్యుడు, రైతు, హరిజనుడు రుణాల కోసం కమర్షియల్ బ్యాంకులకెళ్లినప్పుడు వారికి రుణాలు అందడంలేదని నేను ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను.

రొయ్యలసాగును ప్రాధాన్యతా రంగంలో కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 1400 కోట్ల రూపాయల సముద్ర ఉత్పత్తులను మనం ఎగుమతి చేశాం. తద్వారా భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని పొందగలిగాం. రొయ్య రైతులు రుణాల కోసం కమర్షియల్ బ్యాంకులకు వెళ్లినప్పుడు వారు 300% పూచీకత్తు అడుగుతున్నారు. అతనికి ఇదెలా సాధ్యమవుతుంది? వందల కోట్లరూపాయలను రుణాలు ఇచ్చేటప్పుడు ఇది తప్పుకాదు. కాని సామాన్యుడి విషయంలో ఇలా చెయ్యకూడదు. ఎటువంటి పూచీకత్తు లేకుండానే హర్షద్ మెహతాకు వందలకోట్ల రూపాయలనిచ్చారు.

దీనికి నైతిక బాధ్యత వహించి ప్రభుత్వం రాజీనామా చెయ్యాలి. సహచరులు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని నేను బలపరుస్తున్నారు. □

# కరువుకు శాశ్వత పరిష్కారం ఏది?

గౌరవనీయులైన సభాధ్యక్షులకు కరవు, వరదలపైన ప్రతి సంవత్సరం ఈ సభలో చర్చ జరుగుతుంది. ఈ పరిస్థితిపై చర్చ జరగని సంవత్సరం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 45 సంవత్సరాలయినప్పటికి కరవు, వరదలపై చర్చ జరుగుతూనే ఉన్నది. ఈ అంశంపై ప్రభుత్వం ఎలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదో ఇది నిరూపిస్తున్నది. ఈ పరిస్థితిపైవారు ఎప్పటికి పటిష్టమైన చర్యలు తీసుకోరు. వారు కేవలం తాత్కాలిక చర్యలను తీసుకుంటారు. శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడానికి వారు ఎప్పటికీ ప్రయత్నించరు. గౌరవనీయులైన సభాధ్యక్షులకు చర్చజరుగుతున్నప్పుడు మన స్నేహితుల్లో ఒకరు వర్షాలు ప్రారంభమయినాయి అని చెప్పారు. కాని పంటలు అప్పటికే పండిపోయాయి. ఒకవేళ వర్షాలు కురిసినా అది చెదురు మదురు వర్షం మాత్రమే. అన్ని చోట్ల పడటంలేదు. వ్యవసాయోత్పత్తి తగినంతగా లేదు. దేశంలోని కొన్ని ప్రాంతాలు కరవుకు గురవుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో వరదలు సంభవిస్తున్నాయి. చర్చలు జరుగుతున్నాయి. కానీ సరయిన చర్యలు తీసుకోవడంలేదు. కరవు, వరదల పేరుతో బాధితులకు పునరావాసం కల్పిస్తున్నారు. కానీ ఎంతమొత్తం బాధితుల కందుతున్నదీ సరిగా లెక్కించడం లేదు. ప్రభుత్వం ఖర్చుచేస్తున్న వందరూపాయల్లో 15 రూపాయలు మాత్రమే బాధితులకు చేరుతున్నాయని ఒక సందర్భంలో రాజీవ్ గాంధీ చెప్పినట్లు నాకు గుర్తుంది.

ఈ రకమైన చెడుధోరణులు కొనసాగుతున్నప్పుడు అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది.

చాలా కాలం క్రితం దేశాభివృద్ధి ఏదోఒకటి పటిష్టంగా చేయాలని ఒకరు ప్రణాళిక తయారుచేసినట్లు నాకు జ్ఞాపకముంది. దీనికోసం భగీరథుడను రాజు హిమాలయాలనుండి గంగానదిని రప్పించడానికి చాలా తీవ్రంగా కృషిచేశాడు. ప్రస్తుతం గంగానది దేశానికి మధ్యగా ప్రవహిస్తున్నది. కానీ దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యం వచ్చిన 45 సంవత్సరాల తర్వాత కూడా ఈ నదీ జలాన్ని సాగునీటికోసం ఉపయోగించుకోవటం లేదు. గంగా అన్ని ఇతరనదులు సముద్రంలోకి ప్రవహిస్తున్నాయి. దీని ఫలితంగా పంటపొలాల్లో వివిధ ప్రదేశాల్లో ప్రతి 50, 100, 200 గజాల దూరానికి గొట్టపు బావులను తవ్వుతున్నారు. చాలా పెద్ద సంఖ్యలో గొట్టపుబావులను ఏర్పరచడం వల్ల సరయిన మార్గదర్శకం లేకపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ కారణంగా పంపుసెట్లు, బోరింగులు నిరుప

యోగం అవుతున్నాయి. గతంలో 25 అడుగుల లోతులో నీరున్న చోట ఇప్పుడు 50 అడుగులలోతుకు, గతంలో 50 అడుగుల లోతులో నీరున్నచోట ఇప్పుడు 100 అడుగులకు నీటి మట్టం తగ్గింది. ఈ విషయమై కరవు పరిస్థితిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించాల్సి ఉంది. ఈ రకమైనటువంటి పాక్షికమైన చర్చల వల్ల ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనలేం. ఈ అంశంపై అభ్యర్థించిన రాష్ట్రాలకు మాత్రమే నిబంధనలను రూపొందించామని గతంలో మంత్రి ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. మంత్రి ఏదైనా ఒక రాష్ట్రానికి మాత్రమే మంత్రిగా వ్యవహరిస్తున్నారా? ఆయన కేంద్ర మంత్రి కాదా? □

# చెరకు రైతుల ప్రయోజనాలు కాపాడండి

క్వింటాల్ చెరకుకు చట్టబద్ధ కనీస ధరను 26 రూపాయిలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని సంవత్సరాలుగా, కేంద్రం ప్రకటిస్తున్న చట్టబద్ధ కనీసధర, వాస్తవంగా చెరకును ఉత్పత్తి చేయడానికి అయ్యే వ్యయంను సరిగా ప్రతిబింబించడం లేదు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సలహా ధరలను ప్రకటించడమే దీనికి తార్కాణం. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలకు 55 రూపాయిలను అదనంగా చెరకు ఉత్పత్తిదారులకు చెల్లించమని ఫ్యాక్టరీలకు సూచించింది. కాని ఈ ఏడాది మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధ కనీసధరకు అదనంగా కేవలం 35 రూపాయిలను మాత్రమే ప్రకటించింది ఫలితంగా చెరకు ఉత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. అందువలన వచ్చే ఏడాది చెరకు ఉత్పత్తి తగ్గించవచ్చు. కాబట్టి కేంద్రప్రభుత్వం, చెరకు ఫ్యాక్టరీలు చెప్పిన దానిని నమ్మకంగా, చెరకు ఉత్పత్తిదారులకు చెల్లించే అదనపు ధరకు సంబంధించిన సవరించిన భార్గవ ఫార్ములాను కేంద్రప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలి. ఎందుకంటే, ఫ్రీసేల్ సుగర్ కోటా శాతం 35 శాతం నుంచి 80 శాతం పెరిగింది. మొలాసిస్ ధర పెరగగా, ఇండస్ట్రియల్ ఆల్కహాల్ ఉత్పత్తిని లైసెన్స్ పరిధి నుంచి తప్పించారు. ఫ్యాక్టరీలు పెద్ద మొత్తంలో ఆర్జించుచున్న లాభాలలో కనీసం 70 శాతం వరకు వ్యవసాయదారులకు చెల్లించాలి. విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి అవసరమైన ఎక్కువ చక్కెర కోసం, ప్రభుత్వం ఈ చర్య ద్వారా చక్కెర ఉత్పత్తిని తప్పనిసరిగా పెంపొందించాలి. □

# పులిచింతల ప్రాజెక్టు కట్టాలి

పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు అనుమతి పూర్తి చేయుటకు ఆర్థిక సహాయం అందించటం గురించి

వడ్డే శోభనాద్రీశ్వరరావు (విజయవాడ): అధ్యక్షా! ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో కృష్ణా డెల్టా కింద 140 సంవత్సరాల నుంచీ సాగులో ఉన్న 13 లక్షల ఎకరాల ఆయకట్టును కాపాడటానికి పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అవసరం ఎంతైనా ఉంది. కర్ణాటకలోని ఎగువ కృష్ణా, ఇతర ప్రాజెక్టుల ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నీటిమట్టం పడిపోయింది. ప్రస్తుతం కృష్ణాడెల్టా సరియైన సమయంలో నాట్లు వేసేందుకు కూడా నీటి సరఫరా జరగడం లేదు. ఈ ఏడాది 45 రోజులు ఆలస్యంగా నాట్లు వేశారు. దీని మూలంగా రూ. 240 కోట్ల నష్టం వచ్చింది. గత యాభై సంవత్సరాలుగా ఎన్నడూ ఇలా జరగలేదు. పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణానికి రైతులు కూడా కొంత ఆర్థికసాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. 1988లో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి. రామారావు దీనికి శంకుస్థాపన చేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏ చర్యా తీసుకోలేదు. పులిచింతల ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చి, కాలసిన ఆర్థిక సహాయం అందించడానికి కేంద్రప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

# కరవు పరిస్థితుల్లో రైతుల్ని ఆదుకోవాలి

ముఖ్యమైన విషయం గురించి మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెల్పుకుంటున్నాను. ఇంతకుముందే దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న కరవు పరిస్థితిపై ఎంతో మంది మిత్రులు (1992-1993 సీజన్లో జనుము మద్దతు ధరను ప్రకటించిన మంత్రి 740 స్టేట్‌మెంట్) మట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోకూడా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. 23 జిల్లాలకుగాను 12 జిల్లాల్లో అత్యల్ప వర్షపాతం పడింది. 16 జిల్లాలో వ్యవసాయ పనులు క్షీణించాయి. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి. వర్షాలు కూడా చాలా స్వల్పంగా కురిసాయి.

ఉదాహరణకు నా నియోజకవర్గంలోనే వర్షాధార పంటలైన పెసర, పొద్దుతిరుగుడు పంటలు అసలు పండనేలేదు.

13 లక్షల ఎకరాలు ఆయకట్టు కలిగిన, 140 సంవత్సరాల చరిత్ర ఉన్న కృష్ణా డెల్టాలో విజయవాడలో గత 25 ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం ఇదే ప్రథమం. ఈ సమయానికే 50 శాతంకుపైగా నాట్లు పడేవి. కానీ ఈసారి నాలుగువేల హెక్టార్లలో కూడా నాట్లు పడలేదు. దీని బట్టి రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని మీరు అంచనా వేయవచ్చు.

"రోమ్ నగరం తగిలిపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయిస్తూ ఉన్నట్లు" ఒక మాటను సరిగ్గా ఈ పోలిక కరవు వల్ల రాష్ట్రం అల్లాడుతుంటే పట్టించుకొని రాష్ట్ర ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. ఇది చాలా దురదృష్టకరం.

తన సొంతపార్టీవారు తనను పదవిలోంచి తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాల నుంచి పదవి కాపాడుకోవడానికీ ముఖ్యమంత్రి శ్రద్ధ చూపుతున్నారు. రాష్ట్ర ప్రజలు, రైతులు కష్టాలు పడుతుంటే అసంతృప్తివాదులను బుజ్జగించే ప్రయత్నంలో ముఖ్యమంత్రి ఉన్నారు.

కొన్ని రోజుల క్రితం జులై 9న గౌరవనీయ వ్యవసాయ మంత్రి బలరాం జక్కర్ కొన్ని రాష్ట్రాలలో ఉన్న కరవు గురించి సభలో ప్రస్తావించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని కరవు పరిస్థితిపై ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

ఎగువ కృష్ణా నదిపై కర్ణాటకలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఉన్న దృష్ట్యా 140 ఏళ్ల చరిత్ర గల్గిన కృష్ణా డేల్టాలోని పంట భూములను రక్షించడానికి పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించాలని మాజీ నీటిపారుదల, విద్యుత్ శాఖమంత్రి, ప్రముఖ ఇంజనీర్ డా॥ కె.ఎల్. రావు సూచించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని 1988లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు పులిచింతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కాలువలను ఏ విధంగా కాల్వలను తవ్వాలో నిర్ణయించడానికి, సంపూర్ణంగా సర్వే చేయడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

దురదృష్టవశాత్తు ప్రస్తుత ప్రభుత్వం ఆ విభాగాన్ని పట్టించుకోవడంలేదు.

మొత్తం పనంతా ఆగిపోయింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రైతులు, ముఖ్యంగా జిల్లాలోని కృష్ణా డేల్టా ప్రాంతంలో కరవు ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారు. ఎలాగో అలా ఒక ఎకరానికి 10 బస్తాల తక్కువ ధాన్యాన్ని పండించినా ఉత్పత్తి తగ్గడంవల్ల వచ్చిన నష్టం విలువ రూ. 240 కోట్లు ఉంటుంది. ఇది రైతులకు, రాష్ట్రానికి వచ్చే నష్టమే కాదు. మొత్తం దేశానికే కలిగే నష్టం.

1987లో తీవ్రకరవును చవి చూశాం దాదాపు మూడు సంవత్సరాలు ఆకరవు ఉంది. ఆ సమయంలో మన దగ్గర ఎక్కువ ఆహార ధాన్యాల నిల్వ ఉండడంతో ఆ కరవును మనం ఎదుర్కొన్నాం. ఈ సంవత్సరం ఉత్పత్తి చేయాల్సిన ఆహార ధాన్యాల లక్ష్యం 182 మిలియన్ టన్నులు కాగా అతికష్టంగా 173 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. ప్రభుత్వం దీనిపై భయాందోళనలకు గురవుతూంది. అవసరమైతే

గోధుమలు, బియ్యం దిగుమతి చేసుకుంటామని ప్రభుత్వం చెపుతుంది. అయినప్పటికీ ఈ పరిస్థితి పట్ల మనం జాగ్రత్తగా ఉండాలి.

నేను చెప్పదల్చుకున్నదేమిటంటే మన ఆహార నిల్వలు అపాయకర పరిస్థితులలో ఉన్నాయి. కరవు పరిస్థితులు కొనసాగుతున్నందున, ఈసారి కూడా సరైన వర్షాలు పడకుంటే తీవ్ర పరిస్థితిని ఎదుర్కోబోతున్నట్లే.

1987లో ఎదురయిన కరవు పరిస్థితుల నేపథ్యంలో కూడా ప్రభుత్వం తాను ఇన్నేళ్లుగా అమలు చేస్తున్న విధానాల గురించి పునరాలోచించలేదు. అదృష్టవశాత్తూ మనదేశానికి పుష్కలమైన నీటి వనరులున్నాయి. జీవనదులున్నాయి. వేసవికాలంలో కూడా హిమానీ నదుల ద్వారా మనం సమృద్ధిగా నీటినని పొందగల్గుతున్నాం. కానీ దురదృష్టవశాత్తూ వ్యవసాయం, నీటి పారుదలపై ప్రభుత్వ ఉదాసీనత కారణంగా దేశానికి ఎంతో నష్టం వాటిల్లుతుంది. ఇది దేశానికి చేటు చేస్తుంది. నిజానికి 173 మిలియన్ హెక్టార్లు సాగుకు అనుకూలంగా ఉన్నప్పటికీ (742 స్టేట్‌మెంట్, 1992-93 సీజన్లో జనపనార మద్దతుధరపై మంత్రి ప్రకటన) 113 మిలియన్ హెక్టార్లను మాత్రమే వినియోగించుకుంటున్నాం. సాంకేతికంగా సాధ్యంకాకపోకవచ్చునేమో గానీ, సైద్ధాంతికంగా ప్రతి హెక్టారు సాగుభూమికీ నీటిపారుదల సౌకర్యం కల్పించడం సాధ్యమే.

ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై కేవలం తొమ్మిది నుంచి పది శాతం మాత్రమే ఖర్చు చేస్తుంది. ఎనిమిదో ప్రణాళికలో కూడా నీటిపారుదల కోసం ఎక్కువ నిధులను కేటాయించలేదు. ప్రభుత్వానికి నా సూచన ఏమిటంటే నీటిపారుదల ప్రాజెక్టుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ రంగానికి ఎక్కువ కేటాయింపులు చేసేలా విధానాలలో మార్పులు తీసుకురావాలి. ఎందుకంటే వీటికి చాలా తక్కువ ఖర్చు కావడమే కాకుండా ఎక్కువ విస్తీర్ణానానికి నీటిపారుదల సౌకర్యాన్ని కల్గిస్తాయి.

కరవు సమయంలో తీసుకుంటున్న చర్యలు కేవలం తాత్కాలికంగా సమస్యను తీర్చేవిగానే ఉంటున్నాయి.

నా సలహా ఏమంటే ప్రస్తుతం తలెత్తినట్లు కరవు పరిస్థితులు వచ్చినప్పుడు, దాని నివారణ కోసం తీసుకునే చర్యలు శాశ్వత ఫలితాన్ని ఇచ్చేవిగా ఉండాలి. దీనికి గొప్ప ఉదాహరణ మా జిల్లాలోనే ఉంది. బ్రిటిషువారి కాలంలో తీవ్రస్థాయిలో క్షామం వచ్చింది. అప్పుడు వారు ఎన్నో కాలువలను, తవ్వించారు. ఉదాహరణకు కె.ఇ.బి. కెనాల్ లాంటివి తవ్వించడంతో జిల్లాలోని వేల ఎకరాలకు సాగునీరు అందింది.

గ్రామంలోకి వెళ్లడానికి రోడ్లు కూడా లేని గ్రామాలు దాదాపు రెండు లక్షల వరకు ఉన్నాయి. అందుకే ప్రభుత్వం ఆ గ్రామాలకు రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని నేను సూచిస్తున్నాను. దీనివల్ల సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు పని కల్పించడమే కాకుండా ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా కల్గుతుంది.

అదే విధంగా చిన్నచిన్న నదులు, కాలువలపై చెక్‌డ్యాంలు నిర్మించడం వల్ల నీరు భూమిలోకి ఇంకుతుంది. ఇది భూగర్భజలాలు పెరగడానికి ఉపయోగపడుతుంది. ఇది గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయం కోసమే కాకుండా తాగునీరు అవసరాలను కూడా తీర్చడానికి ఉపయోగపడుతుంది. వీటి నిర్మాణానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకొని శాశ్వతంగా ఉండేలా పనులు చేపట్టాలని నేను సలహా ఇస్తున్నాను.

మా రాష్ట్రానికి వెంటనే కేంద్ర బృందాన్ని పంపించాల్సిందిగా గౌరవ మంత్రివర్యులు ముళ్లపల్లి రామచంద్రన్ (1992-93 సీజన్‌లో జనపనార మద్దతు ధరను ప్రకటిస్తూ మంత్రి చేసిన 743 స్టేట్‌మెంట్)ను కోరుతున్నాను. ఇప్పటివరకు కేంద్ర బృందం ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించలేదు. ప్రభుత్వం వందలకోట్ల రూపాయల వ్యయంతో అనంతపూర్‌లో ఒక పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి భారీ హామీలిచ్చారు.

కాని ఇప్పటివరకు నిధులేవీ మంజూరు కాలేదు. రాష్ట్రంలోని కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులకు సహాయం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వానికి సహాయం చేసేందుకు ఒక కేంద్ర బృందాన్ని ఆంధ్రప్రదేశ్‌కు పంపించాల్సిందిగా నేను అభ్యర్థిస్తున్నాను. □

# సామ్యవాద సిద్ధాంతాలకు అంకితమైన గోరే

అధ్యక్షా ప్రముఖ సామ్యవాది ఎన్.జి. గోరె మృతి పట్ల సయితం మా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నాం. తన జీవిత కాలాన్ని సామ్యవాద సిద్ధాంతాలకోసం అంకితమిచ్చి, భారతదేశంలో సామ్యవాద లక్ష్యసాధనకై గోరె నిరంతరం కృషిచేశారు. వీరి మృతి పట్ల మిత్రులతో కలసి సంతాపం వ్యక్తం చేసే అవకాశం ఇచ్చినందుకు నా ధన్యవాదాలు.

# వరదల వలన వచ్చే నష్టాలను ఎలా నివారించాలి ?

ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన వరదలు, అనంతర పరిస్థితులపై సభలో ఇప్పుడు చర్చించాల్సిన అవసరం లేదని మీరు పేర్కొన్నారు. అయినా వరద బాధిత ప్రాంతాల నుండి వచ్చిన సభ్యులు మాట్లాడాలని నిర్ణయించారు. అందుకు నా కృతజ్ఞతలు. మీ సలహా మేరకైతే ఒక రాష్ట్రంలో వేధింపులకు గురవుతున్న దళితుల సమస్యలపై ఇతర రాష్ట్రాల సభ్యులు ప్రశ్నలు లేవనెత్తే హక్కు లేనట్లుగా ఉంది.

స్పీకర్ : ఎవరు మాట్లాడాలో, ఎవరు మాట్లాడకూడదో సభాధ్యక్షునిగా నేను నిర్ణయిస్తాను.

వడ్డే : నేను కూడా స్పష్టంగా చెబుతున్నది ఈ విషయాన్నే. ఈ సభ యావత్ దేశానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. దేశంలో ఎక్కడ, ఏ సమస్య తలెత్తినా ఒక పార్లమెంటు సభ్యునిగా వారు తమ గళాన్ని వినిపించవచ్చు. సదరు సభ్యులు అందజేసే విలువైన సూచనల్ని మనం చర్చించే అవకాశమూ కలుగుతుంది.

నాకీ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. వరద ప్రాంతాల సభ్యులు పేర్కొన్న విషయాల్నే నేను పునరావృతం చేయదల్చుకోలేదు. వరదలవల్ల నిరాశ్రయులైన వారి కోసం ముమ్మరంగా సహాయ కార్యక్రమాలను చేపట్టిన ప్రజలు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు నా అభినందనలు. వరదల మూలంగా దెబ్బతిన్న ఆయా రాష్ట్రాల ఆస్తినష్టం అంచనాలకనుగుణంగా కేంద్రం విపత్తునిధి నుంచి సాయం

చేయాలి. వరదలు కలిగిస్తున్న నష్టాల్ని ఎలా నివారించాలనే దానిపై సభ్యులు చర్చించకపోవడం చాలా విచారకరం.

తుఫానులు, వరదల వల్ల ఎదురయ్యే కష్టనష్టాలు ఏయేటికాయేట విస్తరిస్తున్నాయి. గత కొంతకాలంగా వీటి మూలంగా సుమారు రెండువేల కోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లింది. వాటిని (వరదలను) అరికట్టే చర్యల మీదకంటే పునరావాస కార్యక్రమాల మీదే మనం ఎక్కువ మొత్తాల్ని వ్యయం చేయడం గమనించాల్సిన అంశం.

1978-79లో వరదలను అరికట్టడానికి రూ. 170 కోట్లను వెచ్చిస్తే, పునరావాస చర్యల కోసం రూ. 350 కోట్లను ఖర్చుచేశాము. అలాగే 1980-81లో వరదల నియంత్రణకు రూ. 165 కోట్లు వ్యయంకాగా, పునరావాస చర్యల మీద 230 కోట్లు వ్యయం చేశాము. దీనిని బట్టి ప్రభుత్వంపై అంశాలను పరిగణనలోకి తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని నా అభిప్రాయం.

ఇప్పటికీ వరదల నియంత్రణ రాష్ట్రాలకు సంబంధించిన విషయం. ఇంతటి బృహత్ కార్యక్రమాలను చేపట్టడానికి తగినన్ని ఆర్థిక వనరులు రాష్ట్రాలవద్ద లేవు. ఇది కేంద్రం నిర్వర్తించాల్సిన బాధ్యత. కాబట్టి వరదలు వెల్లువెత్తిన రాష్ట్రాల్లో కేంద్రం సాయం అందించవలసిందిగా కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి బలరామ్ జక్కర్‌ను కోరుతున్నాను.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ సమస్యపై పోరుసల్పాలి. ప్రతియేటా ముంచెత్తుతున్న వరదలను అడ్డుకట్టవేయడానికి వ్యవసాయశాఖ, అటవీ, పర్యావరణ శాఖ, కేంద్ర జలవనరుల శాఖలు కలిసికట్టుగా నడుంబిగించాలి. ఈ విషయమై మంత్రి అటవీశాఖ అధికారులతో సంప్రదించి అటవీ పరిరక్షణ చట్టంలో తగుమార్పులు చేయాలి.

హరించుకుపోతున్న అటవీ భూముల్లో పళ్ళచెట్లను పెంచాల్సిందిగా ప్రజలను ప్రోత్సహించాలి. వాటి ద్వారా వచ్చే ఫలసాయాన్ని ప్రజలకే అందజేద్దాం. దీనివల్ల ఒకే సమయంలో రెండులాభాలు ఒనగూడుతాయి. గత కొద్ది సంవత్సరాలుగా నదుల్లో కలిసి కొట్టుకుపోతున్న మట్టి సుమారు 600 కోట్ల టన్నులుండవచ్చని అంచనా. ఒక అంగుళం భూమి ఏర్పడడానికి 500 నుంచి 1000 సంవత్సరాలు పడుతుందని అంచనా. ఇంతటి విలువైన భూమిని మనం కోల్పోతున్నాం. దీనినరికట్టడానికి వాటర్‌షెడ్ పథకాల అవసరం ఎంతైనా ఉంది.


వరద బాధితులకు ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద కేంద్రం గృహాల్ని నిర్మించి ఇవ్వాలి. పేద ప్రజలకు ఆస్తులేమైనా ఉంటే అవి వరదల్లో తుడిచి పెట్టుకుపోయాయి. □



# సామాజిక రంగం



భాను ప్రతాప్ సింగ్ తో వడ్డే



ప్రజల ఎదురు తెన్నులు-పాలకుల తీరుతెన్నులు
గ్రంథ ఆవిష్కరణ సభలో రామోజీరావుతో  వడ్డే

# సామాజిక అసమానతలను తగ్గించాలి

నేను మాట్లాడడానికి అవకాశమిచ్చిన స్పీకర్‌కు ధన్యవాదాలు. ఈ బిల్లును ప్రవేశపెట్టి దానిపై చర్చకు అనుమతించిన శ్రీ చిత్తబసుకు కృతజ్ఞతలు. వివిధ మంత్రిత్వ శాఖల గురించి చర్చించే అవకాశం మాకు అనేక సార్లు వచ్చింది. కానీ దేశాభివృద్ధికి కీలక పాత్ర వహించే ప్రణాళికల గురించి చర్చించడానికి చాలా అరుదుగా అవకాశ మొచ్చింది. జాతీయాభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘాలు దేశ మౌళిక సమస్యలను తీర్చలేక పోయాయని ఆయనన్నది నిజమే. దేశం కొంత పురోగతి సాధించినా, మనం ప్రారంభించిన మార్గాన్నే అనుసరిస్తున్న అనేక ఇతర దేశాలు సాధించినంత అభివృద్ధిని సాధించలేక పోయాం.

జాతీయాభివృద్ధి మండలి (ఎన్.డి.సి.), ప్రణాళికా సంఘాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలనే సూచన సమర్ధనీయం. నేను మరొక అంశాన్ని కూడా సూచించదల్చుకొన్నాను. ప్రస్తుతం ప్రణాళికా సంఘం చేసిన ప్రతిపాదనలను ఆమోదించడానికే ఎన్.డి.సి. సమావేశమవుతుంది. అలాకాక అది తరుచుగా సమావేశమై, వివిధ అంశాలపై కూడా చర్చించాలి.

చైనాలో కూడా సోవియట్ రష్యా తరహాలోనే ప్రణాళికల ద్వారా అభివృద్ధి మార్గాన్ని అనుసరించారు. మూలధన సాంద్రత కలిగిన, భారీ పరిశ్రమలకు వారు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. కానీ కరవు రూపంలో చైనా కొన్ని అడ్డంకుల్ని, సమస్యల్ని ఎదుర్కోవలసి వచ్చింది. పరిస్థితిని అర్థంచేసుకున్న మావో-సే-టుంగ్ ఆధ్వర్యంలో చైనా తన ప్రాధాన్యాన్ని మార్చుకొంది. వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం, చిన్న మద్యతరహ పరిశ్రమలకు రెండో ప్రాధాన్యమిచ్చి, తరువాత ప్రాధాన్యాన్ని భారీ పరిశ్రమలకిచ్చారు. జాతిపిత మహాత్మగాంధీ కూడా అదే చెప్పారు. గ్రామీణ భారతం అభివృద్ధి చెందకపోతే దేశాభివృద్ధి సాధ్యంకాదు. మన దేశానికే కాదు. యావత్ ప్రపంచానికి స్వయం ఉపాధి ప్రాముఖ్యాన్ని చెప్పాడు. గాంధీజీ సిద్ధాంతాలే ప్రస్తుత ప్రపంచానికి సరిపోతాయని గొప్ప గొప్ప ఆర్థిక వేత్తలకు కూడా చెప్తున్నారు. అయితే అధికారం చేపట్టి దేశాన్ని వృద్ధి చేయాల్సిన బాధ్యత కలిగిన జవహర్‌లాల్ నెహ్రూ మరొక మార్గాన్ని అనుసరించారు. దీనివల్లే మనం ప్రస్తుతం అనేక క్లిష్ట సమస్యలను ఎదుర్కొంటున్నాం.

స్వాతంత్ర్యం వచ్చిన 44 సంవత్సరాల తరువాత కూడా ఎంప్లాయ్‌మెంటు ఎక్చేంజీలలో నమోదు చేయించుకొన్న నిరుద్యోగుల సంఖ్య 37 మిలియన్లు ఉంది.

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిరుద్యోగులు 40 లక్షల మంది ఉన్నారు. మనం స్వయం సమృద్ధి సాధించామని చెప్పుకోవచ్చు. జనాభాలో పేదరిక రేఖ దిగువనున్న 20% మంది ప్రజలకు తగినంత కొనుగోలు సామర్థ్యం లేదు. మనకు మిగులు ఆహారధాన్యాలు ఉన్నాయని చేపుతాం. కానీ వారందరికీ వాటిని కొనుగోలు చేయగల ఆర్థిక సామర్థ్యం ఉంటే అవి దేశీయ అవసరాలకే సరిపోవు.

ఇన్ని ప్రణాళికల తర్వాత కూడా 48% మంది నిరక్షరాస్యులున్నారు. 52% మాత్రమే అక్షరాస్యులు. గ్రామాలకి తాగునీటి సదుపాయ కల్పనకు రాజీవ్ టెక్నాలజీ మిషన్‌ను ఇప్పుడు ప్రారంభించారు. ఇప్పటికీ 1,40,000 గ్రామాలకు విద్యుత్ సౌకర్యంలేదు. 1000-1500ల మధ్య జనాభాగల గ్రామాల్లో 30% గ్రామాలకు మట్టిరోడ్డు సౌకర్యం కూడాలేదు. 1500ల జనభా మించి ఉన్న గ్రామాల్లో 13% గ్రామాలకి రోడ్డు సౌకర్యంలేదు. రహదారి సౌకర్యం ఉంటేనే అభివృద్ధి ప్రక్రియ ముందుకుసాగుతుంది. అదే లేకపోతే అభివృద్ధి ప్రక్రియ కూడా ఆగిపోతుంది.

ఐనప్పటికీ ప్రస్తుత పరిస్థితి మాత్రం ఇలాగే ఉంది. గృహ సౌకర్యం విషయానికొస్తే, 23 మిలియన్ల గృహాలు ప్రస్తుతం అవసరం. ఈ శతాబ్దాంతానికి ఈ సంఖ్య 63 మిలియన్లు. మనం సామ్యవాద ఆర్థిక వ్యవస్థను అవలంభిస్తున్నాం.

అయినప్పటికీ 1951 లో 116 కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన టాటాలు 1989-90 నాటికి రూ. 8530 కోట్లు ఆస్తులు కలిగిఉన్నారు. బిర్లాలు 8400 కోట్ల రూపాయలు కలిగి ఉన్నారు. ప్రస్తుతం అది 10,000 కోట్లు దాటి ఉండవచ్చు. కేవలం 10 సంవత్సరాలలో అంబానీలు 3600 కోట్ల రూ॥లు కూడబెట్టారు. మనం సామ్యవాద పద్ధతిని అనుసరించినప్పటికీ అంతరాలు ఇలా పెరిగి పోయాయి. అట్టడుగునున్న 20% మంది ప్రజల మొత్తం ఆస్తులు కేవలం 20 కుటుంబాలు కలిగి ఉన్న ఆస్తులకు కూడా సమానంగా లేవు. కాబట్టి మనం పునరాలోచించాలి? ప్రస్తుతం మనం 8వ పంచవర్ష ప్రణాళికను అమలు చేస్తున్నాం. కనీసం ఇప్పుడైనా ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలి.

మనం ఎక్కడ తప్పుచేసాం? సర్కారియా కమీషన్ స్పష్టమైన సూచనలు చేసింది. వాటిని అమలు పరచాలి. కేవలం మీరు చెప్పినట్లు వినే వ్యక్తినే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చేయడం వద్దు. ప్రసిద్ధ ఆర్థిక వేత్తకు ఆ పదవి ఇవ్వండి. రాజకీయ పునారావాసం కల్పించడానికోసం కాక ప్రభుత్వం ఒక మంచి వ్యక్తిని నియమించిందని ప్రజలు భావిస్తారు. నేను కాంగ్రెస్ పార్టీని మాత్రమే విమర్శించడం లేదు. ప్రతిపక్షం అధికారంలో ఉన్నప్పుడు వారు కూడా సర్కారియా కమిషన్ సిఫారసుల్ని అమలు పరచలేదు. ప్రస్తుతమున్న ప్రణాళికా ప్రక్రియ ప్రయోజనకరమేనా లేదా మార్పులేమైనా అవసరమా అనే అంశంపై మీరు జాతీయస్థాయి చర్చ. ప్రారంభించాలి. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీ సూచనాత్మక ప్రణాళిక గురించి చెప్పారు. మనం ఎక్కడ తప్పుచేసామనే విషయంపై ప్రజల్లో చర్చ జరిగేలాచూడాలి. ప్రజల మౌలిక అవసరాలు తీర్చడానికి అనుసరించాల్సిన మార్గం గురించి కూడా చర్చించనివ్వండి. ప్రజలు వారి అవసరాలు తీరడం కోసం దశాబ్దాల తరబడి వేచిచూడలేరు. ఇప్పటికే జమ్ముకాశ్మీర్, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో సామజిక అసమానతలు, నిరుద్యోగులవల్ల తీవ్రవాదం ప్రబలి సంక్షోభం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాల్లో నక్సలైట్లు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఏదైనా తప్పుజరిగితే అనవసరపు ప్రతిష్టకు పోకుండా దాన్ని అంగీకరించాలి. గోర్బచేవ్ రష్యా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పెరిస్త్రోయికా, గ్లాస్తనోస్త్ ప్రారంభించారు. ఆయన చేసిన తప్పులను కూడా వెల్లడించారు. కాబట్టి ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి ఉన్నట్లయితే చేసిన తప్పులను ఒప్పుకొని, ఈ దేశప్రజలను సరైన దిశలో ముందుకు నడిపించాలి.

□

# ఖనిజ సంపదను సద్వినియోగ పరచుకొందాం

నేను పూర్తి వివరాల్లోకి వెళ్లను. ఈ బిల్లుకు మా పూర్తి మద్దతు తెలుపుతున్నాము. అయితే బిల్లును ప్రవేశపెట్టి వదిలేయకూడదు. ఖనిజ వనరులు అత్యధికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక ఆదాయం వచ్చేలా నిర్దిష్టమైన చర్యలు చేపట్టండి. తద్వారా అభివృద్ధి పథకాలు, ఇతర కార్యక్రమాలు భారీ ఎత్తున చేపట్టే అవకాశం రాష్ట్ర ప్రభుత్వాలకు కలుగుతుంది. దురదృష్టవశాత్తు, ఖనిజ సంపద పెద్ద సంఖ్యలో ఉన్నా ఆయా రాష్ట్రాలు ఆర్థికంగా వెనుకబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

బీహారులో ఖనిజ సంపద అధికంగా ఉంది. అక్కడ పేదరికమే కాకుండా దారిద్ర్యం కూడ నెలకొంది. రెండవ స్థానంలో మధ్యప్రదేశ్ ఉన్నా అంతగా అభివృద్ధి చెందలేదు. ఒరిస్సా, ఇతర రాష్ట్రాల పరిస్థితి సరేసరి.

గౌరవ మంత్రిగారికి నా విన్నపం ఏమిటంటే - ఈ విషయంలో ఒక నిర్దిష్టమైన ప్రతిపాదనలను ఏర్పాటు చేయండి. రాయల్టీ పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక ఆదాయం వచ్చేలా చూడండి. ప్రభుత్వానికి నా అభ్యర్థన ఏమిటంటే - మనం

జపాన్‌కు అధిక మొత్తంలో ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేస్తున్నాము. అలాగే, మ్యాంగనీసు, ఇతర ఖనిజాలను ఎగుమతి చేస్తున్నాము. (358 ఖనిజాలపై సెస్సు, ఇతర పన్నులు విధిస్తున్నాము.) నష్టం కలిగించే ధరకు వీటిని ఎగుమతి చేయడం కంటే మీరు 'జాయింట్ వెంచర్ల'ను (ఉమ్మడి వ్యాపారం) ఎందుకు ఆహ్వానించరు? ఓఎన్‌జీసీ విషయంలో, ఒక రోజు ఆర్థిక మంత్రి "వాతావరణంలోకి సహజ వాయువుని వ్యర్థంగా వదిలేయడం కంటే, విదేశీ సంస్థలను ఆహ్వానించి సహజ వాయువు నిక్షేపాలను పూర్తిగా వినియోగించుకోవడం మంచిద"ని అన్నారు. అలాగే మనం కూడా విదేశీ సంస్థలతో జాయింట్ వెంచర్లను ఏర్పాటు చేసి వారి సహకారంతో ఖనిజ సంపదను పూర్తిస్థాయిలో వెలికి తీస్తే ఆయారాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. అయ్యా, మనకున్న ఆధునిక పరిజ్ఞానంతో వాటిని అతి తక్కువ ఖర్చుతోనే వెలికి తీయవచ్చు. ఫలితంగా తక్కువ వ్యయంతో వస్తువు రూపొందడమే కాకుండా ఎగుమతి చేయడానికి కూడ వీలవుతుంది. పాణిగ్రహి గురు తమ రాష్ట్రం గురించి చెప్పారు. అలాంటి పరిస్థితే మిగతా రాష్ట్రాలది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బైరైటీస్‌లను వెలకితీయటానికి ఇదే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. గ్రానైట్లు లైసెన్సు ఇవ్వడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. అరుదైన, విలువైన సంపదను సక్రమంగా వినియోగించుకుంటే సమాజంతోపాటు రాష్ట్రం కూడ అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం కొంతమంది వ్యక్తులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వలన వారు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. వారు నామమాత్రంగా లాభపడితే పర్వాలేదు. కానీ, అనుకున్న దానికంటే ఎక్కువ స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నారు.

ఒక పరిమితి ప్రాంతంలో లభ్యమయ్యే ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలనేదే నేను చెప్పాలనుకునే చివరి అంశం. ఆ ప్రాంతంలో నివసించే ప్రజల జీవనస్థాయి మెరుగుపడాలి. అయ్యా, బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా తెగల ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారన్న సంగతి మనకు తెలిసిందే. వాటి గురించి నేను ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆ సంపద ద్వారా ప్రజలు లబ్ధి పొందడంలేదు. కనుక ఈ పేద ప్రజలను అభివృద్ధిపర్చడానికి ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని నేను కోరుతున్నాను. □

# చిన్న పరిశ్రమలను దెబ్బతీయవద్దు మహాత్ముని మరచిపోవద్దు

ఈ అవకాశాన్ని కల్పించిన ఛైర్మన్‌కి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. చిన్నతరహా పరిశ్రమల రంగానికి సంబంధించినంతవరకు వడ్డీరేట్లకు, ఇతర విషయాలకు సంబంధించిన అంశాలతో కూడిన బిల్లును తీసుకురావటానికి మనం దృష్టి సారిస్తూ ఉన్నాం. ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించడంతోపాటు, సేవలరంగంలో కూడా చిన్నతరహా పరిశ్రమల రంగానికున్న ప్రాధాన్యత కాదనలేనిది. ఇలాంటి బిల్లును తీసుకురావటం హర్షణీయం. పెద్ద పారిశ్రామిక వేత్తలపై ఒత్తిడి తీసుకువచ్చి చెల్లింపులను వసూలు చేయటం ద్వారా చిన్న పరిశ్రమల రంగాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఈ బిల్లులో కొన్ని లోపాలు లేకపోలేదు. ప్రస్తుతం కేవలం 5 శాతం ఫ్లోరేట్ మాత్రమే పరిగణలో ఉంది. బిల్లులోని క్లాజ్ 4లో ఇలా పేర్కొనలేదని నేననుకుంటున్నాను. ఈ 5 శాతం ఫ్లోరేట్ పెద్ద పారిశ్రామికవేత్తల పట్ల ఒకింత వరంగానే పరిణమించింది. వీరు చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో చెల్లించడం లేదు. సాధారణబ్యాంకు పరపతిరేటు కంటే ఈ 5 శాతం తక్కువే. అందువల్ల పెద్ద పారిశ్రామిక వేత్త ప్రయోజనం పొందుతున్నాడు. దీనిని 8 నుంచి 9

శాతం వరకూ పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పెద్ద పారిశ్రామికవేత్త పరపతి విషయంలో 75 శాతం డిపాజిట్ చేయాలన్న క్లాజ్ - 7లోని అంశాలతో నేనంగీకరిస్తాను. ఇది ఆశావహపరిణామం. ఆలస్యపు చెల్లింపులపై వడ్డీని ఆదాయపుపన్ను నుంచి మినహాయిస్తున్న తొమ్మిదవ క్లాజులో పేర్కొన్నారు. ఈ విషయంలో ఆ శాఖా మంత్రి అభినందనీయులు. ఈ బిల్లు ఒక్కటే చిన్నతరహా పరిశ్రమల రంగం సమస్యలను పరిష్కరించబోదని ఇంతకు ముందే మాట్లాడినవారు అభిప్రాయపడ్డారు. చిన్నతరహా పరిశ్రమల రంగం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవటంలో ఎంతో ఆసక్తి కనబరుస్తున్న అరుణాచలంను అభినందిస్తున్నాను. అయితే ప్రభుత్వం చెబుతున్న దానికీ, చేస్తున్నదానికీ చాలా వ్యత్యాసముందనేది గమనించాలి. సంవత్సరం క్రితం ప్రధానమంత్రి స్పష్టంగా చెప్పిన అంశాలను పరిశీలిస్తే ఇన్స్పెక్టర్ రాజ్ ఉదంతం మనకు గుర్తుకు వస్తుంది. చిన్నతరహా పరిశ్రమల వ్యవస్థాపకుడిని వేధింపులకు గురిచేయకూడదని ఇన్స్పెక్టర్ విషయంలో స్పష్టపరిచారు. ప్రధాని మాటల్లో వాస్తవం లేదనే దానికి అనేక ఉదాహరణలున్నాయి. ఇప్పటికీ చాలామంది ఇన్స్పెక్టర్లు తరచూ చిన్నతరహా పరిశ్రమలను సందర్శించి వ్యవస్థాపకులను నానా వేధింపులకు గురిచేస్తున్నారు. కేంద్రస్థాయిలో ప్రభుత్వం తీసుకున్న ఆశావహ నిర్ణయాలను, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయటంలో విఫలమవుతున్నాయి. జిల్లా పాలనాయంత్రాంగం కూడా ఈ విషయంలో విఫలమవుతోంది. ఒక వ్యవస్థాపకుడు ఒక యూనిట్ను ప్రారంభించాలనుకుంటే, అతను 16 శాఖలనుంచి అనుమతి పొందాల్సి ఉంది. ఇది జాప్యానికి దారితీస్తోంది. ఒక అంశాన్ని పరిశీలించిన తర్వాత మరోదానిపై దృష్టి సారిస్తుండటంవల్ల చాలా సమయం పడుతుంది. లిబరలైజేషన్ పేరుతో కేంద్రస్థాయిలో తీసుకుంటున్న నిర్ణయాలు, జిల్లాస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వటంలేదు. చర్యలు మాత్రం ఇదివరకటిలాగే చేపడుతుండటం గమనార్హం. ఇప్పటికీ ప్రాథమిక స్థాయిలో డీరెగ్యులేషన్ జరగలేదు. పారిశ్రామికాభివృద్ధి ప్రక్రియలో పాలనా యంత్రాంగం ఇప్పటికీ ఉక్కిరిబిక్కిరవుతూనే ఉంది.

ప్రభుత్వం ఈ బిల్లును సభముందుకు తీసుకు వచ్చేందుకు చేసిన ప్రయత్నాలను నేను స్వాగతించి ఉన్నాను.

మన జాతీయోత్పత్తి (జి.డి.పి.)లో సుమారుగా లక్షా అరవై వేల కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తులు సన్న, చిన్నతరహా పరిశ్రమల రంగం నుండే వస్తున్నవి. కానీ ప్రభుత్వం మాత్రం ఈ రంగాలకు ఎటువంటి సౌకర్యాలు సదుపాయాలు కల్పించడంలేదు. మూలధన పరిమితి పెంచి, తగిన రుణసదుపాయం ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదని నేను ప్రశ్నిస్తున్నాను.

మూలధనం కొరత ఉన్నప్పటికీ జి.డి.పి.లో నలభై శాతానికిపైగా ఈ చిన్నతరహా రంగమే ఉత్పత్తి చేస్తోంది. అయితే ప్రభుత్వం ఈ రంగానికి ఏ మాత్రం మూలధనాన్ని సమకూరుస్తోంది? కేవలం రూ. 20 వేలు కోట్లు మాత్రమే. అదే భారీ తరహా రంగానికి కేవలం నిర్వహణా వ్యయం కిందే రూ. 58 వేల కోట్లు, నిర్దిష్ట కాలపరిమితిలో రుణసదుపాయం కల్పిస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత మంత్రి కూడా ఈ వాస్తవాలను అంగీకరించారు. ఈ వాస్తవాలను గుర్తించి కూడా చిన్నతరహా రంగంపట్ల ప్రభుత్వం ఎందుకని సవతి తల్లి ప్రేమను చూపిస్తోంది?

భారీ తరహా పరిశ్రమల రంగంలో ఏం జరుగుతోందో ఒకసారి పరిశీలించండి. ఆ రంగానికి సమకూరుస్తున్న మూలధనంలో 90 శాతానికిపైగా చిన్న మొత్తాల మదుపు దారుల నుండీ సమకూరుతోంది. కానీ విచిత్రంగా కొద్ది శాతం మంది మాత్రమే ఈ భారీతరహా రంగాన్ని నియంత్రిస్తున్నారు. ఆర్థిక సాయం పొందడంలో వారికి పరస్పర సహకారం, మార్కెట్ నుంచి నిధులు అందుతున్నాయి. చిన్నతరహా పరిశ్రమల రంగానికి ఇటువంటి సదుపాయం లభించడం లేదు. మూలధనాన్ని సమకూర్చుకోలేక ఈ రంగం అవస్థలు పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి వాస్తవాలు గుర్తించాలి. చిన్నతరహా రంగంపట్ల తన విధానాలను మార్చుకోవాలి. రిజర్వ్ బ్యాంకుకు, ఆర్థిక సాయం అందించే ఇతర ఆర్థిక సంస్థలకు, చిన్నతరహా పరిశ్రమల రంగానికి మరింతగా రుణసదుపాయం అందించేలా విస్పష్టంగా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి.

చిన్నతరహా పరిశ్రమల రంగంపై ప్రభుత్వం విధించిన మూలధన పరిమితిని తొలగించాలి. యం.ఆర్.టి.పి. ఆక్ట్'' (గుత్తాధిపత్య నిరోధక చట్టం) కింద ఇంతకు మునుపు విధించిన 100 కోట్ల మూలధన పరిమితిని తొలగించి ప్రభుత్వం భారీతరహా పరిశ్రమల అభివృద్ధికి చేయూత నందించింది. ప్రస్తుతం 200 కోట్లు, 300 కోట్లు అని పరిమితి లేకుండా ఎంత మొత్తమైనా సరే అని యం.ఆర్.టి.పి. చట్టాన్ని సవరించింది. ఇదే సూత్రాన్ని చిన్న తరహా పరిశ్రమల రంగానికి వర్తింపజేయాలి. కనీసం 2 లక్షల నుంచి 10 లక్షల వరకూ మూలధన పరిమితిని పెంచాలి. నేడు ఉక్కు, ఇనుము, ఇతర ఫెర్రోఅల్లామ్స్‌ల ధరలు ఎలా ఉన్నాయో ప్రభుత్వం గమనించాలి. చిన్నతరహా పరిశ్రమల రంగాన్ని ప్రోత్సహించాలన్న చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం వెంటనే ఈ రంగంపై ఉన్న మూలధన పరిమితిని తొలగించాలి. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి) చిన్న తరహా పరిశ్రమల రంగానికి అందించే రుణ మొత్తాన్ని పెంచాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. నిధులు పుష్కలంగా ఉంటేనే చిన్నతరహా పరిశ్రమల రంగం నిలదొక్కుకుంటుంది.

చిన్నతరహా పరిశ్రమల రంగం సమస్యలను పరిశీలించి తగు సూచనలు,

సిఫార్సులు చేసేందుకు వీలుగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. చిన్న తరహా పరిశ్రమల గురించి మహాత్ముడు కన్నకలలు మనకు తెలుసు. ప్రస్తుత పరిస్థితుల్లో మహాత్ముని భావాలు అనుసరణీయం కాదని చాలా మంది వాదిస్తారు. శతాబ్దాలు గడచినా మహాత్ముని భావలే మిన్న అని నేను ఖచ్చితంగా చెప్పగలను. నేడు మనదేశంలో సుమారు 371 లక్షల మంది నిరుద్యోగులుగా నమోదు అయి ఉన్నారని ఉపాధికల్పనా కేంద్రాలలోని వివరాలను బట్టి తెలుస్తోంది. వీరందరూ ఏదో ఒక ఉపాధికోసం ఎదురుచూస్తున్నవారే. ఉపాధి అవకాశాలు కరువవుతున్న ప్రస్తుత తరుణంలో చిన్నతరహా పరిశ్రమల రంగమే వీరికి ఉపాధి కల్పించి ఆదుకోగలదు. ఇప్పటికే పలు సమస్యలతో కునారిల్లుతున్న దేశానికి నిరుద్యోగం మరో సామాజిక సమస్యగా మారకుండా నిరోధించగలదు. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి గురించి మహాత్ముడు కన్నకలలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలి. చిన్నతరహా పరిశ్రమల సమస్యలు గుర్తించి, సిపార్సులు, సూచనలు చేసేందుకు సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయగలదని విశ్వసిస్తున్నాను. ఈ అంశంపై నా వాదనను వినిపించేందుకు అవకాశం ఇచ్చిన సభా అధ్యక్షునికి కృతజ్ఞతను తెలుపుకొంటున్నాను.

□

# సంక్షోభం నుండి బయట వేయాలి

ఇటుకలు తయారుచేయడానికి బూడిదను ఫ్లై యాష్)ను ఉచితంగా సరఫరా చేయాలని అన్ని థర్మల్ విద్యుత్ కేంంద్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. కానీ, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యుత్ బోర్డులు ఈ సూచనలను పాటించడం లేదు. ఈ బూడిదను ఇటుకల తయారీలదారులకు అందుబాటులో ఉంచడం ఎంతో అవసరం. దీనివల్ల విలువైన అటవీ సంపదను కాపాడవచ్చు. ప్రభుత్వం దీనికోసం కట్టుబడి పనిచేయాలి. దివాళతీసిన సంస్థలను కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. వీటి ఆధ్వర్యంలోని విలువైన భూములను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేస్తున్నారు.

ఈ భూములను బహిరంగంగా అమ్మడం ద్వారా పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తుందని భావిస్తున్నారు. ఈ సంస్థలను సంక్షోభం నుంచి బయటపడేయడానికి వచ్చిన ఆదాయాన్ని ఉపయోగించవచ్చు. □

# స్థానిక సంస్థలను బలోపేతం చేద్దాం

అధ్యక్షా ! 72, 73వ రాజ్యాంగ సవరణల బిల్లులను నేను బలపరుస్తున్నాను. నేను కొన్ని సూచనలు ఇవ్వాలనుకుంటున్నాను. పంచాయితీలు, మున్సిపాలిటీల లాగా స్థానిక ప్రభుత్వాల కాలపరిమితి అయిదు సంవత్సరాలు చేయాలనే నిబంధనని అంగీకరిస్తున్నాను. ఇది చాలా అవసరం.

శరద్ థిగే చెప్పినట్లుగా 1959లో ప్రారంభించిన పంచాయితీల పనితీరు అసమర్థంగా మారడానికి ముఖ్యకారణం వాటిపై ప్రభుత్వాలు పెత్తనం చెలాయించడం, చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ఎన్నికలు నిర్వహించక పోవడం. అందువల్ల అయిదేళ్ళ కాలపరిమితి విధించడం చాలా అవసరం. ఇది ఆహ్వానించదగింది. కానీ, ఏ కారణం వల్లనైనా కాలపరిమితికి ముందు ఎన్నికలు జరగకపోయినా ఆరేళ్ళ ముందు ఎన్నికలు జరిగినా ఎన్నికైన పాలక మండళ్ళను అదేవిధంగా కొనసాగించాలి. ప్రభుత్వం నియమించిన అధికారులు స్థానిక ప్రభుత్వాల అధికారాలను తొలగించరాదని నా సూచన.

మూడంచెల విధానాన్ని అమలు చేసేందుకు నేను కూడా సమ్మతి తెలియజేస్తున్నాను.

ఈ విధానం చాలా రాష్ట్రాల్లో ఉంది. కొన్ని రాష్ట్రాల్లో మూడు అంచెలూ బలంగా పనిచేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షునిగా ఉన్న పంచాయితీ సమితి

జిల్లా పరిషరీత్ కంటే బలంగా పని చేస్తోంది. మూడంచెల విధానాన్ని మేము సమ్మతిస్తున్నాం.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బిల్లులో ఉన్న వివాదాస్పద అంశాలు ఎందుకో నాకు బోధ పడడం లేదు. ''గ్రామస్థాయిలోని పంచాయితీల్లోని అన్ని స్థానాల్లోనూ, సమితి వ్యవస్థఉన్న చోట్ల ప్రత్యక్ష ఎన్నికల ద్వారా సభ్యులను ఎన్నుకోవాలని ఒకచోట ఉంది.

''జిల్లాస్థాయి సంస్థల అధ్యక్షుడికి విధానసభలకు జరిగినట్లుగా ఎన్నికలు జరపాలి. గ్రామస్థాయిలోని పంచాయతీలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. అని మూడో పేజిలో మరోచోట ఉంది.

దీనిపై పునరాలోచించాలి. ప్రత్యక్ష ఎన్నికలే మంచివని మా అనుభవంలో గ్రహించాం. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ వార్డు మెంబర్లకు, సర్పంచులకు, మండల ప్రజాపరిషత్‌లకు, జిల్లాపరిషత్‌లకు, గ్రామసర్పంచ్‌లో, మండల పరిషత్‌లో సభ్యులు ప్రత్యక్షంగా ఎన్నికలు జరుగుతాయి.

ఉపాధ్యక్షా ! స్థానిక స్వపరిపాలన సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల వల్ల కలిగే లాభాలను మొన్న వివరించాను. సభ్యుల దయాదాక్షిణ్యాల వల్ల గాక, ప్రత్యక్షంగా అధ్యక్షులు ఎన్నికకావడం వల్లనే అవి ఇంకా కొనసాగుతున్నాయి. వివిధ స్థాయిల్లోని సంస్థల్లో అధ్యక్షులు తమ సభ్యులు, అధికారుల పట్ల గౌరవాన్ని, ఆజమాయిషీని ప్రదర్శిస్తున్నారు. వారి మధ్య సమన్వయం, సహకారం ఉంటాయి.

ప్రధాన బిల్లు కూడా రెండంచెల వరకూ ప్రత్యక్ష ఎన్నికలు ఉండాలని ప్రతిపాదించింది. కానీ, గ్రామస్థాయి తర్వాత పరోక్ష ఎన్నికలు ఉండాలని సెలెక్ట్ కమిటీ రిపోర్టు ప్రతిపాదించింది.

సెలెక్ట్ కమిటీ అభిప్రాయాలు కూడ విరుద్ధంగా ఉన్నాయి.

''పంచాయితీ రాజ్ సంస్థల్లో ప్రత్యక్ష లేదా పరోక్ష ఎన్నికలు కీలకమైనవని కమిటీ పేర్కొంది''. ఈ నిజాన్ని కమిటి గుర్తించింది.

''ప్రజలచేత ప్రత్యక్షంగా ఎన్నికైన వారు సహజంగానే ఆధిపత్యం కలిగి ఉంటారు. పరోక్ష ఎన్నికల్లో అక్రమ పద్ధతులకు అవకాశం ఏర్పడుతుంది. అట్టడుగు స్థాయి నుంచి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే పంచాయితీల్లో ప్రత్యక్ష ఎన్నికలు జరపాలని కమిటీ అభిప్రాయ పడింది.''

సెలెక్ట్ కమిటి ఇంతకు ముందు వెలిబుచ్చిన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను.

పంచాయితీ సమితి, సర్పంచ్, మున్సిపల్ చైర్మన్లకు పరోక్ష ఎన్నికల పద్ధతి అమల్లో ఉన్నప్పుడు వారిపై అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టేవారు. దాంతో బేరసారాలు జరిగేవి. తిరిగి అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేవారు. అది చివరకు మొత్తం వ్యవస్థపైనే చెడు ప్రభావాన్ని చూపించింది.

అన్ని స్థాయిల్లోనూ ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని అమలు పరచేలా ఆగస్టు సమావేశంలో ఆమోదించాలని కోరుతున్నాను.

హైదరాబాద్ మినహా విజయవాడ, విశాఖపట్నం మున్సిపల్ కార్పోరేషన్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్‌కు కాంగ్రెస్‌కు చెందిన జంధ్యాల శంకర్, విశాఖపట్నం కార్పోరేషన్‌కు డా॥ సుబ్బారావులు ఛైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. అయిదు సంవత్సరాలైనా ఎటువంటి ఆటంకం కలగలేదు. ప్రభుత్వం కూడ సహకరించింది. కాబట్టి పరోక్ష ఎన్నికల కన్నా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎక్కువ ప్రయోజనముంటుందని తెలియజేస్తున్నాను.

గ్రామస్థాయి స్వపరిపాలన సంస్థల ఛైర్మన్‌లు (సర్పంచులు) ఆపై స్థాయి సంస్థల్లో సభ్యులుగా ఉండాలి. ఈ మధ్యస్థాయి సంస్థల అధ్యక్షులు జిల్లా స్థాయి సంస్థల్లో సభ్యులుగా ఉండాలి. శాసనసభ్యుని సమక్షంలోని జిల్లాస్థాయి పంచాయితీ సంస్థలు విధానసభ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు అక్కడి పరిస్థితి ఏమిటో తెలుసుకునేందుకు తోడ్పడతాయి. జిల్లా ప్రజాపరిషత్, మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపాలిటీలు ఏ విధమైన కార్యక్రమాలు ఎలా అమలు చేస్తున్నారో తెలుసుకునేందుకూ, తమ సహకారాన్ని అందించేందుకూ తోడ్పడతాయి. దీంతో స్థానిక సంస్థలు మరింత బాగా పనిచేసేవిధంగా తయారవుతాయి.

రిజర్వేషన్ల విషయంలో గౌరవనీయులైన మంత్రిగారి ప్రతిపాదనలతో మేము ఏకీభవిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు చాలా రాష్ట్రాల్లో అమలు అవుతున్నాయి. ఈ బిల్లులోనూ దానినే ప్రతిపాదించారు. ఇది నిజంగా చాలా మంచి విషయం.

మహిళలకు మూడింట ఒక వంతు స్థానాలను కేటాయించినందుకు ప్రభుత్వానికి అభినందనలు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో చాలా రోజుల తర్వాత వారికి దక్కాల్సిన అధికారం లభించబోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్.టి. రామారావు మొట్టమొదటి సారిగా మహిళలకు 9 శాతం స్థానాలు కేటాయించారు.

మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులుగా మహిళలు రాణించారు.

శ్రీమతి ఇందిరాగాంధి భారతదేశాన్ని పాలించారు. ఇతర దేశాల ప్రజల మనసునూ గెలుచుకున్నారు. కర్నాటకలో మహిళలకు 25 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారు. ఇది ఆహ్వానించ దగింది. సరిపోయినంత మంది మహిళలు ముందుకు రాకపోతే అప్పుడు మాత్రమే వేరే వారితో ఆ స్థానాలు భర్తీ చేయాలని విన్నవిస్తున్నాను.

వెనకబడిన తరగతుల రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వదిలి వేశారు. వెనకబడిన తరగతుల విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. స్థానిక సంస్థలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీల్లో వెనకబడిన తరగతులకు 20 శాతం రిజర్వేషన్లను ఎన్.టి. రామారావు మొట్టమొదటగా ప్రవేశ పెట్టారు. కో-ఆప్షన్ పద్ధతిలో మైనార్టీలకూ స్థానాలు కేటాయించారు. స్థానిక సంస్థల అధికారాల్లో మైనార్టీలకూ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మరో సూచన రిజర్వేషన్ స్థానాల రొటేషన్ గురించి రిజర్వేషన్ల రొటేషన్‌ని కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేశారు. ఒక స్థానంలో రిజర్వేషన్ అలాగే కొనసాగకుండా ఆ స్థానాల్ని మార్చాలి. రొటేషన్ వల్ల చాలా ప్రాంతాల్లో చాలా మందికి అవకాశం లభిస్తుంది. రిజర్వేషన్ కేటగిరీ చేరని వారికి కూడా పాలనా వ్యవస్థలో స్థానం దక్కాలి.

అధికారాలు, బాధ్యతలు చాలా ముఖ్యమైన విషయం. ఈ విషయంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ అధ్యక్షులు కె.పి. సింగ్ దేవ్‌ను అభినందిస్తున్నాను. మూడు అంచెల స్థానిక సంస్థల్లో ప్రణాళికలు తయారు చేసేందుకు జిల్లా ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదించింది. పంచాయితీలు, మున్సిపాలిటీలతో సహా మొత్తం జిల్లాకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలను ప్రణాళికా సంఘం సమన్వయ పరచాలని కమిటీ సూచించింది. ఈ ప్రతిపాదనకు పూర్తి మద్దతు తెలుపుతున్నాను. ఇది చాలా రోజులుగా వాయిదా పడుతోంది. గ్రామీణ ప్రజలకు వారి విధానాల్ని వారే రూపొందించుకునే అధికారాన్ని ఇవ్వాలనే మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ఉంది. 1959లో గ్రామ పంచాయితీలు ఏర్పడ్డాయి. కొన్ని లోపాల మూలంగా ప్రజల కలలను తీర్చలేకపోయాయి. క్రమంగా తమ ప్రాముఖ్యాన్ని కోల్పోయాయి. పంచాయితీలను పరిగణించక పోవడం, నిధులలేమి, సకాలంలో ఎన్నికలు నిర్వహించక పోవడం వంటి లోపాల మూలంగా ప్రజల్లో ఉత్సాహం తగ్గిపోయింది. 72, 73వ రాజ్యాంగ సవరణ బిల్లులు స్థానిక సంస్థలను బలోపేతం చేసి వాటి గొప్పతనాన్ని, ప్రాముఖ్యాన్ని తిరిగి పాదు గొలుపుతున్నాయి. పదకొండు,

పన్నెండువ షెడ్యూళ్ళలో మీరు ప్రతిపాదించిన అంశాలు బాగున్నాయి. వాటికి మద్దతు నిస్తున్నాను.

నిధులు చాలా ముఖ్యమైన అంశం. చాలినంత నిధులు లెకపోవడం వల్ల స్వయం పరిపాలన సంస్థలు స్థానికంగా సరిగా పనిచేయలేక పోతున్నాయి. వీటికి నిధులను సమకూర్చడానికి రాష్ట్రస్థాయిలో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయవచ్చని మీరు సూచించారు.

రాజ్యంగంలోని 280వ ఆర్టికల్ కింద కేంద్ర ఆర్థిక సంఘం ఏర్పాటైంది. ఈ సంఘమే నిధుల విషయాన్ని పరిశీలించాలి. స్థానిక సంస్థలకు నియమానుసారంగా ఎన్నికలు నిర్వహిస్తే చట్టబద్దమైన విధులు అప్పగిస్తున్నాం. అలాగే అధికారాలు కూడా ఇస్తున్నాం. ప్రజలకు సరిగా సేవలందించి అభివృద్ధి పరచుటకు కొన్ని విధానాలు రూపొందించి ఇస్తున్నాం. అందుకు చాలినన్ని నిధులనూ అందించాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల లేమితో ఉన్నాయి. చాలా కాలం నుంచి కేంద్రం చాలా అధికారాలను అన్యాయంగా లాక్కుంది. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు సహాయం చేసే స్థితిలో లేవు.

స్థానిక సంస్థలకు నిధులు సమకూర్చే పనిని కేంద్ర ప్రణాళికా సంఘానికి అప్పగించాలి. రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచే గాకుండా కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచీ స్థానిక సంస్థలకు నిధులు సమకూర్చాలి.

ఈ సందర్భంగా 1972లో అప్పటి కేంద్రమంత్రి డి.పి. ధర్ పార్లమెంట్‌లో 1972 ఆగస్ట్ 23న వెలిబుచ్చిన అభిప్రాయాన్ని చెప్పాలను కుంటున్నాను. "ప్రణాళికా విధానం, అమలులో ప్రజలను భాగస్వాములుగా చేయడంలో నాయకత్వం సఫలం కాకపోవడం భారతదేశంలో ప్రణాళికా విధానం విఫలం కావడానికి కారణం" అని ఆయన అన్నారు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. రైల్వే, నౌక, విమానాల్లో ప్రయాణం చేసే ప్రయాణీకులపై రవాణా చేసే వస్తువులపై వేసే కేంద్రజాబితాలోని టెర్మినల్ పన్నును, రాష్ట్రజాబితాలోని 12 పన్నులను స్థానిక సంస్థల వినియోగానికి నిల్వ చేయాలని 1951లో ప్రభుత్వం నియమించిన స్థానిక ఆర్థిక విచారణ కమిటీ ప్రతిపాదించింది. విస్తృత బాధ్యతలతో రాష్ట్రాలు స్థానిక సంస్థలకు నిధుల వినియోగాన్ని రాష్ట్రాల ఆదాయాలకు కలుపుకోవాలని కమిటి సూచించింది. జాన్ మథయ్ అధ్యక్షతన 1953-54లో వేసిన పన్నుల విచారణ కమిటి కూడా స్థానిక సంస్థలు ప్రత్యేకంగా వినియోగించుకోవడానికి కొన్ని అంశాలను ప్రతిపాదించింది. మూడు దశాబ్దాల క్రితం వారు దీనిని సూచించారు. స్థానిక సంస్థల నిధులు అభివృద్ధి పరుచుటకు, పరిశీలించుటకు కేంద్ర ఆర్థిక సంఘానికి ప్రభుత్వం అధికారం అప్పగిస్తుందని ఆశిస్తున్నాను.

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి రీకాల్ హక్కు ఉండాలని స్వర్గీయ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. అధికారాన్ని అప్పగించిన ప్రజలకు మన పనితీరు నచ్చనప్పుడు రీకాల్ చేసే హక్కు ఉండాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మనం నిలవలేదని వారు భావించినప్పుడు, ప్రజా ప్రతినిధులు సరిగా సేవలు నిర్వర్తించడం లేదని ప్రజలు అనుకుంటున్నప్పుడు వారికి రీకాల్ చేసే హక్కు ఉండాలి. 72, 73 సవరణ బిల్లులలో కనీసం గ్రామసభల్లోనైనా రీకాల్ చేసే అధికారం ఉండే విధంగా సవరణలు చేయాలని ఆశిస్తున్నాను. గ్రామసభ సర్పంచ్, సభ్యులు సరిగా పనిచేయటం లేదని, ఆసక్తులను దెబ్బతీస్తున్నారని పంచాయితీ ఓటర్లు భావించినప్పుడు సమావేశం నిర్వహించాలి. మూడింట రెండువంతుల మంది ఓటర్లు సర్పంచ్, సభ్యులపై అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదిస్తే వారిని తొలగించాలి. ఇటువంటి రీకాల్ అధికారం ప్రజలకు ఇవ్వాలి.

చివరగా మున్సిపాలిటీల గురించి కొన్ని విషయాలు చెప్పాలను కుంటున్నాను. ప్రస్తుతం మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. జనతా ప్రభుత్వ హయాంలో పనికి ఆహార పథకం అమల్లోకి వచ్చింది. రోడ్ల నిర్మాణం, తాగునీటి పథకాలు వంటి కార్యక్రమాలు ఈ పథకం కింద చేపట్టి గ్రామీణాభివృద్ధికి తోడ్పడింది. కొంత వృధాగా ఖర్చైనప్పటికీ ఎన్ఆర్ఈపీ, ఆర్ఎల్జీఈపీ పథకాలు గ్రామీణాభివృద్ధికి కొంత తోడ్పడ్డాయి. 25 శాతం కూడా అందాల్సిన వారికి అందడం లేదని మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఎనిమిదవ లోకసభలో చెప్పారు. అప్పుడు నేను కూడా సభలో ఉన్నాను.

ప్రస్తుతం మీరు రోజ్‌గార్ యోజనను చేపట్టారు. ఇది కూడా గ్రామ పంచాయితీలకు కొంత సహాయం చేసింది. లేకపోతే గ్రామ పంచాయితీలు ఏమీ చేసేవి కావు. బిల్లు తీసుకువచ్చినప్పటికీ, ఇతర చర్యలు చేపట్టినప్పటికీ పంచాయితీలు, మున్సిపాలిటీలకు నిధులు సమకూర్చడం ముఖ్యమైన పని. లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు.

అన్ని స్థాయిల్లోని స్థానిక స్వపరిపాలన సంస్థలను నిజంగా పనిచేసేలా ప్రభుత్వం చూడాలి. ప్రజల అవసరాలను తీర్చాలి. ప్రస్తుతం గ్రామాలు నిర్జీవంగా మారుతున్నాయి. పల్లె ప్రజలు సమీపంలోని పట్టణ ప్రాంతాలకు వలస పోతున్నారు. తాగునీరు, రోడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించి గ్రామాలకు నవజీవనం తేవాలనే విషయం సభలోని సభ్యులందరికీ బాగా తెలుసు. □

# సంపూర్ణ అక్షరాశ్యత సాధించాలి

ప్రపంచ జనాభాలో సుమారు యాభైశాతం నిరక్ష రాస్యులు మనదేశంలోనే ఉన్నందుకు మనం చాలా విచారించాలి. ఇది ఎంతో దురదృష్టకరమైన విషయం కూడా. తాజా జనాభా లెక్కల ప్రకారం నిరక్షరాస్యులు 52 శాతం ఉన్నారు. ఈ నేపథ్యంలో నేను ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. కేరళలో అనుభవం మనకెంతో నమ్మకాన్ని ఇచ్చింది. ప్రజల భాగస్వామ్యం ఉండే ఎలాంటి లక్ష్యాలైనా, ఎంతో సమర్థంగా, తక్కువ సమయంలోనే సాధించవచ్చు. సంపూర్ణ అక్షరాస్యత సాధించి కేరళ ప్రజలు మనకు ఓ దారిని చూపించారు.

గౌరవ మంత్రి నిధులు అధికంగా కేటాయిస్తే మేము కూడ సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగ ముందుకెళతాం. అక్షరాస్యతలోనే కాకుండ చెట్లు నాటే కార్యక్రమాన్ని సైతం కేరళలో మనం చూశాం. ప్రజలను భాగస్వామ్యం చేసి, యువతను, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని ముందుకు సాగితే ఎంతో ప్రగతిని సాధించవచ్చు. జాతిపితను కోల్పోయిన తర్వాత ప్రజల భాగస్వామ్యం ద్వారా విజయం సాధించిన అనేక కార్యక్రమాల్లో ఇదొకటి. ప్రజలు మన వెంట ఉంటే ఎంతటి పెద్ద లక్ష్యాన్నయినా ఇట్టే సాధించవచ్చు.

వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా "కపార్ట్" - వివిధ సంస్థలకు ఎక్కువ శాతం నిధులను అందచేసింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవడానికి గౌరవమంత్రి ఏదైనా ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు చేశారా అని నేను ప్రశ్నిస్తున్నాను. వీలయితే తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రిని కోరుతున్నాను. ఎంక్వైరీని ఏర్పాటు చేసి నిధులను సద్వినియోగం అయ్యేలా చూడాలని అభ్యర్థిస్తున్నాను. ప్రాథమిక విద్యను విశ్వవ్యాప్తం చేసే విషయమై ఇప్పుడే నా గౌరవ స్నేహితుడు మాట్లాడారు కాబట్టి మళ్లీ అదే విషయాన్ని తిరిగి చెప్పను. 1995లోపు సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని జాతీయ విద్యా విధానం ప్రకటించినా నాకు మాత్రం నమ్మకంలేదు.

ఈ విషయంపై ప్రభుత్వ విధానాన్ని గౌరవ మంత్రి గారు చెబితే బాగుంటుంది. ఎప్పటిలోపు మనం ఈ లక్ష్యాన్ని సాధించబోతున్నాము?

ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తి ఎక్కువగా ఉండటంతో కేంద్ర పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. టీచర్లను ఎక్కువ సంఖ్యలో నియమించాల్సిన అవసరముందని మనం గ్రహించాలి. ఈ నిష్పత్తి తక్కువగా ఉంటే విద్యార్థులకు ఉత్తమ విద్య లభిస్తుంది.

ఆపరేషన్ బ్లాక్ బోర్డు లక్ష్యాలు చాలా చక్కగా ఉన్నాయి. అయితే గౌరవ మంత్రికి నేనొక నిజాన్ని చెప్పాలనుకుంటున్నాను. మాతోపాటు చాలామంది సభ్యుల సంబందిత జిల్లాల్లో ఆపరేషన్ బ్లాక్ బోర్డ్ కార్యక్రమం కింద అందచేసిన బోధన, క్రీడా పరికరాలు నిర్ణీత ప్రమాణాల్లో లేవు. అవి నాసిరకంగా ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ఖర్చు పెడుతున్న కోట్ల రూపాయలు బురదలో పోసిన పన్నీరులా తయారైంది.

దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ మా జిల్లాలో మమ్మల్ని జడిపించే సత్యాలను బయటపెట్టింది. ఈ వ్యవహారంపై విస్తృత. దర్యాప్తు జరపాలని గౌరవమంత్రి దృష్టికి తీసుకువస్తున్నాను. కొంతమంది ధరల ప్రాతిపదికన పరికరాలను సరఫరా చేసుండొచ్చు కాని అవి చాలా తక్కువ నాణ్యతతో ఉన్నాయి. మానవ వనరుల అభివృద్ధి శాఖ తగిన నిధులను కేటాయించి ప్రస్తుత పరిస్థితిని మెరుగుపరుస్తుందనే నమ్మకం నాకుంది.

మాధ్యమిక విద్యలో ప్రమాణాలు చక్కగా ఉండాలి. పునాది గట్టిగా ఉండాలి. అలాగైతేనే విద్యార్థులు ఉన్నత విద్యకు, ఇతర చదువులను కొనసాగించడానికి సులువుగా ఉంటుంది. దీనికి సంబంధించిన పాఠ్యప్రణాళికల్లో అనేక మార్పులు తీసుకురావాలని గౌరవ మంత్రికి సూచిస్తున్నాను. ప్రస్తుతం విద్యార్థులు టెక్నికల్

ఉద్యోగాలకు మాత్రమే సిద్ధమవుతున్నారు. అయితే పాలిటెక్నిక్/ఐటీలలో ప్రాక్టికల్ శిక్షణా తరగతులు తక్కువ సంఖ్యలో నిర్వహిస్తున్నారు. సైన్సు లేబరేటరీలలో సైతం ప్రయోగాలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదు. విద్యార్థి తనకు ఏదో విధంగా సర్టిఫికెట్, డిగ్రి, డిప్లొమో వస్తే చాలని తృప్తిపడుతుంటే, విద్యార్థి తరగతి గదిలో అల్లరి చేయకపోతే చాలని ఉపాధ్యాయుడు సంతృప్తి చెందుతున్నాడు. ఇలాంటి శిక్షణ ఏ పరిస్థితులకు దారి తీస్తుందంటే, బీఇ, ఎల్ఎమ్ఇలో ఉత్తీర్ణత సాధించినా కూడ ప్రపంచ జాబ్ మార్కెట్‌లోకి వెళ్లినప్పుడు తన కాళ్ల మీద తాను నిలబడలేకపోతున్నాడు.

విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఎక్కువగా అందించాలని కోరుతున్నాను. డిగ్రీలు చదివిన తర్వాత అది బీఏ, బీకాం, బీఎస్సీ ఏదైనా కానీ ఎంత డబ్బు ఖర్చుపెట్టి తల్లితండ్రులు వ్యయప్రయాసలు పడి చదివించినా నిజజీవితాల్లో మాత్రం ఆ చదువులు ఏ మాత్రం ఉపయోగపడటంలేదు. మన రోజువారి జీవితంలో ఉపయోగపడే వ్యవసాయం, ఎక్కౌంటింగ్, ఆరోగ్యం తదితర అంశాలు మాధ్యమిక విద్యలో బోధిస్తే సత్ఫలితాలిస్తాయి. రైతు కుటుంబంలో పుట్టిన వారు ప్రభుత్వ ఉద్యోగం రాకపోయినా పర్వాలేదు, ఉన్నత విద్యలో ఆధునిక పరిజ్ఞానంతో కూడుకున్న వ్యవసాయ పద్ధతులు నేర్చుకుని వారి కాళ్ళమీద వారు నిలబడగలమని విద్యార్థులు భావించేలా తీర్చిదిద్దాలని కోరుతున్నాను. కనుక పాఠ్యాంశాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేయాలని కోరుతున్నాను.

ప్రభుత్వం కొత్తగా రూపొందించే పాఠ్యప్రణాళికల్లో విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా, జాతికి సేవ చేయాలనిపించే అంశాలు పొందుపర్చండి. దురదృష్టవశాత్తు ప్రస్తుత పాఠ్యంశాల్లో ఇవి లోపించాయి. మాధ్యమిక దశ నుంచే విద్యార్థులకు వృత్తి పట్ల గౌరవం, పని చేసే మనస్తత్వాన్ని బోధించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నాను. దురదృష్టవశాత్తు, ప్రస్తుత పరిస్థితుల్లో పలు ఫ్యాక్టరీల్లోని కార్మికులు పని చేయరు. తమకు లభించే జీతాలపట్ల సంతృప్తి చెందుతున్నారు తప్ప, తమ వల్ల పరిశ్రమకు ఎలా లాభపడుతుందని, ఎలా అభివృద్ధి చెందుతున్నదని పట్టించుకోవట్లేదు. తద్వారా దేశాభివృద్ధికి ఏమైనా తోడ్పాటు అందిస్తున్నామా? అనే విషయం ఆలోచించట్లేదు. పని చేసే మనస్తత్వాన్ని పెంపొందించే పాఠాలను బోధించాలి.

ఇక నవోదయా విద్యాలయాల విషయానికి వస్తే మా స్నేహితుడు ఇదివరకే వీటి గురించి చెప్పాడు. సమయం తక్కువగా ఉంది కాబట్టి నేను ఎక్కువ సమయం

తీసుకోను. వీటిని మనం ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో ప్రారంభించాము. అయితే నా బాధ ఏమిటంటే గత కొద్ది సంవత్సరాలుగా స్వీయ అనుభవంతో చెబుతున్నా, ఇప్పటికి సొంతంగా పరీక్షలు నిర్వహించే వ్యవస్థ మనకు లేదు.

నవోదయ విద్యాలయాల్లో ఇప్పటికీ సి.బి.ఎస్.ఐ. పరీక్ష పద్ధతిని అవలంభిస్తున్నారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రేరణ కలిగించే ఉపాధ్యాయులను నియమించండి. తమ వృత్తి పట్ల అంకితభావం ఉండి విద్యార్థులకు మంచి విద్యను నేర్పించే టీచర్లను నియమించండి.

ఉన్నత విద్యపై ప్రభుత్వానికి నా సూచన. ఇంజనీరింగ్, వ్యవసాయ, పరిశోధన ప్రయోగశాలలో సంప్రదింపులు/సమాలోచనలు జరిపే ప్రక్రియను ప్రవేశపెట్టండి. దీని వలన ఉన్నత విద్యను అభ్యసించే రిసెర్చి స్కాలర్లు, విద్యార్థులు దేశంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొనే పలు సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు సహాయం చేస్తారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించటం ద్వారా ఆయావిద్యా సంస్థలకు కొంత ఆదాయం కూడా వస్తుంది.

ఇక నిరుద్యోగం విషయానికి వస్తే శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం, నిపుణులు, ఉండి కూడ ప్రపంచంలోనే నిరుద్యోగ సమస్య ఉన్న మూడవ దేశం మనదే. విచారించవలసిన విషయం ఏమిటంటే సుమారు 8400 ఇంజనీరింగ్ పట్టబద్రులకు ఉద్యోగాలు లేవు. దేశంలో చదువుకున్న 45 లక్షల విద్యార్థులకు ఉపాధి లేదు. వీరికి ఉద్యోగాలు ఇవ్వాలని నేను కోరడంలేదు. చదువు పూర్తి చేసుకుని బయటికి వచ్చిన విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడగలమనే ఆత్మవిశ్వాసాన్ని వారిలో కల్గించటానికి తగిన చర్యలు తీసుకోండి. మీరు ఆ పని చేసినట్లయితే గొప్ప సేవ చేసిన వారవుతారు.

పాఠ్యాంశాల్లో సెక్స్ ఎడ్యుకేషన్, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత తదితర అంశాలను చేర్చండి. స్వాతంత్ర్యం వచ్చి 45 సంవత్సరాలు గడిచినా దేశంలోని ప్రజలకు వీటి పట్ల ప్రాథమికమైన అవగాహన లేదు. పైపెచ్చు మనం 21వ శతాబ్దంలోకి అడుగిడుతున్నాం. అందుకే ప్రభుత్వం ఆలోచించి ఇలాంటి విషయాల పట్ల తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా గట్టిగా కోరుతున్నాను.

అలాగే క్రీడలకు నిధులను ఎక్కువగా కేటాయించండి. మా సోదరి మమతా బెనర్జీ ప్రస్తుతం సభలో లేరు. దేశీయ టోర్నమెంట్లు అయిదు ఉన్నాయి. వాటిలో జాతీయ క్రీడలైన ఖోఖో, కబడ్డీని చేర్చలేదు. వీటిలో గెలిచిన పాఠశాలకు పదివేల

రూపాయలు బహుమతిగా ఇవ్వండి. దాంట్లో కేవలం అయిదు అంశాలను మాత్రమే చేర్చారు. గత ఆసియా క్రీడల్లో కబడ్డీలో మనకు స్వర్ణం వచ్చింది. ఈ క్రీడల్లో ఖోఖో, కబడ్డీ సైతం చేర్చండి.

స్కూల్లో ప్రవేశం కల్పించేటప్పుడు, ఉపకార వేతనాలు అందచేసే విషయంలో క్రీడాకారులకు ప్రాధాన్యతను తప్పకుండా ఇవ్వాలి. వీరిలో పురుషులు, స్త్రీలు ఎవరున్నా ఫర్వాలేదు, క్రీడకారులకు మాత్రం ప్రాధాన్యత ఇవ్వండి.

ఒకరు లేదా ఇద్దరు పిల్లలు కలిగిన కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారులకు తగిన ప్రాధాన్యతను ఇవ్వండి. అలాగే స్కాలర్‌షిప్పుల విషయంలో సైతం ఎంతో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మారుమూల ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యులైన పేద ప్రజలకు చిన్నకుటుంబం గురించి వివరించండి. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు ఉండటం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండటమే కాకుండా, ఎలాంటి ఆరోగ్య సమస్యలు కలగవని వారికి తెలపండి. దీని వలన వారికి మంచి ప్రోత్సాహం ఇచ్చిన వారవుతాము.

అంగన్‌వాడి సభ్యుల కష్టాలు వర్ణనాతీతం. వారి గౌరవ వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నా నియోజక వర్గమైన విజయవాడలో సైన్సు సెంటర్‌ను ఏర్పాటు చేయాలని గౌరవ మంత్రి వర్యులకు అర్జున్‌సింగ్‌ని కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లు స్థలము, కొంత నిధులను అందచేయటానికి సిద్ధంగా ఉన్నారు. కనుక సైన్సు సెంటర్‌ను ఏర్పాటు చేయవల్సిందిగా అభ్యర్థిస్తున్నాను. □

# పారిశుధ్య కార్మికుల అభ్యున్నతికి కృషి చేద్దాం

సఫాయి కార్మికుల కోసం జాతీయ కమీషన్ ఏర్పాటుచేయడానికి సంబంధించి, మా పార్టీ ప్రతిపాదించిన బిల్లుకు నేను మద్దతు తెలుపుతున్నాను. వాస్తవంగా ఈ బిల్లు చాలా కాలంగా మూలన పడి ఉంది. ఈ బిల్లు లక్ష్యాలు చాలా ప్రశస్తమైనవి. దీనిపై ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలు చేపట్టకపోతే బిల్లు లక్ష్యాలు నెరవేరవు. ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టకపోవడం వల్ల వరకట్న నిషేధ బిల్లు అమలులో విఫలమైంది. ఈ బిల్లు అమలులో ఉన్నప్పటికీ ప్రతి రోజు ప్రసార సాధనాలలో వరకట్నచావులు చోటుచేసుకోవడాన్ని మనం చూస్తున్నాం. తండ్రి ఆస్తిలో కూతురుకు భాగం పొందే హక్కు లేకపోవడమే వరకట్న చావుకు ప్రధాన కారణం. ఈ పంచవర్ష ప్రణాళిక ముగిసేలోగా పాకీ పనిచేసే వారిని (సఫాయి కార్మిక వ్యవస్థ) ఆ వృత్తి నుంచి వేరే వృత్తులకు మళ్లించాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆహ్వానించదగ్గది. దీనికి ప్రభుత్వం కావలసినంత మేర నిధులను కేటాయించాలి. పాకీ పని చేసే వారికి ఆ వృత్తిపై నుంచి తప్పించి, వారికి పునరావాసం కల్పించాలి. పట్టణ ప్రాంతాలలో అలానే గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య పరిస్థితులనూ

మెరుగుపరచాలి. ఇది సఫాయి వ్యవస్థ పూర్తిగా నిర్మూలించలేక పోవచ్చు. కానీ సఫాయి వ్యవస్థ నిర్మూలనకు ఇవి కొంతవరకు సహాయపడతాయి.

కమీషన్ నిర్వర్తించే విధుల్లో రెండు ముఖ్యమైన అంశాలు లేకపోవడం గమనార్హం. ఈ బిల్లులో ప్రస్తావించిన అంశాలతో పాటు నేడు నగరాలలో, పట్టణాలలో, గ్రామాలలో ఉన్న ఆరోగ్య సంబంధ (పరిశుద్ధ) సమస్య తీవ్రతను గుర్తించి, ఆ పరిస్థితులను మెరుగుపరచడానికి నిధులను కేటాయించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాలలో 2 శాతం జనాభా కూడా కాలుష్య రహిత మరుగుదొడ్లు వాడటం లేదు. ఈ ప్రాంతాలలోని స్త్రీలు బయటి ప్రదేశాలలోనే బహిర్భూమికి వెళుతుండటం శోచనీయం. వారికి ఇంతకంటే ప్రత్యామ్నాయం లేదు. ఎందుకంటే ఇళ్ళలోనే కాలుష్యరహిత మరుగుదొడ్లు నిర్మించుకొనే ఆర్థిక స్థోమత వారికి లేదు. ప్రభుత్వం ఈ సమస్య పట్ల సరిగా స్పందించకపోవడం నాకీ బాధ కలిగిస్తోంది. 'కాపార్ట్' ద్వారా కొన్ని ఏజన్సీలలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, తగిన నిధులను మంజూరు చేసి ఈ సమస్యను పరిష్కరించాలి.

గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమం కోసం 1993-94 సంవత్సరంలో 30 కోట్ల నిధులను ఖర్చుచేసినట్లు పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం పేర్కొంది. సమస్యతీవ్రతతో పోలిస్తే ఈ నిధులు తక్కువనే చెప్పాలి. నగరాలలో భౌతిక పరిస్థితులను కల్పించడానికే ఎక్కువ నిధులు ఖర్చుచేస్తున్నారు. నగరాలలో సోడియం వాపోర్ లాంప్‌లపై అధికంగా ఖర్చుచేయటం గమనార్హం. దీనివల్ల నగరాలలో రాత్రులు కూడా పగలుగా మారిపోతోంది. కానీ గ్రామీణ ప్రాంతాలలోని పేదలు, స్త్రీలకు సంబంధించిన ప్రాథమిక సమస్యలపై ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోకపోవటం శోచనీయం. గ్రామాలలో, పట్టణాలలో ఆరోగ్య సంబంధి (పరిశుద్ధ) కార్యక్రమాల కోసం, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచటం కోసం తగినంత నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. బహిర్భూములను శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ, ప్రతి ఇంట్లోనూ ఒక కాలుష్యరహిత కక్కసు ఏర్పాటు చేసుకొనేలా చూడటమే ఈ సమస్యను తగ్గించటానికి తీసుకోవలసిన చర్య. అప్పుడు మాత్రమే ప్రజలకు సహాయం చేకూరినట్లవుతుంది. ఈ అంశంపై ప్రధానంగా దృష్టి సారించాలని నేను ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను. దీనిపై దృష్టి సారించినప్పుడే ప్రభుత్వం లక్ష్యాలు, ఉద్దేశాలు నెరవేరుతాయి.

ఇలా చేసినప్పుడు అది సరైన సమయంలో, ఖచ్చితమైన దిశలో ఖచ్చితమైన

నిర్ణయమవుతుంది. సుదీర్ఘ కాలంగా పట్టి పీడిస్తున్న ఈ సమస్యపట్ల జాగరూకతతో ఉండటానికి సభాసమయంలో సభ్యుల సలహాలను ప్రభుత్వం స్వీకరిస్తుందని నేను భావిస్తున్నాను.

చాలాకాలం నుంచి పరిష్కారం కాకుండా ఉండిపోయిన ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ చర్చలో కొన్ని సవరణలు చేయాలి.

గౌరవనీయులైన సభాధ్యక్షుల వారికి, పారిశుద్ధ్య కార్మికుల బిల్లు వేసిన జాతీయ కమీషన్ నిస్సందేహంగా చక్కటి బిల్లు. కాని దీని అమలు వ్యవహారమంతా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన ఈ కమీషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం సరిగ్గా అమలు పరచటం లేదు. అందుకే దీనిపై సందేహంగా ఉంది.

పాకి పనిని సమాజంలో తక్కువ కులాల వారి వృత్తిగా పరిగణిస్తారు. కాని ఆ చెత్త చెదారం ఏర్పడటానికి కారణమైన వారిని గొప్ప వారుగా చూస్తున్నాం. ఈ అభిప్రాయాన్ని మనం మార్చాలి.

పండిట్ దీన్ దయాళ్, డాక్టర్ లోహియాల సిద్ధాంతాలు ఒకటే. వివిధ సందర్భాలలో వీటిని తమ ఉపన్యాసాలలో ఉటంకించేవారు. 1967లో పండిట్ దీన్ దయాల్ ఒక ఉపన్యాసంలో, బీదవారికి సేవచేయడమే నిజమైన దైవారాధన అన్నారు. డాక్టర్ లోహియా మాట్లాడుతూ, ఒక దేశపు రాణి అయినా ఆమె కింద పనిచేసే దాసి అయినా వారిద్దరికీ విద్య ఒకే పాఠశాల నుంచి అందుతుంది.

పాకి పనివారికి మెరుగైన సదుపాయాలు అందించడమే కాకుండా ఉన్నత వర్గాల వారి సదుపాయాలలో కోత విధించాలి. అప్పుడే నిజమైన ఉద్ధరణ జరుగుతుంది. ఇలాంటి కోతలు భరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. నాలాగే ఇక్కడ ఉన్న సభ్యులంతా సిద్ధపడతారనుకుంటున్నాను.

పాకి పనివారి అభ్యున్నతి కొరకు ప్రభుత్వం ఒకవైపు బిల్లు ప్రవేశపెడుతూనే పారిశుద్ధ్యపు పనుల కొరకు వారితోనే పనిచేయిస్తున్నది. ఇలా ప్రభుత్వం తన విధానంలో, ఆచరణలో ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నది. ఇలాంటి పరిస్థితిలో కమీషన్ ఏర్పాటు చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదని భావిస్తున్నాను.

అధ్యక్షా, ఈ బిల్లులో కొన్ని మార్పులు చేయాలి. కార్మికుల పిల్లలకు సరైన

విద్యావకాశాలు కల్పించాలి. సమాజం వీరిని చిన్నగా చూస్తున్నది. కాని ఇది తప్పు. వారు కూడా సమాజంలోని భాగస్తులే. గాంధీజీ ఒక సందర్భంలో సమాజంలోని ఐక్యత గురించి మాట్లాడుతూ. పారిశుధ్య కార్మికుల జనావాసాలలోని పారిశుద్ధ్య పనిని ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు చేసినపుడే పాకివారు వారిని తమ సమాజానికి చెందిన వారని గ్రహిస్తారన్నారు. ఇలాంటి అభిప్రాయం కలిగించటానికి మనమంతా కృషి చేయాలి. గ్రామ గ్రామాన పర్యటించి సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఐక్యతను పెంపొందించాలి. పాకీ వారు సమాజంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, నమ్మకాన్ని కలగజేయడానికి కమీషన్ చర్యలు తీసుకోవాలి.

పాకీ వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం ద్వారా ఆదుకుంటామని బిల్లులో ఉంది. ఇంతకు ముందు కూడా ఇలాంటి ఎన్నో ఆర్థిక సహాయాలను చేశారు కాని అవి వారికి చేరటం లేదు. వాటిని మధ్యవర్తులే మింగేస్తున్నారు. ఇలాంటి సంఘటనలకు నా సొంత నియోజక వర్గమే ఒక ఉదాహరణ. పాకీ పనివారికి ఆర్థిక సహాయం అందజేయడానికి నేను కొందరిని సిఫార్సు చేశాను. కాని వచ్చిన డబ్బుని మధ్యవర్తులే నొక్కేశారు. వీరి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఉన్నత వర్గాల వారు వీరిపై దౌర్జన్యం చేయకుండా ఉండడానికి చట్టాలను చేయాలి.

మునిసిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సహాయాన్ని అందించే ప్రతిపాదన బిల్లులో ఉంది. కాని వారు పడుతున్న శ్రమకు తగినంత వేతనం అందటం లేదు. వేతనాలను కూడా సకాలంలో అందించటం లేదు. దీనికై వీరు సమ్మెలు చేయాల్సి వస్తుంది. ఫలితంగా పట్టణాలలో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయి ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. మునిసిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు వారి శ్రమకు తగినంతగా, సకాలంలో వేతనాలు అందించాలనే విషయాన్ని కూడా కమీషన్ పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నాను.

పట్టణాలు, ప్రకటిత ప్రాంతాలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేసే పారిశుధ్య సిబ్బందికి ఆరు నుండి ఎనిమిది నెలలుగా జీతభత్యాలు లేవు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది సంఖ్యను కూడా పెంచాలి. వారికి నివాసగృహాలు నిర్మించడానికి ఒక ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలి. వారి ఉన్నతికై కల్పించబడ్డ రిజర్వేషన్లతోపాటుగా వారి సేవలకే గాక వారి వృత్తి పరమైన లైసెన్సులనుగూడా వర్తింపజేయాలి. వారి ఆర్థికాభివృద్ధికై అన్ని స్థాయిల్లో సమానావకాశాలు కల్పించాలి. ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటీకరణ, స్వేచ్ఛావాణిజ్యం

పంథాను అనుసరిస్తోంది. ప్రజలు రిజర్వేషన్ల సౌకర్యం చాలా కాలం నుండి పొందుతున్నా ఈ కొత్త పంథా వారికి ఎలాంటి లాభాన్ని కల్గించదు. కనుక వీరు ఆర్థికంగా బలపడటానికి లైసెన్సుల జారీ లాంటి ఇతర సౌకర్యాల కల్పన విషయంలో ప్రభుత్వం ఆలోచించాలి.

కమీషన్ విషయంలో నేను చెప్పాలనుకునేదేమిటంటే కమీషన్ కాల పరిమితిని మూడు నుండి ఐదు సంవత్సరాలకు పొడిగించాలని, ఇందులో సభ్యులుగా ఈ వృత్తిని అవలంభిస్తున్న వారినే నియమించాలని కోరుతూ నేను ఈ బిల్లుకు మద్దతు తెలియజేస్తున్నాను.

నిజానికి చాలా కాలంగా నలుగుతున్న బిల్లిది. దీని లక్ష్యాలు శ్లాఘ నీయమైనవి. కాని ప్రభుత్వ నిర్దిష్ట చర్యలు తీసుకుంటే తప్ప ఈ లక్ష్యాలు నెరవేరవనేది నా అనుమానం. వరకట్న నిషేధ బిల్లు ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ బిల్లు ఉన్నప్పటికీ ప్రతీరోజూ పేపర్లో ఎన్నో వరకట్నచావుల గురించి చదువుతున్నాము. స్త్రీలకు వారి తండ్రి ఆస్థిలో హక్కులేకపోవడమే దీనికి ముఖ్యకారణం. అదే విధంగా ఎనిమిదో ప్రణాళికాంతానికి పారిశుధ్య వసతులు కల్పించాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదే అయినా, సరిపోయినన్ని నిధులు కేటాయించకుంటే పారిశుధ్య పనివారి పునరావాసం, అభివృద్దే కాదు. పట్టణ గ్రామ ప్రాంతాలలో పారిశుధ్య పరిస్థితులు మెరుగు పడితేగాని దీనిని పూర్తిగా తొలగించలేము.

కమీషన్ నెరవేర్చవలసిన విధుల్లో రెండు ముఖ్యమైన అంశాలు లేకపోవడం నేను గమనించాను. ఈ బిల్లులో ఉన్న విధులేకాక, నేను సూచించదలచుకున్న దేమిటంటే నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో నేడు నెలకొన్న పారిశుధ్య పరిస్థితుల సమస్య తీవ్రతను కమిషన్ పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నాను. దేశంలో నెలకొన్న ఈ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించడానికి కావలసిన నిధులను సమకూర్చాలని కోరుతున్నాను. అక్కడ ఎలాంటి పరిస్థితులున్నాయో గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన మీకు తెలుసు. కనీసం రెండు శాతం ప్రజలకు కూడా మరుగుదొడ్ల సౌకర్యం లేదు. మహిళలు తమ కాలకృత్యాలు తీర్చుకోవడానికి ప్రజలు నడుస్తూండే రోడ్లను ఉపయోగిస్తుండటం సిగ్గుపడే విషయం. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. ఎందుకంటే వారికి ఇళ్ళలో మరుగుదొడ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేదు. ప్రభుత్వం ఈ సమస్యపై సరియైన చర్యలు తీసుకోవడం లేదు. మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా పారిశుధ్య పరిస్థితులు మెరుగుపర్చాలంటే అది ఎలా సాధ్యమవుతుంది. ``కాపార్ట్'' మరియు ఇతర సంస్థల ద్వారా ఒక స్థాయి వరకు కొంత సహాయం చేస్తున్నారని నాకు తెలుసు. □

# విజయవాడ విమానాశ్రయం

విజయవాడ చాలా ముఖ్యమైన ప్రాంతం. చాలాకాలం క్రితం ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేశారు. రన్‌వేను పటిష్ట పరిచి, విస్తరించడంతో పాటు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి అంచనా సిద్ధమయింది. దీనికోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 8 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాన్ని జాతీయ విమానాశ్రయ అథారిటీకి ఇవ్వడానికి అంగీకరించింది.

ఈ సంవత్సరం 4 కోట్ల రుపాయలను ఇప్పటికే కేటాయించింది. కాబట్టి రన్‌వే పటిష్టీకరణ, విస్తరణతో పాటు విమానాశ్రయ అభివృద్ధి పనుల్ని సత్వరం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను కోరుతున్నాను. □

# పాలదిగుబడి పెంచాలి

అధ్యక్షా, పెరుగుతున్న జనాభా అవసరాలకనుగుణంగా మొత్తం పాల ఉత్పత్తిని పెంచేందుకు, గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా సన్నకారు రైతుల, రైతుకూలీల ఆదాయాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఆపరేషన్ ఫ్లడ్ కార్యక్రమ ప్రాధాన్యత దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో ఆపరేషన్ ఫ్లడ్- III కార్యక్రమాన్ని అమలుచేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుంది? ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే 'ఆనంద్' కార్యక్రమం నుంచి స్ఫూర్తిని పొందింది. అస్సాం, మధ్యప్రదేశ్ వంటి కొన్ని ప్రాంతాలలో పాడిపశువుల నుంచి పాల దిగుబడి పెంచేందుకు కూడా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందేమో నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈ ప్రాంతాలలో పాల దిగుబడి చాలా తక్కువగా ఉంది. దీనికి సంబంధించి ఒక కార్యక్రమం అమలవు తోందని ప్రభుత్వం చెబుతున్నా అది అంతగా ప్రగతిని సాధించడం లేదు.

లైసెన్సులు అవసరంలేని విధానం వల్ల పాల ఉత్పత్తుల రంగంలో కొత్త కంపెనీలు వస్తాయని, పాలను సేకరించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేయడంకంటే దీని వల్ల ఎక్కువ లాభాలనార్జించవచ్చని ఇప్పుడే మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఈ ప్రత్యేకాంశంపై శ్రద్ధ వహించి గ్రామీణ ప్రజలకు సహాయం చేసే మిషపై గ్రామాలకు వచ్చే కంపెనీలు లాభార్జనే ధ్యేయంగా పని చేయకుండా జాగ్రత్త పడుతుందా? ఈ అంశంపై ప్రభుత్వం ఆలోచించి అలా జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపడుతుందేమో నేను తెలుసుకోగోరుతున్నాను. □

# నిరుద్యోగులకు ఉపాధికల్పన జరగాలి

ఉపాధి అవకాశాలను కల్పించడంలో మొదటి నుంచి ప్రభుత్వ విధానంలో లోపాలున్నాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో మనది రెండో స్థానంలో ఉంది. ప్రథమ ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ కాలం నుంచి సమర్థంగా పనిచేసిన ప్రభుత్వాలు కూడా మహాత్మాగాంధీ సూచించిన మార్గాలను దురదృష్టవశాత్తు పక్కదారి పట్టించాయి. వివిధ దేశాల్లో అభివృద్ధిని నిశితంగా పరిశీలించిన మహాత్మాగాంధీ మనదేశంలోనూ చేతివృత్తులకు, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సలహా ఇచ్చారు. ఆ తరువాతే భారీ పరిశ్రమవైపు దృష్టిసారించాలని గాంధీ సూచించారు. ఇప్పటివరకు ఏనాడు వాటిని అనుసరించలేదు.

గౌరవనీయ మంత్రివర్యులు తన వార్షిక నివేదికలో 1991 సంవత్సరాంతానికి సుమారు 3.62 కోట్ల మంది నిరుద్యోగులున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఏడాది కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతుంటే మమ్మల్ని ఎలా నమ్మమంటారు? మనకు అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం 1991 సంవత్సరంలో మొత్తం 62 లక్షల మంది ఉపాధి కల్పన కార్యాలయాల్లో నమోదు చేసుకున్నారు. వారిలో 2.53 లక్షల మందికి మాత్రమే ఉపాధి లభించింది. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కల్పించిన పనిదినాలను కూడా కలుపుకొని ఏడాదికి కేవలం

రెండు లక్షల మందికీ ఉపాధి లభించిన తరుణంలో కోటి మందికి ఉపాధి కల్పిస్తామనే మాటను మమ్మల్ని ఎలా నమ్మమంటారు? ఇంతకు ముందు నుంచి కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్రామీణ జీవనోపాధి కల్పన పథకం ద్వారానే కాకుండా ప్రస్తుతం అమలవుతున్న జవహార్ రోజ్‌గార్ యోజన పథకాలనన్నింటిని కలుపుకొని కూడా మీరు చెప్పినదాంట్లో పదిశాతం కూడా రావడంలేదు. ఇది మరీ దయనీయపరిస్థితి. దేశంలో ఈ రోజున రెండుకోట్ల కన్నా ఎక్కువ మంది విద్యావంతులైన నిరుద్యోగులున్నారు. ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక ముగిసేనాటికి నిరుద్యోగుల సంఖ్య 6.5 కోట్లు ఉంటుంది.

ప్రభుత్వ ఆలోచనలు, ప్రణాళికలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మహిళలకు ఉపాధి కల్పన మరీ దారుణం. 50 శాతం మంది మహిళలు మన జనాభాలో ప్రాతినిధ్యం వహిస్తుండగా అందులో కొద్దిమంది మాత్రమే ఉపాధి పొందారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు, సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించే మహిళల కోసం ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తూ చట్టాన్ని తీసుకువచ్చారు. ఆ చట్టాన్ని పరిశీలించి, అలాంటి దానినే రూపొందించడం ద్వారా మహిళలు మరిన్ని ఎక్కువ ఉపాధి అవకాశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని సలహా ఇస్తున్నాను. పారిశ్రామిక వివాదాలు, మూసివేతలు, సమ్మెల వల్ల కోల్పోయే పనిదినాల సంఖ్య తగ్గినట్లు వార్షిక నివేదిక తెలియజేయడం శుభపరిణామం. కార్మికులు, యాజమాన్యం మధ్య సుహృద్భావం ఏర్పడితే ఇది మరింతగా తగ్గుతుంది.

కార్మికులు యాజమాన్యంలో భాగస్వామ్యమయ్యే అవకాశాలు కల్పించే బిల్లును ప్రవేశపెట్టేందుకు నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉండగా చొరవ చూపింది. ఐదు నెలల్లోనే న్యూఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహించి బిల్లు నిర్ణయంపై ప్రభుత్వం తన అంకితభావాన్ని చాటుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాంతీయ సదస్సులు కూడా నిర్వహించారు. రాష్ట్రాల కార్మిక మంత్రులు కూడా సమావేశమయ్యారు. అన్ని సదస్సుల ద్వారా వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రభుత్వం 1990, మే 30న బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. ఆ బిల్లును పరిశీలించి, అవసరమైన సవరణలుచేసి దానిని ఆమోదించాలి. ఆ బిల్లును చట్టంగా మార్చడంలో జాప్యం వద్దు. కార్మికులు కూడా యాజమాన్య సమస్యలను తప్పక అర్థం చేసుకోవాలి. యాజమాన్యం ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను కార్మికులు అర్థం చేసుకున్నప్పుడు, వారు యాజమాన్యంతో సహకరిస్తారు.

వారి డిమాండ్లను, డిమాండ్ల పరిమితిని తగ్గించుకుంటారు. కార్మికులు, యాజమాన్యం మధ్య పారిశ్రామిక సంబంధాలు వృద్ధి చెందేందుకు ప్రభుత్వం బిల్లు ఆమోదంలో చొరవచూపాలి. గ్రామీణ కార్మికులపై జాతీయ కమీషన్ ఇచ్చిన నివేదిక గురించి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయాభివృద్ధి కోసం శరద్‌జోషి అధ్యక్షుడిగా నియమించిన స్టాండింగ్ అడ్వైయిజరీ కమిటీలో నేను సభ్యుడిని. ప్రభుత్వం కనీసవేతనాలను సాగు గణాంక మొత్తంలోకి తీసుకోవడం లేదు. కనీసవేతనాలను అమలు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సుచేసింది. ఒకసారి చట్టబద్ధ కనీస వేతనాలు అమలవుతే, అవి ఎంత పెరిగినా సాగువ్యయం కోసం అంగీకరిస్తారు. ఈ చట్టం ద్వారా వ్యవసాయదారులు కార్మికులకు తప్పక కనీసవేతనాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల ప్రభుత్వం కాగితాలకే పరిమితం కాకుండా కార్యరూపంలోనూ అమలు చేయాలి. ఆ బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

వ్యవసాయకంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో కార్మికులకు ఎక్కువ వేతనాలు చెల్లిస్తుండగా వ్యవసాయకంగా వెనుకబడిన ప్రాంతాల్లో కనీసవేతనాలు చెల్లించడం లేదు.

దేశంలో లక్షలాది కార్మికులు భవనాలు, డ్యాములు, కాలవలు, ఇతర నిర్మాణాల్లో పనిచేస్తున్నవారు కొద్దికాలం కిందట ఢిల్లీలో భారీ ప్రదర్శన, సభను నిర్వహించి, కేంద్రప్రభుత్వానికి సమస్యల వినతిపత్రాన్ని సమర్పించారు. భవన నిర్మాణ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన చట్టాన్ని తీసుకురావాలి. నిర్మాణంలో పై ఫ్లోర్‌లో పనిచేస్తున్న కార్మికులుగానీ, మేస్త్రీగానీ ఒక్కోసారి ప్రమాదవశాత్తు కిందపడిపోతుంటారు. ఒక్కోసారి సెంట్రింగ్ కూలిపోయికూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. వారు ప్రాణాలు కోల్పోతుంటారు. అలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు సాయం అందటంలేదు. బొగ్గుగని కార్మికుల ప్రయోజనాలకోసం రూపొందించిన పథకాన్ని వీరికి వర్తింపజేయాలి. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం చట్టాన్ని తీసుకురావాలి.

నా నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేటలో చాలా సిమెంటు ఫ్యాక్టరీలున్నాయి. అక్కడ సున్నపురాయి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. విశాఖ స్టీల్ ప్లాంటులో సున్నపురాయిని పిండికొట్టే కేంద్రాలు కూడా ఉన్నాయి. వాటివల్ల పర్యావరణం కలుషితం అవుతోంది. వాయు కాలుష్యం అధికమవుతోంది. అక్కడ నివాసముంటున్న ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆరోగ్య పరిరక్షణకు అక్కడ ఇఎస్ఐ ఆసుపత్రిని నెలకొల్పే విషయాన్ని పరిశీలించాలి. వేతనాల చెల్లింపుల్లోనూ

హెచ్చుతగ్గులున్నాయి. కొంత పరిధి వరకు జీతాలు పొందుతున్న ఉద్యోగులు మాత్రమే బోనస్‌కు అర్హులు. ఇలా ఎందుకు జరుగుతుందో నాకు అర్థం కావడంలేదు. వసతులు, అదనపు సంపాదన, ఇతరాల పేరుతో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల్లో ఛైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, ఇతర డైరెక్టర్లు పెద్ద మొత్తంలో జీతాలు తీసుకుంటున్నారు. లక్షల రూపాయలు జీతాలు పొందడమే కాకుండా ఇతర ప్రయోజనాలను పొందుతున్నారు. ప్రత్యేకస్థాయి వరకు మాత్రమే బోనస్‌లపై నిబంధనను ప్రభుత్వం ఎందుకు విధించిందో నాకు అర్థం కావడంలేదు. పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతూ సంస్థ లాభాలకు కారణమవుతున్నవారికి ప్రయోజనాలు లభించడం లేదు. వారిని ఎవరు మోసం చేస్తున్నారు?

ఉద్యోగులకు బోనస్ చెల్లింపులో వారి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఉత్పాదకత, పనితీరుకు బోనస్‌ను అనుసంధానం చేయాలి. అలా చేస్తే ఎవరైతే ఎక్కువ కష్టపడతారో, ఎక్కువ ఉత్పత్తి చేస్తారో వారికే ఎక్కువ బోనస్ లభిస్తుంది. పరిశ్రమల పనితీరుకు మేనేజర్లే బాధ్యతవహించాలి. ప్రభుత్వరంగ సంస్థలకు చాలాసార్లు ఐఏఎస్ అధికారులను నియమించారు. వారు మనసు పెట్టలేదు సరికదా సమస్యను కూడా అర్థం చేసుకోలేదు. సమస్యల పరిష్కారానికి కృషిచేయకుండా ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమయ్యేవారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల పాటు ఒకే మేనేజరు తప్పనిసరిగా అక్కడ ఉండాలి. ఈ పరిశ్రమల్లో సాంకేతిక నిపుణులను, ఇంజనీర్లను, డాక్టర్లను వారి, వారి నైపుణ్యాల కనుగుణంగా నియమించి, వారికి మరిన్ని అవకాశాలను కల్పించడం మంచిది కదా? వారికి తగినంత సమయం ఇవ్వండి. కనీసం మూడు నుంచి ఐదేళ్లపాటు సమయాన్ని నిర్దేశించండి. అలా చేయడం ద్వారా సంస్థ పనితీరుకు బాధ్యుణ్ణి చేయగలం. ఒకవేళ అతడి పనితీరు మెరుగ్గా ఉంటే పదోన్నతి కల్పించాలి. సామర్థ్యాన్ని నిరూపించుకోలేకపోతే అక్కడి నుంచి తప్పించాలి.

నూతన పారిశ్రామిక విధానంపై చివరగా ఒకమాట చెబుతాను. నిరుద్యోగ సమస్య మరింత దుర్భరమయ్యే అవకాశాలున్నాయి. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడంలో నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కాని విదేశీ పెట్టుబడులను ఎంపిక చేసిన వాటిలో మాత్రమే ఆహ్వానించాలి. పరిశ్రమల నుంచి పూర్తిగా వైదొలగకూడదు. లాభాల లక్ష్యంగా విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడిపెడతారు. ఒక్క సంవత్సరం గడుస్తున్న కొద్దీ వారి సాంకేతిక పరిజ్ఞానం మరింత అధునాతనంగా మారుతుంది. రూ. 100 కోట్లు పెట్టుబడిపెడితే కనీసం 200 మందికి కూడా ఉద్యోగాలు లభించవు. అందువల్ల మనం సాంకేతికంగా, ఆర్థికంగా వెనుకబడిన రంగాల్లోకి మాత్రమే

వారిని ఆహ్వానిద్దాం. మనకు తగినంత సామర్థ్యం ఉన్న రంగాల్లో, ప్రత్యేకించి వినియోగ వస్తువుల తయారీ రంగాల్లో పెట్టుబడులను అనుమతించొద్దు. అలాకాకుండా వ్యతిరేకంగా జరిగితే ఆర్థికాభివృద్ధి మందగించడమే కాకుండా ఉన్న పరిశ్రమలు కూడ మూతపడి అనేక మంది ఉపాధి కోల్పోతారు. కార్మికులతో మాత్రమే కాకుండా అన్నివర్గాలతో ప్రభుత్వం విస్తృతస్థాయిలో చర్చలు జరపాలి. □

# గవర్నర్ల పాత్ర

నాగాలాండ్‌లో ఏర్పడిన రాజకీయ అనిశ్చితను తొలగించడంలో గవర్నర్ కీలక పాత్ర పోషించారు. అసెంబ్లీని రద్దుపర్చి తాజాగా ఎన్నికలు నిర్వహించాలని సిఫార్సు చేశారు. ఎన్నికలు జరిగేవరకు పాత ప్రభుత్వమే ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగేలా సమర్థంగా వ్యవహరించారు.

దీనికి ప్రతిగా కేంద్రప్రభుత్వం అక్కడ రాష్ట్రపతి పాలన విధించడమే కాకుండా గవర్నర్‌ను కూడా డిస్మిస్ చేసింది. తద్వారా మిగతా రాష్ట్రాల గవర్నర్లు కూడా ప్రభుత్వం రబ్బరు స్టాంపుల్లా నడుచుకోవాలని సూచించినట్లు అయింది. ఇవేనా రాజ్యాంగంలో మనం పొందుపర్చుకున్న నియమాలు? మన రాజ్యాంగ స్ఫూర్తి ఇదేనా? రాజ్యంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మరిచారా? ప్రతి రాష్ట్ర గవర్నరు ఆ రాష్ట్రానికి రాష్ట్రపతితో సమానమని ఆయన అన్నారు. అలాంటప్పుడు మీరు ఏ హక్కుతో రాష్ట్రపతి పాలన విధించి, గవర్నర్‌ను డిస్మిస్ చేశారు? ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమే కాకుండా, తప్పుడు సంకేతాలను అందజేస్తోంది. సమస్యాత్మక సరిహద్దు రాష్ట్రమైన నాగాలాండ్‌లో ఇది చాలా ముఖ్యమైన అంశం. మీ సొంత కుటిల రాజకీయ అవసరాల కోసం ఇంతకు ముందే సమస్యాత్మక సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, కాశ్మీర్, అస్సాంలలో చిచ్చురేపారు. నాగాలాండ్‌లోనూ ఇదే చేస్తున్నారు. దేశప్రజల జీవితాలతో ఆటలాడుకోవద్దని హెచ్చరిస్తున్నాను. నాగాలాండ్‌లో రాష్ట్రపతి పాలన విధించడాన్ని, గవర్నర్‌ను తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఇది దురదృష్టకరం. తీవ్రంగా ఖండించదగినది. ప్రజాస్వామ్యం ఫెడరల్ స్ఫూర్తి పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం నమ్మకమున్నా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. □

# గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేయవద్దు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చాలీచాలకుండా నిధులు కేటాయించడం వల్ల, వరుస ప్రభుత్వాల విపరీత నిర్లక్ష్యం వల్ల నేటికీ ఇంకా దాదాపు ఒక లక్ష గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడం దయనీయమైన పరిస్థితి. నాలుగోవంతు గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేవు. దాదాపు 75,000 గ్రామాల్లో పిల్లల విద్యావసరాలను తీర్చేందుకు ప్రాథమిక పాఠశాలలు లేవు. 65 శాతానికి పైగా గ్రామాలలో పశువైద్య సదుపాయం లేదు.

గ్రామీణ ప్రజలకు తాగునీటి సదుపాయాన్ని కల్పించేందుకు దశాబ్దం పాటు ప్రాముఖ్యాన్నిచ్చిన తరువాత కూడా ఎన్నో వేల గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యంలేదు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించే పథకానికి ఈ ప్రభుత్వం ఇటీవల కీర్తి శేషులైన ప్రధానమంత్రి శ్రీరాజీవగాంధీ పేరు పెట్టింది. ఆయన పేరు మీద ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

గ్రామాల పట్ల, గ్రామీణ ప్రజల పట్ల వరుసగా ప్రభుత్వాల నిర్లక్ష్యం ఏ మేరకు ఉందో దీనివల్ల తెలుస్తోంది. రెండో పంచవర్ష ప్రణాళిక నుంచి ప్రభుత్వం పరిశ్రమలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుండడం దురదృష్టకరం. వ్యవసాయాభివృద్ధి లేకపోయినా, లక్షలాది ప్రజలకు ఉపాధి కల్పించడానికి, దేశంలోని అశేష ప్రజల

జీవన ప్రమాణాలను పెంచడానికి దేశం పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించగలదని వారనుకున్నారు. కానీ అది తప్పని తేలింది. వ్యవసాయ రంగానికి మొదటి పంచవర్ష ప్రణాళికలో దాదాపు 15 శాతం వరకూ ఉన్న నిధుల కేటాయింపు ఏడో ప్రణాళికలో 6 శాతానికి పడిపోయింది. అదేవిధంగా వ్యవసాయానికి కీలకమైన నీటిపారుదలకు మొదటి పంచవర్షప్రణాళికలో 22 శాతం ఉన్న నిధుల కేటాయింపు ఏడో ప్రణాళికలో 9.4 శాతానికి పడిపోయింది. ఈ సంవత్సరం కూడా ప్రణాళికలో పెద్దగా మార్పేమీ లేదు.

మొదటి పంచవర్ష ప్రణాళికలో కేవలం 2.8 శాతం ఉన్న పారిశ్రామిక రంగ కేటాయింపులు ఆశ్చర్యకరంగా తరువాతి ప్రణాళికలలో 11 శాతానికి పెరిగాయి. దీని ఫలితమేమంటే ఏడవ ప్రణాళిక తరువాత మన స్థూల జాతీయోత్పత్తి ఆఫ్రికా దేశాల సగటు కన్నా ఎక్కువగా లేదు. ఇతర దేశాల కంటే ఇక్కడ రెట్టింపు పేదరికం ఉంది. అయిదేళ్ళకొకసారి లెక్కించే మన ఆహారోత్పత్తి సగటు వృద్ధిరేటు ఒక పంచవర్షప్రణాళిక నుంచి మరో ప్రణాళికకు తగ్గుతూనే ఉంది. ఈ తగ్గుదల 1970-71 నుంచి 1974-75 మధ్యకాలంలో మొదలైంది. ఆహారధాన్యాల ఉత్పత్తిలో వృద్ధిరేటు ప్రస్తుతం హరిత విప్లవం ముందు నాటి కంటె తక్కువగా ఉంది. 1972-73లో వ్యవసాయ ఉపాధి రంగంలో సాలుకు 2.32 శాతం ఉన్న వృద్ధిరేటు 1982-83 నుంచి 1987-88 మధ్యకాలంలో 0.65 శాతానికి వేగంగా పడిపోయింది. మనదేశ ఎగుమతులలో వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత ఉత్పత్తుల వాటా 1981-89 మధ్యకాలంలో 31 శాతం నుంచి 16 శాతానికి పడిపోయింది.

□

## నిరుద్యోగ సమస్య

నిరుద్యోగాన్ని ఎదుర్కొనేందుకు తాను ఇస్తున్న నిధులను వినియోగించుకొని ప్రజలు ఉపాధి పొందుతున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజనను ప్రధానమంత్రి ప్రారంభించారు. దాని లక్ష్యం ఉన్నతమైంది. రూ. 25000 వరకు రుణాన్ని మంజూరు చేసే అధికారాలు బ్రాంచి మేనేజర్‌కు ఇచ్చారు. రూ. లక్షకు పైగా రుణాన్ని ఇవ్వడానికి అతను రీజనల్ ఆఫీస్ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని పథకంలో పేర్కొన్నారు. పేదవానికి రుణ సౌకర్యం అందించే విషయంలో బ్రాంచి మేనేజర్ బాధ్యత వహించవలసిందిగా నేను చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకుంటుందని భావిస్తున్నాను.

□

# పత్రికా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించాలి

బిల్లుకు మద్దతుగా మాట్లాడుతూ ఈ పదిహేను సంంవత్సరాల్లో ప్రెస్‌కౌన్సిల్ పనితీరు సంతృప్తికరం గానే ఉంది. విలేఖరులు కూడా బాద్యతా యుతంగా విధులను నిర్వహిస్తున్నారు. కానీ ప్రజలకు పెద్దగా ఉపయోగం ఉండని వార్తలకు పత్రికల్లో ఎక్కువ చోటు కల్పిస్తున్నారు. మతసామరస్యం, కుటుంబనియంత్రణవంటి అంశాల్లో సాధించిన విజయాలను దృష్టాంతాలుగా చూపడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని ఆశిద్దాం.

వార్తాపత్రికలు, వార్తా ఏజన్సీల స్వతంత్రతను పరిరక్షించడానికి సహాయంగా ఉండటమే ప్రెస్ కౌన్సిల్ లక్ష్యం. రాజకీయ నాయకులు, పోలీసులు, ఇతరుల నుంచి విలేఖరులు ఎన్నో బాధలనెదుర్కొన్న సంఘటనలు మనకు ఎన్నో కన్పిస్తాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్టవేయాలి. ప్రభుత్వ వార్తల కవరేజి సమయంలో స్పష్టమైన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. స్థానిక సంస్థలు తమ వాణిజ్య ప్రకటనలను పత్రికలకు ఇచ్చేటపుడు నిర్మిత నిబంధనలను పాటించాలి. చిన్న పత్రికలు స్థానిక వార్తలకు అధిక సాధ్రాన్యత నిఇవ్వాలి. పత్రికలు తమకు వ్యతిరేకంగా రాస్తున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి ప్రకటనలను ఇవ్వడాన్ని వ్యతిరేకించకూడదు. పత్రికా స్వేచ్ఛా పరిరక్షణకు ప్రభుత్వం కచ్ఛితమైన చర్యలు చేపట్టాలి.

రక్షణ సంబంధమైన పరికరాల కొనుగోళ్ళలో పెద్ద ఎత్తున వృధా జరుగుతోందని మనకి తెలుసు. చాలాసార్లు అధికార రహస్యాల చట్టం మూలంగా పత్రికలు ఇలాంటి సమాచారాన్ని ఇవ్వలేక పోతోంది. అధికార రహస్యాల చట్టానికి సవరణ తీసుకురావడం ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడొచ్చు. న్యూస్‌లెటర్స్ కోసం రాయితీతో కూడిన పోస్టల్ రిజిస్ట్రేషన్ పథకం అమలులో ఉంది. దీనిని ఎందుకు ఉపసంహరించారో నాకు అర్థం కావడం లేదు. ఇలాంటి రాయితీలను తప్పకుండా అమలులోకి తీసుకురావాలి. □

# నిలువనీడలేని వారిని పట్టించుకోరా ?

అయోధ్య సంఘటన ఇతర సంఘటనలపై శ్రీ అజోయ్ ముఖోపాధ్యాయ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటిస్తున్నాం. కొద్ది నిముషాల ముందే ఆర్థిక విధానం లక్ష్యాలను ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. దేశ ఆర్థిక పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది కానీ పరిస్థితులు మీపై అవిశ్వాస తీర్మానానికి మమ్మల్ని మద్దతు తెలుపమంటున్నాయి. శ్రీ అజోయ్ ముఖోపాధ్యాయ దేశ భవిష్యత్తులో ఎలాంటి ఆశా కిరణం కనిపించలేదన్నాడు. దేశంలో 1/3 వంతు జనాభా దారిద్ర్యరేఖకు దిగువునా ఉన్నారని ఆర్థిక మంత్రి అంగీకరించారు.

దేశంలోని నగరాల్లోగానీ, పట్టణాల్లోగానీ కొన్ని లక్షల మంది ప్రజలు దయనీయ పరిస్థితుల మధ్య నిరాశజనకమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. వారు పట్టెడు మెతుకులకై వీధికుక్కలతో సైతం పోరాటం చేయవలసివస్తోంది. ఇలా పేదరికం విలయ తాండవం చేస్తూంటే నివారణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు.

మనదేశంలో దాదాపు 48 శాతం మంది ప్రజలు మాత్రమే అక్షరాస్యులని ఆర్థిక మంత్రి అంగీకరించారు. దానికి తోడు చెప్పుకోదగ్గది ఒకటుంది. ప్రపంచంలో మొత్తం నిరక్షరాస్యులలో 50 శాతం మంది భారతీయులే. విద్యారంగానికి ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణికి ఈ పరిస్థితి అద్దంపడుతోంది. బాలలలో కేవలం 3 శాతం మందికి మాత్రమే విద్య లభ్యమవుతోంది. తలసరి చదువుపై ఖర్చు చేసే దేశాల్లో భారత్ 123వ స్థానంలో ఉంది.

ఆరోగ్య రంగాన్ని పరిశీలిస్తే దేశజనాభాలో 1.5 శాతం మంది క్షయతో బాధపడుతున్నారు. గతంలో మనం మలేరియా జబ్బు వెళ్ళిపోయిందని భావించాం. కానీ నేడు దేశంలో దాదాపు 20 లక్షల మంది మలేరియాతో బాధపడుతున్నారని ప్రభుత్వమే ప్రకటించింది. అలాగే 20 లక్షలమంది కుష్టువ్యాధితో బాధపడుతున్నారు. అత్యంత దురదృష్టకరమైన విషయం ఏమంటే ప్రజలకు కనీస పోషక విలువలున్న ఆహారం దొరకటంలేదు. తలసరి ప్రతి ఒక్కరికి సాలుకు 181 కిలోగ్రాముల ఆహారం అవసరంకాగా కేవలం 173 కిలోగ్రాములే లభ్యమవుతున్నాయి. సాగు ఎక్కువగా ఉన్న మన దేశంలో సగటు దిగుబడి 170 కిలోగ్రాములేకాగా అభివృద్ధి చెందిన దేశాలలో అది దాదాపు 300 కిలోగ్రాములుగా ఉంది.

దేశంలో అనేక వేల మంది తలదాచుకునేందుకు నీడ లేదు. వారిలో ఎక్కువమంది ఫుట్‌పాత్‌లపైన లేదా వీధుల్లోనే ఉంటున్నారు. ఈ దృశ్యం ఎక్కువగా ముంబై మరియు ఇతర మెట్రోపాలిటన్ నగరాల్లో కనిపిస్తుంది. నిరుద్యోగం తగ్గినట్లు ఆర్థిక మంత్రి కొన్ని అంకెలుచెప్పారు. అయితే నేడు దేశంలోని ప్రభుత్వ ఉపాధికార్యాలయాలలో దాదాపు 370 లక్షల నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసికొని ఉన్నారు. ఈ అంకెలన్ని పార్లమెంటు చెప్పింది. పరిస్థితులిలా ఉండగా మీరేమో ఏటా కోటి ఉద్యోగాలిస్తామని ప్రకటించారు. గత రెండు సంవత్సరాలలో ఎన్ని ఉద్యోగాలిచ్చారని నేను మిమ్మల్ని అడుగుతున్నాను. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అనేక రాష్ట్రప్రభుత్వాలు ఉద్యోగ నియామకాలపై నిషేదాన్ని తొలగించలేదు. గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో తెలిపే వివరాలను తెలుసుకునేందుకు శ్వేత పత్రాన్ని విడుదల చేయమని డిమాండ్ చేస్తున్నాము. □

# జాతీయ గృహవిధానానికి ఆమోదం తెలపాలి

1968లో రూపొందించిన "జాతీయ గృహ విధానం" అమల్లో ఒక్క అడుగు ముందుకేయలేకపోయాం. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యం, అశ్రద్ధలే కారణం. పట్టణాభివృద్ధి సంస్థ చేస్తున్న ప్రతిపాదనల్లో కేవలం 25 శాతం ప్రతిపాదనలనే ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఈ సమస్య ఎప్పుడు ఎలా తీరుతుంది?

గృహ నిర్మాణ కార్యకలాపాల్లో పెట్టుబడి లేమి దీనికి అసలైన ప్రతిబంధకం. ఈ తరహా పెట్టుబడుల్లో ఎల్.ఐ.సి. హడ్కోల నుంచి 26శాతం, ప్రజలు పొదుపు చేసుకున్న మొత్తాల నుంచి నాలుగుశాతం వస్తున్నాయి. గృహనిర్మాణాలకు భూమికొరతగా ఉండటం దీనికి మరో అడ్డంకి. ఇవ్వాల్సిన పరిమితికన్నా ఎక్కువగా అనుమతులు ఇవ్వడంతో పట్టణ భూమి సీలింగ్, నియంత్రణ చట్టం దుర్వినియోగ మవుతోంది. చాలా కొన్ని సందర్భాల్లో మాత్రమే డబ్బు చేతులు మారాక అనుమతులిస్తున్నారు. భూముల అద్దె నియంత్రణ చట్టంలోను ఇదే పరిస్థితు లున్నాయి. నగరీకరణపై ఏర్పాటైన జాతీయ కమీషన్ భూమి లీజు నియంత్రణ చట్టాన్ని మార్చాల్సిన సలహాలను అందించింది. లీజుదారులు హక్కులను పరిరక్షించేందుకు తగిన చర్యలను తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సూచించింది. అయితే దీనికి సంబంధించి సరైన సవరణలు చేయడంపై ప్రభుత్వం ముందుకు రావడంలేదు. గ్రామీణ నిరుపేదల విషయంలో ప్రభుత్వం ఏమీ చేయలేకపోతుంది. ఎల్.ఐ.సి. పాలసీదారులు కూడా గృహాలను నిర్మించుకోలేక పోతున్నారు. పెద్దనగరాల్లోని ఎల్ఐసి పాలసీదారులు రుణాలు పొందుతూ ఇళ్లు కట్టుకుంటున్నారు. ఇదే సదుపాయాన్ని గ్రామీణులకు ఎల్ఐసి అందించడం లేదు. పట్టణాల్లో గృహవసతిని మెరుగుపరచుకునే పథకం చాలా మంచిది. దీనికి అధికంగా నిధులు మంజూరు చేయాలి. ☐

# నివాస సమస్య

ఇందిరా ఆవాస్ యోజన పథకం ద్వారా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారు లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు, తెగల వారికి ఎక్కువ సబ్సిడీ ఇవ్వాలి. వెనుకబడిన కులాల వారికి తక్కువ సబ్సిడీ ఇవ్వాలి. సమాజంలో ఇతరుల సహాయార్థం ఋణాల పంపిణీ చేయాలి. ఇలా జరగనంత కాలం నివాస సమస్య పరిష్కారం కాదు. ☐

# పేదలపై పెనుభారం పెరుగుతోంది

పేదలు, రైతులు, మధ్యతరగతి వర్గాలకు ప్రతికూలమైన ప్రతిపాదనలే ఈ బడ్జెట్‌లో అధికంగా ఉన్నాయి. వీటివల్ల పేద, మధ్యతరగతి వర్గాలపై భారం పెరుగుతుంది. ధనికవర్గాలకు, కార్పొరేట్ రంగానికి వేలకోట్ల రూపాయల రాయితీలు ప్రకటించారు. బడ్జెట్ రూపకల్పనలో ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకు ప్రభావం అధికంగా ఉందని నేను భావిస్తున్నాను. కస్టమ్స్, దిగుమతి సుంకాలను తగ్గించాలని అవి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలనుంచి దిగుమతులపై గల ఆంక్షలను ఎత్తివేయాలని ప్రభుత్వంపై ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయి. దేశీయ పరిశ్రమలు, ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలపట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ లేదు.

ఐఎమ్ఎఫ్‌కు చెల్లించాల్సిన వాయిదాలను ముందుగానే చెల్లిస్తున్నామని గౌరవనీయులైన మంత్రి చెబుతున్నారు. దీనివల్ల కొద్దిగా వడ్డీ - తప్ప

ఒరిగేదేమీలేదన్నారు. నిరుపయోగంగా ఉండిపోయిన రూ. 66,000 కోట్ల విదేశీ రుణాలపట్ల ఆర్థిక మంత్రి అభిప్రాయమేమిటో అర్థంకావట్లేదు. మొత్తం రూ. 2,18,000 కోట్ల విదేశీ రుణం నుంచి 66,000 కోట్లు నిరుపయోగంగా పడిఉన్నాయన్నారు.

అమెరికాకు చెందిన ఎన్రాన్ విద్యుత్ కార్పోరేషన్‌తో మహారాష్ట్ర విద్యుత్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దానికి అమెరికా సంస్థ విధించిన షరతులన్నింటికీ మహారాష్ట్ర విద్యుత్ సంస్థ అంగీకరించింది. దీనికి కేంద్రం నుంచి అనుమతి రావలసి ఉంది. ఎన్రాన్ పవర్ కార్పోరేషన్ ఆర్జించే లాభాలను చెల్లించడానికి ప్రభుత్వం తీవ్ర విదేశీమారక ద్రవ్యం కొరతను ఎదుర్కొవలసి రావచ్చు. ఈ విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఇప్పుడు ఈ షరతులన్నింటికీ ఒప్పుకున్నట్టయితే, భవిష్యత్తులో విదేశాల నుంచి వచ్చే అన్ని ప్రాజెక్టులకు యిటువంటి సమస్యలు ఫలెత్తే అవకాశం ఉంది. ఇది దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్రమైన ఒత్తిడికి కారణమవుతుంది.

కేవలం నిధులు కేటాయించినంత మాత్రాన్నే పేదలకు ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ పథకం ఉద్దేశాలు మంచివే. రూ. 25,000ల వరకు ఋణాన్ని మంజూరు చేసే అధికారం బ్యాంకు మేనేజర్లకు దాఖలు పర్చారు. దీనికంటే ఎక్కువ మొత్తం కావాలంటే మేనేజర్ రీజినల్ ఆఫీసు నుంచి అనుమతి తీసుకోవాలి. దాదాపు లక్ష రూపాయలవరకు ఋణాన్ని ఇస్తారు. కానీ పేదవారు ఎలాంటి సెక్యూరిటీ పెట్టలేరు కాబట్టి, బ్యాంకు మేనేజర్లే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పై విషయాన్ని పరిగణించాల్సి ఉంది.

క్రిమి సంహారకాలపై 10 శాతం ఎక్సైజ్ సుంకాన్ని విధించారు. రైతులు అధికంగా ఉపయోగించే మోనోక్రోటోఫాస్ వంటి వాటిపైనా పన్ను విధించారు. ఎరువులు, క్రిమిసంహారకాలు, ఇతర వస్తువులపై ధరలు పెరగడం వల్ల ఇప్పటికే రైతులపై అధిక భారం పడుతోంది. క్రిమిసంహారకాల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. □

# ఒకరు లేక ఇద్దరు చాలు

మనదేశంలో పోలిస్తే చైనా ఎంతో ఆలస్యంగా జనాభా నియంత్రణ చర్యలు చేపట్టింది. అయినప్పటికీ వాళ్ళు జనాభా పెరుగుదలను అదుపు చేయడంలో కృతకృత్యులయ్యారు. ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీ, ప్రతి ప్రభుత్వాధికారీ కలసికట్టుగా కృషి చేసినందువల్ల వాళ్ళీ విజయాన్ని సాధించగలిగారు. ప్రభుత్వమే జనాభా నియంత్రణకు పూనుకోవడంలో మనదేశమే మొదటిది. అయినప్పటికీ కుటుంబ నియంత్రణ పథకంలో మనం కొద్ది మేరకే విజయం సాధించగలిగాం. కేరళ, తమిళనాడు, గోవాల నుంచి ప్రోత్సాహకర ఫలితాలొచ్చాయి. ఈ రాష్ట్రాలు ఎలా విజయం సాధించగలిగాయో మనం విశ్లేషించాలి. కుటుంబ నియంత్రణ అనేది ఏక సూత్ర ప్రాతిపదికకే పరిమితం కాకూడదు. స్త్రీలకు లేదా పురుషులకు ఆపరేషన్లు చేయడమే కుటుంబ నియంత్రణా మార్గం కాదు. కుటుంబ నియంత్రణ వల్ల ఒనకూరే ప్రయోజనాలు వారికి తెలియాలి. వివాహ వయస్సును పెంచడం, బిడ్డకూ, బిడ్డకూ ఎడం ఇవ్వడం వల్ల సమకూరే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు మెరుగైతే పేదలు ప్రయోజనం పొందుతారు. ముఖ్యంగా తల్లీ, బిడ్డా సరైన ఆరోగ్య సంరక్షణను పొందగలుగుతారు. దాంతో శిశు మరణాలు తగ్గుముఖం పడతాయి. సామాజిక ఆర్థిక స్థితి మెరుగైనప్పుడే మనదేశంలో జనాభా నియంత్రణ సాధ్యమని మనం భావిస్తూ ఉంటాం. రాజకీయ

పార్టీలను, స్వచ్ఛంద సేవా సంస్థలను, ఇతరులను ప్రభుత్వం ఈ పనిలో నిమగ్నం చేయాలి. జనాభా నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలను చేపట్టింది. ఈ ప్రోత్సాహకాలను మరింత విస్తృతం చేయాలి. 'ఇద్దరు లేక ముగ్గురు' అనే ప్రస్తుత నినాదానికి బదులు 'ఒకరు లేక ఇద్దరు' అనే నినాదాన్ని ప్రభుత్వం చేపట్టాలి. రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించాలి. ఒక మహిళ కుటుంబ నియంత్రణ పాటించి ఒక్క బిడ్డనే కన్నట్లయితే (కలిగి ఉన్నట్లయితే) ఆ బిడ్డ ఆరోగ్య పరిరక్షణ పై ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. ఆ ఒకేఒక బిడ్డకు ఉచిత విద్యను అందించాలి. ఇలాంటి ఒకే బిడ్డ ఉన్న నిరుపేద కుటుంబాలకు అణగారిన వర్గాలతో సహా స్వయం ఉపాధి పథకాలలోనూ, గృహ నిర్మాణ పథకాలలోను ప్రాధాన్యతను ఇవ్వాలి.

సంతాన నియంత్రణ విధానాన్ని ప్రోత్సహించడానికి తీసుకుంటున్న చర్యల్లో అధికారులు, ప్రభుత్వోద్యోగులు, రాజకీయ నాయకులపై వృత్తి సంబంధమైన కొన్ని ఆంక్షలను విధించే విషయంపై ఆలోచించాలి. ఇద్దరు పిల్లలకంటే ఎక్కవ సంతానం ఉన్న వారు ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించడం లాంటివి చేయాలి.

మనదేశంలో 39 శాతం మంది బీదప్రజలున్నారు. ఎక్కువ మంది గ్రామాలలోనే ఉన్నారు. మత పెద్దల ప్రభావం వీరిపై చాలా ఉంటుంది. కావున సంతాన నియంత్రణ విషయాన్ని వారికి ప్రబోధించడానికి వీరి సహాయం తీసుకోవాలి.

సంతాన నియంత్రణ ఆపరేషను చేసుకున్న ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం రెండు ఇంక్రిమెంట్లను ఇస్తున్నది. అలాగే గ్రామీణ ప్రజలకు కూడా 150 రూపాయలను ప్రోత్సాహక నగదుగా ఇస్తున్నది. ఇది చాలా తక్కువ మొత్తం. ఇందులో అది కూడా పూర్తిగా అందడం లేదు. పెద్ద కుటుంబం వల్ల కలిగే బాధలపట్ల ఉద్యోగులకు అవగాహన ఉంటుంది. కాని నిరక్షరాస్యుడైన గ్రామీణుడికి ఈ విషయం పట్ల సరైన అవగాహన లేదు. వారిని దీనిపట్ల ఆకర్షితులను చేయడానికి ప్రోత్సాహక నగదు మొత్తాన్ని పెంచాలి. సంతాన నియంత్రణ పథకాన్ని ఒంటరిగా అమలు చేయకుండా దానితో పాటు అక్షరాస్యతను పెంచడం, వైద్య సదుపాయాలను కల్పించడానికి బడ్జెట్‌లో మరిన్ని నిధులను కేటాయించాలి. అప్పుడు దీనికంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు.

సంతాన నియంత్రణను ఒక జాతీయ విధానంగా రూపొందించాలి. జాతీయ కమీషన్‌కు ప్రధాని అధ్యక్షుడిగా, రాష్ట్ర కమీషన్‌కు ముఖ్యమంత్రులు అధ్యక్షులుగా ఉండేటట్టు చర్యలు తీసుకుంటే పథకం సమర్థవంతంగా అమలౌతుంది. □

# తల్లి, బిడ్డల సంరక్షణ అతిప్రధానం

ఈ బిల్లుపై కొన్ని విషయాలు చెప్పటానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు మా మద్ధతు తెలుపుతున్నాను. గౌరవనీయ సభ్యులు ఇదే విషయాన్ని ప్రత్యేకంగా మహిళాసభ్యులు కొన్ని విషయాలు చెప్పారు. వారు చెప్పిన దానినే సుదీర్ఘంగా మళ్లీ చెప్పటంలేదు. కాని పిల్లల సంరక్షణకు కావలసిన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని చెప్పదలచుకున్నాను. వారు దేశానికి రేపటి పౌరులు.

వారి ఆరోగ్య పరిస్థితులు సరిగా లేకున్నా, వారి మరణాలరేటు తగ్గించకున్నా జనాభా నియంత్రణ విధానంపై దుష్పరిణామం చూపిస్తుంది. మరణాల రేటును తగ్గిస్తే, ఇతర దేశాల్లో చేస్తునట్లు పిల్లల ఆరోగ్యంపై భరోసా ఉండి, ఒకరు లేదా ఇద్దరు పిల్లలతో మాత్రమే కుటుంబాన్ని చూసుకుంటారు.

దీనితో బిల్లు ఆశయాలు పూర్తిగా నెరవేరుతాయి.

చాలా నిబంధనలు సరిగా ఉన్నాయి. ఇంతక్రితమే ఈ బిల్లు తెచ్చారు. 1983లోనే ఈ సభ ఆమోదించినా, 1986లో రాజ్యసభ ఆమోదించనందున బిల్లు పనికిరాకుండా పోయింది. ఇప్పుడు మళ్ళీ తీసుకువచ్చారు.


బిల్లుకు మా పూర్తి మద్ధతు తెలుపుతున్నాము. పాల ఉత్పత్తుల ప్రకటనలను నిలిపి వేయాలి. తల్లీ బిడ్డల సంరక్షణకు మరిన్ని ఎక్కువ నిధులు ప్రభుత్వం ఇవ్వాలి. దీనితో బీదగర్భిణీస్త్రీలు ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. వారు ఆరోగ్యంగా ఉండటంతో తమ పిల్లలకు సరియైన పాలు ఇవ్వగలుగుతారు. స్వరాజ్యం వచ్చి 45 ఏళ్లు అయినా ఇప్పటికీ వేల మంది పిల్లలు చనిపోవడం దురదృష్టకరం. ముఖ్యంగా చంటిపిల్లలు చనిపోతున్నారు. అందుకే వారికి సరియైన పోషణ చూడాలి. అలాగే తల్లీ పిల్లల సంరక్షణ చేపట్టాలి. దీని కోసం కార్యక్రమం ఉందో లేదో తెలియదు కానీ ఎక్కువ నిధులు విడుదల చేయాలి. □



# ప్రభుత్వ విధానాలు చట్టాలు



గవర్నర్ సూర్జిత్ సింగ్ బర్నాలాతో వడ్డే



మాజీ ఉప ప్రధాని దేవీలాల్‌తో వడ్డే

# వినిమయదారుల పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి

ఈ చట్టాన్ని సమ్మతించని విషయమై నేను ఇంతకు ముందే నోటీస్ ఇవ్వడం జరిగింది. ఇప్పుడే గౌరవ హోంమంత్రి ఈ చట్టాన్ని ఏ పరిస్థితిల్లో తెచ్చారో వివరించారు. దీనిని నేషనల్ కన్సుమర్ డిప్యూట్ కమీషన్ నిర్ణయం ప్రకారం తీసుకువచ్చారు.

కాని ఈ చట్టంతో పాటు ఇంకా కొన్ని సవరణలు తీసుకురావలసిందని నా అభిప్రాయం.

మీరు తెలిపిన ప్రకారం 1986లో అప్పటి మంత్రి హెచ్.కె. ఎల్. భగత్, ఈ బిల్లులో లోపాలున్నాయని, ఇది అర్ధవంతంగా లేదని అంగీకరించారు. సభాముఖంగా దానిని అంగీకరించారు. అయితే కాలం గడిచేకొద్దీ ఏవైనా లోపాలు తలెత్తితే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

తప్పకుండా ప్రభుత్వం ముందుకు వచ్చి బిల్లులోని లోపాలను సవరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని నేను భావించాను.

గౌరవ మంత్రిచే ఈ రోజు ప్రవేశపెట్టిన బిల్లులో అటువంటివి ఏమీ లేక

పోవడం దురదృష్టకరం. ప్రస్తుత బిల్లులో జిల్లా వినియోగదారుల ఫోరం గురించిన చిన్న సవరణ తప్ప ఏమీలేదు.

ఈ ప్రభుత్వం దేశంలోని పేద వినియోగదారుల గురించి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. గాంధీజీ నాలుగు దశాబ్దాల క్రితమే చెప్పిన సత్యం ప్రస్తుతానికి సరిగ్గా సరిపోతుంది.

" మనకు సంబంధించిన వరకు వినియోగదారుడు ముఖ్యుడు. అతడు మనపై ఆధారపడలేదు. మనమే అతనిపై ఆధారపడ్డాము. అతడు మన పనికి అంతరాయం కాదు. దీనికి అతడే కారణం. మనం అదే అవకాశాన్ని వినియోగదారునికి ఇచ్చిఉపకారం చేయడం లేదు. మనకే అతడు అవకాశం ఇచ్చి ఉపకారం చేయుచున్నాడు"

చాలాకాలం క్రితమే గాంధీజీ చెప్పిన విలువైన వాక్యాల గురించి మీకు తెలిసే ఉంటుంది. అప్పుడు ఈ నైతిక విలువలు, ఇప్పటికంటే ఎంతో విలువైనవి మీరు అంగీకరిస్తారు.

హెచ్.కె.ఎల్ భగత్ చెప్పిన విషయాలను హోంమంత్రి దృష్టికి తీసుకురావాలని అనుకుంటున్నాను.

"ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు సంతృప్తికరంగా లేవు"

సమితి స్థాయికి, గ్రామస్థాయికి, వెళ్ళి వినియోగదారులను వారి హక్కుల పట్ల చైతన్య వంతులను చేస్తామని, అదే ప్రభుత్వం ఉద్దేశమని చెప్పింది.

కాని ఇప్పటి వరకు అందులో విజయం సాధించలేదు. ప్రభుత్వ విధానం చూస్తే దీనిని సీరియస్‌గా తీసుకొన్నట్లుగా లేదు. నాలుగున్నర సంవత్సరాల పరిపాలన తర్వాత కూడా సగం జిల్లాలకు జిల్లా ఫోరాలు పరిమితం అయ్యాయి. దురదృష్టవశాత్తు ఈ రోజుల్లో వ్యాపారుల ఆశకు అంతం లేకుండా పోయింది. వారు బియ్యంలో, చక్కెరలో ఇసుకవేసి అమ్ముతున్నారు. మందులను కూడా కల్తీ చేయడంలో వెనుకాడటం లేదు.

ఏవిధంగానైనా డబ్బు చేసుకోవాలన్నదే వారి ఆశయం. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన సవరణలు చేయాలి.

ఉదా:- ఒక వినియోగదారుడు కల్తీ బారినపడి ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఈ బిల్లులో ఎటువంటి అవకాశాలులేవు. పేద ప్రజలు ఈ కేసు

గురించి నెలలు, సంవత్సరాలు ఆగలేరు. అందువలన ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల భద్రతా చట్టంలో సవరణలు తీసుకువచ్చి పేద వినియోగదారునికి మేలు చేయాలి.

క్రిమిసంహారక మందుల్లో కల్తీల గురించి మనం వింటున్నాం. ఎంతోమంది రైతులు మోసపోవుచున్నారు. ఎంతో కష్టపడి, సంపాదించి, పొదుపు చేసిన డబ్బును వారు ఖర్చు చేయుచున్నారు. ఆ మందులు సరిగా పనిచేయవు. ఫలితంగా రైతులు పంటలను కోల్పోతున్నారు. ఎవరు కూడా వారికి నష్టపరిహారం చెల్లించడం లేదు.

ఇది ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. మీకు తెలిసిన ప్రకారం కాంప్లెక్సు ఎరువుల ధరలు అధికం అయినప్పటికీ, నాణ్యత అంతగా ఉండటంలేదు. సరఫరా దారులు కల్తీచేసి డబ్బులు విపరీతంగా సంపాదిస్తున్నారు.

నా సలహా ఏమిటంటే అటువంటి విషయాలు మీ దృష్టికి వచ్చినప్పుడు కఠిన చర్యలు తీసుకోండి.

ఉదా:- ఒక వినియోగదారుడు కల్తీ గురించి జిల్లా ఫోరంలోగాని, రాష్ట్ర ఫోరంలోగాని, ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి, విచారణ జరిపి వినియోగదారునికి నష్టపరిహారం వచ్చేలా చూడాలి. కాని పరిపాలకుల నిర్లక్ష్య వైఖరి వలన లక్షల మంది వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.

అంతేకాకుండా వినియోగదారులకి వారి హక్కుల పట్ల అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత కూడా కారణం.

ఎంతో మంది గ్రామీణులకు జిల్లా ఫోరం గురించి కూడా తెలియదు. అందువలన దీనిని ఆసరాగా తీసికుని తయారీదారులు, వ్యాపారులు కల్తీ వస్తువులను వినియోగదారులకు సరఫరా చేయుచున్నారు.

జిల్లా ఫోరం, రాష్ట్ర ఫోరం, నకిలీ వస్తువులను సరఫరా చేసినందుకు ఉత్పత్తిదారులకి పెద్ద మొత్తంలో పెనాల్టీ విధించాలి. ఇదే నేను ప్రభుత్వానికి చెప్పదలచుకొన్నది.

సర్ రైతులకి నకిలీ విత్తనాలు అందజేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. చాలా సార్లు ఈ విషయాన్ని మేము సభలో ప్రస్తావించడం జరిగింది. చాలా ఆశలతో, వేల రూపాయలు వెచ్చించి ప్రజలు విత్తనాలు కొంటారు. కాని వాటిలో నాణ్యత

లోపిస్తుంది. ఫలితంగా రైతులు ఎంత కష్టించినా, చివరికి నష్టాల బారిన పడు తున్నారు. మీకు కూడా ఈ విషయం తెలుసు. కావున నా విన్నపం ఏమనగా ప్రభుత్వం నిర్దిష్ట విధానాలతో ముందుకు వచ్చి, బిల్లును ప్రవేశపెట్టి ఇటువంటి నకిలీలు జరగకుండా చర్యలు తీసుకుని నకిలీ చేసే వారిని కఠినంగా శిక్షించాలి.

తర్వాత వినియోగదారుల భద్రతా చట్టం గురించి మీడియాద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నేను అభిప్రాయపడుచున్నాను. ఇప్పటికే కొన్ని దిన పత్రికలు, కొన్ని కాలమ్స్‌ని కేటాయించి వినియోగదారులకి మోసపూరిత సంఘటనల గురించి తెలియజేసి, పొందిన నష్టపరిహారం గురించి ప్రజలకి తెలియజేస్తున్నారు. వీటివలన అతని హక్కులు పరిరక్షించగలుగుతున్నారు. అందుకు నేను వారికి ధన్యవాదాలు తెలియజేయుచున్నాను. ఈ రోజుల్లో టి.వి. అనేది శక్తివంతమైన ప్రసార సాధనంగా తయారయింది. ఇది సూటిగా ప్రజల హృదయాల్లోకి చొచ్చుకుపోతుంది. ప్రభుత్వం ఎలక్ట్రానిక్ మీడియాలో కొంత సమయం కేటాయించి వినియోగదారులలో చైతన్యం తీసుకురావాలని నా మనవి.

అమెరికాలో రాల్ఫ్‌నాడార్ అనే వ్యక్తి జనరల్ మోటార్స్‌కి వ్యతిరేకంగా పోరాడాడు. ఒక మోడల్ వినియోగదారులకి అనుగుణంగా లేదని, దానిని ఇంజనీర్లతో పరీక్ష చేయించాడు. తర్వాత వివిధ ఫోరాలలో కేసుని వేశాడు. పోరాడి అంతిమంగా విజయం సాధించాడు.

ఈ దేశంలో ఇటువంటి పోరాటాలు జరపడానికి బీదరికం, నిరక్షరాస్యత అడ్డంకిగా ఉన్నాయి. 75 శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. దీని నుంచి రక్షించడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. ప్రభుత్వం చొరవ తీసుకోనంత కాలం వినియోగదారునికి న్యాయం జరుగదు.

అవసరం అయినప్పుడు జరగని న్యాయం, న్యాయం కాదు. ఇప్పటికే ఐదు సంవత్సరాలు గడచిపోయాయి. తక్షణమే ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని నేను అభ్యర్థిస్తున్నాను.

సెక్షన్-14ను కూడా సవరించవలసిన అవసరం ఉన్నది. ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని ఇటువంటి లోపాలుసవరించాలి. హోం మంత్రి శ్రద్ధ వహించి, ఈ సమావేశాల్లో కాకపోయినా, వచ్చే సమావేశాల్లో నిర్దిష్ట విధి విధానాలతో బిల్లు రూపొందించాలని నేను కోరుతున్నాను. ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకొనేలా నేను ఒత్తిడి తీసుకువస్తాను.

□

# వినియోగదారుల చట్టాల విషయంలో ప్రజల్ని చైతన్య పరచాలి

ఉప సభాపతి గారూ, వినియోగదారుల (హక్కుల) పరిరక్షణ బిల్లు - 1993కు నేను మద్ధతు తెలుపుతున్నాను. ప్రభుత్వం తెచ్చే ఇలాంటి బిల్లులను మేం స్వాగతిస్తున్నాం. వినియోగదారుల చట్టం అమలవుతున్న తీరును గత ఆరు సంవత్సరాలుగా వర్కింగ్ గ్రూపు పరిశీలించింది. అమలులో జరుగుతున్న ఉల్లంఘనలను అధిగమించడానికి వర్కింగ్ గ్రూపు సూచనలు చేసింది. వాటిని ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకొని, దగ్గరలోనే చట్టానికి మరిన్ని సవరణలు చేస్తుందని మేం నమ్ముతున్నాం. ఇలాంటి సవరణలను పలు వినియోగదారుల సంఘాలు కూడా డిమాండుచేస్తున్నాయి. మొట్టమొదట ఈ సవరణ బిల్లు విషయానికొద్దాం. వినియోగదారులు ప్రయోజనం కోసం జిల్లా ఫోరమ్‌లోగాని, రాష్ట్ర కమీషన్‌లో గాని ఫిర్యాదు చేసుకోవచ్చునని చెప్పే బిల్లులోని సెక్షన్ - 25ను స్వాగతిన్తున్నాం. సెక్షన్-6 ప్రకారం ఆహారపదార్థాలను కూడా సేవల రంగంలోకలిపారు. ఆ సెక్షన్ జిల్లా ఫోరమ్ పని తీరును, సెక్షన్ - 16 రాష్ట్ర కమీషన్ పనితీరును, సెక్షన్ - 20 జాతీయ కమీషన్ పనితీరును గురించి వివరిస్తాయి.

ప్రజాహితం దృష్ట్యా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమీషన్ల జవాబుదారీ తనాన్నీ పెంచడానికి 10, 16, 20 వ సెక్షన్లకు చేసిన సవరణలు దోహదం చేస్తాయి. నేను భావిస్తున్నాను.

సెలక్షన్ కమిటీలను కూడా మీరు ప్రకటించారు. అనధికార వర్గాలకు సెలక్షన్ కమిటీలలో స్థానం కల్పించడం మంచి పరిణామం. 11,17,20వ సెక్షన్ల ప్రకారం రూ. లక్ష నుంచి 5 లక్షల మొత్తానికి సంబంధించిన కేసులను జిల్లా ఫోరమ్, రూ. 10 లక్షల నుంచి 20 లక్షల వరకు స్టేట్ కమీషన్లు విచారణ జరపవచ్చు. రూ. 20 లక్షల విలువకు పైన ఉన్న కేసులను జాతీయ కమీషన్ విచారణ చేస్తుంది. గత ఏడు సంవత్సరాలుగా వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వివిధ స్థాయిల్లోని వినియోగదారుల ఫోరమ్‌ల విచారణ పరిధిని విస్తరించడం శుభపరిణామం.

సెక్షన్ - 2 కు కూడా సవరణలు అత్యంత ఆవశ్యకం. ఇది వాణిజ్య వ్యవహారాలకు సంబంధించినది. చాలా సందర్భాల్లో వ్యాపారులు, షాపుల యజమానులు వినియోగదారులును కొంటున్న వస్తువుతో పాటు మరో వస్తువు కూడా కొనుక్కోమని బలవంతపెడుతున్నారు. ఇలాంటి వస్తువును కొనుక్కోవడం వల్ల వినియోగదారునిపై అదనపు భారం పడుతుంది. మానవ జీవితాలకు చేటు చేసే వస్తువులను దృష్టిలో ఉంచుకొని క్లాజ్ -5 లో చేర్చిన సవరణలు కూడా అత్యంత ఆవశ్యకమైనవి. అందులో స్వయం ఉపాధి పొందే సభ్యుల శక్తిని పెంపొందించడానికి సంబంధించిన క్లాజ్ ఉంది. వారు కొన్నదానిపై నష్టం వస్తే దాన్ని భర్తీ చేసేందుకు ఉద్దేశించిన అంశాలు క్లాజ్ -5లో ఉన్నాయి. చవకబారు పిర్యాదులతో వినియోగదారుల చట్టాన్ని తప్పుదోవ పట్టించే వారిని శిక్షించడానికి ఉద్దేశించిన ఇరవై ఆరో క్లాజ్‌ను కూడా మేం స్వాగతిస్తున్నాం. ఇది మంచి పరిణామం కూడా. వాస్తవంగా నష్టపోయిన వ్యక్తులు మాత్రమే వినియోగదారులు ఫోరానికి ఫిర్యాదు చేయాలి. దాన్ని మేం ప్రశంసిస్తున్నాం.

ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలు లాంటి ప్రధానమైన అంశాన్ని వినియోగదారులు చట్టం పరిధిలోకి తేవడం పట్ల మేం అసంతృప్తి చెందాం. దీనికి మీరు ఆసుపత్రులలో పరిస్థితులు మెరుగుపడతాయని చెప్పవచ్చు. ఆసుపత్రులలో పరిస్థితులు అభివృద్ధి చెందకపోవడం వల్లే ఈ సవరణ తెచ్చాం అని మీరు చెప్పవచ్చు. కానీ 'అభివృద్ధి' కి అర్థం ఏమిటో మేం తెలుసుకోవాలని ఆసక్తితో ఉన్నాం. దీనిపట్ల మీ ఆలోచన ఏమిటి? మీరు సమాధానం చెప్పే సమయంలో దీన్ని స్పష్టం చేయగలరు. వినియోగదారులకు, రోగులకు, ఆసుపత్రులలో మెరుగైన సేవలను అందించడానికి డాక్టర్లు, ఇతర సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరించండి. ప్రభుత్వ వైద్యశాలలో పరిస్థితులు మెరుగుపరచడానికి ప్రభుత్వపరంగా

ఎలాంటి చర్యలు చేపడతారు? దయచేసి వీటిని వివరించండి.

ఏది ఏమైనప్పటికీ, వినియోగదారుల హక్కుల చట్టాన్ని జిల్లాలస్థాయిలో అమలుచేయడంపైనే దాని విజయం ఆధారపడి ఉంది. జిల్లా ఫోరమ్ సమర్థవంతంగా పనిచేయడం పైనే ఇది ఆధారపడి ఉంది. మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నా స్వానుభవాలను మీ ముందుంచుతాను. రాష్ట్రంలోని 23 జిల్లాలలో, నాకందిన సమాచారం ప్రకారం కేవలం నాలుగు జిల్లాలకు మాత్రమే నియమాల పరంగా పూర్తిస్థాయి వినియోగదారుల ఫోరమ్ ఛైర్మన్ (అధ్యక్షులు) ఉన్నారు. జిల్లాలలో జడ్జిలే జిల్లా ఫోరమ్‌కు అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. తత్ఫలితంగా జిల్లా జడ్జీలు వినియోగదారుల ఫోరమ్‌కు కేవలం ఒక రోజు మాత్రమే పనిచేస్తున్నారు. అదీ జిల్లా జడ్జి స్వతహాగానే కేసులను స్వీకరిస్తున్నారు. పర్యవసానంగా కేసులు రోజురోజుకూ పెరిగిపోయి, విచారణకు నోచుకోకుండా మూలన పడుతున్నాయి. జిల్లా ఫోరమ్‌లు వాస్తవంగా ఫిర్యాదులను మూడు లేదా ఐదు నెలల్లోగా పరిష్కరించాలి. కానీ అలా జరగడం లేదు. దీన్ని పరిశీలించాలని గౌరవనీయులైన మంత్రి ఆంటోని గారిని కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో మార్చి, 1993 నాటికి 40,205 కేసులు నమోదుకాగా, 29,267 కేసులను పరిష్కరించారు. అంటే మార్చి, 1993 నాటికి 10,938 కేసులు విచారణ పూర్తి కాకుండా నిలచి ఉన్నాయి. గత ఏడాది రాష్ట్రస్థాయిలో 735 కేసులు నమోదుకాగా, కేవలం 94 కేసులను మాత్రమే పరిష్కరించారు. కాబట్టి కేసులు సత్వర పరిష్కారానికి అన్ని జిల్లాలకూ పూర్తి కాలపు వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులను నియమించాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

ఈ సందర్భంలో ఓ అంశాన్ని మీ దృష్టికి తీసుకొస్తాను. ఏ జిల్లాల్లో అయితే వినియోగదారుల ఫోరమ్‌కు పూర్తి కాలపు అధికారులు ఉన్నారో, అక్కడ ప్రజల్లో చైతన్యం పెరిగింది. పూర్తికాలపు అధ్యక్షుడు పనిచేస్తుండటంతో కేసులు త్వరగా పరిష్కరించడం జరిగింది. దాంతో వినియోగదారులు తమ హక్కులను తెలుసుకొన్నారు. వారికి జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకొనేందుకు ఫోరమ్‌కు వెళుతున్నారు. ఏ జిల్లాల్లో వినియోగదారుల ఫోరమ్‌కు పూర్తికాలపు అధికారులు లేరో, అక్కడ నియమించాలని ప్రభుత్వానికి నేను సలహా ఇస్తున్నాను. ఈ సందర్భంలో మహాత్మాగాంధీ చెప్పిన అంశాన్ని మీ దృష్టికి తెస్తాను.

''వినియోగదారుడు మన ప్రధాన అతిథి. ఆయన మనపై ఆధారపడటం లేదు. పైగా మనమే వినియోగదారుడిపై ఆధాపరపడి ఉన్నాం అలా అని మనం వినియోగదారుడి పట్ల దయచూపడం లేదు. వాస్తవంగా వినియోగదారుడే సేవ చేయడానికి మనకు అవకాశం కల్పిస్తున్నాడు'' అని గాంధీజీ చెప్పారు.

జాతిపిత చెప్పిన గొప్పమాటలను మనం గుర్తించుకోవాలి. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు నడుంబిగించాలి. కల్తీ పురుగు మందులు, ఎరువులు,

నాణ్యతలేని విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా బాధపడుతున్నారు. బహుళజాతి కంపెనీలు కూడా ప్రజల్ని, రైతుల్ని మోసం చేస్తున్నాయి. దీనిపట్ల వినియోగదారుల్లో చైతన్యం తేవాలని ప్రభుత్వాన్ని అర్థిస్తున్నాను. మీడియా ద్వారా మరీ ముఖ్యంగా దూరదర్శన్ ద్వారా ప్రచారం చేసి వినియోగదారులను చైతన్యపరచాలి. అలానే వినియోగదారుల్ని చైతన్య పరచే సాహిత్యానికి ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించాలి. ఆ సాహిత్యాన్ని వివిధ భాషల్లో తయారుచేసి ప్రజలకు పంచాలి. అలా వినియోగదారులను చైతన్య పరచాలి. ఈ విధంగా చేస్తే చివరకు బలమైన వినియోగదారుల విప్లవం ఏర్పడుతుంది. ఇతర దేశాల్లో వినియోగదారుల్లో చైతన్యం ఈ పద్ధతులవల్లే వచ్చింది.

□

# కల్తీ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

సాధారణంగా చిన్న వ్యాపారులు ఆహార పదార్థాలను హోల్‌సేల్ వ్యాపారులనుండి కొన్ని సమయాల్లో ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేస్తారు. హోల్‌సేల్ వ్యాపారాలు, ఉత్పత్తిదారులు ఎక్కువ సమయాల్లో ఆహార పదార్థాలను కల్తీ చేస్తారు.

సామాన్యంగా చిన్న వర్తకులు వారు అమ్మే ఆహార పదార్థాలను కల్తీ చేస్తారు. కానీ చిన్న వర్తకులే పట్టుబడతారు. ఆహార శాఖ నిఘా యంత్రాంగం తమ దృష్టిని హోల్‌సేల్ మరియు ఉత్పత్తిదారులవైపు మళ్ళించదు. వ్యాపారమే జీవనాధారంగా ఉన్న చిన్న వ్యాపారులు చాలా తక్కువ సమయాల్లో ఆహార పదార్థాలు కల్తీ చేసి జైలు కెళతారు. కాని నిజంగా ఆహార పదార్థాలను కల్తీ చేసే హోల్‌సేల్ మరియు ఉత్పత్తిదారులు మాత్రం శిక్షవడకుండా తప్పించుకుంటున్నారు. సంపన్నులు పలుకుబడి ఉన్నవారు తప్పించుకొని చిన్న వర్తకులకు వ్యతిరేకంగా మాత్రమే ఆహార కల్తీ నిరోధక చట్టం అమలు జరుపబడుతుందనే అభిప్రాయం కలుగుతోంది. చిన్న పొరపాటుకు జైలు శిక్ష పడేలా ఉన్నందున న్యాయం చిన్న వ్యాపారులకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. ఇలాంటి కేసులను పరిశీలనానంతరం 432 సిఆర్‌పిసి సెక్షన్ ప్రకారం విధించిన శిక్షను ప్రవర్తన బాగున్నట్లయితే ఖైదులను విడుదల చేసే విషయాన్ని పరిశీలించవలసిందిగా సుప్రీంకోర్టు ప్రభుత్వానికి సూచించింది. చిన్న వ్యాపారులు వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ చట్టానికి తగిన సవరణలు చేయవలసిందిగా కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

□

# ఎగుమతి - దిగుమతుల విధానం సవరించాలి

చట్టం గురించి పాండే వివరించారు. కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల వల్ల తలెత్తిన అసందిగ్ధతను ఆయన తెలిపారు. పాండే చెప్పినదాన్ని నేను మళ్ళీ చెప్పను. కానీ గౌరవనీయులైన మంత్రివర్యుల నుంచి నేను వివరణ కోరుతున్నాను.

1991 ఫిబ్రవరి 22, జూలై 12న అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం ఇదే సమాధానం ఇచ్చింది. దీన్ని బట్టి ప్రభుత్వం గందరగోళంలో ఉన్నట్లు కనపడుతోంది.

గతంలో తలెత్తిన అసందిగ్ధతను తొలగించడానికి అవసరమైతే చట్ట సవరణకు ఉపక్రమించాలి. ప్రస్తుతం ఉన్న చెల్లింపుల సమతుల్యత సంక్షోభం నుంచి బయటపడడానికి, ఎగుమతి-దిగుమతుల విధానాన్ని సరళీకరించాలి. ప్రస్తుత నిబంధనలు చాలా అసందిగ్ధంగా ఉన్నాయనే విషయం గౌరవనీయులైన మంత్రివర్యులకు తెలుసు. ఎగుమతి లావాదేవీలు చేసే ప్రతిసారీ వివిధ ప్రభుత్వశాఖలను సంతృప్తి పరచడానికి దాదాపు 25 రకాల పత్రాలను సమర్పించాల్సి వస్తోంది.

ఎగుమతి లావాదేవీల ప్రక్రియను సరళీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనివల్ల ఎగుమతిదారులకు ప్రోత్సాహం లభించి, ఎగుమతులు పెరుగుతాయి. తద్వారా ప్రస్తుత పరిస్థితిని అధిగమించడానికి వీలు కలుగుతుంది. ఎగుమతులు, దిగుమతుల ముఖ్య నియంత్రణాధికారి ఒక మంచి మిత్రుడిగా, మార్గదర్శకుడిలా ఉండాలి. నియంత్రికుడిలా కాదు. దేశ ఆర్థిక పరిస్థితి పెరుగుదలకు గౌరవ మంత్రివర్యులు తగిన చర్యలు చేపడతారని నేను భావిస్తున్నాను. ఈ దిశగా ఆయన నుంచి నేను వివరణ కోరుతున్నాను.

అధ్యక్షా, మాజీ ప్రధానమంత్రి విషాద హత్యోదంతాన్ని దేశప్రజలు ఇప్పుడిప్పుడే మరచిపోగలుగుతున్నారు. ఈ హత్యకేసులో నిందితుడైన షణ్ముగం పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకోవడం పట్ల ప్రజలు ఆశ్చర్యాన్ని, అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. హత్యోదంతంపై కేంద్ర నేర పరిశోధన శాఖ సాగిస్తున్న దర్యాప్తు ముగిసి నిందితులకు శిక్షలు పడతాయని భావిస్తున్న దశలో ఈ సంఘటన జరగడం తీవ్ర విచారకరం.

ఈ సంఘటన జరగడానికి చూపించే సాకులను వాస్తవంగా ఏ ఒక్కరు నమ్మరు.

''షణ్ముగం ఒక ప్రముఖ స్మగ్లర్'' అని గౌరవనీయులైన హోంమంత్రి ప్రకటించారు. 1991-92 సాధారణ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా 463 ప్రకారం హోంమంత్రి తన సమాధానం తెలియజేయాలని కోరుతున్నాను. ప్రభుత్వం వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను పెంచడం ద్వారా చెల్లింపుల సమతుల్యతను కాపాడి, వాణిజ్య లోటును తగ్గించుకోగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. కానీ మీ ప్రయత్నాలు ఆ దిశగా లేవు. ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోంది. ఫలితంగా వ్యవసాయోత్పత్తుల దిగుబడులు తగ్గిపోతున్నాయి.

మన పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోలిస్తే మన దేశంలో ఎరువుల ధరలు ఎక్కువగా ఉన్నాయి. నేను ఒక విషయం మీ దృష్టికి తీసుకురాదలుచుకున్నాను. 1989లో డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డి.ఎ.పి.) టన్ను ధర ఇక్కడ రూ. 3600 ఉండేది. అదే పాకిస్తాన్‌లో రూ. 3211, బంగ్లాదేశ్‌లో రూ. 2700 మాత్రమే. ఎస్.ఎస్.పి. టన్నుధర 1989లో ఇక్కడ రూ. 950, అదే పాకిస్తాన్‌లో రూ. 791 ఉండేది. మన దేశంలో ఎరువులకు రాయితీలు ఇస్తున్నప్పటికీ పొరుగు దేశాల కంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. రాయితీలలో కోతపెట్టి 40 శాతానికి పరిమితం చేస్తే ఎరువుల ధరలు పెరగడమే కాకుండా, ఎరువుల ఉత్పత్తి వ్యయం

కూడా పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో మన వ్యవసాయోత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లో ఇతర దేశాలతో పోటీ పడలేవు. ఈ పరిస్థితిని మీరు ఏవిధంగా చక్కదిద్దుతారు.

ఈ రోజు జీరోఅవర్‌లో ఈ అంశం గురించి ప్రస్తావించాను. కనుక మళ్ళీ ఈ విషయాన్ని ప్రస్తావించను. ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే నా ఉద్దేశ్యం.

దేశవ్యాప్తంగా రైతులు ఈ విషయం మీద ఆందోళన చెంది, ఉద్యమాలకు దిగుతున్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ సభ్యులు ఈ అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో మాట్లాడిన సభ్యులందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా బంద్‌లు, రాస్తారోకోలు జరుగుతున్నాయి. □

# పేటెంట్ చట్టం ప్రయోజనకరం

ఔషధ విధానంపై సమీక్ష చర్చ ప్రధానాంశాలలో ఒకటి. ఇదివరకే అమలులో ఉన్న విధానాన్ని ప్రస్తుతం సమీక్షించాలి. అదే సమయంలో ఈ విధానంవల్ల పొందిన ప్రయోజనాలను గుర్తుంచుకోవాల్సి ఉంటుంది.

ఔషధ విధానం (1986) లోని అంశాలు భారతీయ పేటెంట్ చట్టం (1970) లోని అంశాలకు సామ్యముంది. ఈ చట్టాల వల్ల దేశం ప్రయోజనం పొందుతుంది. ఇది అమలులోకి వచ్చిన తరువాత 250 పెద్ద కంపెనీలు, 8000 చిన్న తరహా యూనిట్లు తెరపైకి వచ్చాయి. భారత పేటెంట్ చట్టం (1970) వల్ల వేల సంఖ్యలో చిన్నతరహా యూనిట్లు ప్రారంభమై ప్రజల అవసరాలను తీరుస్తున్నాయి. పేటెంట్ చట్టం వల్ల పొందిన ప్రయోజనాలివి.

దేశంలో మూడోవంతు ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. రెండు పూటలా తిండికే లేని వారు మందుల రేట్లు ఇరవై రెట్లు పెరిగితే వాటిని కొనటం అనేది వారికి గగనమవుతుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారము జాతీయోత్పత్తిలో 5 శాతం ఆరోగ్యానికి వినియోగించాల్సి ఉంటే, మనదేశంలో కేవలం 1 శాతం మాత్రమే వినియోగిస్తున్నారు. నిధుల కొరత ఉందని మంత్రిత్వ శాఖ చెబుతోంది. □

# విదేశీ మారకద్రవ్య పరిరక్షణ

ఈ రద్దు ఆర్డినెన్సును సకాలంలో తీసుకురాలేదని నేను అభిప్రాయ పడుతున్నాను. 1999లో ఈ ట్రావెల్ ట్యాక్సును ప్రవేశపెట్టడానికి కారణం విదేశీ పర్యటనలను నిరుత్సాహపరచి ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవడం, ఇప్పుడు ఈ విధానాన్ని రద్దు చేస్తే అసలు ఉద్దేశం దెబ్బతింటుంది. ఇంతకుముందుకన్నా చెల్లింపుల సమతౌల్యం పరిస్థితి చాలా వరకు మెరుగుపడింది. కానీ ఇంకా పూర్తిస్థాయిలో ప్రమాదం పోలేదు. అప్పటి గాయాలనుంచి మనం కోలుకోలేదు. విదేశీమారక నిల్వలు పెంచడానికి మనం మరింత కృషి చేయాలి. ఎగుమతుల లక్ష్యాలను ఇంకా నిర్ణయించలేదు. లక్ష్యాలకు, సాధించిన దానికి మధ్య వ్యత్యాసం ఉంది. ఈ సంవత్సరం ప్రకృతి కూడా అనుకూలించలేదు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కరవు ప్రభావం తీవ్రంగా ఉంది. వంటనూనెలతో సహా ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం రావచ్చని నేను భయపడుతున్నాను.

ఎందుకంటే సాంకేతిక జ్ఞానం వల్ల వచ్చిన ఫలితాలు విదేశీ మారక ద్రవ్యం పరిరక్షణ (ట్రావెల్) పన్ను రద్దు ఆర్డినెన్స్, విదేశీ నూనెగింజల దిగుమతిపై కమిషన్ (రవాణా) పన్ను రద్దుబిల్లు 1992) దిగుమతుల వల్ల తగ్గిపోయాయి.

కానీ ఇప్పటికీ మనం కొంత మొత్తాన్ని వెచ్చించాల్సి రావచ్చు. ఇలాంటి పరిస్థితులలో ఈ బిల్లును రద్దు చేయడానికి ఇది సరైన సమయం కాదని అభిప్రాయ పడుతున్నాను.

ప్రస్తుతం ప్రభుత్వం లిబరలైజేషన్‌ను అమలు చేసే దిశలో ముందుకు పోతుంది. ఆర్థిక రంగంలో, పారిశ్రామిక విధానాలలో ఎన్నో కొత్త పథకాలను ప్రకటించారు. కానీ మనం ఈ విధానాన్ని అమలు చేసిన ఇతర దేశాలను గమనిస్తే వారి చెల్లింపుల సమతౌల్యం దారుణంగా దెబ్బతిందన్న విషయం తెలుస్తుంది. దీనివలన కొన్ని రంగాలకు లాభం చేకూరుతుంది. కానీ అదే సమయంలో చెల్లింపుల సమతౌల్యంలో తీవ్ర అనిశ్చితి ఏర్పడుతుంది.

మనం ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

1985 నుంచి తీసుకుంటున్న ఈ విధానాలపట్ల సభ్యులందరూ జాగ్రత్తగా ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం, అంతకుముందున్న ప్రభుత్వాలు అమలు చేసిన విధానాల వల్ల మన విదేశీ మారకనిల్వలు ప్రమాదస్థాయికి పడిపోయాయి. రూపాయి విలువ కూడా పడిపోయింది. 1980-81లో రూపాయి విలువ డాలర్‌తో 12 ఉండగా, 1986-87 నుంచి 1991-92 కల్లా ఇది 25కు చేరింది. అంటే వంద శాతం పెరిగింది. అందుకే ప్రభుత్వం ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుంటుదనుకుంటున్నాను. 1991లో పబ్లిక్‌రంగ సంస్థలనుంచి ఉత్పత్తి అయిన వస్తువులను ఎగుమతి చేయడం ద్వారా వచ్చిన విదేశీమారక నిల్వలు చాలా తక్కువ. గత రెండు సంవత్సరాలలో వరుసగా 30 శాతం, 17.1 శాతం ఉంది. ప్రస్తుతం 6 బిలియన్ల విదేశీమారక ద్రవ్యం ఉంది. ఇది గతంలో కంటే మేలే. కానీ చిన్న దేశమైన తైవాన్‌లో 18 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఉంది. మన పొరుగుదేశం అయిన చైనాలో కూడా ఇది చాలా మొత్తంలో ఉంది. ప్రభుత్వం కొంతకాలానికి లిబరలైజేషన్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి. విదేశీమారక ద్రవ్యాన్ని అమ్మే ప్రతినిధులు దానిని అమ్మివేసేందుకు అవకాశం ఇవ్వాలి. (430 ప్రకటన : విదేశీమారక ద్రవ్య పరిరక్షణ (ట్రావెల్) పన్ను రద్దు ఆర్డినెన్స్, విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ ట్రావెల్ పన్ను రద్దు బిల్లు 1992).

ఎన్నో వాణిజ్యసంస్థలు విదేశాలకు వెళ్తున్నాయి. కాబట్టి వీటి మీద కొన్ని నిబంధనలు విధించాలి. విదేశీ ద్రవ్యాన్ని సేకరించడం, విడుదల చేయడంలో కూడా రిజర్వుబ్యాంకు తన నిబంధనలను, క్యాపిటల్ వస్తువుల దిగుమతిపై కూడా అవసరమైన

చర్యలు తీసుకోవడానికి మార్చి 17, 1992న ప్రవేశపెట్టిన విధానాలను అమలు చేయాలి. ఈ విధమైన చర్యలు తీసుకుంటే విదేశీమారక ద్రవ్య నిల్వలు పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది.

మన ఎగుమతులు పెరగడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ దిశగా ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టకూడదు. మన దగ్గర సమృద్ధిగా విదేశీమారక నిల్వలు ఉండి, చెల్లింపుల సమతౌల్యం గురించి మనం ఏవిధమైన ఆలోచనా చేయకుండా ఉన్నరోజు మనం ఈ పన్నును రద్దు చేయవచ్చు. ఈ విధంగా నేను ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్సు నెంబరు 8, 1992ను వ్యతిరేకిస్తున్నాను. ధన్యవాదాలు. □

# మద్యనిషేధం విధించాలి

అధ్యక్షా ! మన జాతిపిత మహాత్మాగాంధీ మద్యనిషేధం విధించాలని సూచించారు. పేద వారి దయనీయ పరిస్థితులకు మద్యం ఒక కారణమని ఆయన వివరించారు. మన రాజ్యాంగంలో కూడా ఆర్టికల్ 47 ప్రభుత్వం మద్య నిషేదాన్ని విధించాలని చెబుతోంది. రాష్ట్ర విధానాల్లో భాగాంగా వాటిని పేర్కొంది. కానీ చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని అమలు చేయటం లేదు. పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. మద్యనిషేధం అమలులో ఉన్నప్పుడు తగ్గిన ఆదాయాన్ని పూడ్చుకోవడానికి అమ్మకం విధించాయి. మద్యనిషేదం తొలగించిన తర్వాత అమ్మకం పన్నును అట్లాగే ఉంచాయి. రాష్ట్రాలు ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచుకోవటానికి మద్యం కామధేనువులా తయారైంది. దీని మూలంగా చాలా మంది పేదవారు దారిద్ర్య రేఖను దాటలేక పోతున్నారు. కుటుంబ సభ్యులకు విద్య, వైద్య సౌకర్యాలు అందించలేక పోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మహిళలు మద్య నిషేధంకోసం పోరాడుతున్నారు. సారాయి, ఇతర మత్తు పానీయాలు అమ్మకం నిషేధించాలని వారు కోరుతున్నారు. కార్మికులు, స్వయం ఉపాధి పొందినవారు, వ్యాపారస్తులు, మేధావులు అందరూ వీరికి మద్ధతునిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలూ బలపరుస్తున్నాయి.

వెంటనే కేంద్రం ఈ విషయాన్ని పరిశీలించాలి. ఆంధ్రప్రదేశ్ మద్యనిషేధానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. మద్యనిషేధం అమలు చేస్తే ఏర్పడే నష్టంలో 50 శాతాన్ని కేంద్రప్రభుత్వం భర్తీ చేయాలి. □

# ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సమగ్రమైన సవరణలు చేయాలి

వడ్డే శోభనాద్రీశ్వరరావు (విజయవాడ) : అధ్యక్షా, "ఈ సభ 1991 ఏప్రిల్ 18న రాష్ట్రపతి జారీ చేసిన ప్రజాప్రాతినిధ్య(సవరణ) ఆర్డినెన్సు ( ఆర్డినెన్స్ నెం. 2, 1991) ను తిరస్కరించింది" అని మీకు మనవి చేసుకుంటున్నాను.

అధ్యక్షా, ఈ ఆర్డినెన్స్‌ను 10వ లోక్‌సభ ఎన్నికల సమయంలో జారీ చేశారు. జమ్మూ, కాశ్మీర్‌లోని ఆరులోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు వాయిదా పడకుండా ఉండటానికి ఆర్డినెన్స్ జారీచేయవద్దని నేను భావిస్తున్నాను. అక్కడ లడఖ్‌లో ఒకటి, జమ్మూలో రెండు, కాశ్మీర్ లోయలో మూడు స్థానాలు ఉన్నాయి. కాశ్మీర్ లోయలో ఎన్నికలు నిర్వహించడానికి అనువైన వాతావరణం లేనప్పటికీ జమ్మూ, లడఖ్‌లలో ఎన్నికలు నిర్వహించవచ్చు. కాశ్మీర్‌లోని మూడు స్థానాల కోసం ఎన్నికలు వాయిదా వేయాలనే వాదన సరికాదు.

అధ్యక్షా, అస్సాంలో ఉల్ఫా కార్యకలాపాల వల్ల శాంతిభద్రతలు దెబ్బతిన్నాయన్న కారణంతో ప్రఫుల్లకుమార్ మహంతా ప్రభుత్వాన్ని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 343 నిబంధన కింద రద్దు చేసిన విషయం మీకు తెలుసు.

ఎల్.టి.టి.ఇ. కార్యకలాపాల వల్ల తమిళనాడులో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని కరుణానిధి ప్రభుత్వాన్ని చంద్రశేఖర్ ప్రభుత్వం పడగొట్టింది. ప్రజల చేత ఎన్నికైన తమిళనాడు ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కేంద్రం భావించింది. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ మద్ధతుతో ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. అధికారంలోకి రాగలిగింది. తరువాత ఆ రెండు పార్టీలు అవగాహన కుదుర్చుకుని చిన్న సాకుతో ప్రభుత్వాన్ని కూల్చగలిగాయి. ఇది అప్రజాస్వామికం. తమిళనాడులో ఎన్నికలు నిర్వహించాలనుకుంటున్నాయి. అలాగే అస్సాంలో కూడా ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

పంజాబ్‌లో ఎన్నికల నిర్వహణకు పరిస్థితులు అనుకూలంగాలేవని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనే పరిస్థితులు లేవని అక్కడి రాజకీయ పక్షాలు కోరినప్పటికీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది. వారి మాటలను పెడచెవిన పెట్టి ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. కొద్ది గంటల్లో ఎన్నికలు నిర్వహిస్తారనగా వాయిదా వేయడం కూడా చేశారు.

10వ లోక్‌సభ ఎన్నికలను జమ్ము, లడఖ్, ప్రాంతాలలో నిర్వహించకుండా చేసే ఈ ఆర్డినెన్సు అక్కడి ప్రజల హక్కులను కాలరాస్తోంది.

344 తీర్మానం ద్వారా ఈ ఆర్డినెన్స్ జారీని అడ్డుకొని ఎన్నికల వాయిదాను ఆపాలి.

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం జమ్మూలోని మూడు, లడఖ్ స్థానాల్లో ఎన్నికలు జరగకుండా నిరోధించే హక్కులేదు. కనుక ఈ ఆర్డినెన్సు జారీని నేను వ్యతిరేకిస్తున్నాను. ఈ ఆర్డినెన్స్ వల్ల ప్రజల సహజ (సాధారణ) హక్కులకు విఘాతం కలుగుతుంది. ఇది అప్రజాస్వామికం. ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, అనవసరంగా ఆర్డినెన్సును జారీచేస్తోంది.

వడ్డే శోభనాద్రీశ్వరరావు (విజయవాడ) : అధ్యక్షా, కాశ్మీర్‌లో కాకపోయినా జమ్ము, లడఖ్ ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించవచ్చుననే నా అభిప్రాయంతో సభ్యులందరూ ఏకీభవిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది.

పంజాబ్‌లో ఎన్నికల్ని వాయిదా వేయడానికి తమ ప్రభుత్వం సుముఖంగా లేదని హోం మంత్రి ఇప్పుడే చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లో ఇప్పుడు ఎన్నికలు నిర్వహించరాదని ఎన్నికల కమీషన్ నిర్ణయించిందని మీరంటున్నారు. ఈ సమయంలో అక్కడ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం సాధ్యపడదని ప్రధాన రాజకీయ పార్టీలు అభిప్రాయ పడినందువల్ల వాయిదా పడ్డాయంటున్నారు. మేము దానితో ఏకీభవిస్తున్నాం. కాంగ్రెస్ (ఐ), సి.పి.ఐ, సి.పి.ఐ (ఎం) పార్టీలు పంజాబులో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించడం

మంచిది కాదు అన్న అభిప్రాయం కూడా యదార్థమే. అయినా పంజాబ్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిందేనని ఎన్నికల సంఘం నిర్ణయించింది. దాదాపు 20 మంది అభ్యర్థులను ఉగ్రవాదులు చంపారు. అయినా అక్కడ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం కృతనిశ్చయంతో ఉంది. పోలింగ్‌కు కొద్ది గంటల ముందు ప్రజలు ఓటింగ్‌లో పాల్గొని ఎన్నికల ప్రక్రియను జయప్రదం చేయాలనీ, రాజ్యాంగంలోని 355 తీర్మానం ప్రకారం ఓటర్లు ప్రజాస్వామ్య హక్కుల్ని వినియోగించుకోవాలనీ, ఇది ఓటర్లపై ఉన్న పవిత్ర బాధ్యత అని పంజాబ్ గవర్నర్ పేర్కొన్నారు.

ఈ విధంగా గవర్నర్ ఓటర్లందరికీ విజ్ఞప్తి చేశారు. అయినా అక్కడ ఎన్నికల్ని వాయిదా వేయడానికి కారణమేమిటి?

ఏ కారణాలపై అక్కడ ఎన్నికలను వాయిదా వేశారు? ప్రస్తుతం మీరు ఏ నివేదిక ఆధారంగా దాన్ని తోసిపుచ్చుతున్నారు. అక్కడ ఎన్నికలను వాయిదా వేసే నాటికి పదో లోక్‌సభలో కాంగ్రెస్(ఐ) గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. పి.వి. నరసింహారావు కాంగ్రెస్ నేతగా ఎన్నికయ్యారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే బలం మీకుంది. పంజాబ్‌లో ఎన్నికలను నిర్వహించడం మీకు ఇష్టం లేదు. అందుకనే అక్కడ ఎన్నికలు వాయిదా వేయాలనే తప్పుడు నిర్ణయాన్ని ఎన్నికల అధికారి తీసుకొన్నారు. పవిత్రమైన ఆ సంఘాన్ని ఇంతకంటే తీవ్రంగా నేను విమర్శించ దలుచుకోలేదు. ఒక్క విషయం మాత్రం నేను స్పష్టం చేయదలచుకున్నాను. ఎన్నికల అధికారి నిరంకుశంగా తీసుకున్న నిర్ణయానికి దేశప్రజలు చాలా బాధపడ్డారు. చాలా రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారిపై మహాభియోగ తీర్మానం చేయాలని డిమాండ్ చేశాయి.

జమ్మూ, కాశ్మీర్‌ల్లో సాధారణ పరిస్థితుల్ని నెలకొల్పి అక్కడ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి హామి ఇచ్చారు. గతంలో ఇలాంటి హామీలను చాలా ఇచ్చారు. కానీ ఆచరణలో చేసి చూపించలేకపోయారు. దీని గురించి నా సహచర సభ్యుడు పాబుద్దీన్ సయ్యద్ సవివరంగా వివరించారు. కాబట్టి దీన్ని నేను పునరావృతం చేయను. సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, జమ్మూ కాశ్మీర్‌లలో నేటి దుస్థితికి నాడు తీసుకున్న ముందుచూపులేని నిర్ణయాలే కారణం - ఇది 356 చట్టబద్ధమైన ప్రజాప్రాతినిధ్య సవరణబిల్లు కాదా?ప్రజాస్వామ్య ప్రక్రియ పట్ల వారికెందుకు ఆసక్తి లేదు? జాతీయ జనజీవన స్రవంతికి దూరంగా ఉండాలని వారెందుకు భావిస్తున్నారు.

ప్రజలచేత ఎన్నికైన ఫరూక్అబ్దుల్లా ప్రభుత్వాన్ని కూలదోసింది మీరుకాదా? అదే సమయంలో ఎన్.టి.రామారావు ప్రభుత్వాన్ని కూడా కూలదోశారు. ఇలాంటి మీ సంకుచిత చర్యల వల్ల కేంద్రప్రభుత్వం పై ప్రజలకు చెడు అభిప్రాయం

కలుగుతోంది. ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. కాబట్టి మనమందరం ఆత్మవిమర్శ చేసుకోవాలి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదు. మీరు నేషనల్ కాన్ఫరెన్సుతో పొత్తుపెట్టుకున్నాక ఇరువురు రిగ్గింగుకు పాల్పడ్డారు.

కొన్ని పార్టీల అభ్యర్థులు కొన్ని స్థానాల్లో గెలవటంలో తప్పేముంది? వారు జాతి వ్యతిరేకులు కాదు. భారతీయులకు వ్యతిరేకులు కాదు. కాశ్మీర్ భారతదేశంలోనే ఉండాలని వారు కోరుతున్నారు. అలాంటి వారినందరిని మీరు నిర్లక్ష్యం చేశారు. మీ తప్పుడు విధానాల వల్లే వారు జీవన స్రవంతికి దూరంగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఇతరులతో మీకు పొత్తు కుదరనందువల్ల ఒంటరిగా పోటీ చేశారు. డిఎంకే విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు మీరు, ఏఐఎడి ఎంకే ఒక అవగాహనకు రావడం వల్ల డిఎంకే ప్రభుత్వాన్ని తేలికగా కూలదోశారు. ఇది చాలా తప్పు. దీని ప్రభావం చాలా కాలం పాటు ఉంటుంది.

ఇలాంటి సంకుచిత చర్యల ప్రభావం చిరకాలం ఉంటుంది.

సమగ్ర సవరణల ప్యాకేజీతో ముందుకు వస్తాం అని మంత్రిగారన్నారు. ఇంతకు ముందు కూడ దీని గురించి చర్చించాం. చాలా సలహాలిచ్చాం. ఆషామాషి అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలన్నది ప్రధాన సలహా. ఇది మీ అనుభవం కూడా కావచ్చు. ప్రజాప్రాతినిధ్య చట్టం 357 ప్రకారం ఎన్నికల్లో పోటీచేసే స్వతంత్ర అభ్యర్థులు రూ. 500.00 డిపాజిట్‌తో నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. ఎన్నికల్లో పోటీచేయడం ద్వారా మంచి ప్రచారం లభిస్తుందని వారు భావిస్తున్నారు. అలాంటి వారి పేర్లు నియోజకవర్గం మొత్తానికి తెలుస్తుంది. ఇలాంటి వారి వల్ల బ్యాలట్ పేపర్ సైజు (పరిమాణం) పెద్దదవుతోంది. ఎన్నికల కేంద్రాలలో సరైన వెలుతురు ఉండడం లేదు. చిన్న చిన్న ప్రాథమిక పాఠశాలల్లో, సరిగా వెలుతురు లేని చోట్ల ఎన్నికల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికీ మన జనాభాలో 65 శాతం నిరక్ష్యరాస్యులున్నారు. ఎక్కువ మంది ఓటర్లు నిరక్షరాస్యులు. వెలుతురు సరిగా లేకపోవడం వల్ల ఎన్నికల గుర్తులను గుర్తుపట్టడం కష్టమవుతోంది. కాబట్టి దాన్ని నివారించటానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను. సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని పెంచడంతోపాటు, ఓటర్ల జాబితాను స్వతంత్ర అభ్యర్థులు కొనుగోలు చేసేలా ఉండాలి. కేంద్ర, రాష్ట్రాలలో నమోదైన పార్టీల అభ్యర్థులకు ఓటర్ల జాబితాను ప్రభుత్వం అందిస్తుంది. స్వతంత్ర అభ్యర్థులు నిజంగా ఎన్నికల్లో పోటీచేయదలచుకుంటే ఒకజత ఓటర్ల జాబితాను కొంటారు. కానీ స్వతంత్ర అభ్యర్థులు వాటిని కొనుగోలు చేయడం లేదు. ఎందుకంటే వాటి విలువ కొన్ని వేల రూపాయల దాకా ఉంటుంది.

ఆషామాషీగా పోటీచేసే అభ్యర్థులను ఎన్నికలలో పాల్గొనకుండా చేయాలంటే వారినందరిని ఖచ్చితంగా ఓటర్ల జాబితాలను కొనమనాలి. ఆ జాబితాలను నామినేషన్ పరిశీలనప్పుడు సమర్పించమనాలి. ఒకవేళ ఎవరైనా అలా చేయకుంటే ప్రజా ప్రాతినిధ్య చట్టం 385 ప్రకారం వారిని పోటీకి అనర్హులుగా ప్రకటించాలి.

ఈ పద్ధతి వల్ల ఆషామాషీ అభ్యర్థులందరూ ఎన్నికల నుంచి వైదొలిగే అవకాశముంది.

గౌరవ మంత్రివర్యులు ఓటరు గుర్తింపు కార్డుల గురించి ప్రకటించారు. అవి చాలా అత్యవసరమైనవి. ఎందుకంటే ఒక ఉదాహరణ చెబుతాను. 1989 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రి నియోజకవర్గం ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థికి 1200 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇప్పుడు అదే అభ్యర్థికి 78,000 ఓట్ల ఆధిక్యత లభించింది. ఎన్నికల కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, రిగ్గింగ్ లేకుండా ఇది ఎలా సాధ్యమవుతుంది.

అందుకే ఇలాంటి అనైతిక ధోరణులు ప్రబలకుండా ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరించి ఓటింగ్ యంత్రాలు, గుర్తింపుకార్డులు ఇవ్వాలి. వాటిని ప్రతి సార్వత్రిక ఎన్నికలలోను, ఉప ఎన్నికలలోను ఉపయోగించాలి.

కల్లోలిత జమ్మూ,కాశ్మీర్ రాష్ట్రాలలో అనేక రాజకీయ పార్టీల కార్యకర్తలు జైళ్ళలో మగ్గుతున్నారు. వారిలో ఎక్కువ మందికి ఈ దేశపు పౌరులుగా రాణించాలని ఆశయం ఉన్నవారే. ఇకనైనా ప్రభుత్వం వారిని విడుదల చేయాలి. వివిధ రాజకీయ పక్షాలతో ఉద్రిక్త ఉపశమనానికి చర్చలు ప్రారంభించాలి. జాతి వ్యతిరేకశక్తులకు సహాయం చేయని రాజకీయ పార్టీల కార్యకర్తలను ప్రభుత్వం నిర్బంధించింది. దీనివల్ల ఉగ్రవాదులు, వేర్పాటు వాదులు, జాతి వ్యతిరేకశక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగిస్తున్నాయి.

ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయాత్మక మార్పులతో ఒక చట్టాన్ని ప్రవేశపెట్టాలని ఆశిస్తున్నాను.

మంత్రివర్యా, ఈ విధంగా ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాలి. ఇంతటితో నా తీర్మానాన్ని ఉపసంహరించుకుంటున్నాను.

□

# పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించవద్దు

సభాధ్యక్ష స్థానంపై నాకున్న గౌరవంతో కొన్ని ముఖ్యమైన అంశాలను మీ ముందు ప్రస్తావించాలనుకుంటున్నాను. అధికార పార్టీ ప్రతిపక్షపార్టీలలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తుంది. ప్రతిపక్షాలను చీల్చాలని ప్రయత్నిస్తుంది. ఇటీవల వారు మహారాష్ట్రలో ఒక పార్టీని చీల్చారు. ప్రస్తుతం వారు తెలుగుదేశం పార్టీలో సైతం ఫిరాయింపులు తేవాలని ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి తెలుగుదేశం పార్టీ ఒక ప్రాంతీయ పార్టీగానే స్థాపించబడినప్పటికీ మా పార్టీ కంటూ కొన్ని విలువలున్నాయి. దేశాన్ని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దక్షిణాది నుంచి దేశానికి ఎవరూ ప్రధాని కాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పి.వి. నర్సింహారావుకు అలాంటి మహదవకాశం వచ్చి ప్రధాని అయినందున ఆయన పోటీ చేస్తున్న నంద్యాల ఉప ఎన్నికల్లో మాపార్టీ తరుపున ఎవర్నీ ప్రత్యర్థులుగా నిలపవద్దని మా పార్టీ అధ్యక్షుడు నిర్ణయించారు. ఇప్పుడు అదే ప్రధాని అధ్యక్షతలోని కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో మెజార్టీకి కొన్ని సీట్లు తక్కువ కావడంతో తెలుగుదేశం పార్టీలోనే ఫిరాయింపులను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నది.

మీకు ఈ విషయం తెలిసిందే. ఎందుకంటే ఈ విషయమై చోటుచేసుకున్న

పరిణామాలన్నీ మీ ముందు జరిగినవే. వారు మీ వద్దకు వచ్చారు. మిమ్మల్ని కలిసారు. తమ అభిప్రాయాలను అందుకు సంబంధించిన ప్రతులను మీకు అందజేశారు. కేంద్రమంత్రి ఒకరు ఈప్రతులకు సంబంధించిన డ్రాఫ్టులను మీకు మాత్రమే అందజేయమని మా పార్టీ సభ్యులకు సలహా ఇవ్వడం మమ్మల్ని కలవరపరిచింది. ఈ విషయం పత్రికల్లో సైతం వచ్చింది. ఇందులోని కొందరు సభ్యులు హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని అతిథి గృహంలో విడిది చేసినట్లు పత్రికల్లో వచ్చింది. దురదృష్టవశాత్తు పార్టీని చీల్చడం, ఫిరాయింపులకు ప్రయత్నించడం వంటి అంశాల్లో అధికారపక్షం పాత్ర స్పష్టంగా వెల్లడైంది. రాజకీయ వ్యవస్థలో నైతిక విలువలను పెంపొందించేందుకు ఆసక్తి చూపుతున్నామని చెప్పుకుంటూ దీనిపై అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి కృషి చేస్తున్నామంటున్న పి.వి. నర్సింహారావు సారథ్యంలోని కేంద్రప్రభుత్వం, ఇప్పుడు తమ వంతు వచ్చే సరికి స్వయం మనుగడకై వీటన్నింటిని గాలికి వదిలేస్తున్నారు. ఎలాంటి విచక్షణ లేకుండా అధికార పార్టీ వారు ఇలాంటి చర్యలకు పాల్పడటం దురదృష్టకరం. ఈ విషయాన్ని మీ వద్ద ప్రస్తావించడానికి కారణం నా గుండెలో రగులుతున్న బాధను మీదృష్టికి తీసుకురావడానికే. నేను మళ్లీ జరిగిన విషయాన్ని ప్రస్తావించను. కానీ ఈ విషయాన్ని సభాధ్యక్షుని దృష్టికి తేవడానికి నేను మీకు ఆ ఉత్తరం పంపాను. అందులో నేను మిమ్మల్ని అభ్యర్థిస్తూ మీకు అంగీకార పత్రాల ద్వారా తమ వైఖరిని వెల్లడించిన వారు ఆపై మళ్లీ తమ వైఖరిని ఎందుకు మార్చుకోవల్సి వచ్చిందో ప్రతి ఒక్కరు అడిగి తెలుసుకోవల్సిందిగా కోరాను. ఈవిషయం మీకు గుర్తుండే ఉంటుంది. 12వ తేదీన జరిగిన సమావేశానంతరం నుంచి చాలా మంది సభ్యులు కనిపించడం లేదు. ఈ విషయాన్ని గమనించాల్సిందిగా మేము మీకు విన్నవించాం. దానికి స్పందిస్తూ మీరు గమనిస్తానని చెప్పారు. వారు ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లో ఒక పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తున్నారన్న సంగతిని కూడా మా సభ్యులు మీ దృష్టికి తీసుకువచ్చారు.

అప్పుడు మీరు స్పందిస్తూ " చింతించకండి, తొందరేమీలేదు. నేను కొంత సమయం తీసుకొని మీకు తప్పక అవకాశం కల్పిస్తానని అన్నారు"....(సభలో గందరగోళం)

మాతో పాటు ఉంటున్న సహచరుడిని మీరు 13వ తేదీన ఒక ఉత్తరాన్ని పంపమనడం మమ్మల్ని కలవరపరిచింది. దానివల్ల కలిగే ప్రయోజనం జోలికి నేను

వెళ్ళడం లేదు. వేర్పాటు గ్రూపులను గుర్తిస్తూ డివిజన్ సభ్యులకు సంఖ్యను కేటాయిస్తూ దానిపై సంతకం చేసి పంపారు. మళ్లీ రెండు గంటల తర్వాత మీరు మరో లెటర్ పంపారు...(సభలో గందరగోళం)

జనతాదళ్ పార్టీ విషయంలో నిర్ణయం తీసుకొనేందుకు రెండు నెలలు తీసుకొన్న మీరు తెలుగుదేశం పార్టీ సభ్యుల విషయంలో విబేధం చూపుతూ కేవలం 48 గంటల స్వల్ప వ్యవధిలోనే నిర్ణయం తీసుకున్నారు ......(సభలో గందరగోళం)

అధ్యక్షా, వారు ఒక కొత్త పార్టీని స్థాపించారు.

మేము వారిని ఏమైనా ఒక అతిథి గృహంలో ఉంచామా? (సభలో గందరగోళం)

□

# ఎన్నికల సంస్కరణలు కావాలి

కొంతమంది అభ్యర్థులు కోట్లాది రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. వాస్తవానికి వీరే ఎన్నికల్లో పోటీ చేయడం కష్టంగా భావిస్తున్నారు. అందుకనే రాజకీయపార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఎన్నికల సంస్కరణలని తీసుకురావాల్సిన అవసరం ఉంది.

1991, 1992 ఎన్నికల్లో అధికార పార్టీ, ప్రస్తుత ప్రతిపక్ష పార్టీ రెండూ ఎన్నికల్లో చేసిన ఖర్చుని చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. భా.జ.పా. జాతీయ ఇంగ్లీషు, హిందీ న్యూస్ పేపర్లలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రకటన ఇచ్చింది. ఇంతటి డబ్బుని వారు ఎక్కడ నుంచి ఖర్చు పెడుతున్నారు? మరొకవైపు చిన్న పార్టీలు ప్రాంతీయ పత్రికల్లోనైనా కొద్దిపాటి ప్రకటనని ఇప్పించుకునే పరిస్థితుల్లో లేవు. కనుక ఒక క్రమపద్ధతి అవసరం. అందుకోసం ఎన్నికల సంస్కరణలని ముందుకు తేవాలి.

# ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత

గౌరవనీయ మంత్రికి నేను సూచిస్తున్నాను. బడ్జెట్ సమావేశాలు ముగిసేలోగా సమగ్ర ఎన్నికను సంస్కరణలు తేవాలని తీవ్రంగా ప్రయత్నిస్తామని మంత్రిగారు చెప్పటం అభినందనీయము. ఈ సభలో మనం ఏం చెప్పినా చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నప్పటికి ఎన్నికలలో ధనం,కులం, వర్గం, మతం ప్రభావితం చేస్తాయన్న వాస్తవం మనకు తెలిసిందే. వీటి ప్రభావాన్ని తగ్గించటానికి ఇదే సరైన సమయం. కొన్ని స్థానాలు ప్రజల ద్వారా ఎన్నికై, కొన్ని స్థానాలు రాజకీయ పార్టీలు ఇచ్చిన జాబితా ప్రకారం నైష్పత్తిక జాబితా పద్ధతిలో ఎన్నుకోవటం కొన్ని దేశాలలో అమలులో ఉంది. ఈ పద్ధతి అమలు ద్వారా బూత్‌ల ఆక్రమణ, కుల మత ప్రచారాలతో ఓట్లడగటం, కోట్ల ధనాన్ని ఎన్నికలలో ఖర్చు చెయ్యడం తగ్గించవచ్చు. ఇది పూర్తిగా అంతమవుతుందని చెప్పను కాని వీటి ప్రభావాన్ని తగ్గించటానికి ఇదే సరైన సమయం.

ఆలోచనాపరుడు, అపారమైన అనుభవమున్న గౌరవనీయ మంత్రి ఈ విషయాన్ని పరిశీలించవలసిందిగా కోరుతున్నాను.

కనీసం ఉప ఎన్నికలలోనైనా ప్రభుత్వం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగించకపోవడంపై నేను ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాను.

ఎక్కడివి అక్కడే ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే వాటిపై చాలా డబ్బును ఖర్చు చేసింది. వాటిని సక్రమంగా వినియోగించుకోవటానికి ప్రభుత్వం ఆలోచించడం లేదు.

మా రాష్ట్రంలో నంద్యాల లోక్‌సభ నియోజక వర్గం నుండి ఉప ఎన్నికల్లో పి.వి. నర్సింహారావు పోటీ చేసిన సంగతి మీకు తెలిసిందే. రాష్ట్రంలో ప్రతిపక్షంలో ప్రధాన రాజకీయ పార్టీ మాదే. వివిధ కారణాల వలన ఆయనకు వ్యతిరేకంగా మేము అభ్యర్థిని నిలబెట్టలేదు. (అవరోధాలు) మీరు అంగీకరించినా అంగీకరించకపోయినా దీనికి కారణం ఒక వ్యక్తి దక్షిణాది నుండి ముఖ్యంగా మా ఆంధ్రప్రదేశ్ నుండి ఒక తెలుగు వారు మొదటి సారిగా ప్రధానమంత్రి అయ్యారు. ఆయనపై గౌరవాభిమానాలతో వ్యతిరేకంగా అభ్యర్థిని నిలపలేదు. దీనిపై కొంతమంది మంత్రులు మమ్మల్ని తప్పులు బట్టారు.

నా ఆవేదనను మీ దృష్టికి తీసుకురావాలనుకొంటున్నాను. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిని నిలుపలేదు. దురదృష్టవశాత్తు నంద్యాల లోక్‌సభ ఎన్నికల్లో పెద్దఎత్తున రిగ్గింగ్ చోటు చేసుకుంది. బూత్‌ల ఆక్రమణ జరిగింది. వారి ప్రాంతంలో గౌరవనీయ ప్రధాన మంత్రికి మెజారిటీ తీసుకురావటానికి అనేక మంది ముఖ్యనాయకులు ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కరూ వారి సొంత మార్గాలు, పద్ధతుల్లో ప్రయత్నించారు. దురదృష్టవశాత్తూ జిల్లా ఉన్నతాధికారులు నాయకులతో కుమ్మక్కయ్యారు. రాజకీయ నాయకులకు సహాయపడ్డారు.

గౌరవనీయ మంత్రి దృష్టికి నేను తీసుకురావాలనుకుంటున్నది మనదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే ఈ విధమైన పద్ధతులను అరికట్టాలి.

కొంత ఖర్చుతో కూడినదే అయినా బహుళ ప్రయోజక గుర్తింపు కార్డులను పంపిణీ చెయ్యాలని గౌరవనీయ మంత్రిని కోరుతున్నాను. పార్లమెంట్, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలలో ఓట్లు వెయ్యడానికి, బ్యాంకులలో రుణాలు పొందడానికి ఇవి ఉపయోగపడతాయి. ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ భరించవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఒక్కటే భరించాల్సిన అవసరం లేదు.

ముఖ్యమైన ఈ విషయంపై మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి ఓ రోజున అన్ని రాజకీయ పార్టీలతో మీరు చర్చించిన విషయాలన్ని మీ ముందు దాఖలు పరిచాను.

ఆ చట్టం ప్రకారం చట్టసభల స్పీకర్లకు అంతిమ నిర్ణయాధికారం ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన దృష్ట్యా అన్ని పార్టీల నేతలతో కలిసి ఆ తీర్పును అందరూ తప్పక పాటించాలని మీరు సూచించారు.

గత లోక్‌సభ స్పీకర్లు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. అవి మీ ముందుంచాను. దాని ప్రకారం నలుగురు సభ్యులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలి. అది వారి పార్టీనేత విజ్ఞప్తి మేరకు.

అలాగే నలుగురికి కేటాయించారు. మరో నలుగురిని కలిపారు. ప్రస్తుతం మరో 12 గురిని కలుపుతున్నారు.

ఇలా 4+4+12 గురిని కలపడం తప్పుడు సూచనలు చేస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం తప్పుదోవపడుతున్నది. మేం దీన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇది హాని చేస్తుంది.

అధికార పార్టీవారు ఇతర పార్టీలను చీల్చుతున్నారు. వారి మెజారిటీ సంఖ్యను నింపు కోవడానికి చేస్తున్నారు. మా తెలుగుదేశం పార్టీలోనూ, ఇతర పార్టీల్లోనూ చీలికలు తేవాలని చూస్తున్నారు.

దేశంలోనే అత్యున్నత వ్యవస్థ అయిన ఈ సభ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నీ, రాజకీయ పార్టీల మనుగడను రక్షించాలని కోరుతున్నాను.

10వ షెడ్యూలు ఉంది. పార్టీ రాజ్యాంగం ఉంది. వాటిని అనుసరిస్తున్నాం. న్యాయం జరిగేటట్టు, ప్రజలుమెచ్చేటట్టు మీరు ఒక నిర్ణయం వీలైనంత త్వరలో చేయండి. ఎందుకంటే నలుగురు సభ్యుల విషయంలో, మరోనలుగురి సభ్యుల విషయంలో మీరు పొరపాటేమీ చేయలేదు.

ప్రస్తుతం అనూహ్య పరిస్థితి నెలకొని ఉంది. దీనిపై చర్య తీసుకోవాలని కోరుతున్నాను. □

# పేదలకు అందుబాటులో మందుల ధరలు వుండాలి

ప్రస్తుత ఔషధ విధానాన్ని సమీక్షించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ (బిల్లుపై) విషయంలో చర్చ జరిగినపుడు మా అభిప్రాయాలను తెలియపరచడానికి మా పార్టీ సభ్యులకు అవకాశం దక్కలేదు.

ఔషధ విధానాన్ని సమీక్షించుకోవాలనుకున్నది చాలా ప్రాముఖ్యత కలిగిన అంశం. అలాగే పాత విధానంలో గల మంచి అంశాలను విస్మరించకూడదు.

1986 సంవత్సరపు ఔషధ విధానం 1970 సంవత్సరపు పేటెంట్ చట్టం ప్రకారం వీటి పరిధిలోకి 250 పెద్ద కంపెనీలు, 8వేల చిన్న తరహా కంపెనీలు వస్తాయి. కేవలం ప్రాసెస్ చేసిన మందులకే పేటెంట్ హక్కును కల్పించడం వల్ల ఒకే రకమైన మందును అన్ని చిన్న తరహా పరిశ్రమలు ఉత్పత్తి చేసుకోవడానికి వెలుసుబాటు కలిగింది. ఇలాంటి చట్టం లేకపోతే ఒక మందుకు పేటెంట్ దొరికినట్టయితే ఇతర కంపెనీలు అటువంటి మందును ఉత్పత్తి చేయడానికి వీలులేదు. అలాంటప్పుడు చిన్నతరహా పరిశ్రమలు మనుగడ సాధించలేక పోయేవి.

మనదేశంలో మూడోవంతు ప్రజలు బీదరికంలో మగ్గుతున్నారు. వారి సంపాదన ఆహార అవసరాలనే తీర్చడంలేదు. ఇలాంటి సమయంలో మందుల

ధరలు ఏకంగా 20 శాతం పెరిగితే అప్పుడు బీదప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. దీనికి ఒక ఉదాహరణగా, రెనిటిడిన్ మందుకలిగివున్న గ్లాక్సో కంపెనీకి చెందిన పది బిళ్లలుగల పొట్లం ధర మనదేశంలో 29 రూపాయలకు దొరుకుతుంది.

అదే పాకిస్థాన్‌లో 260, బ్రిటన్‌లో 481, అమెరికాలో 744 రూపాయలుగా ఉంది. ఇలాగే ఎన్నో ఉదాహరణలున్నాయి. ఇందులో హృద్రోగ, ప్రాణరక్షక మందులు కూడా ఉన్నాయి. మనదేశం కంటే వీటి ధర సుమారుగా 20 నుంచి 30 వంతులు ఎక్కువగా ఉన్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఒకదేశ జాతియోత్పత్తిలో ఐదు శాతం నిధులను ఆరోగ్యరంగంపై ఖర్చుచేయాలని మీరు విన్నవించారు. కాని మనం ఖర్చుచేస్తున్నది ఒక్కశాతం కూడా దాటలేదు. బీద ప్రజలకు అవసరమైన నిరోధక, ప్రాణరక్షక మందులను అందుబాటు ధరలోకి అందించడానికి తమవద్ద నిధులు లేవని ఆరోగ్యశాఖ స్టాండింగ్ కమిటీ ముందు తన అసక్తతను వెలిబుచ్చింది. ఇలా తప్పించుకోవడం వల్ల ప్రజలకు అపకారం చేసినవారౌతారు.

దేశంలోని పేదప్రజలకు అవసరమైన మందులను వారికి అందుబాటులో ఉండే ధరకు అందించాలి. అలా అని ధరలను పున:సమీక్షించే విషయంలో నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. ఎందుకంటే మందుల తయారీదార్లు తాము పెట్టిన పెట్టుబడికి తగిన రీతితో లాభం పొందాలను కోవడం సహజం. అదే సమయంలో వారు మౌలిక లక్ష్యాలను విస్మరించకుండా చూడాల్సి వుంది. వస్తువు తయారుచేసే విధానం మీదనే తప్ప వస్తువు మీద పేటెంట్ హక్కులను ఇవ్వకూడదు. నాకిచ్చిన ఈ అపకాశానికి కృతజ్ఞతలు తెల్పుకుంటూ ఇంతటితో ముగిస్తున్నాను. □

# రిజర్వేషన్లు

**25-8-94** **రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూలు సవరణ** : వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఇస్తున్న రిజర్వేషన్లపై వచ్చే పార్లమెంటు సమావేశాల్లో సంపూర్ణ రాజ్యాంగ సవరణ తెచ్చేలా గౌరవ మంత్రివర్యులు బిల్లును తీసుకురావాలి. సమాజంలో ఉన్నత కులాలుగా పేర్కొంటున్న వారిలో దారిద్ర్యంతో బాధపడుతున్నవారికి రిజర్వేషన్లు కల్పించేందుకు, అవసరమైన పక్షంలో గతంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాల్సిందిగా సుప్రీంకోర్టును ప్రభుత్వం కోరాలి. అప్పుడే ఆర్థికంగా వెనుకబడినవారికి న్యాయం లభిస్తుంది. □

## వన్యప్రాణుల సంరక్షణ చట్టంలో మార్పులు చేయాలి

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ప్రయోజనాలు కాపాడటానికి వన్యప్రాణుల సంరక్షణ చట్టం నుంచి అడవి పందులను తొలగించవలసిన అవసరం ఉంది. గుంటూరు, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, కడప, అనంతపూర్, కర్నూల్ మొదలైన జిల్లాలలో అడవి పందులు చెరకు పంటకు తీవ్ర నష్టాన్ని కల్గిస్తున్నాయి. ఇవి కల్గించే పంట నష్టం కొన్నికోట్ల విలువ ఉంటుంది. గుసజాలీ సహకార చక్కెర ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలలో వందల ఎకరాలలో చెరకు పంటను పందులు పూర్తిగా నాశనం చేస్తున్నాయి. అక్కడి రైతులు చెరకు పండించటానికి వెనకంజ వేస్తున్నారు. అందువలన ఫ్యాక్టరీకి ఆశించినంత చెరకు రావడం లెదు. ఇది వాటాదారులైన రైతులకి, పనివారికి చాలా నష్టం. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం ఆడవి పందులను చంపినట్లయితే నేరంగా పరిగణిస్తారు. అందువల్ల గ్రామీణులు, వాటి వలన ఎంతో నష్టం పొందుతున్నప్పటికీ ఏమీ చేయలేక పోతున్నారు. అందువలన ప్రభుత్వం తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసికొని వన్యప్రాణులు సంరక్షణ చట్టాన్ని సవరించి అడవి పందులను ఆ జాబితా నుండి తొలగించి, అడవి సమీప ప్రాంతాలలో నివసించే ప్రజల ప్రయోజనాలను రక్షించవలసిన అవసరం ఉన్నది.

## బోగస్ సంస్థలు

తపోవన్ గృహనిర్మాణ రుణసహాయ సంస్థ ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి ఆనక చేతులెత్తేసింది. విజయవాడలోని దాని కార్యాలయం మూసేశారు. గృహరుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు డిపాజిట్ కింద రుణమొత్తంలో 20 శాతం చెల్లించారు. కష్టపడి సంపాదించి కూడబెట్టిన సొమ్ము పోవడంతో వారు చెప్పలేనంత వేదనను అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న తపోవన్ రిజిష్టర్డు కార్యాలయంతోసహా అన్ని ప్రాంతాల్లోని దాని బ్రాంచీల్లో ఖాతాలను ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలి. ఈ వ్యవహారంలో ప్రజలను మోసగించిన తపోవన్ నిర్వాహకులపై ప్రభుత్వం తగు చర్యతీసుకొని, డిపాజిట్ సొమ్ము తిరిగి రాబట్టాలి.

# పాస్‌పోర్టు జారీలో జాప్యం కూడదు

ఉపాధ్యక్షా ! 1992 పాస్‌పోర్ట్ (సవరణ) బిల్లుపై మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. 1967 పాస్‌పోర్ట్ చట్టంలో చాలా నిబంధనలు సవరించాల్సి ఉందని నేను అంగీకరిస్తున్నాను. పాస్‌పోర్టు ఫీజు గురించి ఈ బిల్లులో స్పష్టంగా పేర్కొనలేదు. ఫారమ్ తయారీకి అయ్యే వ్యయం, అనుబంధ ఖర్చులకు సంబంధించి పాస్‌పోర్ట్ విభాగాన్ని సంప్రదిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీటిని గణనలోకి తీసుకోకుండా ఫీజు భరించే విధంగా నిర్ణయించాలని నేను కోరుతున్నాను.

అయిదు వారాల్లోగా పాస్‌పోర్టులు జారీ చేస్తామని విదేశీ వ్యవహారాల మంత్రి లోక్‌సభలో ప్రకటించారు. అయిదు వారాలు కాదుకదా అయిదు నెలలయినా పాస్‌పోర్టులు ఇవ్వడంలేదు. పోలిసు తనిఖీ మూలంగా ఆలస్యం అవుతోంది. మీరు కూడా ఇటువంటి అనుభవాలు ఎదుర్కొని ఉంటారు. పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నప్పుడు చాలా మంది పోలీసులు మనవద్దకు వస్తారు. పోలీస్ కమిషనర్‌కుగాని, డీఎస్పీకి గాని తనిఖీ పత్రాలకు ఉత్తరం రాయమని అడుగుతారు. సాధ్యమైనంత త్వరలో పాస్‌పోర్టు లభించాలంటే తనిఖీ పత్రాలను దరఖాస్తులకు జతచేయమంటారు. దీనికి చాలా సమయం పడుతుంది. దీనిని తగ్గించటానికి ఏదో ఒకటి చేయాలి. పోలీస్

తనిఖీ పత్రాలు ఇచ్చేందుకు రెండువారాల కాల పరిమితి విధించాలని నాకన్నా ముందు మాట్లాడినవారు కోరారు. వారితో నేను ఏకీభవిస్తున్నాను.

అధ్యక్షా గౌరవనీయులైన మంత్రిగారు లోకసభలో చేసిన ప్రకటన అమల్లోకి రాలేదు. ఇందుకు నేనొక ఉదాహరణ చెప్పాలనుకుంటున్నాను. 1991 డిసెంబర్ 31 నాటికి హైద్రాబాద్ కార్యాలయంలో 84,805 పాస్‌పోర్టులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రిగారు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

''హైద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో రోజుకి సగటున 1,222 దరఖాస్తులు రాగా 988 దరఖాస్తులకు పాస్‌పోర్టులు ఇస్తున్నాం'' అని గౌరవనీయులైన మంత్రి 1992 మార్చి 23న ప్రకటించారు.

ఈ విషయాన్ని పరిశీలిస్తే హైద్రాబాద్ కార్యాలయంలో రోజుకి 344 దరఖాస్తులు పెండింగులో ఉంటున్నట్టు తెలుస్తోంది. ఆ లెక్కన 1992 జూన్ వరకు వీటి సంఖ్య 20 వేలకు చేరుకుంటుంది. కానీ, సభలో మంత్రి ప్రకటన చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది. 1992 జూన్ 19 వరకు హైద్రాబాద్ కార్యాలయంలో 91,075 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి ప్రకటించారు.

మంత్రి సభకు చేసిన వాగ్దానాలు అమల్లోకి రావటం లేదని దీని ద్వారా తెలుస్తోంది. విజయవాడలో కొద్దికాలం పనిచేసిన పాస్‌పోర్టు కార్యాలయాన్ని తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. 1983-84లో ప్రారంభమైన ఈ కార్యాలయాన్ని 1985లో మూసేశారు. కారణాలు అధికారులకే తెలియాలి. ప్రస్తుతం అధికారులు అధిక పనిభారం మోస్తున్నారనే మిత్రుడు షాబుద్దీన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. కార్యాలయాల సంఖ్య పెంచి పనిభారం తగ్గించాలి. కేరళ రాష్ట్రంలో త్రివేంద్రం, కోజికోడ్, కోచ్చిలలో పాస్‌పోర్టు కార్యాలయాలున్నాయి. తమిళనాడులో మద్రాస్, తిరుచ్చిలలో కార్యాలయాలున్నాయి. మహారాష్ట్రలో బొంబాయి, నాగపూర్‌లలో కార్యాలయాలున్నాయి. అందువల్ల విజయవాడలో కార్యాలయాన్ని తిరిగి ప్రారంభిచకపోవడానికి ఏ కారణమూ కనబడడం లేదు. విజయవాడలో కార్యాలయం పనిచేస్తున్నప్పుడు ఇతర కార్యాలయాలో కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చేవి. నాగపూర్‌లో 10వేల దరఖాస్తులు వస్తే విజయవాడలో 30 వేలు వచ్చాయి.

అక్షరాస్యత అధికంగా ఉన్న, చదువులు, ఉద్యోగాల కోసం గల్ఫ్ ఇతర దేశాలకు వెళ్తున్న తీరప్రాంత ప్రజల సౌకర్యానికి విజయవాడలో కార్యాలయాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నాను. లామినేటింగ్ మిషన్లవంటి అత్యాధునిక యంత్రాలను కూడా ఏర్పాటుచేయాలని కోరుతున్నాను. తక్కువ వ్యవధిలో పాస్‌పోర్టులు ఇచ్చేందుకు ప్రక్రియను పూర్తిగా కంప్యూటరీకరణ చేయాలి. లోపాలు ఏమైనా ఉంటే వాటిని తొలగించాలి. ఇంతటితో నా ఉపన్యాసం ముగిస్తున్నాను. □

# రైల్వేల పనితీరు నిరుత్సాహం కలిగిస్తోంది

గౌరవనీయులైన రైల్వేమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలపై జరుగుతున్న చర్చలో మాట్లాడేందుకు నాకు అవకాశమిచ్చిన సభాధ్యక్షులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

ప్రపంచంలో రెండో స్థానంలో నిలుస్తున్న భారతీయ రైల్వేలను చూసి మనం గర్వపడతాం. కానీ మన రైల్వేల పనితీరును పరిశీలిస్తే నిరుత్సాహమే కలుగుతుంది. ఈ మధ్య యూరప్‌లో రైలు ప్రయాణంచేసే అవకాశం నాకు కలిగింది. అక్కడి రైళ్ల రాకపోకలను బట్టి గడియారాలు కూడా సరిచేసుకోవచ్చు. అక్కడ అంతటి సమయపాలనను పాటిస్తారు. అక్కడి పరిస్థితులు వేరని నాకు తెలుసు. అక్కడి ట్రాక్ నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంజన్ల సామర్థ్యం లాంటి అంశాలు భిన్నంగా ఉండటమే ప్రధాన కారణం. మనదేశంలోనూ ఎంతో ప్రగతి సాధించాం. రైళ్లలో ప్రయాణికుల సంఖ్య మూడు రెట్లు, సరుకుల రవాణా అయిదురెట్లు పెరిగింది. కొత్త రైల్వేమార్గాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులపై తగినన్ని నిధులు వెచ్చించినట్టయితే మంచి పురోగతి సాధ్యమయ్యేది. కొత్త రైలు మార్గాల నిర్మాణంపై రైల్వేశాఖ నిరాసక్తంగా ఉండటానికి కారణాలేమిటో నాకర్థం కావడంలేదు. 1992-93లో 241 కిలోమీటర్ల కొత్త రైలుమార్గాన్ని నిర్మించిన రైల్వేశాఖ 1995-96

వచ్చేసరికి నిర్మాణ పరిమాణాన్ని తగ్గించింది. దీంతో ప్రస్తుతమున్న రైలుమార్గాల్లో రద్దీపెరిగి, వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. దాదాపు 1200 కిలోమీటర్ల రైలుమార్గం అవసాన దశకు చేరుకుందని స్వయంగా రైల్వేశాఖే ఒప్పుకుంది.

రైలుమార్గాల డబ్లింగ్‌ను నిర్లక్ష్యం చేయడం మరో ప్రధానాంశం దేశంలో కేవలం 23 శాతం రైలుమార్గాల్లోనే డబుల్ లేదా మల్టీ ట్రాక్‌లున్నాయి. గత పది సంవత్సరాలలో కేవలం 2000 కి.మి. రైలు మార్గాన్ని మాత్రమే డబుల్ ట్రాక్ మార్గంగా మార్చారు. దీనికోసం 1994-95లో రూ. 265 కోట్లు కేటాయించగా 1995-96లో రూ. 150 కోట్లకు తగ్గించారు. డబ్లింగ్ కోసం సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు కేటాయించాలని గౌరవనీయులైన రైల్వే మంత్రిని కోరుతున్నాను.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చే స్టేషన్లలో ప్లాట్‌ఫారాలు కాంక్రీట్‌తో నిర్మించారు. తరచూ వీటిని శుభ్రం చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉంది. రాజధాని న్యూఢిల్లీ రైల్వే స్టేషనులో పరిస్థితి ఏమీ బాగా లేదు. చాలా స్టేషన్లలో పరిస్థితి ఇలాగే ఉంది. ప్రయాణీకుల సౌకర్యాలకోసం ఖర్చుచేయగల పరిస్థితిలో ఉన్న రైల్వేశాఖ, తనకుగల గుత్తాధిపత్యంవల్లే నిర్లక్ష్యం చేస్తోంది. ఈ పరిస్థితికి ఇదే ప్రధాన కారణం.

ఉద్యోగుల భద్రతకోసం రైల్వేశాఖ కొంతవరకు కృషి చేస్తోందని ఒప్పుకుంటాను. ఉద్యోగుల కోసం పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు నిర్వహిస్తోంది. విజయవాడలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కొంతకాలం క్రితం రైల్వేమంత్రిని కోరాను. రెండు సంవత్సరాల క్రితం దాన్ని ప్రారంభించారు. ఇప్పుడది బాగా నడుస్తోంది. ఇప్పుడు డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇన్ని చేస్తున్నప్పటికీ, అవసరాలకనుగుణంగా సదుపాయాలు పెరగడంలేదు. రైల్వేశాఖ నడిపే పాఠశాలల్లో సీట్ల సంఖ్య పరిమితంగా ఉండడంవల్ల ఉద్యోగులందరి పిల్లలకు వీటిలో ప్రవేశం లభించడంలేదు. దీంతో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర పాఠశాలల్లో రైల్వే ఉద్యోగుల పిల్లలను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నారు. మీకు మీ పాఠశాలలుండగా మా దగ్గరకెందుకొస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైతే నిజమైన అవసరాలున్నాయో గుర్తించి, తదనుగుణంగా సీట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

రైల్వేశాఖ కేవలం రెండు యూనియన్లకే తన గుర్తింపునిచ్చింది. భారతీయ రైల్వే ఉద్యోగుల సమాఖ్య (ఐ.ఆర్.ఎం.ఎఫ్.), భారత జాతీయ రైల్వే ఉద్యోగుల సమాఖ్య (ఎన్.ఎఫ్.ఐ.ఆర్)లను మాత్రమే గుర్తించారు. ఇంతపెద్ద రైల్వేశాఖలో కేవలం రెండు యూనియన్లు ఉండటమేమిటో నాకర్థంకాలేదు. వివిధ విభాగాలలో 16 లక్షల మంది పనిచేసే రైల్వేశాఖలోని ఉద్యోగులందరి సమస్యలను పరిష్కరించటం ఏ ఒక్క యూనియన్‌వల్ల కాదు. లోకో రన్నింగ్ స్టాఫ్, ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్,

డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్, ఇ.డి.పి. అసోసియేషన్, ఇండియన్ రైల్వే స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ వంటి ఎన్నో సంఘాలు ఉన్నాయని తెలిసింది. అందువల్ల కార్మిక సంఘాల చట్టాలను సవరించడంపై పునరాలోచించాలి. సమస్యలపై స్పందించే యూనియన్లకు అనుమతివ్వాలని సూచిస్తున్నాను.

యాజమాన్యంలో ఉద్యోగుల భాగస్వామ్యంకోసం ప్రవేశపెట్టిన నూతన పథకం ఆశావహమైనది. ఈ పథకం వల్ల ఉన్నతస్థాయి అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు పరస్పరం చర్చించే అవకాశం లభిస్తుంది. ఈ పథకం ఎంతమేరకు అమలవుతుందనేది పక్కనబెడితే, యాజమాన్యంతో కిందిస్థాయి ఉద్యోగులు చర్చలు జరిపే అవకాశం లభించడమే ఇందులోని కీలకాంశం.

డిప్లొమా, ఇంజనీరింగ్ చదివినవారెంతోమంది వివిధ రైల్వే విభాగాలలో పనిచేస్తున్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో పనిచేసే మధ్యతరగతి ఉద్యోగులు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరు సమస్యలను వెల్లడించడంతోపాటు రైల్వేల సామర్థ్యాన్ని పెంచి, రైల్వేసేవల మెరుగు దలకవసరమైన సూచనలు చేయగలరు. ఈ దిశగా ఆలోచించి, వారికి తగిన అవకాశం కల్పించాలని కోరుతున్నాను. నా దృష్టికి వచ్చిన రెండు సమస్యలను ఇదివరకే మీ దృష్టికి తెచ్చాను. ఇడి.పి. సెంటర్లలో పనిచేస్తున్న స్టెనో గ్రాఫర్ల సర్వీసు మార్పుకోసం ఇచ్చిన లిఖిత పూర్వక అభ్యర్ధనపై తగిన చర్య తీసుకుంటారని ఆశిస్తున్నాను.

మెకానికల్, సిగ్నల్, టెలికమ్యూనికేషన్ల విభాగాల్లో పనిచేస్తున్న డిప్లొమా ఇంజనీర్లు, తమను జూనియర్ ఇంజనీర్లుగా పిలవాలని డిమాండు చేస్తున్నారు. ప్రభుత్వశాఖలైన రోడ్డు రవాణా, టెలికమ్యూనికేషన్లు, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి వంటి శాఖల్లోని డిప్లొమా ఇంజనీర్లను జూనియర్ ఇంజనీర్లుగా పరిగణించాలని కేంద్రం ఉత్తర్వులు జారీచేసిన దరిమిలా వారి డిమాండు సహేతుకమే. రాష్ట్ర, ప్రభుత్వ ఆధ్వర్యంలోని పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు వంటి శాఖలతోపాటు, చాలా శాఖల్లో డిప్లొమా ఇంజనీర్లను జూనియర్ ఇంజనీర్లుగానే పరిగణిస్తున్నారు. మధ్యస్థాయిలో పనిచేసేవారికి తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది. వారు మరింత నిబద్ధతతో కష్టపడి పనిచేసేందుకది సహాయపడుతుంది. రైల్వేలపై ఆర్థికంగా భారమేమీ పెరగదు. మీరువారికి సముచిత స్థానం కల్పించడానికి, వారి అభ్యర్ధనను మానవ దృష్టితో పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ-కోటిపల్లి రైలు మార్గం నిర్మాణానికి అనుమతించినందుకు మా పార్టీ తరపున, ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున

గౌరవనీయులైన మంత్రిగారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ రైలుమార్గం నిర్మాణం ఎంతో ప్రాధాన్యంగలది. అందుకే దీని గురించి పదేపదే అభ్యర్థించాం కేజీ బేసిన్‌లోని రవ్వ చమురు క్షేత్రం నుంచి ముడిచమురును విశాఖపట్నంలోని రెఫైనరికి తరలించడంలో ఈ మార్గం కీలకమైనది.

మల్లికార్జున్ రైల్వేశాఖ సహాయ మంత్రిగా ఉన్నపుడు మంజూరు చేసిన పెద్దపల్లి - కరీంనగర్ - నిజామాబాద్ రేల్వే మార్గం విషయంలో కూడా మంత్రికి కృతజ్ఞతలు చెబుతున్నాను. నడికుడి - బీబీనగర్ తరువాత ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న రెండో కొత్త రైలు మార్గమయిన దీనికి ప్రధాని శంకుస్థాపన చేసారు. రూ. 192 కోట్లు అవసరమైన ఈ రైలు మార్గానికి కేవలం రెండు కోట్లు కేటాయిస్తారా?

□

# హైదారబాద్, విజయవాడ, తిరుపతి, మద్రాసుల మధ్య విమాన సర్వీసులు

విజయవాడలో విమాన ప్రయాణీకుల తాకిడి రోజురోజుకి పెరిగిపోతున్నది. రాత్రి సమయాల్లో విమాన సర్వీసులను అనుమతించారు. కాని విమానాశ్రయంలో రన్ వే పనులను ఇంకా చేపట్టలేదు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రిల మధ్య వాయుదూత్ విమాన సర్వీసులను నడిపిస్తున్నా వాటిని క్రమబద్ధం చేయలేదు. ప్రమాణ వేళలు కూడా అసమంజసంగా ప్రయాణీకుల అవసరాలను బట్టి లేవు. ఈ సర్వీసులను రద్దు చేయడంవల్ల ప్రయాణీకులకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం తగినవిధంగా చర్యలు తీసుకొని వాయుదూత్ సర్వీసులను పునరుద్దరించాలని కోరుతున్నాను. బోయింగ్ విమానాలు దిగడానికి అవసరమైన రన్‌వేను నిర్మించాలని పర్యాటక, విమానయాన శాఖా మంత్రిని కోరుతున్నాను.

# విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలి

ముఖ్యమైన ఈ బిల్లు మీద మాట్లాడే అవకాశం కల్పించి నందుకు కృతజ్ఞతలు. ముందుగా బిల్లుకు సంబంధించిన లక్ష్యాల ప్రకటనలో పేర్కొన్న కొన్ని లైన్లను మీకు వినిపిస్తాను.

విద్యుత్ ఉత్పాదక వనరుల అసమాన పంపిణీ, విద్యుత్ ఉత్పాదక సంస్థల్లో ఉన్న వైవిద్యం, ట్రాన్స్‌మిషన్‌లైన్ల నిర్మాణం, నిర్వహణ, దీనికి సంబంధించిన ప్రణాళిక ఇలా కొనసాగుతుంది.

సంస్థల్లో ఉన్న వైవిధ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ బిల్లును తెస్తోంది. అయితే, అణుశక్తిసంస్థ, నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌లను ఈ బిల్లులో ఎందుకు చేర్చలేదన్నది నా ప్రశ్న. ఏ ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బిల్లును తెస్తుందో స్వయంగా ఆ ఉద్దేశానికే విఘాతం కలిగించే విషయం ఇది. చర్చ అనంతరం గౌరవనీయ మంత్రి వర్యులు మాట్లాడినప్పుడు నా ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుందని ఆశిస్తున్నా.

రెండవది, ఆస్థుల బదలీ ప్రక్రియ గురించి. చాలా తక్కువ బుక్‌వాల్యూతో ఆస్థులను కొత్త సంస్థకు అప్పగించాలని పేర్కొన్నారు. ఇది ఎంత వరకు సమంజసమో నాకర్థంగాకుండా ఉంది. మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థవైపు వెడుతున్నామని ఓ పక్క ప్రభుత్వం చెబుతుంటే మరోవైపు ఈ విధంగా కారుచవకగా ఈ ఆస్థులనెందుకు అప్పగిస్తునట్టు? దీనిని పక్కనబెట్టి ప్రస్తుత ధరల్లోంచి తరుగుదల విలువను తొలగించి ఆస్థుల విలువను ఎందుకు లెక్కగట్టకూడదు?

మూడవది, ప్రపంచబ్యాంక్ నిర్దేశించినందువల్లనే ప్రభుత్వం ఈ బిల్లును తెస్తున్న విషయాన్ని మీకు చెప్పదల్చుకున్నా విద్యుత్ ప్రాజెక్టులకోసం అవసరమైన 1.2 బిలియన్ల అప్పుకొరకు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు దగ్గరికెళ్లింది. బ్యాంకు పేర్కొన్న నిబంధనలకు ప్రభుత్వం తల ఊపింది. వర్జిన్‌కు ఆర్. వాసుదేవన్ రాసిన ఉత్తరం ఈ విషయాన్ని స్పష్టపరుస్తోంది. ఈ విధంగా జరిగి ఉండాల్సింది కాదని నేను భావిస్తున్నా. ప్రపంచ బ్యాంకో లేక ఏ ఇతర సంస్థలో నిర్దేశించే నిబంధనలను పాటించడం కంటే మనదేశ ప్రయోజనాలకు అగ్రస్థానం ఇవ్వడం సముచితం.

నేను పేర్కొన దలిచిన మరొక అంశం ఏమంటే కొత్తగా వచ్చిన విద్యుత్ ప్రాజెక్టుల గురించి. పలు ప్రాజెక్టులకు అనుమతి లభించింది. సంతోషించదగ్గ విషయమే ఇది. ఎందుకంటే పరిశ్రమలుగానీ వ్యవసాయంగానీ ఏ ఇతర రంగం గానీ విద్యుత్తనేది అత్యంత కీలకమైన అవసరం. ఐతే, నాకర్థం కాని విషయమేమంటే సరిపడినంత బొగ్గు సహజవాయువు లేని పరిస్థితిలో ఈ ప్రాజెక్టులకు అనుమతి ఎలా లభించిందా అని. బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి ఏ చర్యలు తీసుకున్నారు? ఆంధ్రప్రదేశ్ విషయాన్నే తీసుకుంటే, మాకు అవసరమైనంత బొగ్గు లభ్యంగావడంలేదు. రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో (తూర్పుగొదావరి, పశ్చిమగోదావరి, విశాఖపట్నం) సహజవాయువు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులను ప్రతిపాదించడం జరిగింది. అయితే, ముందు అంచనా వేసినంతగా సహజ నిక్షేపాలు అక్కడ లేవని తాజాగా తేలింది. ఈ కారణంగా కొన్ని ప్రాజెక్టులు రద్దయ్యాయి. పరిస్థితులు ఇలా ఉన్నప్పుడు బొగ్గు, సహజవాయువు ఉత్పత్తి మీద ప్రభుత్వం దృష్టిపెట్టి తీవ్రమైన ప్రమాణాలను చేపట్టవలసి ఉంటుంది. తదనుగుణంగా, విద్యుత్ ప్రాజెక్టులను తీసుకురావడం సాధ్యపడుతుంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి నా విన్నపం ఏమిటంటే, ఈ బిల్లుపైన అధ్యయనానికి ఉభయ సభలకు చెందిన సభ్యులతో కూడిన ఒక సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటు చెయ్యమని. ఎందుకంటే,

ఈ బిల్లు వల్ల కలిగే పర్యవసానాలు మన ఆర్థిక వ్యవస్థపైన దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపనున్నాయి. అంతేగాక ఎంతో మంది ఉద్యోగులు, మరెన్నో ఇతర రంగాలు ఈ ప్రభావానికి గురికానున్నాయి. కాబట్టి, సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటు చేయమని ప్రభుత్వానికి నేను విజ్ఞప్తి చేస్తున్నా.

చివరగా, ప్రభుత్వానికి చేసే మరో విజ్ఞప్తి వ్యవసాయ విద్యుత్తు టారిఫ్‌ను యాభైపైసల దాకా పెంచకుండా ఉండమని నేను కోరుకుంటున్నా. ఎందుకంటే, విద్యుత్ ధర అంత పెరిగితే మనదేశంలోని వ్యవసాయరంగం సర్వనాశనమౌతుంది. అభివృద్ధి చెందిన ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర పరిశ్రమలకు, వ్యవసాయానికి విద్యుత్తునందిస్తున్న ధర తక్కువే కావచ్చు. కానీ, మన దేశంలోని రైతుల, సాధారణ ప్రజల తలసరి ఆదాయాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి. ఇదే సందర్భంలో ఇతర దేశాల్లోని పేద ప్రజల సగటు ఆదాయాల్లో కలుగుతున్న వృద్ధినీ మనం గమనించాలి. ఇయంఎఫ్, ప్రపంచ బ్యాంక్ చెప్పినట్లుగా చేస్తూ పోవడమంటే ఈ దేశాన్ని వినాశనం వైపు తీసు తీసుకెళ్ళడమే నన్నది మీరు గ్రహించాలి. ప్రభుత్వానికి నేను చేసే సూచన ఏమంటే... పంపిణీ నష్టాలను తగ్గించడం ద్వారా డబ్బును ఆదాచేసి ఈ దేశ రైతులకు సాధారణ ప్రజానీకానికి తోడ్పడమని కోరుతున్నాను.

□

# విద్యుత్ రంగం

మహారాష్ట్రలోని మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఎం.ఎస్.ఇ.బి.) అమెరికాకు చెందిన ఎన్రాన్ పవర్ కార్పోరేషన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొంది. ఒకవేళ ఈ ఒప్పందంలోని నిబంధనలను మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం అంగీకరించినట్లయితే అనేక సమస్యలెదురవుతాయి. 16శాతం పోస్ట్‌టాక్స్ గ్యారంటీ రిటర్న్ తర్వాత వచ్చే లాభాలను చెల్లించడానికి ఫారెన్ ఎక్చేంజి నిధుల సమస్య తలెత్తుతుంది. ఈ నిబంధనలను అంగీకరించినట్లయితే విదేశాల నుంచి వచ్చే పవర్ కార్పోరేషన్‌ల నిబంధనలను కూడా అంగీకరించాల్సి వస్తుంది. భవిష్యత్తులో వచ్చే పెట్టుబడులన్నింటి విషయంలో కూడా ఇలాగే జరగొచ్చు. ఇది విదేశీ మారక ద్రవ్య నిల్వలపై పెనుభారం అవుతుంది. అందువలన ఇలాంటి అంశాలపై జాగ్రత్త వహించమని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

# నివాళులు

# ఆచార్య ఎన్.జి. రంగా

స్పీకర్ గారు, ఆచార్య ఎన్.జి. రంగా మరణంతో జాతి, ప్రత్యేకించి లోక్‌సభ ఒక మిత్రుడ్ని, తత్వవేత్తను కోల్పోయింది. దేశ వ్యవహారాల్లో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన అద్వితీయమైన పాత్రపోషించారు. మారుమూల కుగ్రామాలకు సైతం పూజ్యబాపూజీ సందేశాన్ని చేరవేసి స్వతంత్ర భారతావనిలో రైతులు, చేనేత కార్మికులు, మహిళలు, గ్రామీణ చేతివృత్తిదారుల్లో స్ఫూర్తిని కలిగించారు. మీ వృత్తులు పరిరక్షించబడతాయని, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆశావహ వాతావరణాన్ని సృష్టించారు ఆయన. రాజకీయ కార్యకర్తలకు సరైన విషయావగాహన కలిగించాల్సిన అవసరముందని ఆయన గుర్తించారు. వందలాది రాజకీయ శిక్షణాతరగతులు నిర్వహించి చరిత్ర, ఆర్థిక, రాజనీతి శాస్త్రాలతోపాటు ప్రజాజీవితానికి సంబంధించిన పలు అంశాలను బోధించారు. ఆపరిజ్ఞానంతోనే చాలా మంది ప్రస్తుతం దేశంలో వివిధ పార్టీల్లో ఉన్నత స్థానాలను అధిరోహించారు.

రైతులకి, గ్రామీణ ప్రజలకి ఆయన నిజమైన మిత్రుడు. భారత ప్రజానీకానికి అత్యంత ప్రీతిపాత్రుడయిన గొప్ప ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకించిన ధైర్యశాలి ఆయన. దేశ ప్రయోజనాలకు, రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ఆ నిర్ణయం లేనందునే ఆయన దానిని చాలా తీవ్రంగా వ్యతిరేకించారు.

ఇంద్రజిత్ గుప్తా అభివర్ణించినట్లు ఆయన దయాళువు. ఏ పార్టీకి చెందిన యువ పార్లమెంటు సభ్యులకయినా ప్రోత్సాహాన్ని అందించేవారు. ప్రేమతో వారి లోపాలు చెప్పడంతోపాటు బాగా ఎలా రాణించవచ్చో సలహాలు కూడా చెప్పేవారు.

ఇదే నాకు ఆయనతోగల అనుబంధం గొప్పరైతునాయకుడయిన ఆయనకు మా పార్టీ తరపున నివాళి అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. మా సంతాపాన్ని ఆయన కుటుంబసభ్యులకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

మా పార్టీ తరపున నివాళి అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. మా సంతాపాన్ని ఆయన కుటుంబసభ్యులకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

# ఎన్.టి. రామారావు

ఈ దేశ ముద్దు బిడ్డ ఎన్.టి. రామారావుకు నివాళులర్పించడానికి అనుమతినిచ్చినందుకు స్పీకర్‌కి ధన్యవాదాలు. దేశంలోని ప్రతి వ్యక్తికి కూడు, గూడు, నీడ కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనల్ని అమలు పరచడానికి ప్రయత్నించిన వ్యక్తి రామారావు. కిలో బియ్యం రెండు రూపాయలు వంటి సంక్షేమ పథకాలని అమలు చేసిన వ్యక్తి ఆయన. పేదలకి లక్షల శాశ్వత గృహాలని నిర్మించి, వారికి బట్టల్ని సబ్సిడీ రేట్లకిప్పించిన వ్యక్తి ఆయన. ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మూడవ సారి ముఖ్యమంత్రి అయిన క్షణమే మద్యపానం నిషేదించారు. మైనార్టీలకు, వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు అమలు పరచి, స్థానిక సంస్థల కో ఆపరేటివ్ ఎన్నికలు జరిపించిన ప్రజాస్వామ్య విశ్వాసవాది.

దేశంలోనే ఆదర్శమైన కోఆపరేటివ్ చట్టాన్ని అమలు పరచిన మొదటి వ్యక్తి రామారావు. ఆయన కాలంలో రాష్ట్రంలో మత సామరస్యం సంపూర్ణంగా ఉంది. మీరన్నట్టు వందల సినిమాల్లో నటించడం వల్ల, రామారావు వేలమంది హృదయాల్లో నిలిచి పోయారు. జనవరి 18న రామారావు మరణించారు. పేద ప్రజలు ఒక సన్నిహితుణ్ణి కోల్పోయారు. ప్రజల సంక్షేమాన్ని మరవకుండా ఆయన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేసింది.

# మొరార్జీదేశాయ్


శ్రీ మొరార్జీదేశాయ్ మరణం పట్ల తెలుగుదేశం పార్టీ తరపున ప్రగాఢ సంతాపం తెలుపుతున్నాను. నిర్మొహమాటంగా మాట్లాడే గుణం, పరిపాలన సామర్థ్యాలు, ధైర్యం, నమ్మిన సిద్ధాంతాలు ఆచరించడం... వీటన్నింటికి ఆయన ప్రతీక. ఆయన ప్రధాన మంత్రిగా ఉన్నకాలంలో సామాన్యుడు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు పొందేలా ధరల పెరుగుదలను ఆదున అదుపులో పెట్టారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతిన్నందున ఎమర్జెన్సీ అనంతరం ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన వ్యక్తి ఆయన.



బర్నాలా గ్రామంలో ప్రకాశ్ సింగ్ బాదల్, చతురానన్ మిశ్రా, లాలూ ప్రసాద్ యాదవ్ తో వడ్డే



అమెరికా వ్యవసాయ శాఖకు చెందిన జాన్సన్, వి.ఆర్. రెడ్డి లతో వడ్డే



# శాంతి భద్రతలు



నేతాజి సుభాష్‌చంద్రబోస్ కుమార్తె అనితా బోస్ తో



పంజాబ్‌లో రైతు సదస్సులో  వడ్డే

# బలహీన వర్గాలపై దురాగతాలను అరికట్టాలి

గౌరవ సభ్యుడు, మిత్రుడు సత్యదేవ్‌సింగ్ ప్రవేశపెట్టిన తీర్మానంపై మాట్లాడేందుకు నాకు అవకాశమిచ్చినందుకు చైర్మన్ గార్కి కృతజ్ఞతలు. షెడ్యూలు కులాలు, తెగల ప్రజలపై మహిళలపై అరాచకాలు, వేధింపులకు సంబంధించిన ఈ తీర్మానం సారాంశానికి నేను మద్ధతిస్తున్నాను. కానీ తీర్మానంలో కేవలం ఉత్తరప్రదేశ్, బీహార్‌లను మాత్రమే పేర్కొనడం పట్ల నేను ఆశ్చర్య పడుతున్నాను. ఇందులో మర్మమేంటో నాకర్థం కావడంలేదు.

ఎస్సీ, ఎస్టీలపై అరాచకాలకు సంబంధించిన కేసుల వివరాలు రాష్ట్రాల వారీగా నా దగ్గర ఉన్నాయి. ఒక్క రాజస్థాన్‌లోనే వందలాది కేసులు నమోదైనట్టు గతంలోనే సభ దృష్టికి వచ్చింది. ఎస్సీలపై అరాచకాలకు సంబంధించి మధ్య ప్రదేశ్‌లో 1992లో 4571, 1993లో 4,387, ఎస్టీలపై అరాచకాలకు సంబంధించి 1992లో 576, 1993లో 1586 కేసులు నమోదయ్యాయి.

నా మిత్రుడు షాబుద్దీన్ వ్యక్తపరచిన అభిప్రాయాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఆయన చెప్పినట్టు ఎస్సీ, ఎస్టీలపై అరాచకాలు కేవలం ఉత్తరప్రదేశ్, బీహార్‌ల్లోనే జరుగుతున్నాయనడం వాస్తవం కాదు. ఇలాంటి

సంఘటనలు ఏ ప్రాంతంలో చోటుచేసుకున్నా మనం వీటిని తీవ్రంగా పరిగణించాలి. గుండెల్ని పిండేసే ఇలాంటి వార్తా కథనాలు చదువుతున్నపుడు మనం చాలా బాధను అనుభవిస్తాం. దురదృష్టకరమైన ఇలాంటి దారుణ సంఘటనలపై వార్తలు ఉత్తరాదినుంచే వస్తున్నాయి. ఉదాహరణకు రాజస్థాన్‌లో 'సతి' దురాచారానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న స్వచ్ఛంద సంస్థకు చెందిన మహిళలతో కలిసి వెళ్ళినందుకు ఓ మహిళను వేధించిన తీరు... గుండెల్ని బద్దలు చేస్తుంది.

ఓ ఎస్సీ అబ్బాయి, ఎస్సీయేతర అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకోవాలనుకున్నపుడు జన్మనిచ్చి పెంచి పోషించిన వారి ముందే గ్రామస్థులు ఆ యువకుడిని దారుణంగా హత్యచేయడంలాంటి కథనాలు చాలా సందర్భాల్లో మనకు తటస్థం అవుతాయి. ఇలాంటి సంఘటనలు ఇంకా తలెత్తుతూనే ఉన్నాయి.

దేశరాజధానికి అతి సమీపంలో కొన్నేళ్ల క్రితం అంటే ఎనిమిదో లోక్‌సభ కాలంలో జరిగిన సంఘటన సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఊరు పేరు గుర్తువేసినప్పటికీ ఆ సంఘటన నాకు బాగా జ్ఞాపకం ఉంది. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఆ దారుణాన్ని మనం మరిచిపోలేం. వందమంది పోలీసుల సమక్షంలో ఆలయంలోకి అడుగుపెట్టినందుకు ఆ యువకుడిని కిరాతకంగా చంపేశారు. గాంధీ, జ్యోతిరావ్‌పూలె, అంబేద్కర్ లాంటి మహోన్నత వ్యక్తులు చేసిన పోరాటాల ఫలితంగా హరిజనులకు ఆలయ ప్రవేశం లభించింది. హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించేందుకు ఆధునిక యుగంలోనూ కొందరు వ్యక్తులు అంగీకరించకపోవడం నమ్మశక్యం కాకుండా ఉంది. 30 నుండి 40 ఏళ్ళ మధ్యనున్న వారు మూడేళ్ళ బాలికలపై అత్యాచారాలకు పాల్పడ్డారన్న వార్తలు మనం వింటూనే ఉంటాం. ''నిజంగా వాళ్ళు మనుషులేనా''? ఇలాంటి సంఘటనలు విన్నప్పుడల్లా మన హృదయం ఆవేదనతో నిండిపోతుంది.

భూ సమస్యలు, తదితర కారణాలేమైనప్పటికీ ఇలాంటి సంఘటనలు సంభవించినపుడు జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు చొరవతీసుకుని గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటుచేసి చర్యలు తీసుకోవడం మంచిది. భవిష్యత్తులో అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవకాశముంటుంది. ఎస్సీ, ఎస్టీల మీద అరాచకాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం పెంచేందుకు కృషిచేస్తున్న బాధ్యతాయుతమైన పౌరులతో కూడిన కమిటీలుంటే నష్టాల్ని కొంతమేర పూడ్చుకోవచ్చు.

మహారాష్ట్రకు రెండో రాజధానిగా పరిగణించే నాగ్‌పూర్‌లో ఓ గిరిజన తెగకు చెందిన వేలాది ప్రజలు తమ సమస్యను చెప్పుకోడానికి వచ్చారు. ఆ సమయంలో

శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయి. ఆరాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం ఈ విషయాన్ని పట్టించుకోలేదు. బహుశా బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ఆయనకు తీరిక లేకపోవచ్చు. ఆ రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి కూడా గిరిజనుల దగ్గరకెళ్ళకుండా పక్కనున్న వారితో ``వాళ్ళకేం కావాలి? మనం ఆ సమస్య తీర్చగలిగితే ఫర్వాలేదు. మనం తీర్చలేకపోతే? ఆకాశం నుంచి ఏమీ ఊడిపడడం లేదని చెప్పొచ్చు'' అని అన్నారు. ప్రభుత్వానికున్న ఇలాంటి నిర్లక్ష్య ధోరణి కారణంగానే 120 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఇది చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయింది.

ఎస్సీ, ఎస్టీలు, బలహీనవర్గాలు, మైనారిటీలు, మహిళలపై అరాచకాలకు పాల్పడేవారిని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనే కాకుండా, స్థానిక ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు అనర్హులు చెయ్యాలి. ఇలాంటివారే తెరవెనకుండి రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తారు.

ఈ సందర్భంగా నాకో సంఘటన జ్ఞప్తికి వస్తోంది. బాధ్యతాయుతమైన ప్రభుత్వాలు, పార్టీలు కొన్ని సందర్భాల్లో తమ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగానే వ్యవహరిస్తున్నాయి. నేనొక విషయాన్ని ప్రస్తావిస్తున్నందుకు మిత్రులు మన్నించాలి. హుబ్లిలోని ఈద్గాలో ఒక రాజకీయపార్టీ జాతీయపతాకాన్ని ఆవిష్కరించాలని ప్రయత్నించింది. దురదృష్టవశాత్తు అక్కడ అప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆ రాజకీయ పార్టీయే ఎందుకు అక్కడ పతాకావిష్కరణ చేయాలి. మీరే ఆపని ఎందుకు చేయలేదంటూ ఈద్గా నిర్వాహకుల్ని ఆపలేకపోయింది.

డాక్టర్ రమేష్ చంద్ తొమర్ (హాపూర్): మా పార్టీవాళ్లే చెప్పారా? ఎందుకు తప్పుగా చెప్పారు?

శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు : జాతీయపతాకం మనందరిదీ. 90 కోట్ల మంది పతాకం. దీన్నుంచి ఓ రాజకీయ పార్టీ , రాజకీయ ప్రయోజనాన్ని కోరుకొనవచ్చు. కాని అధికారంలో ప్రభుత్వం లేదా సంస్థ ముందుకు వచ్చి ఏంటి ఇది?ఎందుకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్నారు. అని అడగాలి. మనం భారతీయులం, మనం మన పతాకాన్ని ఆవిష్కరించుకుంటాం. ఈ వైఖరికి మనం కట్టుబడి ఉండాలి. ఏమైనప్పటికీ, అంతకుముందున్న ప్రభుత్వం ఈ వైఖరికి కట్టుబడిలేదు. కాని, దెవెగౌడ

ప్రభుత్వం ఈ పని చేసింది. అందుకే ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వాన్ని దీనితో సంబంధం ఉన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఈ చిన్న విషయం రెండు సంవత్సరాల పోరాటానికి దారి తీసింది. ఎందుకిలాంటివి జరుగుతున్నాయంటూ నేను ఆశ్చర్యపోయాను. ఇలాంటి వాటిని త్యజించాలని, రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని సూచిస్తున్నాను. ఈ విషయంతో నా స్నేహితులతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అన్ని రాజకీయ పార్టీలు నేరచరితులకు టిక్కట్లను ఇచ్చే సంప్రదాయం క్రమంగా వస్తోంది. వారిలో చాలా మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, చివరకు మంత్రులవుతున్నారు. ఇది ప్రజా జీవితాన్ని నిర్వీర్యం చేస్తోంది. హంతకులు, దోపిడీ దొంగలు, సమాజంలో అశాంతిని సృష్టించేవారిని ప్రోత్సహిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారనుకుంటున్నాను. ఇది నిజంగా ఆందోళనకరం. ఈ ధోరణులను నివారించవలసి ఉంది.

ఐదు సంవత్సరాల క్రితం భాగల్పూర్ ఉదంతం జరిగింది. దీన్ని గురించి తెలుసుకుని దేశం యావత్తు నిర్ఘాంతపోయింది. ఈ సంఘటనపై విచారణకోసం ఏర్పాటైన కమిటి ఇంతవరకు నివేదికను సమర్పించలేదు. ఎస్సీ, ఎస్టీలను ఎంతగా ఆదరిస్తామో, వారిపై ఎలాంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నామో ఈ సంఘటన తేటతెల్లం చేసింది. కారకులెవరైనప్పటికీ దేశంలోని ప్రజలకు ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్న ఇలాంటి అంశాల్ని చర్చిందేందుకు సభ ముందటకు తెచ్చినందుకు నా సహచరుడు సత్యదేవ్ సింగ్‌ను అభినందిస్తున్నాను. ఈ తీర్మానంలోని స్ఫూర్తిని నేను సమర్థిస్తున్నాను. దేశవ్యాప్తంగా సంభవిస్తున్న ఈ సంఘటనలను తగ్గించేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలి. ఒక్కసారిగా ఈ సమస్యను తగ్గించడం సాధ్యం కాకపోవచ్చు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల్లో సాంఘిక సంస్కరణ, పునర్జీవనం ముందుగానే ప్రారంభమైంది. కాని కొన్ని ప్రత్యేక కారణాలవల్ల ఉన్నత - నిమ్నకులాల మధ్య ఉత్తరాదిలో ఘర్షణ ఏర్పడింది. భూమి సమస్యల కారణంగా బీహార్‌లో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఇదెలా వచ్చిందో నాకు తెలియదు. ఎస్సీ, ఎస్టీలను, భూమిలేని పేదలను చంపుతున్న ప్రైవేట్ సైన్యాలను నివారించడం, నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఈ తీర్మానంపై మాట్లాడేందుకు అవకాశాన్ని కల్పించిన మీకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. □

# మా నమ్మకాన్ని వమ్ము చేయవద్దు

మిత్రుడు సోమ్‌నాథ్ ఛటర్జీ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని సమర్ధిస్తున్నాను. భారతదేశ ఆర్ధిక రాజధానిగా పేరొందిన బొంబాయినగరం గత జనవరి నెలలో ఎన్నో అవంతారలను ఎదుర్కొంది. మత విద్వేషాలు చెలరేగటం వల్ల వందల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లతో బొంబాయి నుంచి బయటకు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి బొంబాయికి రవాణా దెబ్బతినటం వల్ల దేశ ఆర్ధిక కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రజల్లో భయాందోళల్ని తగ్గించి, నమ్మకాన్ని కలిగించి, పరిస్థితుల్ని సాధారణ స్థితికి తెచ్చేలోగానే వందల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవటమో లేదా గాయపడటమో జరిగింది.

అల్లర్లతో ప్రాణాలు కోల్పోయిన వారికి, గాయపడిన వారికి, సర్వం సహా కోల్పోయిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాను. బాంబు పేలుళ్లలో మృతి చెందిన వారికి, సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలనే గౌరవ సభ్యుడు జనార్ధన్ చేసిన సూచనలకు మద్దతు తెలుపుతున్నాను.

రాజీవ్‌గాంధీ శ్రీ పెరంబుదూర్ బాంబు పేలుళ్లతో మరణించిన అనంతరం మా రాష్ట్రంలో మేము కూడా ఇటువంటి చేదు అనుభవాలనెన్నో చవిచూశాం. రాజీవ్ మరణానంతరం దురదృష్టవశాత్తు కొన్ని అనుకోని సంఘటనలు జరిగినాయి. కొన్ని చోట్ల దొమ్మీలు జరిగినాయ్. ఆ ఘటనలో తమ వ్యాపారాల్ని పూర్తిగా నష్టపోయిన వారు ఇంతవరకూ ఏ విధమైన సహాయం పొందలేక పోయారు. సహాయం చేస్తానని ప్రభుత్వమిచ్చిన హామీ నెరవేర లేదు. ఇది మా కొక చేదు అనుభవం. బొంబాయి బాంబు పేలుళ్లతో తమ వ్యాపారాల్ని కోల్పోయిన వారికి తిరిగి తమ వ్యాపారాలు కొన సాగించేలా సహాయం చెయ్యమని గౌరవనీయ హోంమంత్రిని కోరుతున్నాను. నేను ప్రస్తావించ బోయే వార్త ఆందోళన కలిగించేది. సోమ్‌నాథ్ ఛటర్జీ, జస్వంత్ సింగ్‌లు ఆ పేరు చెప్పారు కనుక నేను తిరిగి ఆ పేర్లు చెప్పదల్చుకోలేదు. కొందరు ముఖ్యవ్యక్తులు మనదేశం విడిచి వెళ్లిపోయారు. ఇటువంటి సంఘటన ఈ విధంగా జరగటం ఇది మొదటిసారేమి కాదు. గతంలో సయితం ఇలాగే జరిగింది. మనకింకో భయంకరమైన

అనుభవం ఉంది. ఆర్థిక నేరగాళ్లున్నారని గుర్తించేలోగానే, వారు దేశం విడిచి వెళ్లిపోయారు.

శ్రీ పెరంబుదూర్ రాజీవ్ గాంధీ హత్యలో వాస్తవాలను చెప్పగల ఓ ముఖ్యవ్యక్తిని బుద్ధిపూర్వకంగానో, తెలియకో ఆత్మహత్య చేసుకునే అవకాశం కల్పించారు. అతను ప్రత్యేక పరిశోధనా సభ్యుల రక్షణలో ఉండగా ఈ సంఘటన (ఆత్మహత్య) ఎలా జరిగిందనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయ్. ప్రజలు ఎన్నో రకాల అభిప్రాయాల్ని వెలిబుచ్చుతున్నారు. అదే విధంగా ప్రస్తుత బొంబాయి బాంబు పేలుళ్ల సంఘటనలోనూ కీలక సమాచారాన్నివ్వగలిగిన వ్యక్తి దేశం విడిచి వెళ్లగలిగాడు. అతనొక్కడే కాకుండా, అతని కుటుంబ సభ్యులంతా దేశం విడిచిపోయారు. వదంతుల్ని వ్యాపింప చేయరాదన్న శరథ్ ధిగే సూచనను నేను ఒప్పుకుంటున్నాను. ప్రభుత్వం ముందు ఈ సంఘటనపై ఒక అవగాహనకొచ్చి, సంఘటనతో సంబంధమున్న వ్యక్తుల్ని, లేదా సంస్థను గుర్తించాలి. ఇదే సమయంలో పనికట్టుకుని కొందరు ఒక వర్గంపై కోపం వచ్చేలా ఉద్దేశ్య పూర్వక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటువంటి సంఘటల్ని దేశం హర్షించదు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు అవగాహనతో బాధ్యతా యుతంగా ప్రవర్తించాలన్న ఆయన సూచనతో నేను పరిపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. ఇదే సమయంలో చాకో వ్యాఖ్యల్తో విభేదిస్తున్నాను. ముఖ్య సంఘటనల్లో ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సహకరించాయి. అయినప్పటికీ మీ ప్రభుత్వం పరిస్థితులకు అనుగుణంగా నిలబడలేక పోయింది. మీరు తప్పులు చేసినప్పుడల్లా ప్రతిపక్షాలు ఆదుకోవాలనుకుంటారు. త్రిపుర శాసన సభాకాలం ముగిసిన తరువాత ఏం చెయ్యాలన్న విషయంపై ప్రతిపక్షాన్ని మీరు సంప్రదించలేదు. రాజ్యాంగంలో అనుమతించిన దానికన్నా త్రిపురలో ఎక్కువ కాలం 'కేర్‌టేకర్' ప్రభుత్వాన్ని కొనసాగించారు. సభలో ఈ విషయమై వాడిగా వేడిగా చర్చ జరిగిన మీదట త్రిపురలో రాష్ట్రపతి పాలన విధించారు. అందుకని ప్రభుత్వానికి నేను సూచించిందేమంటే, ప్రతిపక్షాల నమ్మకాన్ని వమ్ము చెయ్యకండి. వారిలో నమ్మకాన్ని కలగచేయండి. క్లిష్ట సమయాల్లో ప్రతి పక్షాలను సంప్రదించి వారి సహాయ సహకారాలు పొందండి. ఏకపక్ష ధోరణి విడనాడి ఈ విషయంపై దృష్టి సాధించండి. ప్రభుత్వానికి మా సాయమెప్పుడూ ఉంటుంది. కానీ పై నుదహరించిన సంఘటన విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ దృష్టితోనే ముందుగా వాయిదా తీర్మానాన్ని తెచ్చాం. సోమ్‌నాథ్ ఛటర్జీ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంతో ఏకీభవిస్తున్నాను, సమర్థిస్తున్నాను. □

# జమ్మూకాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులు ఏర్పడాలి

కాశ్మీర్‌లో ఇప్పటికే వందల మంది హత్యకు గురవుతున్నారు. మన రక్షణ బలగాలపై తీవ్రవాదులు 1275 సార్లు దాడిచేశారు. ప్రతిదాడిలోనూ, ఒకరో, ఇద్దరో జవాన్లు చనిపోయారు. ఈ పరిస్థితుల్లో అక్కడ ఎన్నికల నిర్వహణ కుదరదు. అవినీతి స్థాయి విశృంఖలంగా ఉందని సమాచారం. అటువంటి ప్రాంతాలకు శ్రద్ధ, అంకిత భావం కల అధికారుల్ని నియమించాలి. దీనివల్ల ఆ ప్రాంతాభివృద్ధి కోసం కేటాయిస్తున్న అనేక నిధులు సక్రమంగా ప్రజలకు చేరతాయి. ఆ ప్రాంతంలోని రకకరాల అభిప్రాయాలున్న పలు వర్గాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి. దేశ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకు భంగం వాటిల్లకుండా వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. జమ్మూకాశ్మీర్ భారత్‌లో విలీనమయ్యే తీర్మానాన్ని అమెరికా గుర్తించదని సహాయ మంత్రి అన్నారు. కానీ ఈ అభిప్రాయంతో మనం ఏకీభవించబోవటం లేదు.

3 సెప్టెంబర్ 1992 నుండి మరో ఆరునెలలు రాష్ట్రపతి పాలన విధించటానికి మద్ధతు తెలిపే ముందు నేను కొన్ని విషయాలు చెప్పదలచుకున్నాను.

ప్రధాన మంత్రి, హోంమంత్రి చేసిన ప్రకటనలను నేను ఒప్పుకోవటం లేదు. జమ్ముూకాశ్మీర్‌లో పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు.

రాకెట్లు ప్రయోగించి ముఖ్యపట్టణం శ్రీనగర్‌లోని అసెంబ్లీ భవనం, సచివాలయాలపై దాడి చేయగలగడాన్ని బట్టి మిలిటెంట్లు ఎంత శక్తియుక్తులను పుంజుకున్నారనేది అర్థమవుతుంది. పరిస్థితి విషమంగానే ఉంది.

మిలిటెంట్ల కార్యకలాపాలను తగ్గించడానికి ప్రభుత్వం తన ప్రయత్నాలను అలాగే కొనసాగించాలి. మన సైన్యానికి అవసరమైన అత్యాధునిక ఆయుధాలు సమకూర్చాలి. పాకిస్తాన్ నుంచి, ఇతర మార్గాల నుంచి మిలిటెంట్లకు ఆయుధాలుఎలా అందినవి?

ఆ రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని మనవి చేస్తున్నాను. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అక్కడ ప్రశాంత పరిస్థితులు ఏర్పడాలి. ఆ పరిస్థితులు ఏర్పడడానికి సరియైన చర్యలు తీసుకోవాలి. ఆర్టికల్ 370 వల్ల కాశ్మీర్‌లోయ ప్రజలకు రక్షణ కల్పించగలమనే విశ్వాసాన్ని ప్రభుత్వం వాళ్లలో పాదుకొల్పాలి. ఓ సమయంలో తప్పొప్పులు జరిగినందువల్ల నమ్మకం పెంచే చర్యలు చేపట్టాలి.

కాశ్మీర్‌లో అధికారంలో ఉన్నవారుగానీ, కేంద్రంగానీ అధికరణం 370ని సరిగా అమలు చేయడం లేదని కాశ్మీర్ లోని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. కాశ్మీర్ ప్రజలు ప్రాణాని కన్న మిన్నగా భావించే సంస్కృతిని, ప్రత్యేకతను పరిరక్షించటానికి అధికరణం 370 దోహదపడుతున్నది. అధికరణం 370ని రద్దు చేయాలని కోరుతున్న బిజెపి మిత్రులు ఈ విషయమై నన్ను క్షమించాలి. అధికరణం 370ని అమలు చేయడంలో ఉన్న చారిత్రక నేపథ్యం తెలియని యువత నాకు తెలిసిన వారిలో ఉన్నారు. కాశ్మీర్ మనదేశంలో అంతర్భాగ మైనపుడు ఆర్టికల్ 370 అవసరం ఏంటని వారడిగారు.

వారికి వాస్తవ పరిస్థితి గురించి ఏమీ తెలియదు. విభజన జరిగినపుడు కాశ్మీర్ నేత, షేర్-ఏ-కాశ్మీర్ షేక్ అబ్దుల్లా, అప్పటి పాలకుడు హరిసింగ్‌లు కాశ్మీర్‌ను ఇండియాలో కలపడానికి ఒప్పుకున్నారు.

రాత పూర్వక ఒప్పందం కుదుర్చుకున్నారు. చాలామంది యువతకు ఈ విషయం తెలియక అక్కడ అధికరణం 370ని అమలు చేయకూడదంటారు.

పాకిస్తాన్ ప్రభావంతో కొందరు తీవ్రవాదులుగా మారి అక్కడి రాజకీయ అనిశ్చితిని ఆసరాగా తీసుకొని చెలరేగి పోతున్నందువల్ల అధికరణం 370 సరిగా అమలుకావడం లేదని కాశ్మీర్ ప్రజలు భావిస్తున్నారు.

ఈ పరిస్థితిలో అధికరణం 370ని రద్దు చేయడం దేశ ఐక్యత, సమగ్రతలకు భంగకరం. కాశ్మీర్ ప్రజలు మనదేశస్థులుగానే ఉంటారు. అధికరణం 370 రద్దు డిమాండ్‌ను బిజేపి నేతలు వదులుకోవాలని నేను కోరుతున్నాను.

ముఫ్తీ మహమ్మద్ సయీద్ కొందరు మిలిటెంట్లను తన కూతురిని కిడ్నాప్ చేసిన సందర్భంలో అయూబ్‌ఖాన్ చెప్పగా విడుదల చేశారు.

వీటిని మనదేశంలో ప్రోత్సహించిన పార్టీ ఏదని గౌరవనీయ స్నేహితుణ్ని అడుగుతున్నాను. విమానం హైజాక్ చేసిన వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వడం నిజం కాదా? అకాలీపార్టీని బలహీన పర్చడానికి భింద్రన్‌వాలేను మీ పార్టీ ఎగదోసిన సంగతి వాస్తవం కాదా?

నేను చెప్పదలచుకున్న దేమిటంటే ఇతర పార్టీలను విమర్శించడానికి బదులుగా తమ గుండెల మీద చెయ్యేసుకొని నిజం మాట్లాడాలి. ఇలాంటి విమర్శలను మానుకొని దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే పనులు చేయాలి. చేసిన తప్పులను మరవాలి. కుత్సిత భావాలను వదలాలి. జాతీయ ప్రయోజనాలకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలి. ఇటువంటి తప్పుడు విధానాలనుమాని, జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించడానికి అనుకూల వాతావరణం కల్పించి అక్కడ తీవ్రవాదాన్ని తుద ముట్టించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాను.

□

# నిరంకుశ టాడా చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాను

గౌరవ మంత్రి ప్రవేశపెట్టినటువంటి తీవ్రవాద నిరోధక చట్టం -1991 సవరణ బిల్లుని నేను వ్యతిరేకిస్తున్నాను.

మొదటగా బిల్లుని సభలో ప్రవేశపెట్టినప్పుడు, అప్పటి ప్రభుత్వం తీవ్రవాదుల ఆగడాలను నియంత్రిస్తానని, టాడా చట్టాన్ని పొడిగించమని రాజ్యసభలో బిల్లుని ఆమోదించడం జరిగింది.

రెండు సంవత్సరాల్లోనే, మరో రెండు సంవత్సరాలు పొడగించడం జరిగింది. మళ్ళీ రెండు సంవత్సరాలు పొడిగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

వాస్తవానికి ఇటువంటి శాసనాలను దుర్వినియోగ పరచే అవకాశం ఉంది. దీనికి ఇప్పుడే చిత్తబసు ఒక ఉదాహరణ చెప్పారు. నిర్మల్‌సింగ్ అనే వ్యక్తి ఆ ప్రాంతంలో జరిగే అవినీతిని అరికట్టడానికి ఉద్యమం లేవదీస్తే, టాడా చట్టం క్రింద అరెస్ట్ చేశారు. సాంఘిక న్యాయం కోసం అతడు పోరాడుతున్నాడు. పరిపాలనలో జరిగే అవకతవకలను తొలగించడానికి పోరాటం చేస్తున్నాడు. టాడా చట్టాన్ని అడ్డం పెట్టుకుని అతనిని అరెస్టు చేశారు. వేరే రాష్ట్రాల్లో కూడా ఇటువంటి కేసులు ఉండవచ్చు. నా దృష్టికి వచ్చిన ప్రకారం రాజస్థాన్ లోని కోటా ప్రాంతంలో ఒక

వర్గానికి చెందిన ప్రజలను టాడా చట్టం కింద పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు.

రాజకీయ నాయకులచే గాని, అధికారులచే గాని టాడా చట్టం దుర్వినియోగపరచిన సందర్భాలు, ప్రభుత్వం జరిపిన అధ్యయనంలో వెలుగులోనికి వచ్చిన సంఘటనల గురించి, మంత్రిగారి నుంచి నేను తెలుసు కోవాలనుకుంటు న్నాను. ప్రభుత్వం ఇటువంటి సంఘటనలపై తక్షణమే స్పందించాలి. ఇంతకు ముందే మనకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి.

హైకోర్టు ఇచ్చినటువంటి ఒక తీర్పుని వ్యతిరేకించడానికి, అంతర్గత భద్రతా చట్టం జారీ చేయడం జరిగింది. దీనిని సాకుగా తీసుకుని దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడినటువంటి నాయకులను కొన్ని సంవత్సరాల పాటు జైళ్ళలో ఉంచారు. అక్కడ వారు ఎన్నో బాధలు అనుభవించారు. మురార్జీ దేశాయి, అద్వానీ,వాజ్‌పేయి, జార్జ్‌ఫెర్నాండెజ్ ఇంకా చాలా మంది స్వాతంత్ర్యం కోసం రక్తం చిందించిన వారిని జైళ్ళలో పెట్టారు.

మనకు అంతటి చేదు అనుభవం ఉంది. ఒక వ్యక్తి పదవిని కాపాడటానికి ట్రేడ్ యూనియన్ నాయకులను, రైతు నాయకులను, ఇంకా ఎంతో మందిని మీసా చట్టం కింద అరెస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి.

మళ్ళీ ఇప్పుడు అదే చట్టాన్ని తీసుకు వచ్చారు. ఈ చట్టాన్ని తీసుకువచ్చిన నాలుగు సంవత్సరాలలో ఎంత వరకు తీవ్రవాదుల చర్యలను, కార్యకలాపాలను అరికట్టడంలో విజయవంతమయ్యామో నేను తెలుసుకోవాలను కుంటున్నాను. పంజాబ్, జమ్ము, కాశ్మీర్ లలో జాతి వ్యతిరేక కార్య కలాపాలు ఎంత వరకు అదుపు లోకి వచ్చాయి.

నేను చాలా విచారిస్తున్నాను. ఎందుకంటే కాలం గడచిన కొద్దీ తీవ్రవాదుల కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. అంతేకాకుండా వారు ఆధునాతన ఆయుధాలను సమకూర్చుకొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా, జమ్ము, కాశ్మీర్ రాష్ట్ర రాజధానిలో వారు రాకెట్లను, ఆధునాతన ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రయోగిస్తున్నారు. పంజాబులోని పలు ప్రాంతాలలో కూడా వీటిని ఉపయోగిస్తున్నారు.

నా మనవి ఏమనగా తీవ్రాదులను అణచివేయడానికి మీ బలగాలు తక్షణమే స్పందించాలి. తీవ్రవాదాన్ని బలహీన పరచాలి. అదే విధంగా రాష్ట్రంలో తీవ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రభుత్వాన్ని పటిష్ట పరచాలి.

8వ లోక్ సభ సభ్యులుగా మనకి అనేక చేదు అనుభవాలు ఎదురయ్యాయి.

పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సంయుక్త సమావేశంలో బర్నాలా ప్రసంగించినప్పుడు రాష్ట్రపతి అతనిని గొప్పవక్త అని ప్రశంసించారు. తర్వాత కొన్ని నెలలకే బర్నాలా ప్రభుత్వాన్ని రద్దు చేశారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బర్నాలా ప్రభుత్వానికి రివార్డుగా ప్రభుత్వాన్ని రద్దు చేశారు. మీ రాజకీయ లబ్ధి కోసం, హర్యానాలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆ పని చేశారు. కాని హర్యానాలో ఓటర్లను ఆకర్షించడంలో విఫలం అయ్యారు. మీ పరిపాలన జిమ్మిక్కుల వలన వారు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. వారి ప్రజాస్వామ్య హక్కులను రద్దు చేశారు. పంజాబులో ప్రజల తీర్పుని ఎప్పుడు గౌరవించలేదు. పైగా హర్యానాలో అధికారం సంపాదించడానికి బర్నాలా ప్రభుత్వాన్ని రద్దు చేశారు. కాని హర్యానా ప్రజలు మీ కంటే తెలివికల వారు కనుక అధికారాన్ని మీకు ఇవ్వలేదు.

నా మనవి ఏమనగా, పంజాబు, జమ్మూ, కాశ్మీర్‌లో, అస్సాం రాష్ట్రాలలో తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి మీరు ఉపయోగించే మిలటరీ, పోలీస్ చర్యలతో పాటు, ఆయా రాష్ట్రాలలో మార్పులు తీసుకురావడానికి మార్గాలను అన్వేషించండి.

మన ప్రస్తుత హోం మంత్రి చమన్‌జీ అటువంటి మార్పును తీసుకు రావడానికి తీవ్ర కృషి చేస్తారని నేను భావిస్తున్నాను. నిన్న నాతో మాట్లాడుతూ, తాను త్వరలో పంజాబ్, కాశ్మీర్ కల్లోలిత ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడి వారిలో మార్పులు తీసుకువస్తానని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ లో కూడా పరిస్థితి అంత బాగాలేదని ఈ సందర్భంగా చెబుతున్నాను. గౌరవ హోంమంత్రి దీనిని గమనించవలసినదని నా మనవి.

అక్కడక్కడా తీవ్రవాదులు నక్సలైట్లతో సంబంధాలు పెట్టుకున్నారు. వారు చాలా ఆధునాతన ఆయుధాలను పొందుతున్నారు. అప్పటి రామారావు సారధ్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం పట్ల నక్సలైట్లకి గల కోపం, ద్వేషం, ఆవేదన ఆసరాగా తీసికొని కొందరు కాంగ్రెస్ నాయకులు వారితో సంబంధాలు పెట్టుకున్నారు. దానికి ప్రతిఫలంగా వారు 1989 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ వారికి సహాయం చేశారు. వారి సహాయం వలన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది.

అప్పుడు పరిస్థితి మాకు తెలుసు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నక్సలైట్ల ఆగడాలను ప్రోత్సహించారు. ఈ నక్సలైట్లు ఉగ్రవాదులతో, జాతి వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకుని పెద్ద మొత్తంలో ఆయుధాలు సమకూర్చుకున్నారు. ఎ.కె.-47 రైఫిళ్ళను కూడా సంపాదించగలిగారు. వారు వ్యాపారస్తులను, పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తూ ఎ.కె.-47లు కావాలని అడిగారు.

దీనికి నిదర్శనం కిందటి రోజు జరిగిన సంఘటనే. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సంఖ్యలో పోలీసులని చంపగలిగారు. ఎందుకంటే పోలీసుల ప్రవర్తన కూడా నీచస్థితికి దిగజారింది. నేను మీ దృష్టికి తీసుకురావాలనుకున్న విషయం ఏమనగా లెటరుతో పాటు బిల్లు కూడా ముఖ్యమైంది. దాంతో పాటు మా ఉద్దేశం, అంకితభావం మరీ ముఖ్యమైనవి.

సర్, హైదరాబాద్ పట్టణంలోనే అనేక సంఘటనలు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే చాలా సంఘటనలు జరిగాయి. కాని ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్యమంత్రిని మార్చాలని డిమాండ్ చేయగా వందల మందిని చంపారు. అటువంటి వ్యక్తులకి వ్యతిరేకంగా ఏం చర్యలు తీసుకున్నారు? ఇటువంటి సంఘటనలు తీవ్రవాదులను, జాతి వ్యతిరేకులను ప్రోత్సహించడానికి, కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ అవకాశం ఇచ్చినట్లు కాదా?

ఈ సంఘటనలు జరిగింది. కేవలం ముఖ్యమంత్రిని మార్చడానికే. మీకు మీ పార్టీ హైకమాండ్‌ని అడిగి మార్చే హక్కు ఉంది. అంతేకాని, అమాయక ప్రజలను చంపి, పెద్ద మొత్తంలో విధ్వంసం సృష్టించడం మంచిది కాదు. ఇటువంటి సంఘటనలు మరచిపోలేని ముద్రని వేస్తాయి.

అందువలన ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడవలసిందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ ప్రభుత్వం, ప్రత్యేకంగా హోం మంత్రి తీవ్రవాదుల కార్యకలాపాలను నిరోధించడంలో విజయవంతం అవుతారని నేను ఆశిస్తున్నాను.

అందువలన టాడా చట్టం 1987ని పొడిగించడం ప్రస్తుత ప్రభుత్వానికి అవసరం లేదని నేను భావిస్తున్నాను.

శ్రీరామకృష్ణ కొణతాల, (అనకాపల్లి) :

సర్, వడ్డే శోభనాద్రీశ్వరరావు ఇప్పుడే చెప్పినట్లు, అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సంఘ్ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారని, ప్రస్తుత పరిస్థితికి వారే కారణమని చెప్పారు. మరి వాళ్ళ పార్టీ నక్సలైట్లతో చేతులు కలిపి, గడచిన ఎన్నికలలో ఉమ్మడి వేదికపై ప్రసంగించారు. మరి దాని మాటేమిటి.

ఛైర్మన్ : ఇటువంటి విషయాలు వాదించడానికి ఇది సమయం కాదు. ఇది క్వశ్చన్ అవర్.

రామకృష్ణ : ఆంధ్రప్రదేశ్ నక్సలైట్ల ఉద్యమానికి ఇతనే బాధ్యుడు.

వడ్డే : ఇది జగమెరిగిన సత్యం

పి.సి. ఛాకో (త్రిచ్చుర్) : మీరు ఉమ్మడి వేదికపై ప్రసంగించారని అతను చెప్పాడు. మీరు దానికి సమాధానం ఇవ్వాలి.

ఛైర్మన్ : ఇంకోసారి దీనిని అడగవచ్చు. ఇప్పుడు సమయం లేదు.

వడ్డే : సర్, నేను నా ప్రసంగం ముగింపు దశలో ఉన్నాను. నా సహచరుడు ఏదో చెప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలైట్ల పట్ల చూపిన చొరవ గురించి అతనికి ఎక్కువగా తెలుసు అనేది అందరికి తెలిసిన సత్యం. ఎందుకనగా అంత విచ్చలవిడితనం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడు జరగలేదు. దీనితో ముగిస్తున్నాను.

సర్ దీనితో ఏకీభవించి హోం మంత్రి టాడా చట్టాన్ని పొడగించే విషయమై ఒత్తిడి చేయరని నేను భావిస్తున్నాను. □

# తీవ్రవాదుల ఆగడాలు అరికట్టాలి

బోడో తీవ్రవాదుల హేయమైన చర్యలకు బాధితులైన వారందరికీ మా పార్టీ తరపున తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. దాదాపు రెండు గంటలపాటు తీవ్రవాదులు ఊచకోత కోస్తుంటే ఆ అమాయకులను రక్షించేవారే కరువయ్యారు. ఇది చాలా గర్హించదగ్గ విషయం. ప్రజాస్వామ్యప్రభుత్వం అయినప్పటికీ, బోడో అటానమస్ కౌన్సిల్ పాలిస్తున్న ప్రాంతంలో ప్రజల శాంతి భద్రతలకు కాపాడటంలో విఫలమవుతోంది. దుర్భరమైన పేదరికం కారణంగా ఎక్కువ సంఖ్యలో నిరుద్యోగ యువకులు ఐ.ఎస్.ఐ. లాంటి దేశం వెలుపల పనిచేస్తున్న ఇతర సంస్థల పట్ల ఆకర్షితులవుతున్నారు.

వరద బాధితుల సహాయార్థం అస్సాం ప్రభుత్వానికి కేంద్రం రూ. 25 కోట్లు కేటాయించింది. కాని, ఈ మొత్తంలో రూ. 24.6 కోట్లను పాతబాకీల నుంచి మినహాయించింది. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. వసూళ్లను వాయిదావేసి అస్సాం ప్రభుత్వానికి, బోడో అటానమస్ కౌన్సిల్‌కు సరిపడా నిధులు సమకూర్చాలి. అఖిలపక్ష కమిటీ ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన అవసరముంది.

# చట్టానికి ఎవరూ అతీతులుకారు

మహారాష్ట్రలో ఓ పార్టీకి చెందిన నాయకుడు చేసిన ఆ వ్యాఖ్యలను మా పార్టీ తరపున నేను ఖండిస్తున్నాను. ఇది శాఖోపశాఖలుగా విస్తరించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇటువంటి సంఘటనే జరిగింది. ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే కేదో జరిగితే అతని అనుచరులు కనబడిన వాటిన్నింటిని ధ్వంసం చేశారు. పలువురు ఈ దాడిలో మరణించగా, కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది.

ఇది ఘోరమైన దురవస్థ. దీన్ని సహించలేం. వ్యక్తిగతంగా కొందరు మారవచ్చెమో కాని అధికారం మాత్రం దుర్వినియోగం కారాదు. ఒకవేళ అధికారమే దుర్వినియోగమైన స్థితిలో పరిస్థితులను చక్కదిద్దడానికి ఒక కేంద్రియ వ్యవస్థ ఉండాలి. మీరు ఏ నిర్ణయం తీసుకొన్నా దానికి మా మద్ధతు ఉంటుంది.

అటువంటి పరిస్థితే ముంబాయిలో వస్తుందని ఊహించడానికే భయపడు తున్నాను. దురదృష్టవశాత్తు ఇప్పటికే జరగవలసినంత నష్టం ముంబాయిలో జరిగిపోయింది. మళ్ళీ ఇప్పుడు దాన్ని పునరావృతం చేయదలచు కోలేదు. హోదాకు

తగని ప్రకటనలు ఇచ్చినందుకు థాకరే క్షమాపణలు చెప్పి, ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని మీ ద్వారా నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

బొంబాయి, ఇతర ప్రదేశాల్లో అనధికారికంగా ఉంటున్న విదేశీయులను వెంటనే దేశాన్ని విడచిపెట్టి వెళ్ళేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

కొంతమంది వ్యక్తులకో, తన అనుచరులకో ఒకరు ప్రీతిపాత్రుడు కావచ్చు. అంతేకాని ఈ దేశ చట్టాన్ని అనుసరించని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఉండకూడదు. బాల్‌థాకరే చట్టానికి అతీతుడేమీకాదు. ఈ దేశ చట్టాన్ని థాకరే తన చేతుల్లోకి తీసుకోలేడు. అదసలు ఆయనపని కాదు.

ఇది దారుణ పరిస్థితులను సృష్టించే విధంగా ఉంది. ఒకవేళ బాల్‌థాకరే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోలేక పోతే అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. థాకరేను కాదు ఎవరైనా సరే, ఏ మతానికి చెందిన వారైనా సరే బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. లేదంటే అది జాతి సమగ్రతకు, లౌకిక వాదానికి పెద్ద ఎత్తున హాని తలపెడుతుంది.

ఓ జర్మన్ వృద్ధురాలి ఫోటో ఉన్న ఈ రోజు దినపత్రికను మీరందరూ తప్పని సరిగా చూసి ఉండాల్సింది. ఆ ఫోటోలో జర్మనీ అధ్యక్షుడు ఆమెను అభినందిస్తున్నారు. ఆమె వయస్సు 90 ఏళ్లు.

హిట్లర్ నిరంకుశ పాలన నుండి వేలాది మంది యూదులను ఆమె కాపాడింది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే బొంబాయి నేతలు కొందరు తాము హిట్లర్ అనుచరులమని ఇక్కడ చెప్పుకొన్నారు. అందుకే నన్ను ఈ విషయం అంతగా ఆశ్చర్యపరచలేదు. ఆప్రకటనను కొందరు గౌరవసభ్యులు ఖండించారు. తాను చేసిన ప్రకటనపై థాకరే ఆత్మపరిశీలన చేసుకొంటే ఆ ప్రకటన చేసినందుకు ఆయన సిగ్గుపడతారు. తాను చేసిన ప్రకటనను వెనక్కి తీసుకొంటారు. మరెప్పుడు అటువంటి వ్యాఖ్యలు చేయరు.

మహారాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నిన్న ఓ ప్రకటన చేశారు. దేశహితం దృష్ట్యా ప్రజా శ్రేయస్సు దృష్ట్యా బొంబాయి నేతలెవ్వరూ భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలను చేయకుండా కఠినమైన ఆదేశాలను జారీ చేశారు. ఇది కేవలం

బొంబాయి నగర హితం కోసమే చేసింది కాదు. కేంద్ర హోంమంత్రి, సహాయ మంత్రి ఇక్కడే ఉన్నారు. వారు ఈ విషయమై మహారాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించి, భవిష్యత్తులో అటువంటి ప్రకటనలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకురాగలరు.

మరో విషయమేమిటంటే వాజ్‌పేయ్ గారికి నా విన్నపమేమిటంటే అటువంటి వివాదస్పద వ్యాఖ్యలు భవిష్యత్తులో చేయకుండా థాకరేను నియంత్రించండి. అటువంటి జాగ్రత్త ప్రధాని తప్పక తీసుకోగలరని ఆశిస్తున్నాను. ఎందుకంటే సంకీర్ణ ప్రభుత్వంలో వారిద్దరూ భాగస్వాములే కదా. ఇది జాతి సమైక్యతతో పాటు దేశ శ్రేయస్సు కొరకు చేయాల్సిన పని. రాజ్యాంగ విలువలను, చట్టాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారంలో ఉన్నంత వరకైనా అటువంటి ప్రకటనలు చేయకూడదని నేను చెప్పాలనుకొంటున్నాను.

□

## ప్రముఖులకు రక్షణ


మరో ఐదు సంవత్సరాలు పొడిగించేందుకుద్దేశించిన ఈ బిల్లును నేను అడ్డుపడబోవటం లేదు. స్వర్గీయ రాజీవ్‌గాంధీ కుటుంబంపై మా అందరికీ సానుభూతి ఉంది. వి.ఐ.పి. వి.వి.ఐ.పి, ఎం.పి., ఎం.ఎల్.ఏల భద్రతకు ఎంతో డబ్బు వెచ్చిస్తున్నారు. ఇదంతా విలువైన ప్రజాధనం. చివరికిది ఎలా తయారయ్యిందంటే, ప్రతి నాయకుడూ తనకో గన్‌మెన్ ఉండటం పరపతికి చిహ్నంగా భావించేలా అయ్యింది. అందువల్ల ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చెయ్యాల్సివుంది. జాన్‌కెనడీ, శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, శ్రీలంక మాజీ ప్రధానిలాంటి వారికి కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ హత్యకావించబడ్డారు. ఈ సందర్భంలో ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలని కోరుతున్నాను. తనకు ఎస్.పీ.జి భద్రత వద్దన్న మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌ని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. మాజీ ప్రధానులంతా ఇదే విధంగా ముందుకొస్తారని ఆశిస్తున్నాను.




స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కేంద్ర మాజీ మంత్రిణి
శ్రీమతి బసవరాజేశ్వరితో వడ్డే



మొవ్వలో ఎడ్ల బండ్ల పోటీలకు ప్రారంభిస్తున్న
వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే


మత సామరస్యం



వ్యవసాయ  శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న  వడ్డే



విజయవాడలో జరిగిన వ్యవసాయ సదస్సులో పెద్దిరెడ్డి
తిమ్మారెడి, గౌతులచ్చన్న, బి. సత్యనారాయణ రెడ్డి లతో  వడ్డే

# ఉమ్మడి పౌరస్మృతి ఇప్పుడే సాధ్యం కాదు

నాకు అవకాశ మిచ్చినందుకు కృతజ్ఞతలు. రాజ్యాంగంలోని అతి ముఖ్యమైన ఈ అంశంపై తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టి చర్చకు అవకాశం కల్పించిన గౌరవ సభ్యుడికి నా అభినందనలు. గతంలో దీనిపై లోక్‌సభ, రాజ్యసభల్లో పలు చర్చలు జరిగాయి. 1962, మే 11న డాక్టర్ సీతాపరమానంద ప్రవేశపెట్టిన తీర్మానంపై రాజ్యసభలో చర్చ జరగ్గా, 1967, డిసెంబర్ 21 న లోక్‌సభలో మరలా చర్చ జరిగింది.

నాకు బాగా గుర్తు. ఎనిమిదవ లోక్‌సభలో ఇండియన్ యూనియన్ ముస్లిమ్‌లీగ్ సభ్యుడు బనత్ వాలా ఆర్టికల్ 44ని తొలగించాలని కోరుతూ ప్రైవేట్ బిల్లును ప్రతిపాదించారు.

ఇది ఆదేశిక సూత్రాల్లో ఉంది. అయితే ఆదేశిక సూత్రాల్లోని మిగతా సూత్రాల్లాగ ఇది కూడా వెంటనే ఇప్పటికిప్పుడు సాధించలేని దీర్ఘకాలిక లక్ష్యాల్లో ఒకటి. ఉదాహరణకి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్య లేదా పరిశ్రమల నిర్వహణలో కార్మికుల భాగస్వామ్యం లేదా పౌష్టికాహారాన్ని అందరికీ

అందించడం లాంటి అంశాలన్నీ ప్రశంసించదగ్గ లక్ష్యాలు. కాని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటేనే వాటిని సాధించగలం. ఉదాహరణకి గ్రామ పంచాయితీల ఏర్పాటుకై ఉద్దేశించిన ఆర్టికల్ 40నే తీసుకుందాం. స్థానిక స్వపరిపాలనకి సంబంధించిన పంచాయతీరాజ్, నగరపాలక బిల్లులకు రాజ్యాంగ స్వరూపం కల్పించడానికి మనకి చాలా సంవత్సరాలు పట్టింది.

చట్టసభల్లో చర్చల సందర్భంగా వ్యతిరేకించిన చాలా మంది సభ్యులు తర్వాత వాటిని అంగీకరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. హుస్సేన్ ఇమామ్ వ్యతిరేకించిన సంగతి ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు.

"భారతదేశం అత్యధిక జనాభా కలిగిన పెద్ద దేశం. భిన్నత్వం గల ఈ దేశాన్ని ఏ అంశంలోనయినా ఒకే రకంగా ఉంటుందనే ముద్ర వేయడం అసాధ్యం"

అతడు తన సందేహాన్ని వ్యక్తం చేసి ఈ విధంగా చెప్పాడు :

"సార్! ఉమ్మడి పౌరచట్టం చాలా మంచిది, సమర్థనీయమైనది. దానికన్నా ముందు దేశ ప్రజలందరూ విద్యావంతులవ్వాలి. ప్రజలలో నిరక్షరాస్యతను తొలగించాలి. వారి ఆర్థికస్థితి మెరుగుపడి ముందుకు పురోగమించాలి. ప్రతి ఒక్కరూ తమ కాళ్ళమీద తాము నిలబడి, ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలగాలి. అప్పుడు మనం ఉమ్మడి పౌర చట్టాన్ని తప్పక సాధిస్తాం.

నేను చెప్పేదేమిటంటే కొంతమంది గౌరవనీయులైన సభ్యులు దీని సూత్రాలను వ్యతిరేకించినప్పటికీ, సమీప భవిష్యత్తులో సాధిస్తాం కనుక చివరకు అంగీకరించారు."

రాజ్యాంగ రూపకల్పనలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ ప్రముఖ పాత్ర పోషించారు. ఇమామ్ వ్యక్తం చేసిన సందేహాలకు జవాబిస్తూ.....

మిత్రుడు హుస్సేన్ ఇమామ్ చట్ట సవరణకు మద్దతు తెలుపుతూ భారత్ లాంటి పెద్ద దేశాలకు ఇది ఎంతు వరకు సాధ్యం? వాంఛనీయం? అని అడిగారు. మానవ సంబంధాలలోని ప్రతి అంశాన్ని ఈచట్టం పరిధిలోకి వస్తుందన్న వ్యాఖ్య విని నేను చాలా ఆశ్యర్యపడ్డాను. మనదేశమంతటా ఒకే ఉమ్మడి నేర చట్టాన్ని అమలు పరుస్తున్నారు. ఇందులో భారత్ నేర, శిక్షాస్మృతి చట్టంలో పొందుపరచిన నిబంధనలు ఉన్నాయి. మనకు మధ్యవర్తిత్వం (రాజీ) ద్వారా సమస్యలను

పరిష్కరించుకొనే చట్టాలు కూడా ఉన్నాయి. ఇవి అందరి వ్యక్తులకూ, వారు అనుసరించే మతాలకూ ఒకేవిధంగా ఉన్నాయి.

అతడు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.....

"ఈ సవరణ గురించి అడిగిన చాలా మంది మిత్రులు 1935 వరకు షరియత్ చట్టానికి లోబడిన ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల గురించి మరచిపోయారనుకుంటా. అనుక్రమం, ఇతర విషయాలలో హిందూ చట్టం అమలులో ఉన్నది. 1939లో కేంద్ర విధాన మండలి ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల ముస్లింలకు హిందూ చట్టాన్ని వర్తింపజేయటాన్ని రద్దు చేసింది. ఈశాన్య సరిహద్దు రాష్ట్రాలేకాక భారత్‌లోని చాలా ప్రాంతాలు హిందూ చట్టాన్ని అనుసరించాయి. కేంద్ర సరిహద్దులు, బొంబాయిలోని ఎక్కువ మంది ముస్లిములు ఈ చట్టాన్ని అనుసరించారు. వీరితోపాటు షరియత్ చట్టాన్ని అనుసరించే మిగతా ముస్లిములను ఒకే తాటిమీదకు తెచ్చేందుకు 1937లో విధాన మండలి జోక్యం చేసుకొని మిగతా భారత్ కంతా కూడా వర్తించేలా ఒక చట్టాన్ని చేసింది."

మనదేశంలోని కొన్ని ప్రాంతాల్లోని ముస్లిములు షరియత్‌చట్టం ఆధీనంలో లేనప్పటికీ, వారి సెంటిమెంట్లను దృష్టిలో పెట్టుకొని, వారి శ్రేయస్సును అభిలషిస్తూ ఎప్పటికప్పుడు కొత్త సవరణలు జరిగాయి.

'విభిన్న మతాలు, జాతులు, కలిగిన దేశంలో ఒకే పౌరస్మృతి సాధ్యమవుతుందా?"

మనకు వివాహ, విడాకుల విషయాల్లో మాత్రమే వేర్వేరు పర్సనల్ చట్టాలు ఉన్నాయి. అవి కుటుంబచట్టాలు. మానవత్వంలేని కొన్ని పాత సంప్రదాయాలను మార్చి హిందూ చట్టాలను రూపొందించడానికి విశేషమైన కృషి జరిగిందని నేను చెప్పాలను కొంటున్నాను. తద్వారా హిందూ వితంతువుల పునర్వివాహ చట్టం 1856, హిందూ వీలునామాల చట్టం 1870, బాల్య వివాహాల నిరోధక చట్టం 1929, హిందూ వివాహ ప్రతిబంధకాల నివృత్తి చట్టం 1946, కేవలం వేర్వేరు కులాల మధ్య వివాహాలనే కాకుండా, హిందువుల, సిక్కులు, జైనుల మధ్య వివాహాలకు కూడా చట్టబద్ధత కల్పించే హిందూ వివాహ ఆమోద చట్టం 1949, ఏక వివాహాన్ని ప్రోత్సహించే హిందూ వివాహ చట్టం 1955, హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు తదితరులందరినీ కలిపి అన్ని వారసత్వ చట్టాలను తెచ్చిన హిందూ వారసత్వ చట్టం

వచ్చాయి. కుటుంబ పెద్ద చనిపోయినప్పుడు వితంతువు, కుమార్తె, తల్లికి కూడా ఆస్తిలో హక్కులను చట్టం ప్రసాదించింది. వరకట్న నిషేధ చట్టం, హిందూకోడ్ బిల్లు వంటి అనేక చట్టాలు ఉన్నప్పటికీ నా మిత్రుడు ప్రస్తావించినట్లుగా తరచూ వరకట్న చావులు సంభవించడం మనం చూస్తూనే ఉన్నాం. అందుకు కారణం తండ్రి జీవించి ఉన్నప్పుడు ఆయన ఆస్తిలో కుమార్తెకు హక్కు లేకపోవడమే. ఆయన మరణాంతరం మాత్రమే కుమార్తె కొంత భాగాన్ని పొందగలుగుతుంది.

పార్సీచట్టం గురించి చెప్పాలంటే ఎనిమిదో శతాబ్దంలో భారతదేశానికి వలస వచ్చి జొరాష్ట్రియన్లకు పార్సీవివాహాలు, విడాకుల చట్టం 1865 ఉంది. పార్సీల్లో మేధావులు, పార్సీలా అసోసియేషన్ కమిటీల సూచనల మేరకు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆ చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఆ ప్రకారం దానిని 1936లో సవరించారు.

క్రైస్తవ చట్టం ప్రకారం. భారత క్రైస్తవ వివాహాల చట్టం 1872, భారత విడాకుల చట్టం 1869, భారత వారసత్వ చట్టం 1825 వారికి న్యాయసూత్రాలుగా ఉంటాయి. కాని, వాటిని క్రోడీకరించేందుకు ఒక బిల్లు తెచ్చారు.

వివిధ పర్సనల్ చట్టాలను క్రోడీకరించరించాల్సిన అవసరం ఉందని ఇప్పుడే నా మిత్రుడు షహాబుద్దీన్ చెప్తున్నారు. లా కమీషన్ సిఫార్సుల ఆధారంగా కొంత ప్రయత్నం జరిగింది. 1962లో ఒక బిల్లును ప్రవేశపెట్టారు. దురదృష్టశాత్తూ అది ఆమోదం పొందలేదు.

వివిధ మతాల పర్సనల్ చట్టాలలో కొన్ని మంచి విషయాలు ఉన్నాయని నేను భావిస్తున్నాను. వివిధ మతాల కుటుంబ చట్టంలోని మంచి అంశాలను విశాల హృదయంతో స్వీకరించాల్సి ఉంది. ఒక ప్రత్యేక మతాన్ని అనుసరించేవారు. ఇతరుల విధానాలను బలవంతంగా అనుసరించాల్సివస్తుందనే భావన రాకుండా ఏకరూప పౌర నియమావళిని రూపొందించేందుకు, వాటన్నింటినీ క్రోడీకరించాల్సి ఉంది.

అల్పసంఖ్యాకులు, అధిక సంఖ్యాకులుగా, అధిక సంఖ్యాకులు అల్ప సంఖ్యాకులుగా మారే సమయం ఎంతో దూరంలో లేదని నా మిత్రుడు రాజీవ్ సింగ్ ఇప్పుడే వ్యాఖ్యానించారు. ఇది చాలా దురదృష్టకరం. ఇది సభలోనే కాదు, సభ వెలుపల కూడా, ఓ రాజకీయ పార్టీ, కొన్ని సంస్థలు ప్రజల్లో, ముఖ్యంగా అమాయక జనాల్లో ఈ అభిప్రాయాన్ని కల్గించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. కాని ఇది నిజం కాదనినేను చెప్పదలచుకొన్నాను. కేంద్ర ప్రభుత్వం గణాంక వివరాలను ఇచ్చింది. □

# బాబ్రీ మసీదు వివాదాన్ని పరిష్కరిద్దాం

అధ్యక్షా, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఒక రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం గురించిన అంశంపై సభలో ఇన్ని రోజులుగా చర్చ జరగడం ఇప్పటివరకు ఎప్పుడూ జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేయడం లేదు. ఇప్పటికే మేము ఈ విషయంపై మా అభిప్రాయాలను వెల్లడించాము. అయితే చివరకు ప్రధానమంత్రి సరైన చర్యలు తీసుకొని పరిస్థితులను అదుపుచేయడం పట్ల నేను సంతృప్తిని వ్యక్తం చేస్తున్నాను. కానీ ఈ విషయంపై జాతీయ సమైక్యత మండలి సమావేశాలు జరిగేంతవరకు చర్యలు తీసుకోలేదు. ఇది కొత్త విషయం ఏమీకాదు. గత రెండు సంవత్సరాలకుపైగా ఈ అంశం రగులుతూనే ఉంది.

ప్రస్తుత పరిస్థితులను అదుపు చేయడానికి గౌరవ ప్రధానమంత్రి అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఏది ఏమైనా అసలు చేయకపోవడం కన్నా ఆలస్యంగానైనా చర్యలు తీసుకోవడం మేలే.

అన్నింటికన్నా ముఖ్యమైన దేమిటంటే ఎలాంటి రక్తపాతం జరగకపోవడంపట్ల మేము మరింత సంతోషంగా ఉన్నాము. కొన్నిసార్లు రక్తపాతం జరిగిందా దాని ఫలితంగా ఉద్రిక్తతలు చోటుచేసుకుంటాయి. ఆ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోకుండా

ఇతర విషయాలపైకి దృష్టి మళ్లుతుంది. ఇది మంచి ముగింపుకు దారి తీయకపోవచ్చు. ఈ కారణం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని రద్దు చేయకపోవడం ఎంతో సంతోషదాయకం.

ఈ విషయంలో మేము ప్రధానమంత్రిని మీ అనుమతితో అభినందిస్తున్నాము. దేశ సౌభ్రాతృత్వాన్ని లౌకికవాదాన్ని కాపాడడానికి అల్హాబాద్ హైకోర్టు-లక్నో బెంచ్, సుప్రీంకోర్టులకు మేము ధన్యవాదాలు తెలియ జేస్తున్నాము. మీ ద్వారా నేను ప్రధానమంత్రిని రెండు విషయాలపై వివరణ కోరదల్చుకున్నాను.

మొదటగా ప్రధానమంత్రి సాధువులతో చర్చలు జరిపారు. ఇప్పుడే నాకన్నా ముందుగా మాట్లాడిన గౌరవనీయ సభ్యుడు అక్కడ ఉన్నారు. (రామజన్మభూమి-బాబ్రీమసీదు వివాదంపై 193వ నిబంధన కింద 599వ చర్చ). గౌరవనీయ ప్రధానమంత్రి ఇరుపక్షాలూ ఒక అంగీకారానికి రాకపోతే ఈ విషయంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం జరుగుతుందని చెప్పారు. అయితే, క్రమబద్ధమైన ఆలోచనలు చేసే వ్యక్తికి ఇంతకన్నా మంచి మార్గం ఇంకోటి ఉండదు. దీనిని మేము స్వాగతిస్తాం. కానీ వివాదాస్పద భూమిలో నిర్మాణాన్ని చేపట్టాలనుకుంటున్న సాధువులు, విశ్వహిందూ పరిషత్‌లు కోర్టు తీర్పును అంగీకరించడానికి ఒప్పుకున్నాయా అనేది నేను ప్రధానమంత్రి ద్వారా తెలుసుకోవాలనుకుంటున్నాను. మేము కొంతమంది సభ్యుల అభిప్రాయాలను విన్నాం. వారందరూ ఫైజాబాద్ కోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తున్నారు. కోర్టు వీరిపై అభియోగం మోపినపుడు మాత్రం "మేము కోర్టు సూచనలను పాటిస్తాం. కోర్టు నిర్ణయాలను గౌరవిస్తాం" అని అంటున్నారు. ఎప్పుడైతే కోర్టు అభియోగాలు మోపడంలేదో "అలాకాదు, కోర్టు తీర్పు ఇలా ఇచ్చి ఉండాల్సిందికాదు" అంటున్నారు.

ఇక రెండో వివరణను ప్రధానమంత్రి నుంచి కోరదల్చుకున్నాను. నిజానికి అక్కడ విహెచ్‌పి నిర్మాణాన్ని చేపట్టింది. విహెచ్‌పి ప్రధాన కార్యదర్శి నిర్మాణానికి సంబంధించి ఫ్లాట్‌పారమ్‌ను శాశ్వతంగా ఉండేలా నిర్మిస్తున్నట్లు, పనులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పవిత్ర స్థలమైన బాబ్రీమసీదును పడగొట్టి ఆ స్థానంలో రామమందిరం నిర్మించాలని అనుకుంటున్న వారి ఆలోచనకు ఇది సూచనలుగా కన్పిస్తున్నాయి.

గౌరవనీయ ప్రధానమంత్రి తనను కలిసిన సాధువులతోనూ, మత పెద్దలతోనూ జరిగిన చర్చలలో ఈ ముఖ్య విషయం గురించి చర్చించారా అనే విషయంపై సంపూర్ణ

వివరణను తెలుసుకోవాలనుకుంటున్నాను. ఏ మతానికి సంబంధించిన వారి మనోభావాలకు దెబ్బతగలకుండా తీసుకునే ప్రతి చర్యకూ తెలుగు దేశం పార్టీ సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంది.

కానీ సభలో కొంతమంది సభ్యులు మూడు, నాలుగు నెలల్లో ఈ విషయాన్ని మళ్లీ తీసుకురావాలని అనుకుంటున్నారు. నా అభ్యర్థన ఏమిటంటే ఇది మంచి పరిణామం కాదు. ఇది దేశాన్ని, ప్రజలను, సౌభ్రాతృత్వ భావనను, మతవిశ్వాసాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మూడు, నాలుగు నెలల సమయంకన్నా ఎంతో ముఖ్యమైనది. పరిష్కారం కోసం ఒక సంవత్సర సమయం పట్టినా అప్పటివరకు వేచి ఉండాలి. ప్రస్తుతం ఈ విషయం యువకుల మనస్సులను విషపూరితం చేస్తుంది. వారిలో కొందరు విభాగాలుగా ఏర్పడ్డారు. ఇది ఎంతో ఆందోళన కరమైన విషయం. బిజేపి, విహెచ్‌పి, ఇతర సంస్థలు ఈ సమస్యను పరిష్కరించేంతవరకు ఓపిక పట్టాలని (రామజన్మభూమి-బాబ్రీమసీదు వివాదంపై 193వ నిబంధన కింద జరిగిన 591 చర్చ) నేను అభర్థిస్తున్నాను.

పూర్వం అక్కడ దేవాలయం ఉండేదని బిజేపికి చెందిన మిత్రుడు చెప్పారు. వారిని నేను ఒక ప్రశ్న అడగదల్చుకున్నాను. పూర్వకాలంలో కొంతమంది హిందూరాజులు బౌద్ధారామాలను కూల్చివేశారు. ఇప్పుడు అన్ని దేవాలయాలను కూల్చి బౌద్ధరామాలను నిర్మించాలని అనుకుంటే ఎలా ఉంటుంది. అలాగే పూర్వపు రోజుల్లో హరిజనులను, గిరిజనులను దేవాలయాలలోకి అనుమతించేవారు కాదు. అలాగే గ్రామాల్లోకి చెప్పులు వేసుకొని రానిచ్చేవారు కాదు. తాగడానికి బావులలోంచి నీటిని కూడా తీసుకెళ్లనిచ్చేవారు కాదు. అలాగని అప్పుడెవరైనా మా తాతలు, ముత్తాతలు అలా చేసేవారని చెప్తే వారు చెప్పినదానిని అంగీకరించేమాట పక్కన పెట్టి వారిని కొడతారు. (అంతరాయం).

మనం ముందుకే వెళ్లాలి. వెనక్కి తిరిగి చూసుకోకూడదు. మనం అందరం ఒకే జాతి ప్రజలుగా ఉండేలా పరిస్థితులను సృష్టించుకోవాలి.

పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధాన ప్రతిపక్షంగా ఉండి, ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన పార్టీ, రాజ్యాంగం పట్ల గౌరవాన్ని చూపడం లేదు. ఈ దేశం లౌకిక తత్వానికి కట్టుబడి ఉంటుందని మన రాజ్యాంగ ప్రవేశికలో మనం స్పష్టంచేసుకున్నాం. మొదట ప్రవేశికలో 'సెక్యులరిజం' అన్న పదం లేదు. శ్రీమతి ఇందిరాగాంధీ కాలంలో జరిగిన రాజ్యాంగ సవరణ ద్వారా 'లౌకికవాదానికి' కట్టుబడి ఉన్నట్టుగా మనం స్పష్టం చేసుకున్నాం. ఈ రాజకీయ పార్టీ మాత్రం తమకు రాజ్యాంగ లౌకిక లక్షణాలపట్ల గౌరవం లేనట్టుగా ప్రవర్తిస్తుంది. సుప్రీంకోర్టుకిచ్చిన మాటకు కూడా కట్టుబడిలేదు.

సర్, డిసెంబరు ఆరున జరిగిన సంఘటనలు చాలా దురదృష్టకరం. దేశ స్వాతంత్ర్య నాలుగున్నర దశాబ్దాల అనంతరం జరిగిన ఈ చీకటి సంఘటనలను వారు మాత్రమే వర్ణించగలరు. పరిస్థితులు చాలా చిన్నాభిన్నంగా ఉన్నాయి. చాలా వాటికి మాకు సాక్ష్యాలున్నాయి. ఎన్ని వందల మంది తమ జీవితాలని కోల్పోయారు? కోట్లాది రూపాయిల ఆస్థి నష్టం జరిగింది. నష్టం చాలా ఎక్కువగా ఉంది. మత సామరస్యానికి తీరని నష్టం జరిగింది. దేశంపై బయట ప్రభావం కూడా చాలా ఉంది.

85 కోట్ల మంది జనాభా ఉన్న ఈ దేశానికి శాంతి అహింస మార్గాలని జాతిపిత చూపారు. స్వర్గీయ జవహార్ లాల్ నెహ్రు నాయకత్వాన ఈ దేశానికి గొప్ప సెక్యులర్ మార్గం చూపెట్టబడింది. నెహ్రు, ఇతర నాయకులు ఈ దేశానికి గొప్ప నాయకత్వాన్ని అందించారు. అలీన ఉద్యమంలో భారతదేశం గొప్పశక్తిగా ఆవిర్భవించింది. ఈ నాడు ఈ దేశ 'ఔన్నత్యం' వేగంగా అడుగంటి పోయింది. విదేశాల నడుమ మనదేశస్థాయి ఏమిటి?

ఈ ప్రభుత్వం సైన్యం, కేంద్ర బలగాలతో కట్టడాన్ని రక్షించడంలో విఫలమైనది. ప్రధాన మంత్రి తన ఎర్రకోట ప్రసంగంలో కట్టడాన్ని కాపాడుతామని ప్రకటించారు. అయోధ్యలో 6న (ఆరున) సమావేశం అయిన కరసేవకులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం అయింది. ఇది బి.జె.పి., వి.హెచ్.పి., ఆర్.ఎస్.ఎస్., భజరంగదళ్, ఇతర సంస్థల లక్ష్యాలు ఏమిటో స్పష్టం చేస్తుంది. వారి వాస్తవ రూపం ఏమిటి?

రాముడు తండ్రి మాట నిలబెట్టుకోవడానికి తన అధికారాన్ని త్యాగం చేస్తే, ఈ పార్టీ తన రాజకీయ లక్ష్యాలకోసం అధికారాన్ని చేపట్టడంకోసం కోర్టుకు ఇచ్చిన మాటను ఉల్లంఘించింది. వీరు రామభక్తులమని ఎలా చెప్పుకుంటున్నారో నాకు అర్థం కావడంలేదు. సత్యం కోసం రాముడు నిలబడితే, ఈ పార్టీ సన్నిహితులు మాత్రం అసత్యానికి, దాడులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గౌరవనీయులైన ప్రధాన మంత్రి వారి మాటలను ప్రేమించడం విశ్వసించడం చాలా దురదృష్టకరం. మేము 2వ తేదీన ప్రధానిని కలసినపుడు 'కట్టడాన్ని కాపాడడానికి కోర్టు అర్డరును అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోండి' అని మేమంతా చెప్పాము.

కోర్టు అర్డరుకు భగం కలిగే ప్రమాదం ఉందికనుక, కరసేవకులు కట్టడాన్ని ఏమిచేయం అన్న వారి మాటలు బహుశా ప్రధాన మంత్రిలో బలమైన నమ్మకం విశ్వాసం కల్గించి ఉండొచ్చు!కొద్ది నెలల క్రితం సాధువులతో సంప్రదింపులు జరిపి ఈ సమస్యకు

ఒక పరిష్కారం తెలపాలన్న ఆయన ఆలోచనను మేము ఎవరము కాదనడం లేదు. కట్టడం దగ్గర ఎటువంటి రక్తపాతం జరుగ కుండా శాంతియుత మార్గాల ద్వారా కరసేవకులు కార్యక్రమాన్ని నిలుపుదల చేసే ఆయన నిర్ణయాన్ని మేమందరం అభినందించాం. కోర్టు ఆర్డరును మేము గౌరవించము, దానికి కట్టుబడి ఉండము అంటు బి.జె.పి., వి.హెచ్.పి., భజరంగధళ్, ఆర్.ఎస్.ఎస్.కు చెందిన నాయకుల ప్రకటనల ద్వారా కొన్ని లక్షల మందిని అయోధ్యలో సమావేశం అయ్యేటట్లు ఆహ్వానిస్తున్నారు. ఈ పరిస్థితిలో ప్రధానమంత్రి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదిన జరిగిన చర్చకు సమాధానం ఇస్తూ కేంద్ర హోంమంత్రి 'దీనికోసం ఒక ప్రత్యామ్నాయ వ్యూహం' ఉంది అన్నారు. ఈ వ్యూహం వల్ల ఏమి జరిగింది?

మీరు 135 కంపెనీల పారా మిలటరీ బలగాలను అయోధ్యకు పంపారు. కాని ఏమి జరిగింది?

కట్టడాన్ని కూల గొడుతుంటే, వారు ఫైజాబాద్‌లో ఉన్నారు. సార్, నేను ప్రధానమంత్రి పట్ల ఉన్న గౌరవంతోనే వారి పరిజ్ఞానాన్ని ప్రశ్నిస్తున్నాను. అయోధ్యనుండి అందిన మీ ఇంటలిజన్స్ వారి రిపోర్టు ఏమైనది.

ఏదైనా పొరబాటు జరిగితే అవసరమైన చర్యలు చేపట్టేలా ఫైజాబాద్ జిల్లా మేజిస్ట్రేట్‌ను, సీనియర్ సూపరింటెండు పోలీసుకు మీ కళ్యాణ్ సింగ్ ప్రభుత్వం ఎటువంటి అధికారాలు ఇవ్వలేదన్న విషయం మీకు తెలియదా?

ఎవరైనా కట్టడానికి హాని చేస్తే వారిపై చర్యతీసుకోవచ్చు అవసరమైతే కాల్పులు కూడా జరుపవచ్చు. అలా కానప్పుడు, మీరు అధికారులకి ఎటువంటి సూచనలు ఇవ్వనపుడు కట్టడము ఎలా సురక్షితంగా ఉండగలదు? కాబట్టి కోర్టు ఆర్డరును అమలు చేయడంలో కట్టడాన్ని కాపాడటంలో యు.పి.లోని బి.జె.పి. ప్రభుత్వం తీవ్రంగా విఫలం అయినది.

వీటిని అమలు చేయాల్సిన బాధ్యతను రాజ్యంగం మీ భుజస్కందాల మీద పెట్టింది. ఈనాడు ఈ దేశంలో ఈ ప్రభుత్వం లాగానే తోటి దేశాల మధ్య పరపతిని పోగొట్టుకుంది. దేశంలోనే మైనార్టీల మనోభావాలని కాపాడలేకపోయింది.

అయోధ్యలో కట్టడం కూల్చివేశారు. ఇది మత విధ్వంసానికి దారి తీయవచ్చునని నివేదికలు చేపుతున్నాయి. ఇపుడే ఏదో ఒక చర్య తీసుకోవాలి. చాలా ఆలస్యంగా ఈ క్యాబినెట్ సమావేశం అయినా, కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్

చేయడానికి చర్య తీసుకొన్నట్లు కనిపిస్తుంది. కాని అప్పటికే కళ్యాణ్ సింగ్ రాజీనామా చేశారు. రాజీనామా ప్రతిని ముఖ్యమంత్రి ఉత్తరప్రదేశ్ గవర్నర్‌కు పంపారు. అదే గనుక జరిగి ఉన్నట్లైతే ఇలా చేయడమే సరిఅయినది.

జాతీయ సమైక్యతామండలి ఇచ్చిన భాద్యతలను నిర్వహించడానికి ఇది సరైన మార్గము. అపుడు ఏమి జరిగింది? 7వ తేదిన కూడా మీరు పనిచేయలేదు అక్కడి చుట్టు ప్రక్కల ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి చదును చేయడానికి, అక్కడ రాంలాలా విగ్రహాన్ని ప్రతిష్టించడానికి, దాని చుట్టూ ప్రహరిగోడ కట్టడానికి మీరు అనుమతించారు. ఈ రోజున పరిస్థితి ఏమిటి? ఇపుడేమో! అక్కడ మసీదు కడతామని మాట ఇస్తున్నారు. మసీదుని ఎక్కడ కడుతారు ఎలా కడుతారు? సార్, ఇటువంటి వాటికి అనుమతి ఇవ్వడం బి.జె.పి. దాని మిత్రులతో ప్రభుత్వానికి అవగాహన ఉందని ప్రజలకు అభిప్రాయం కల్గుతుంది. 7వ తేదీన కూడా భద్రతా బలగాలు కరసేవకులను ప్రహరీ గోడ కట్టుకోవడానికి అనుమతిని ఇచ్చాయి. 8వ తేదీన కేంద్ర బలగాలు అక్కడకు వెళ్ళడంతో కరసేవకులు అయోధ్యను వదలి వెళ్ళారు. దీనిని బట్టి ప్రభుత్వానికి బి.జె.పి. దాని సన్నిహితుల మధ్య ఒక అవగాహన ఉందన్న బలమైన అభిప్రాయం ప్రజలకు కల్గుతుంది. ఇది ప్రజల విశ్వాశాలను దెబ్బతీస్తుంది.

సార్, మత సంస్థలని నిషేధించే ప్రభుత్వ చర్యలకి మేము మద్దతిస్తాం. ఈ మత సంస్థలు దేశంలో మత విద్వేషాలని రేపుతున్నాయి. అయోధ్యలో మసీదు కూల్చివేసిన తర్వాత ఒక మతనాయకుడు, అణగారిన మెజారిటీ ప్రజల భావాలు ఇలా మార్గాన్ని ఎంచుకున్నాయంటూ చేసిన ప్రకటన నాకు గుర్తుంది. కాని అది సరైంది కాదు. మత విద్వేషాలని చూసి నీవు చలించి, ఆ భావాలున్న వారిలో మార్పు తేవాలి. కొన్ని వందల సంవత్సరాల కిందట అకృత్యాలు జరిగి ఉండొచ్చు. అలాగే అనేక అసాధారణ సంఘటనలు జరిగాయి. అంబేద్కర్ రోజుల్లో ఆయన చదువు పూర్తి చేసుకుని, విదేశాలలో డాక్టరేటు పొంది, ప్రిన్సీస్టేట్‌లో రక్షణ శాఖ కార్యదర్శిగా ఉండగా ఆయనకు బరోడాలో ఉంటానికి ఇల్లు ఇవ్వలేదు. ఆయన మహర్ కులస్థుడు కావడంవల్ల, సత్రంలో ఉన్నప్పుడు అంబేద్కర్ వస్తువులనన్నింటిని బయటకి విసిరేశారు. అప్పుడు అలా జరిగింది కనుక, ఇప్పుడు దానికి బదులు తీర్చుకుంటామని ఎవరన్నా అనగలరా? దాన్ని మీరు సమర్థిస్తారా? మీరు ముందుకు అడుగు వేయాలనుకుంటున్నారా లేక కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్ళాలను కుంటున్నారా? మత సంస్థలపై తీసుకునే ప్రభుత్వ చర్యలకు మా పార్టీ మద్దతిస్తుంది.

ఎవరన్నా మధుర, వారణాసి సంఘటనలు ఇంకా అలా ఉన్నాయని అంటే ప్రథమ పౌరులుగా మీరు అటువంటి వాటిని నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అయ్యిందేదో అయ్యింది. ఇప్పటికే దేశం చాలా మూల్యాన్ని చెల్లించింది. మత విద్వేషాలు జరక్కుండా అన్ని చర్యలు తీసుకోవాలి.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లలోని బి.జె.పి. ప్రభుత్వాలు లా అండ్ ఆర్డర్ సరిగ్గా నిర్వహించడం లేదంటూ ఆ ప్రభుత్వాలని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై మాకున్న పరిమితులని నేను వ్యక్తం చేశాను. మీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న మహారాష్ట్రలో అనేక మంది చనిపోయారు. గుజరాత్‌లోనూ అలాగే జరిగింది. ఇంద్రజిత్ గుప్తా చెప్పిన ఆలోచనతో మేము పూర్తిగా ఏకీభవిస్తున్నాము. మీ ప్రభుత్వం జారీచేసి నిషేధ ఉత్తర్వులని ఆ మూడు రాష్ట్రాలు అమలు చేయకపోయినా, మత సంస్థల నాయకులని అరెస్టుచేయక పోయినా, మత శక్తులని అణచివేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోక పోయినా, మీరు అటువంటి రాష్ట్ర ప్రభుత్వాలని విధిగా రద్దు చేయాలి.

మేము దాన్ని ప్రశ్నించడం లేదు, విబేధించడంలేదు. ప్రభుత్వాలని రద్దు చేసే పనిని మీరు చేయకపోయినా, అది బి.జె.పి.కి ఎంతో ఉపయోగపడేది. వారు ఈ సంఘటనని పెద్దది చేసేవారు. బాబ్రీ మసీదు నిర్మాణం కూల్చివేత, మతకలహాల కారణాలని ప్రజలకి చెప్పుకోలేక బి.జే.పి.వారు అపఖ్యాతిపాలయ్యారు. వారు నేడు మీ ప్రభుత్వ చర్యని తెరపైకి తేవడం ద్వారా, మీరు ప్రజాస్వామ్యాన్ని ఎలా హత్యచేశారో, రాజ్యాంగ ఫెడరల్ విధానాన్ని ఎలా వక్రీకరించారో ప్రజలకి తెలపనున్నారు. ఇటువంటి మత, రాజకీయ పార్టీలకి రాజకీయ అవకాశాలు పొందడానికి మీ తప్పుడు నిర్ణయాలు అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాము. మత కలహాల వల్ల జీవితాలు కోల్పోయి, బాధల బారిన పడ్డవారికి, వారిపై ఆధారపడ్డ వారికి అవసరమైన సహాయం అందేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరుతున్నాం.

ఈ ప్రభుత్వానికి నా సలహా ఏమిటంటే, అది ఏ మతానికి చెందినదైనప్పటికి, లబ్ది పొందజూసే మత సంస్థలని అనుమతించరాదు. ప్రధాన సమస్య విషయాన్ని సుప్రీంకోర్టుకి సూచించండి. కోర్టు వాస్తవాన్ని బట్టి అక్కడ మందిరం ఉందా, మసీదు ఉందా నిర్ణయిస్తుంది. ఒకవేళ సుప్రీంకోర్టు, అక్కడ మందిరమే ఉందన్న నిర్ణయానికి

వస్తే, అక్కడే రామ మందిరాన్ని నిర్మించండి. దాని పక్కనే మసీదుని నిర్మించవచ్చు. ఒకవేళ బాబ్రీమసీదుకు ముందు అక్కడ రామమందిరం లేదని తేలితే, ఆ స్థలంలో మసీదు కట్టి పక్కనే మందిరాన్ని నిర్మించొచ్చు. ఈ దేశానికే కాక యావత్ ప్రపంచానికి మార్గాన్ని చూపిన గౌతమ బుద్ధ, గాంధీలు బోధించిన మత సంఘీభావాన్ని చూపడానికి అయోధ్యలో చర్చి, గురుద్వారాలని కూడా నిర్మించండి.

సార్ ! మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌ల లోని రాష్ట్ర ప్రభుత్వాలని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మేము అంగీకరించము. ఈ చర్యలు భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య నిబంధనలకు పూర్తిగా వ్యతిరేకము. ఈ మూడు రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు సంవత్సరాల కాలానికి ఎన్నుకోబడ్డాయి.

కేంద్ర ప్రభుత్వం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేక పోయిందని మా పార్టీ భావిస్తుంది. అయోధ్యలోని కట్టడాన్ని కూల్చడమో, కట్టడమో చేయడానికి కరసేవకులు ప్రయత్నించినప్పుడు అక్కడి కళ్యాణ్ సింగ్ ప్రభుత్వం వారిని ఆపడానికి ఏ ప్రయత్నంలు చేయలేదని కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా తెలుసు. అక్కడ ఏం జరగలేదని హోం మంత్రి ఎలా ప్రకటన చేస్తారు? ఇది ప్రభుత్వ తప్పిదంకాదా? అంతేగాక కళ్యాణ్ సింగ్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వారు అయోధ్యకి వెళ్ళి, అక్కడ రామ మందిరం కడతామని ప్రతిజ్ఞ చేశారు. వారు కేంద్రాన్ని, న్యాయవ్యవస్థలని మోసం చేశారు. ఈ దేశ ప్రజలని మోసం చేశారు. కాని వారు లౌకిక విధానాన్ని రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ప్రభుత్వాన్ని నిందిస్తారు.

ఇప్పుడు మీరు రాష్ట్రాల్లోని మూడు ప్రభుత్వాలని రద్దుచేయడం ద్వారా ఆ పార్టీకి ప్రజల సానుభూతి పొందడానికి అవకాశం కల్పిస్తున్నారు. మీరు రాజ్యాంగ విరుద్ధంగా వెళ్ళారు.

వారికి గాంధీజీ పట్ల తక్కువ భావం ఉంది గమ్యాలకన్నా వాటిని చేరే మార్గాలు ముఖ్యం అని నమ్మరు. లేకుంటే వారు ఇలా చేసేవారుకాదు. కొద్దినెలల కిందట బి.జే.పి. ఏక్‌తాయాత్రను జరిపింది. ఒక పక్క మత పరంగా ప్రజలని విభజిస్తూ, మరోవైపు ఈ ఏక్‌తాయాత్ర జరపడం వల్ల ప్రయోజనం ఏముంది. మీరు రాజకీయంగా పోరాడండి. బి.జే.పి.కి ఉన్న ముసుగును తొలగించండి. ఇదే నేను ప్రభుత్వానికి చేస్తున్న విజ్ఞప్తి. నిన్న ప్రధానమంత్రి సమాధానం విన్నాం. నేను సోమనాథ్ ఛటర్జీ వ్యక్తం చేసిన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. అయోధ్యలో జరిగిన సంఘటనకి పశ్చాత్తాపంగా ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మీరేమో మూడు రాష్ట్ర ప్రభుత్వాలని చాలా

తేలిగ్గా డిస్మిస్ చేశారు.మరి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు రద్దు చేయలేదు? అలాగే కర్నాటక, అస్సాం, గుజరాత్‌లని ఎందు రద్దుచేయలేదు? మీరు రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. మీ నిషేధ ఆజ్ఞలని ఆ మూడు రాష్ట్రాలు అమలు చేయకపోయి నట్టయితే, దాన్ని మీరు తప్పుగా పరిగణించి ఆ సమయంలో ఆ ప్రభుత్వాలని రద్దు చేయవచ్చు. అప్పుడు మీరు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు కూడా హర్షిస్తారు.

ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ చిత్తశుద్ధితో ఈ మత శక్తులపై పోరాడాలని నేను అర్థిస్తున్నాను. ఆ విషయంలో మా సహాయం అందిస్తాము. స్పీకర్ సార్, సభలో చర్చించిన అనేక బిల్లులపై మా అభిప్రాయాలని వెల్లడించడానికి అవకాశమిచ్చిన మీకు, డిప్యూటీ స్పీకర్‌కు, ఇతర సభ్యులకి మా తెలుగు దేశం పార్టీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను. సార్, ప్రస్తుతం దేశం చాలా క్లిష్ట సమస్యలని ఎదుర్కొంటూంది. సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న ఆశతో మనమంతా ఈ సమావేశాలు ముగిశాక ఇంటికి వెళతాము. మతసామరస్యం నెలకొనడంతో మనదేశం లౌకిక దేశాల మధ్య గర్వంగా తలెత్తుకోగలదు.

ర్యాలీలని నిషేధించడం సరైంది కాదని మా పార్టీ భావిస్తుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ర్యాలీలు జరుపుకోవడానికి అనుమతిచ్చారు. డిసెంబరు 6, అయోధ్యలో బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేతలో సూత్రదారి కళ్యాణ్ సింగ్ బహిరంగ సభ జరుపుకోవడానికి మీరు అనుమతి నిచ్చారు. కోర్టు ఉత్తర్వులని ఉల్లంఘించమంటూ బి.జే.పి. కి చెందిన అద్వానీ, ఇతర నాయకులు ఇచ్చిన హామీ పట్ల మీకు బహుశ అనుమానం ఉండొచ్చు. కళ్యాణ్ సింగ్ అటువంటి హామీని ఇచ్చినప్పటికి, ఏం జరిగిందో మనందరికీ తెలుసు. ఈ ప్రభుత్వ రాజ్యాంగేతర పనితీరుని అద్వాని ప్రశ్నించడం లేదనిపిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లోని వారి ప్రభుత్వం చట్టపాలనని ఉల్లంఘించి, సుప్రీంకోర్టు ఆర్డర్ని కూడా ఉల్లంఘించింది. ఇవన్నీ జరిగినప్పుడు అద్వాని అక్కడే ఉన్నారు.

అద్వానిజీ గాంధీని ప్రస్తావించారు. గాంధీ కనుక అక్కడ ఉన్నట్టయితే, మసీదుని కూల్చడాన్ని ఆయన అనుమతించక పోయేవారు. ఆయన కట్టడంపై కూర్చొని 'మొదటి సుత్తిదెబ్బ మసీదుపైకన్నా నాతలపై వేయండి' అనేవారు. మసీదుని కూల్చడానికి ఎంతమందివచ్చినా గాంధీజీ ఆపగలిగేవారు. దురదృష్టవశాత్తు అద్వానీ అక్కడ ఉన్నప్పటికీ, ఈ సంఘటన జరిగింది. అందుకే రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వ చర్యలని అద్వాని ప్రశ్నించరు.

బోట్‌క్లబ్ లాన్‌కి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తే దానివల్ల ర్యాలీలో పాల్గొనేవారికి

ఇబ్బంది కలుగుతుంది. దానితో వారి శరీరాలు గీచుకుపోతాయి. డిసెంబరు 6న అయోధ్యలో జరిగిన సంఘటన ఈ దేశరాజ్యాంగాన్ని గాయపర్చిందంటే మీరు అంగీకరించరా? జాతి గౌరవానికి భంగం కలిగింది. ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పడానికి ప్రభుత్వం ఏమీ చేయడంలేదనిపిస్తుంది. అయోధ్యపై శ్వేత పత్రం ప్రకటిస్తానని ప్రధాని ఎప్పుడో చెప్పారు. శ్వేత పత్రంతో ప్రధాని ఎందుకు ముందుకి రాలేదో నేను తెలుసు కోవాలనుకుంటున్నాను. అక్కడ ఏం జరిగిందీ ప్రజలకి తెలిసేలా ప్రధాని ఎందుకు చేయడంలేదు?

అక్కడ ప్రభుత్వం తనవిధిని నిర్వర్తించడంలో విఫలమవడమేకాక, మతతత్వశక్తులను అణచివేయడంలోనూ విఫలమయ్యింది. బహిరంగ సభలపైన నిషేధం పెట్టడం ద్వారా మనం మత శక్తులని అణచలేము.

కాశ్మీర్‌లో అనేక దేవాలయాలని కూల్చివేస్తుండగా, ఇక్కడ ఎప్పుడో పాతమసీదుని కూల్చివేస్తే ఈ జనం చాలా గోల చేస్తున్నారని ప్రభుత్వం చెబుతుంది. కాశ్మీర్‌లో దేవాలయాలని కూలదోస్తుంది పాకిస్తాన్ మిలిటెంట్లు. ఈ దేశం ఐక్యతని, సమగ్రతను దెబ్బతీయడానికి వారు అలా చేస్తున్నారు. మీ అందరికీ నేను ఒకటి తెలపాలనుకుంటున్నాను. కాశ్మీర్‌ని ఈ దేశం నుండి వేరు చేయడానికి పాకిస్తాన్ తీవ్రవాదులు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం మందిరం నిర్మించాలని కోరుతూ సంతకాలు సేకరించే నెపంతో బి.జే.పి. కార్యకర్తలు ఇంటింట తిరిగి బ్రోచర్లు పంచుతున్నారు. ఇప్పుడే ఒక మంత్రి కుటుంబ నియంత్రణ గూర్చి మాట్లాడారు. రానున్న కాలంలో హిందూ జనాభాకన్నా ముస్లిం జనాభా పెరుగుతుందన్న ప్రచారం జరుగుతుంది.

ఇది అవాస్తవం. 1951 నుండి 1981 మధ్య 1.5 శాతం మాత్రమే పెరిగింది. వార్షిక పెరుగుదల 0.05 శాతం. నాలుగైదు శతాబ్దాలు అనంతరం కూడా వారు హిందువులంత కాలేరు.

వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి సివిల్ కోడ్ ఎందుకుండ కూడదు. సాధించాల్సిన లక్ష్యాల్లో అదీ ఒకటని ఆ దేశ సూత్రాల్లో ఉంది. దీనిపై రాజీ పడటం ఉండరాదు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఉమ్మడి సివిల్ కోడ్‌ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారు. కొన్ని కారణాలవల్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.

పది సంవత్సరాల కాలంలో అందరికీ ప్రాథమిక విద్య అందించాలన్నది ఆ దేశ సూత్రాల్లో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు దాన్ని సాధించలేదు. ఇటువంటి ఉదాహరణలు చూపుతూ ముస్లింలపై ద్వేషభావాన్ని హిందువుల్లో కలిగించే ప్రయత్నం

జరుగుతుంది. ఇది వాస్తవం. అటువంటి ప్రచారం జరిపే మత శక్తులను ప్రభుత్వం అణచివేయాలి. ప్రధాని అక్కడ ఇక్కడ ప్రకటనలు చేయడం సరికాదు. ఈ దుష్టాచారాన్ని అపడానికి మీ కార్యకర్తలు ఇల్లు ఇల్లు తిరిగి ప్రచారం చేయాలి.

ఒక కథ చెప్పి ముగిస్తాను. ప్రభుత్వం ఎప్పుడూ ఇంత అసమర్థంగా ఉండరాదు. ఇది నాకొక కథని గుర్తు చేస్తుంది. కావమ్మ చాలా చిన్న వయస్సులో పెళ్ళిచేసుకుంది. ఆమె భర్తది కూడా చిన్నవయస్సే. కొంత కాలం తర్వాత ఒక బాలుడు ఆ గ్రామానికి వచ్చాడు. నీళ్ళు తెచ్చుకునే ఆడవాళ్ళు ఆ పిల్లాడ్ని చూశారు. ఆ పిల్లాడు బహుశ కావమ్మ మొగుడై ఉంటాడనుకున్నారు. వాళ్ళు అతన్ని అడగటం ప్రారంభించారు. 'నువ్వు కావమ్మ భర్తవా? పిల్లాడు మాట్లాడలేదు. వాళ్ళంతా కలసి ఆ పిల్లాడిని కావమ్మ దగ్గరికి తీసుకెళ్ళారు. స్నానం చేయించారు. మంచిబట్టలిచ్చారు. కావమ్మ దగ్గరికి పంపారు. అప్పటి నుండి వాళ్ళిద్దరూ అలా బ్రతుకుతున్నారు. కొంతకాలం తర్వాత ఆ పిల్లాడు కావమ్మ మొగుడు కాదేమోనని ఆడవాళ్ళందరికీ అనుమానం వచ్చింది. అప్పుడు పిల్లాడిని పిలిచి చెప్పారు. 'నువ్వు ఎవరో పిల్లాడిలాకనిపిస్తున్నావ్. నువ్వు కావమ్మ భర్తవు కాదు'. అప్పుడు ఆ పిల్లాడు ఇలా చెప్పాడు. 'నేను మీ గ్రామానికివచ్చి నప్పుడు మీరే నేను కావమ్మ భర్తనని చెప్పారు. అందుకు నేను మీ మాటలని అంగీకరించాను. ఆమెతో ఉంటున్నాను. నేను ఆమె భర్తని కాదని మీరు చెబితే, నా గొడుగు కర్ర నాకిస్తే నాదారిన నేపోతా'.

అలాగే ప్రభుత్వానికి కూడా ఈ దేశ రాజ్యాంగాన్ని కాపాడటంలో ఎటువంటి బాధ్యత నిర్వర్తించలేదు. మత శక్తులని అణచి వేసే నిర్దిష్ట చర్యలని తీసుకోవడమే కాదు, ఈ దేశంలో హిందువులు ద్వితీయ పౌరులు అంటూ ప్రచారం చేస్తున్న వారిని కూడా అణచాలి. వారు దొడ్డిదారిలో పదవిలోకి రావాలనుకుంటున్నారు. ఈ దుష్ట ఆచారాలపై ప్రభుత్వంతోపాటు అన్ని పార్టీలు కూడా సెక్యులరిజాన్ని కాపాడటానికి పోరాడాలి. ఒక రాజకీయ పార్టీ నిర్వహించే బహిరంగ సభని రద్దు చేయడనికే ర్యాలీల రద్దు నిర్ణయం అని మా పార్టీ భావిస్తుంది. ఇది మత శక్తులని అణచటానికి ఎందుకు పనికి రాదు.

మత శక్తులపై మీరు నిజంగా పోరాడాలనుకుంటే, ఈ నిర్ణయాన్ని ప్రాథమిక స్థాయినుండి అమలు చేయాలి. అందుకు మా సహకారం ఉంటుంది. □

# మతసామరస్యం ప్రమాదంలో పడింది

నాకు అవకాశాన్నిచ్చినందుకు స్పీకర్‌కు ధన్యవాదాలు. ప్రతిపక్ష నాయకుడు శ్రీ ఎల్.కె.అద్వానీ ప్రసంగాన్ని విన్నాను. ప్రజలు వారికి అధికారాన్ని కట్టబెట్ట లేదు. ఉత్తరప్రదేశ్‌లో కూడా వారికి అధికారం ఇవ్వలేదు. వారికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లు చీలడం వల్లే వారు అధికారంలోకి రాగలిగారు.

మనం రాజకీయ మేనిఫేస్టోలో ఏమీ చెప్పినప్పటికీ, రాజ్యాంగ లౌకిక తత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. దాన్ని నాశనం చేయకూడదు. రాజ్యాంగ లౌకిక తత్వానికి భంగం కలిగేలా మనం ఏమీ చేయకూడదు. గతంలో కూడా అయోధ్య, ఫైజాబాద్‌లలోని ప్రజలు కలిసిమెలసి ఉన్నారు. అద్వానీ రథయాత్ర తర్వాత, బి.జే.పీ, వి.హెచ్.పీ, ఆర్.ఎస్.ఎస్.లు అయోధ్యలో రామాలయ నిర్మాణ పనిని చేపట్టాకే పరిస్థితి విషమించి మతసామరస్యం ప్రమాదంలో పడింది.

విషయం కోర్టు ముందుండుగా, వారెందుకు కంగారు పడుతున్నారు? కోర్టు తీర్పు తర్వాత మీరేదో ఒకటి చేయవచ్చు. కాని దానికి ముందు మీరేం చేసినా అది ఖచ్చితంగా మతసామరస్యాన్ని దెబ్బతీస్తుంది. దేశంలో అత్యధిక ప్రజలు ఇష్టపడని మందిర నిర్మాణ పనిని వదులుకోవాల్సిందిగా బి.జె.పి లోని మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ విషయంపై తగు వివరణ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

గోడ నిర్మించడానికి అనుమతినిచ్చిన విషయంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. న్యాయబద్ధం కానిది, మత సామరస్యానికి భంగం కలిగించే అటువంటి నిర్మాణాన్ని నిలుపు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

□

# మతాల మధ్య చిచ్చుపెట్టవద్దు

రెండు సంవత్సరాలకుపైబడి జమ్మూకాశ్మీర్‌లో గవర్నరు పాలన కొనసాగుతుంది. ఈ పరిస్థితిలో ఈ బడ్జెట్‌ను ఆమోదించి సమ్మతి తెలియజేయాల్సి ఉంది.


కానీ కేంద్ర ప్రభుత్వం ఆత్మ శోధన చేసుకుంటుందా అని ప్రశ్నిస్తున్నాను. సరిహద్దు రాష్ట్రమైన జమ్ముకాశ్మీర్‌లో ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది. ఈ రోజు జమ్ముకాశ్మీర్‌లో రాజకీయ శూన్యత ఆవరించింది. కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వం తీసుకొన్న చర్యలే ఈ పరిస్థితికి కారణం.

మొరార్జీ దేశాయ్ హయాంలో తప్ప మరెప్పుడూ జమ్ముకాశ్మీర్‌లో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగలేదు. ప్రజలెన్నుకొన్న ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కూలదోసి షా ఆద్వర్యంలో కీలు బొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసారు. రాష్ట్ర ఆసక్తులకు ఈ ప్రభుత్వం మరింత హాని చేస్తుందని తెలియడంలో చివరికి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు తిరిగి చేతులు కలిపాయి. ఈ రెండు పార్టీలు కలిసి రిగ్గింగ్ చేసి జాతీయవ్యతిరేక వాదాన్ని, కేంద్ర వ్యతిరేక వాదాన్ని రెచ్చగొట్టే కార్యక్రమాలకు ఊతమిచ్చే కొంతమందికి అవకాశమిచ్చినట్లయింది.


ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం అధికారంలో ఉండగా జగ్‌మోహన్‌ని ఆ రాష్ట్ర గవర్నర్‌గా పంపడం మరో తప్పిదం. వారిద్దరి మధ్య సయోధ్యలేదు. ఎందుకంటే 1984లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని రద్దుచేయడంలో జగ్‌మోహన్ కీలక పాత్ర వహించాడు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, గవర్నరు కుటుంబ సభ్యుల్లా ఉండాలన్న ప్రాథమిక విషయాన్ని విస్మరించి, జగ్‌మోహన్‌ను గవర్నరుగా పంపడం కారణంగా జరిగిన పరిణామాలు అందరికీ తెలిసినవే. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వ హించడానికి అవసరమయ్యే చర్యలు తీసుకోవాలని నా విన్నపం. సుమారు 60,000 నుంచి 70,000 వరకు ప్రజలు కాశ్మీరు నుంచి జమ్మూ, ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిపోయారు. ఎన్నికలు నిర్వహిస్తే, వీరందరూ తిరిగి వచ్చి తమ విలువైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనే వాతావరణం కల్పించాలి. జమ్ము ప్రాంతంలోని నియోజక వర్గాల్లో అధిక ఓటర్లు ఉన్నందున, కాశ్మీర్ ప్రాంత నియోజక వర్గాల్లో తక్కువ మంది ఓటర్లున్నందున సాధ్యమైనంత త్వరగా డీలిమిటేషన్ చేపట్టాలి. రాష్ట్రంలో జనాభా లెక్కలు కూడా నిర్వహించకపోవడం దురదృష్టకరం. ఈ విషయంలో ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. నిజాయితీగా ఉండాలి. నేనొక ఉదాహరణ చెపుతాను. ఢిల్లీ అల్లర్లకు కారణమైన వారిని శిక్షించడానికి తగినచర్యలు తీసుకోవాలని అకాలీదళ్ పార్లమెంటులో డిమాండ్ చేస్తూవచ్చింది. చర్యలు తీసుకోకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రకటించినా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదు. అకాలీదళ్ పంజాబ్ శాసనసభ ఎన్నికలను బహిష్కరించింది. అప్పుడు దోషులను శిక్షించడానికి తగిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ అప్పటికే అకాలీదళ్ ఎన్నికలను బహిష్కరించడంతో కాంగ్రెస్ లాభపడింది. ఒకవేళ ఆ ప్రకటనను ముందే చేసివుంటే అకాలీదళ్ పంజాబ్ ఎన్నికలలో పాల్గొని ఉండేది. అది పాల్గొనక పోవడంవల్ల కాంగ్రెస్ విజయం సాధించడం, లోక్‌సభకు అత్యధిక సభ్యులను ఎన్నికయ్యేలా చూడటం వంటి ప్రయోజనాలు పొందింది. కాని రాష్ట్రంలో పూర్తిస్థాయి సాధారణ పరిస్థితులను నెలకొల్పడానికి మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. జమ్మూకాశ్మీర్‌లో కూడా ఇదే పరిస్థితి పునరావృతం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. జమ్మూకాశ్మీర్, పంజాబ్ లాంటి సరిహద్దు రాష్ట్రాల్లో తమ రాజకీయకేళికి అవసరమైన ప్రయోగాలు చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. దూరదృష్టిలేని రాజకీయ జిమ్మిక్కులతో మీరు ఈ దేశాన్ని ఇప్పటికే భ్రష్టు పట్టించారు.

మీరిప్పుడే ఆ రెండు రాష్ట్రాల్లోను వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టారు. దీన్ని ఇక ముందు కొనసాగించవద్దని, నిజాయితీగా చేయమని కోరుతున్నాను.

□



# కుంభకోణాలు




ప్రపంచ వ్యవసాయ సదస్సులో ప్రసంగిస్తున్న వడ్డే



ఎన్.జి.రంగా శత జయంతి ఉత్సవాల సందర్భంగా రైతు నాయకుడు యలమంచలి శివాజీని సన్మానిస్తున్న వడ్డే

# దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేవారిని ఏంచేస్తారు ?

అధ్యక్షా ! గత పదిరోజులుగా షేర్ బ్రోకర్స్ దేశవ్యాప్తంగా సమ్మె చేయడం దురదృష్టకరం. నేను దీనిని ఖండిస్తున్నాను. కోటిన్నర మంది షేర్ హోల్డర్లు దీనివల్ల ఇబ్బంది పడుతున్నారు.

మారుమూల ప్రాంతాలలోని వారు, గ్రామీణులలో కూడా షేర్లు కొనాలనే, ఈక్విటీ క్యాపిటల్‌ల్లో పెట్టుబడులు పెట్టాలనే ధోరణి పెరిగింది. ఇలాంటి స్థితిలో వారు (షేర్‌బ్రోకర్స్) ఎందుకోసం సమ్మెకు దిగారు ? వారు తమ సంస్థలను రిజిష్టర్ చేయించాలను కోవడంలేదు. చిన్న, మధ్యతరగతి వ్యాపారులు సైతం సేల్స్‌టాక్స్‌కిందగాని, కేంద్ర సేల్స్‌టాక్స్ కింద కాని లేదా ఏ ఇతర ప్రొవిజన్ కిందకాని రిజిష్టర్ చేయించుకోవలసిఉంది. ఇది చాలా సాధారణ విషయం. అయితే కోట్లు సంపాదించు కోవాలనుకునే వీరు (షేర్‌బ్రోకర్స్) తమ షేర్లను రిజిష్టర్ చేయించుకోవాలనుకోవడం లేదు. ప్రతి వ్యవహారానికి దాని 'రూల్స్' ఉంటాయి. అయితే, వీళ్లు తాము చేసే పనులకు (వ్యవహారాలకు) 'రూల్స్' (నిబంధనలు) ఉండాలనుకోవడం లేదు. వీరి విషయంలో ప్రభుత్వం గట్టిగా వ్యవహరించాలని నేను కోరుతున్నాను. ఇన్వెష్టర్ల ప్రయోజనాలను కాపాడటానికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలి.

షేరుబ్రోకర్లు నిర్వహించే రోజువారి వ్యవహారాల్లో ప్రజలకు బాధ్యులుగా ఉండేటట్లు రిజిస్ట్రేషన్లు ఉపయోగపడతాయి. వారి వ్యవహారాల్లో పారదర్శకత ఉండేటట్లు కూడా చేస్తాయి. అన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలలో అంతర్గత వ్యాపారం (Inside trading) జరగటం అందరికీ తెలిసిందే. సెబి నిబంధనలు ఇలాంటి వ్యవహారాలను కొంతవరకు తగ్గించవచ్చు కూడా. గౌ॥ ఆర్థిక మంత్రి నుంచి కొన్ని వివరణలను కోరుతున్నాను.

నాకు తెలిసిన సమాచారంమేరకు బాడి ఛార్జెస్ అనే క్యారీఫార్వర్డ్ ఛార్జెస్‌లో వ్యత్యాసాలు ఉన్నాయి. ముంబాయిలో 2 శాతం ఉంటే కోల్‌కత్తాలో 10 శాతం ఉన్నాయి. ఇది నిజమా? దొడ్డిదారిన వ్యాపార వ్యవహారాలు నిర్వహించడానికిది ఈ వ్యత్యాసమే కారణమా? ఆర్థిక మంత్రి ద్వారా నేను తెలుసుకోవాలనుకుంటున్నాను.

కారుకొనడం కోసం అడ్వాన్సుగా నేను రూ. 50,000 చెక్ తీసుకొన్నాను. దీనికోసం నేను ముందు అప్లైచేశాను. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మీద నాకు చెక్ ఇచ్చారు. దానిని క్యాష్ చేసుకోవడానికి టైములేకపోవడంవల్ల, నాకు అకౌంటు ఉండే ఎస్‌బిఐకి దానిని తర్వాత పంపించాను. కలెక్షన్ ఛార్జీల కింద రూ. 500 వసూలు చేస్తామని బ్యాంకుమేనేజరు చెప్పారు.

జాతీయ బ్యాంకు నుంచి స్పెకులేటీవ్స్ కోసం హర్షద్ మెహతా రూ. 600 కోట్లను వడ్డీలేకుండా తీసుకోగలిగాడు. ఇదెలా సాధ్యం ? ఇదెలా జరిగిందో గౌ॥ ఆర్థికమంత్రిని చెప్పనివ్వండి. అసలు ఇవి పనిచేసే విధానమేమిటి? లోపభూయిష్టమైన విధానాలవల్ల ఇవి సంభవించాయని అర్థమా?

ఇలాంటి సంఘటనలే ఇంకెక్కడైనా జరిగి బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయలను అడ్వాన్సుగా తీసుకున్నారా? ఈ విషయాలను ఆర్థిక మంత్రి నుంచి తెలుసుకోవాలనుకొంటున్నాను.

అతిపెద్ద వ్యవహారాలయిన వీటి ద్వారా వారు ఎంత లాభం పొందారు ? ఇది మీ దృష్టికి ఎప్పుడు వచ్చింది? ఎప్పటినుంచి ఈ వ్యవహారం సాగుతోంది? ఎంత మంది దీనివల్ల లాభపడ్డారు?

వందలకోట్ల రూపాయల చెల్లింపులకోసం షేర్లు అమ్మేస్తున్న ప్రస్తుత వ్యవహారం వల్ల ప్రభావాలెలా ఉంటాయి? దీనిపై చర్యలేమిటి? అనే విషయాలు ఆర్థికమంత్రి చెప్పాలి. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఏమి తీసుకున్నాడతను. ఈ షేర్లు కొని పెట్టుబడులు పెట్టిన చిన్న మధ్యతరగతి ప్రజలపై దీని ప్రభావం ఎలా ఉంటుందో కూడా చెప్పండి. ఈ వ్యవహారంలో ఎస్‌బీఐ అనుబంధ సంస్థలైన ఒక జాతీయ బ్యాంకు,

ఒక విదేశీబ్యాంకుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బ్యాంకు అధికారులు బ్యాంకు రసీదులు (bank receipts) ఎలా విడుదల చేస్తారు? స్టాక్ బ్రోకర్స్‌కు సెక్యూరిటీలు విడుదల చేస్తామని ఎలా మాట ఇస్తారు. ఊహించని విధంగా స్పెక్యులేటీవ్స్ కోసం పెద్దమొత్తంలో డబ్బును స్టాక్‌బ్రోకర్సు ఎలా తీసుకో కలిగారు? ఎస్‌బీఐలోని కొందరు అధికార్లు చెప్పినట్లు, వేరే బ్యాంకులలోని రసీదులు (Counter parts) కూడా కొన్ని వారికి తోడ్పడ్డాయి? ఇది నిజంకాదా? అతని మీద ప్రభుత్వం ఏ చర్యతీసుకొంది?

అధ్యక్షా ! ఈ విషయం మీద నేను ఇంతకు ముందే నోటీసు ఇచ్చాను. ఒకే ఒక స్టాక్ బ్రోకర్ ఎస్‌బీఐ నుంచి రూ. 600 కోట్లు తీసుకోకలిగాడు. ఈ విషయం సభలో చర్చకూడా జరిగింది. అప్పుడు కొన్ని చర్యలు తీసుకోవాలనీ సూచించాము. కోట్లాది రూపాయలు తీసుకున్న ఇలాంటి సంఘటనలు ఇంకా జరిగిఉండవచ్చు. స్పెకులేటీవ్ అవసరాలకోసం జాతీయ బ్యాంకులనుంచి ఈ రకంగా రుణాలు తీసుకొని ఉండవచ్చు. నేషనల్ హౌసింగ్ బ్యాంకు, యూకోబ్యాంకులు కూడా ఈ వ్యవహారంలో ఉన్నాయి. నేషనల్ హౌసింగ్ బ్యాంకు దీంట్లో ఉండడం కొత్తవిషయం. పేద, మధ్యతరగతి వారు ఇళ్లు నిర్మించుకోవడంలో సహాయం చెయ్యడానికే నేషనల్ హౌసింగ్ బ్యాంకును ఏర్పరిచారు. ముఖ్యమైన నిధులు స్పెక్యులేటీవ్ అవసరాల కోసం స్టాక్-బ్రోకర్ల చేతుల్లోకి వెళ్లాయి. రిజర్వుబ్యాంకు జారీచేసిన మార్గదర్శకాల్లో కొంత వివాదం ఉంది.

(దీనికి సంబంధించి ప్రకటన చెయ్యాలని కోరుతున్నాను. ఇన్ని కోట్లు మింగి, ఫేర్వాని, మార్గబంధులు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు). ఇది చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఈ దేశ ప్రజలకు ఆర్థిక వ్యవస్థకు వారు చాలా చెడుచేశారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలన్న నా సహచరుల డిమాండును నేను బలపరుస్తున్నాను. సహచరుడు నిర్మల్ కాంతి ఛటర్జీ చెప్పినట్లు ఇది వ్యక్తులతో సాధ్యమయింది కాదు. దీనిలో వ్యవస్థలు, విధానాల ప్రమేయం ఉంది.

దీనికి సంబంధించిన సమాచారం కావాలని సభలో అడిగినప్పుడు, ఫలాన, ఫలాన నిబంధనల ప్రకారం ఇది వెల్లడించకూడదని చెప్పారు. విధానాలను పారదర్శకంగాను, ప్రజాప్రయోజనాలకోసం రహస్యనిబంధనను తొలగించడానికి ఇదే సరైన సమయం.

ఈ వ్యవహారాన్ని పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ సంఘం ఏర్పాటు చెయ్యాలనే నా డిమాండును పునరుద్ఘాటిస్తున్నాను. □

# న్యాయమూర్తులే అక్రమాలకు పాల్పడితే ఏం చేయాలి ?

అధ్యక్షా పార్లమెంటు చరిత్రలోకి ఒక కార్యక్రమాన్ని ప్రతిపాదించాం మనము ప్రజాస్వామ్యానికి, న్యాయసమీక్షకు ఎంతగా నిబద్ధులమై ఉన్నామోననేది ఈ అవిశ్వాసతీర్మానం సూచిస్తోంది. సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) సిట్టింగ్ న్యాయమూర్తిని తొలగించడానికై అవిశ్వాసతీర్మానాన్ని ప్రవేశపెట్టాం. ఈ తీర్మాన ప్రవేశంలో ఎవరూ చట్టానికి అతీతులు కారన్నది స్పష్టంగా అవగతమవుతోంది. నిన్న ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టేటప్పుడు సోమనాధ చటర్జీ ప్రసంగాన్ని అలాగే రామస్వామి తరపు న్యాయవాది కపిల్ సిబాల్ వాదనని విన్నాం.

అధ్యక్ష, లోకసభ సచివాలయం సరఫరా చేసిన ఈ పత్రాలను పూర్తిగా అధ్యయనం చేశాం.

రామస్వామి తరపు న్యాయవాది కపిల్ సిబాల్ తన బాధ్యతను చక్కగా నిర్వహించాడు. మనకందరికి న్యాయవిధానంపై అవగాహన ఉంది. న్యాయవాది తన కక్షదారుని కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తాడు. అదే విధంగా కపిల్ సిబాల్ సైతం తన వాదన కొనసాగించాడు.

అయితే గౌరవనీయులైన లోకసభ స్పీకర్ ఏర్పాటుచేసిన విచారణ సంఘం ముందు తన కక్షదారుడైన రామస్వామి కోసం న్యాయవాది హాజరుకాక పోవడం నాకు

చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వాస్తవానికి కమిటి ముందు హాజరు కావడం ఆయన బాధ్యత.

జస్టిస్ రామస్వామి ప్రస్తుతం సిట్టింగ్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన న్యాయసంరక్షకులు. అయనా న్యాయాన్ని అందించవలసినవారు. అయితే ఆయన సైతం తనపై వచ్చిన ఆరోపణలపై ఏర్పాటు చేసిన కమిటి ముందు హాజరు కాకపోవడం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఇప్పుడు నా సహచరుడు ఆర్. ప్రభు చెప్పిన రెండు విషయాలపై పూర్తి వివరణ నివ్వదలచాను. అతనికి పూర్తి విషయం తెలిసి ఉండకపోవచ్చు. నిన్న సిబాల్ చెప్పిన మాటలనే అతనూ చెప్పాడు. రామస్వామిపై అభియోగాలకు సంబంధించిన పత్రాలలో అతను అపరాధానికి పాల్పడినట్లు సమాచారం ఉంది. దీనిపై నిజనిర్ధారణకు స్పీకర్ ఒక కమిటిని నియమించారు.

ఈ కమిటి ఏర్పాటులోనూ ప్రొసీడింగ్ ప్రారంభమయ్యేనాటికి కొంత ఆలస్యంజరిగింది. దీనికి ముఖ్యకారణం ఈ విషయం సర్వోన్నత న్యాయస్థానం ముందు కెళ్ళడము. దీనిపై న్యాయస్థానం 29.10.1991 నాడు ఒక నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే ఈ తీర్పుకు ముందే 20.10.1991 నాడు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును వెలువరించిఉంది. దీని ప్రకారం 4:1 మెజారిటి తీర్పుతో తొమ్మిదో లోకసభలో న్యాయమూర్తిని తొలగించడంపై పెట్టిన తీర్మానం ఆ సభ రద్దవడంతో ఆగిపోలేదు. 607 విశ్వాసతీర్మానం ప్రకారం రాష్ట్రపతికి పంపిన సమాచారంలో న్యాయ వృత్తిలోని కమిటికి ఇంకా అధికారం ఉందని చెప్పింది.

న్యాయస్థానం తీర్పుతరువాతే కమిటి తన పని ప్రారంభించింది. సిట్టింగ్ జడ్జియైన రామస్వామికి తగు మర్యాద నిస్తూ అతనిపై ఉన్న ఆరోపణలను తొలగించేందుకు ఎంతో అవకాశాన్నిచ్చింది. కాని అతను ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ప్రతిసారీ తన లేఖలతో లేదా తన తరపు న్యాయవాదులతో కాలయాపన చేసారు. అంతేకాని కమిటి ముందు ఎప్పుడు హాజరు కాలేదు.

ఇది తీవ్ర అభ్యంతరకరమైన వ్యవహారం. న్యాయవ్యవస్థలో భాగమైన ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి న్యాయవ్యవస్థకు చేస్తున్న ద్రోహంలాంటిదే. ఈ విషయంలో నా స్నేహితులు ప్రస్తావించిన రాజ్యాంగంలోని 124వ అధికరణం 4వ సబ్‌క్లాజు గురించి ప్రత్యేకంగా చెప్పదలుచుకోలేదు. ఈ అధికారంలో కింద ఎవరేని న్యాయమూర్తులు విధినిర్వహణకు వ్యతిరేకంగా ఉన్నట్లయితే వారిని తొలగించవచ్చు. ఈ విషయమంతా అతనికి అవగతమే అయినప్పటికి కమిటి ముందు హాజరుకాలేదు. ఇది దురదృష్టకరం. సిబాల్ దాదాపు ఆరుగంటల పాటు చేసిన వాదన మాకు సమ్మతంకాలేదు. ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉంది. జస్టిస్ రామస్వామి తన పరిధులు దాటి వ్యవహరిం చాడనేది

సుస్పష్టమవుతోంది. కానీ రామస్వామి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసాడాలేదా. తన తీర్పులను కొందరికి అనుకూలంగా ఇచ్చాడా లాంటి వ్యవహారాలను కమిటి విచారించడం లేదు. రాజ్యాంగంలోని 124 అధికరణానికి అనుగుణంగా ఈ సభలోని 108 మంది సభ్యులు చేసిన పిర్యాదుమేరకు కమిటి విచారణ జరుపుతోంది. అతనిపై వారు చేసిన 14 ఆరోపణలకుగాను పదింటికి స్పష్టమైన సాక్షాధారాలు లభ్యమయినాయి. మొదటి ఆరోపణ ప్రకారం అతను రూ. 50 లక్షలు దుర్వినియోగం చేసాడని ఉంది. విచారణలో అతను రూ. 6 లక్షలు దుర్వినియోగం చేసాడని రుజువైంది. నిబంధనల ప్రకారం రామస్వామి రూ. 38,000లను ఖర్చు పెట్టాల్సి ఉండగా దానికన్నా 13 రెట్లు ఎక్కువగా ఖర్చుపెట్టాడని మనకు తెలుస్తోంది.

నా మిత్రులు ప్రసంగించిన అంశాన్ని నేను మళ్ళీ చెప్పదలుచుకోలేదు. వారు ఏదయితే చెప్పడం మరచారో దాన్నే చెప్పదలచు కొన్నాను. ఏప్రిల్ 1989 నుంచి అక్టోబర్ 1989 వరకు అనగా కేవలం 6 నెలల కాలంలో రామస్వామి 12 సూట్‌కేసులు కొనుగోలు చేసాడు. ఈ సూట్‌కేసులన్నీ ప్రజాధనంతో కొన్నవే. అతను తన సొంతధనంతో ఎన్ని సూట్‌కేసులు కొన్ని ఎవరికీ ఆక్షేపణ ఉండదు. కానీ ఆ సూట్ కేసులకు మొత్తం ప్రజాధనాన్ని వాడినతీరే బాధాకరం. న్యాయమూర్తిగారి ఇటువంటి చర్యలను మేము హర్షించే స్థితిలో లేము.

ఇలా అనధికారంగా ప్రజాధనాన్ని అతను తన సొంత వస్తువుల కొనుగోలుకు వాడుకొన్నారు. ఈ వ్యవహారమంతా ఈ రిపోర్టులలో ఉంది. అతను తప్పుచేసినందు వల్లనే న్యూనతా భావంతో కమిటి ముందు హాజరై తన నిర్ధోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేయలేదు. తాను ఎలాంటి అపరాధం చేయలేదనే భావన అతని కుంటె అతను లేక అతని తరపు న్యాయవాది విచారణ జరుపుతున్న కమిటి ముందు హాజరయ్యేవారు.

కాబట్టి ఇలాంటి పెడసరపు పోకడలతో ఉన్న వ్యక్తి న్యాయస్థానంలో ఉన్నతమైన స్థానంలో ఉండేందుకు అర్హత కోల్పోయారు. ఈ విషయాన్ని గౌరవ న్యాయ సభకు ఇచ్చిన రిపోర్ట్‌లో తెలియజేశాం. జస్టిస్ రామస్వామిని తొలగించే తీర్మానానికి మేము మద్దతు పలుకుతున్నాం. ప్రత్యేకించి కార్య, న్యాయ, శాసన శాఖల్లోగాని పార్లమెంటరియన్లుగాని న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎటువంటి పొరబాటు చేయలేదు. కానీ న్యాయవ్యవస్థలో చెడు జరిగిన రోజు అది దేశ చరిత్రకు దుర్దినమే. ఇటువంటి పరిస్థితులలో దిగజారుతున్న ప్రమాణాలను మళ్ళీ ఉన్నతంగా నిలబెట్టాలి.

ఈ దిశగా రామస్వామి తొలగింపు అందుకు కొంత దోహద పడుతుంది. కనుకనే జస్టిస్ రామస్వామి తొలగింపు తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సోమనాథచటర్జీ ప్రతిపాదనకు మేము మద్దతు తెలుపుతున్నాం. □

# బోఫోర్స్ దర్యాప్తును ప్రక్కత్రోవ పట్టించవద్దు

నా కంటే ముందు మాట్లాడిన గౌరవసభ్యులు ఎన్నో విషయాలు చెప్పారు. నేనయితే వాటి వివరాల్లోకి వెళ్లను, వారు చెప్పిందే మళ్లీ చెప్పను.

బోఫోర్స్ వ్యవహారం గురించి స్వీడన్ విదేశాంగ మంత్రికి ఓ అభ్యర్ధన పత్రం అందచేసానని మన విదేశీ వ్యవహారాల మంత్రి రాజ్యసభలో సమాధానం ఇవ్వడం చూసి నేను ఆశ్చర్యపోయాను. కాస్తంత ఆందోళన చెందాను.

ఏదైన అధికార కార్యక్రమంలో పాల్గొనటానికి విదేశాలకు వెళితే, విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు మేము ఎలా ప్రవర్తించాలో చెబుతుండేవారు. 'మీరు ఇలా నడుచుకోవాలి, దేశానికి వ్యతిరేకంగ వ్యాఖ్య చేయకూడదంటూ సలహాలు ఇచ్చేవారు. సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి అయిన మాధవ సింహ సోలంకీ స్విట్జర్‌లాండ్‌లోని విదేశాంగ మంత్రికి ప్రయివేటు లాయర్ ద్వారా నోటీసు ఇచ్చామని ఒప్పుకున్నారు. ఈ సంఘటన ఫిబ్రవరి 1వ తేదిన జరిగింది. ఆ విషయం గురించి పత్రికలు రాయకుండా ఉండకపోతే ఎవరు పట్టించుకునేవారు కాదు. అసలు విషయం

మరుగున పడేది. స్విస్ విదేశాంగ మంత్రికి ఇచ్చిన విజ్ఞాపన పత్రం అవసరానికి ఉపయోగపడిందని భావిస్తున్నాను.

గౌరవనీయులైన ప్రధానమంత్రి ద్వారా నేను కొన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను. మాధవసింహ సోలంకీ రాజీనామాతో సమస్య సమసిపోతుందని నేను భావించట్లేదు.

ఆ పత్రాన్ని ఎవరు స్విస్ మంత్రికి అందచేశారో తెలుసుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేసింది? ఆ అభ్యర్థన పత్రంలో ఏ విషయాలు ఉన్నాయి? ప్రభుత్వం దాన్ని సంపాదించిందా? అందులో ఏ అంశాలు ఉన్నాయో ప్రధానమంత్రి లేదా రక్షణమంత్రి మాట్లాడేటప్పుడు వివరణ ఇవ్వాలని నేను కోరుతున్నాను. మీరు ఆ విషయాన్ని వదిలివేస్తే అనుమానం మీమీద వస్తుంది. అందులో సందేహం మాత్రం లేదు. ప్రభుత్వంపై అనుమానం కలుగుతోంది.

ఇప్పుడు మాధవ్ సింహ్ సోలంకీ బలిపశువు అయ్యిండొచ్చు. అయితే ప్రభుత్వానికి అన్ని విషయాలు తెలుసనే నమ్మకం నాకుంది. కనుక 193 రూల్, 711 చర్చ కింద, మీరంతట మీరుగా నిజం చెప్పండి దయచేసి ఆ పత్రంలో ఏ వివరాలు పొందుపర్చారో తెలపండి. ఆ అభ్యర్థన పత్రాన్ని అందచేసిన వ్యక్తి ఎవరు? ప్రభుత్వానికి అపకీర్తి తెచ్చిన లాయర్‌పై ఎలాంటి చర్య తీసుకుంటున్నారో కాస్త వివరించండి. దీని వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని మీరు భావిస్తే తక్షణమే చర్య తీసుకోండి.

మణిశంకర్ అయ్యర్, పి. చిదంబరం మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్‌గాంధి ప్రభుత్వం నిజాల్ని వెలికి తీయటానికి ఎంతో కృషి చేసిందన్నారు. అయితే ఎనిమిదో లోక్‌సభలో నేను కూడ సభ్యుడిగా ఉన్నాను. నిజాల్ని పూడ్చిపెట్టడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు నేనింకా మర్చిపోలేదు. ఈ విషయమై రికార్డులను పరిశీలించండి. (అంతరాయాలు) దయచేసి నన్ను చెప్పనివ్వండి, రహస్యాల్ని కాపాడటం కోసం ప్రభుత్వం సత్యాల్ని తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. ఇక్కడ నాకో సామెత గుర్తుకు వస్తుంది - 'రోగి అనుకున్నదే డాక్టర్ కోరుకున్నది'. కంపెనీ (సంస్థ) నుంచి కమీషన్లు, లంచాలు తీసుకున్నవారు ప్రస్తుతం స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మధ్యవర్తిని నియమించకూడదు, కమీషన్ ఎవరికీ ఇవ్వకూడదనే విషయం ఆయుధాలు సరఫరా చేసే బోఫోర్స్, ఇతర కంపెనీలకు ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే మొదట్లో మీరు

కూడా నిజం చెప్పలేదు. ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు సైతం నిజాల్ని దాచారు. బోఫోర్స్ కుంభకోణంలో కొందరికి భారీస్థాయిలో కమీషన్లు అందాయని ప్రముఖ దినపత్రిక 'ది హిందు' ప్రచురించింది. ముడుపులు ముట్టచెప్పారని స్పష్టంగా తెలిసింది. అయితే ప్రభుత్వం ఈ విషయంపై ఎలాంటి చర్యలు చేపట్టింది.

ఈ వ్యవహారం గురించి మంత్రి చిదంబరం అతని సహోద్యోగుల ద్వారా వివరాలు తెలుసుకోవాలని నేను ఆశిస్తున్నాను. బోఫోర్స్ కొనుగోళ్లలో ముడుపులు తీసుకున్నవారి పేర్లు ప్రభుత్వానికి చెబుతానని అప్పట్లో ఆర్మీ చీఫ్ భయపెట్టడంతో రక్షణ కార్యదర్శి పారిపోయాడని ఆర్మీ మాజీ చీఫ్ చెప్పారు. ఆ కంపెనీలో లావాదేవీలు జరిపే సమయంలో ఒప్పందానికి భంగం కలిగిందని ఆర్మీ అధిపతి భయపెట్టడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వం కంట్రాక్టు ఇవ్వటం లేదని, ఇక ఆయుధాలు సరఫరా చేయకూడదని బెదిరించారు. ఈ సలహా అప్పటి ఆర్మీ చీఫ్ ఇచ్చారు. అయితే ఆ వ్యవహారాన్ని బుట్టదాఖలు చేసిన వ్యక్తియే ఒక రాష్ట్రానికి గవర్నర్ అయ్యారు. అంటే మీరు అతన్ని అలా గౌరవించారన్నమాట. మీకు ప్రయోజనం కలిగించిన వారికి ఆ విధంగా సహాయం చేశారు. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమయం ఎంతో వృధా చేశారని వాణిజ్య శాఖ మంత్రి తెలిపారు. సరే, ప్రస్తుతం నేను ప్రభుత్వం నుంచి వివరణ కోరుతున్నాను. ఈ విషయంపట్ల వారికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే గత కొద్ది రోజులుగా ఏమి చేశారు? జస్వంత్‌సింగ్ పేర్కొన్న పలు సూచనలను ఇప్పుడే ఆయన వివరించారు. ప్రభుత్వం నుంచి ముడుపులు తీసుకున్న హిందుజాలు, విన్‌చద్దాలను మీరు ఏమి చేశారు? ఒక ప్రముఖ వ్యక్తి తన ఆర్థిక సామ్రాజ్యాన్ని భారత్‌లో ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాడని కొన్ని వార్తా పత్రికలు ప్రచురించగ చదివాము. కొంతమందికి చెల్లించిన డబ్బును ప్రస్తుతం రాబట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారా? అలా చేయకపోతే ఆ భారమంతా దేశంలోని ప్రజలపై పడుతుంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ నోబెల్ కంపెనీనీ విచారిస్తుండగా ప్రభుత్వం ఒక రహస్యాన్ని దాచినట్లుగా భావించారు. ఇప్పుడు అలాంటి రహస్యాలు ఏమి పనికిరావు. కనుక ఈ నెలాఖరులోపు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసి నిజాలను వెలికి తీయటానికి ప్రయత్నించాలి. లేదంటే మరో ఐదేళ్ల కాలం వృధా అవుతుంది.

విన్‌చద్దా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడని లోగా తెలిపారు. దర్యాప్తును ఆలస్యం చెయ్యడం వారి ప్రధాన ఉద్దేశ్యమయితే కాదుకదా? వాస్తవంగా అయితే కోర్టు 1991 అక్టోబరులోనే తీర్పు ఇచ్చేది. కానీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా చేసిన కొన్ని పనుల వలన అది సాధ్యం కాలేదు.

వారు దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారు. నిజాల్ని సమాధి చేస్తున్నారు. ఈ నెలాఖరులోపు సత్యాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. లేదంటే భారత చట్టంలో ఉన్న లొసుగుల కారణంగా ముడుపులు తీసుకున్న వ్యక్తులు శిక్ష నుంచి తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి.

విదేశాంగ మంత్రి స్విస్ మంత్రికి అందచేసిన అభ్యర్థన పత్రంలోని వివరాలను యథావిధిగా సభ ముందుంచాలని ప్రధానమంత్రిని, రక్షణమంత్రిని డిమాండ్ చేస్తున్నాను. ఎందుకంటే న్యాయం అందరికి సమానంగా ఉండటమే కాకుండ ప్రత్యక్షంగా కనిపించాలి. అదే విధంగా స్విస్ అధికారులు తీసుకున్న చర్యలు, లేదా తీసుకోబోయే చర్యలు తెలపండి. ఇన్ని రోజుల్నుంచి నిజాల్ని తొక్కి పెట్టడానికి గట్టిగా ప్రయత్నించారు. మీరు మీ నాయకుడికి నమ్మకంగా ఉండొచ్చు. మేము దాని గురించి ఎంతమాత్రం ప్రశ్నించము. కానీ నిజాల్ని తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందనే విషయం మీరు మరిచిపోవద్దు.

అవినీతి ప్రతిచోట ఉంది. బోఫోర్స్ కుంభకోణం బయటికి వచ్చినప్పుడు ఉన్నతాధికారులకు సైతం అందులో ప్రధానపాత్ర ఉందని తేలింది. ఓ మంచి ఆరంభాన్ని ఇవ్వాలంటే ప్రజల్లో నెలకొన్న అనుమానాలు తీర్చాల్సిన బాధ్యత మీదే. ప్రధానమంత్రి ఆ దిశగా చర్యలు తీసుకుంటారని మేము ప్రగాఢంగా విశ్వసిస్తున్నాము. ఆయన ఆ దిశగా చర్యలు చేపట్టాలని మనము కోరుకుందాం. (అంతరాయాలు)

మన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో అత్యున్నత మండలిగా పేర్కొని కొలువు తీరిన సభను ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా కించపర్చిందనే కొత్తమాట వినిపించింది. ఈ విషయంపట్ల ప్రభుత్వం నిజాయితీగా ముందుకొచ్చి ఆ సమాచారం తప్పని ఖండించాలి.

ఈ అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఢిల్లీ హైకోర్టులో వి.ఎన్. చద్దా వేసిన పిటిషన్‌పై స్విట్జర్లాండ్ ప్రభుత్వం మరిన్ని వివరాలు

ఇవ్వాల్సిందిగా మన ప్రభుత్వాన్ని ఏప్రిల్ 8న కోరింది. అందుకు ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం లేకపోయినా కేవలం తుదితీర్పును జాప్యం చేయించడం కోసమే ఆ సమాచారాన్ని స్విట్జర్లాండ్‌కు పంపించింది. ఇదే అంశంపై పార్లమెంటులో చర్చిస్తున్నప్పటికి ప్రభుత్వం జవాబివ్వడం లేదు. ప్రభుత్వం వాస్తవాలను వెల్లడిచేస్తూ స్పష్టమైన వివరణ ఇవ్వకపోతే ప్రధానమంత్రిని ఈ విషయంలో అనుమానించాల్సి వస్తోంది. ఇలాంటి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదు.

'ఈ నోట్ ఇచ్చే విషయం మీద నేనెవరికి అధికారాన్ని అప్పగించలేదు. ఆ విషయం నాకూ తెలియదు. ఈ నేపథ్యంలో సోలంకీ నా పేరు పేర్కొనే విషయం తలెత్తే అవకాశమే లేదు.'

'ఈ అంశాన్ని సోలంకి నిర్ధారించారు. అంతేకాదు తన ప్రస్థావన ఉన్నదనడాన్ని నిర్ద్వంద్వంగా ఖండించారు.' రెండో పేజిలో స్విట్జర్‌లాండ్‌లో సీబీఐ లాయర్ మార్క్ బొన్నాట్ ఇలా పేర్కొన్నాడు. "ప్రధాని కోరిక మేరకు సోలంకి నివేదిక అందజేసినట్లుగా పేర్కొన్నాడు." దీనిని బట్టి మనకు అర్థమయ్యే దేమిటంటే కొంతమంది వాస్తవాన్ని దాస్తున్నారని తెలుస్తోంది. సీబిఐ తరుపున బాధ్యతాయుత (వ్యక్తిగా ఉన్న లాయర్ ఎవరూ కోరుతూ ఒక లెటర్ రాశాడు) ఇది మామూలు విషయం కాదు. మనం దీనిని తేలిగ్గా తీసుకోకూడదు. సీబిఐ లాయర్ సృష్టించిన ఈ వైరుధ్యాన్ని ప్రధాని పరిశీలించాలి. సోలంకి తన లెటర్‌లో ప్రధానమంత్రి ప్రస్తావనే లేనప్పుడు సీబిఐ లాయర్ అలాంటి ఉద్దేశాన్ని ఎలా కల్పించాడు? ఏ ఆధారాల ద్వారా ఆయన చెప్పాడూ? ఒకవేళ లాయర్ చెప్పింది సరైనది అయితే, సోలంకి చెప్పింది తప్పు! ఒకవేళ సోలంకి చెప్పింది వాస్తవమైతే లాయర్ లేదా ఆయనకు ఆ సమాచారాన్ని ఇచ్చిన వారిది పొరపాటు. ఈ వైరుధ్యం పట్ల ప్రధాని వివరణ ఇవ్వాలి.

ప్రధాని ద్వారానే నేను మరో వివరణ కోరుతున్నాను. భారత ప్రభుత్వం నుంచి నోట్ రావాల్సి ఉందని, అది ఇంకా తయారుకాలేదని చెల్లింపు లబ్ధిదారుల పక్షాన జెనీవా కోర్టులో వాదిస్తున్న లాయర్లు అక్కడి కోర్టుకు తెలియజేశారని అంటున్నారు. ఇది నిజమా? ఈ విషయంపై ప్రధానమంత్రి వివరణ ఇవ్వాలి.

□

# నల్లధనాన్ని అరికట్టే ఉద్దేశ్యం ప్రభుత్వానికి వుందా?

పేరు ప్రఖ్యాతులున్న ఆర్థికవేత్తగా ఆర్థికమంత్రి అంటే నాకు అత్యంత గౌరవం ఉంది. ఆయన అభిప్రాయాలను కొన్నింటిని నేను సమర్థించకపోయినా మనదేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ఆయన నిజాయితీని, అంకితభావాన్ని నేను ప్రశ్నించను.

ఆర్థికబిల్లుకు సంబంధించి నేను కొన్ని సూచనలు చేయదలచుకున్నాను. నల్లధనాన్ని విపరీతంగా కలిగి ఉన్న షావుకార్లను శిక్షించకుండా విడిచిపెట్టాలని ప్రభుత్వం తీర్మానించింది. వారి ప్రయోజనార్థం రెండు పథకాలను రూపొందించారు. కానీ వేతన తరగతికి చెందిన, మధ్య ఆదాయవర్గాలకు చెందిన ప్రజలపట్ల ఆర్థికమంత్రి అంత కరుణ ఎందుకు చూపడం లేదో నాకు అర్థం కావడం లేదు. అధ్యక్షా, రూపాయి విలువ తగ్గడం వల్ల విపరీతమైన ద్రవ్యోల్బణం ఏర్పడిన సంగతి మీకు తెలుసు. ప్రస్తుతం 15.5 శాతం ఉన్న ద్రవ్యోల్బణ రేటు 20 శాతం వరకు పెరగవచ్చునని అంచనా. ఈ దృష్ట్యా, నిజాయితీగా ఆదాయ వివరాలు సమర్పిస్తున్న మధ్య ఆదాయవర్గాల ప్రజల పరిస్థితిని పరిగణించాలని నేను ఆర్థిక మంత్రిని కోరుతున్నాను. తమ ఆదాయాన్ని ప్రకటించడం తప్ప వేతన తరగతికి చెందిన ప్రజలకు మరో మార్గం లేదు. ఆదాయపన్ను మినహాయింపును ప్రస్తుతం ఉన్న రూ.22,000

నుంచి రూ. 30,000 కి లేదా ద్రవ్యోల్బణ రేటు, ధరల్లో పెరుగుదల, రూపాయి కొనుగోలు శక్తులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయించిన మరే మొత్తానికైనా దయచేసి పెంచాలని నేను కోరుతున్నాను. ఆదాయపన్ను రేట్లను తగ్గించడం వల్ల ప్రభుత్వానికి రాబడి పెరిగిందని మనదేశంలోనే కాక ప్రపంచమంతటా నిరూపితమైంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పన్నురేట్లను తగ్గించవలసిందిగా ప్రభుత్వానికి నా సూచన.

పన్ను వసూళ్ళు తప్పకుండా పెరుగుతాయి. నల్లధనం తగ్గి మరింత మెరుగైన ఉత్పాదన రంగాల్లోకి ప్రవహిస్తుంది. ఈ ఆదాయపన్ను రేట్లను ఈ క్రింది విధంగా తగ్గించడానికి నేను గౌరవనీయులైన ఆర్థిక మంత్రికి ఒక సూచనను చేయదలచుకున్నాను.

(i) రూ. 30,000 నుంచి రూ. 50,000 వరకు 20 శాతం

(ii) రూ. 50,000 నుంచి రూ. 1,00,000 వరకు 25 శాతం

(iii) రూ 1,00,000 నుంచి రూ. 2,00,000 వరకు 30 శాతం

(iv) రూ 2,00,000 పైగా 40 శాతంగా నిర్ణయించవచ్చు.

ఈ సూచనను పరిశీలించవలసిందిగా ఆర్థికమంత్రికి నా విజ్ఞప్తి.

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, పరపతి సంస్థలు పొందే వడ్డీపై 3 శాతం వడ్డీపన్నును మళ్ళీ ఎందుకు ప్రారంభిస్తున్నారో నాకర్థం కావడం లేదు. గౌరవనీయులైన ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పినదాన్నిబట్టి దీన్ని ఇంతకుముందు 1974లో ప్రవేశపెట్టారు. 1978లో ఉపసంహరించుకున్నారు. 1980లో ప్రవేశపెట్టి తిరిగి 1985లో ఉపసంహరించుకున్నారు. ఇప్పుడు మళ్ళీ ప్రవేశపెడుతున్నారు. ప్రభుత్వాన్ని ఈ నిర్ణయానికి ప్రేరేపించిన అంశాలేమిటో తెలియడం లేదు. వాణిజ్యంపై, చిన్న తరహా పరిశ్రమలపై దీని ప్రభావం ఉంటుంది. అయితే నేను ఒకందుకు ఆర్థికమంత్రిని అభినందిస్తున్నాను. గతంలో చేసిన కొన్ని తీర్మానాలకు నిన్న సవరణలను ప్రతిపాదించినపుడు వ్యవసాయ సహకార పరపతి సంఘాలను, భూమి అభివృద్ధి బ్యాంకులను, భూ తనఖా బ్యాంకులను ఈ సవరణల పరిధి నుంచి ఆయన మినహాయించారు. ఈ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు (సహకార సంఘాలతో సహా) బ్యాంకింగ్ నియంత్రణ చట్టం పరిధిలోకి వస్తాయని ఆయన చెప్పినదాన్ని బట్టి చూస్తే ఇది సహజమే. కాని భూతనఖా బ్యాంకులు, భూమి అభివృద్ధి బ్యాంకులు బ్యాంకింగ్ నియంత్రణ చట్టం పరిధిలోకి రావనేది నాకు తెలిసిన సమాచారం. ఈ విషయం ఎలా ఉన్నా ఆయనకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. రూ. 2,500 కన్నా ఎక్కువగా ఉన్న వడ్డీపై పన్నును ముందే తగ్గించి

ఇవ్వడం విషయానికొస్తే బ్యాంకుల్లో తమ ఆదాయాన్ని మదుపుచేసే ఎంతోమంది ప్రజలను ఈ నిర్ణయం మానసికంగా ప్రభావితం చేస్తుంది. ఇప్పటివరకు చూపిన ఉత్సాహం వారు ఇకముందు చూపకపోవచ్చు. ఈ అంశాన్ని కూడా పున:పరిశీలించి దీన్ని ఉపసంహరించవచ్చు.

పన్నులపై వడ్డీ తిరిగి చెల్లించే విషయంలో ప్రభుత్వం ఇంతకఠినంగా ఎందుకు వ్యవహరిస్తోందో నాకు అర్థం కావడం లేదు. కొద్దికాలం కిందట పన్నుచెల్లింపుదారులు ప్రభుత్వానికి చెల్లించవలసిన, ప్రభుత్వం తిరిగి చెల్లించవలసిన మొత్తాలు రెండింటిపై 15 శాతం వడ్డీ ఉండేది. తరువాతి కాలంలో వాటిని వరుసగా 24శాతం, 18 శాతాలకు పెంచారు. ఈ నిర్ణయానికి కారణం నాకు అంతుబట్టడం లేదు. పన్ను చెల్లింపుదారు ప్రభుత్వానికి బాకీ ఉన్నపుడు 24 శాతం వడ్డీ చెల్లించవలసి వస్తుంది. అదేప్రభుత్వం పన్ను ఎక్కువగా కట్టిన చెల్లింపుదార్లకు తిరిగి చెల్లించవలసి వచ్చినపుడు మాత్రం 18 శాతమే వడ్డీని చెల్లిస్తుంది. ఆర్థికమంత్రి పరిశీలించవలసిన నిర్దిష్ట అంశంగా దీన్ని నేను పరిగణిస్తున్నాను.

''సరళీకరణ, హేతుబద్ధీకరణలు'' సంతోషదాయకం అని మీరు విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. పదాల సంఖ్యను సగానికి తగ్గించడమే దీనర్థమైతే తద్వారా మీరు ఎటువంటి సరళీకరణ, హేతుబద్ధీకరణలను ప్రతిపాదిస్తున్నారో నాకు తెలియదు. గతంలో కరువు సమయంలో కార్పొరేట్ పన్నుపై సర్‌ఛార్జిని ప్రవేశపెట్టారు. మూడేళ్ళ తరువాత కరువు అంతమైంది. ఋతుపవనాలు, పంటలు బాగున్నాయి. కాని సర్‌ఛార్జీని మాత్రం మీరు ఉపసంహరించలేదు. గల్ఫ్ యుద్ధం ముగిసిన తరువాత కూడా అది కొనసాగుతోంది. కార్పొరేట్ పన్నులపై సర్‌ఛార్జిని కొనసాగించడం అర్థరహితమని దీన్ని బట్టి తెలుస్తోంది. ఈ విషయాన్ని పరిగణించి సర్‌ఛార్జిని తొలగించడానికి ఆర్థికమంత్రిని నేను కోరుతున్నాను.

నల్లధనం నిల్వల ప్రతి ఏటా నలభైవేల కోట్ల రూపాయలు వచ్చి చేరుతున్నట్లు అంచనా. నల్లధనం చెలామణిని అరికట్టే ఉద్దేశమే ప్రభుత్వానికుంటే ఐదువందల రూపాయల నోట్ల చెలామణిని ఎందుకు రద్దు చేయరు? టన్నుల కొద్దీ డబ్బున్న కోటీశ్వరులు చాలా మంది ఉన్నారు. కొద్ది మేరకైనా నల్లధనాన్ని ప్రభుత్వం దీని ద్వారా తగ్గించవచ్చు.

ఆస్తి పన్ను చట్టానికి సంబంధించి మూడో షెడ్యూలులో 12వ నిబంధనకు ప్రభుత్వం ఒక సవరణను ప్రతిపాదించింది. ఈ విషయంలో కూడా ప్రభుత్వ వైఖరి సమర్థనీయం కాదు. గతంలో 1958లో దీన్ని ప్రవేశపెట్టి 1960లో ఉపసంహరించారు. 1981లో దీన్ని మళ్ళీ ప్రతిపాదించారు కానీ నిబంధనల ముసాయిదా పత్రం వెలుగుచూడలేదు. 1986లో తిరిగి ముసాయిదాను ప్రకటించారు కానీ ఆ

ప్రతిపాదనను ఉపసంహరించారు. తిరిగి 1988లో ప్రత్యక్ష పన్నుల చట్టానికి సవరణ బిల్లు ద్వారా దీన్ని సభలో అంగీకరించారు. కానీ కొద్ది కాలం తరువాత అప్పటి ఆర్థికమంత్రి శ్రీ ఎస్.బి.చవాన్ దాన్ని ఉపసంహరించారు. ఆనాడు చెప్పిన దాంట్లో నుండి కేవలం రెండు వాక్యాలను నేను ఉటంకిస్తాను.

ఆస్తి పన్ను చట్టంలోని మూడోషెడ్యూల్లో ఆస్తి విలువను నిర్ధారించడానికి సంబంధించిన నిబంధనల ప్రకారం, పెట్టుబడి సంస్థల్లో విలువను ప్రకటించని ఈక్విటీ వాటాల విలువను నిర్ధారించే పద్ధతిని గురించి మాట్లాడుతూ " నిర్వహణ పరంగా అటువంటి మూల్య నిర్ధారణ పద్ధతి ఎంతో వ్యయ ప్రయాసలతో కూడు కున్నది. పైగా సంస్థ వాటాలను అమ్ముకోవడం పై వాటాదారుడికి ఎటువంటి నియంత్రణ ఉండదు. ఈ కారణం వల్ల, పెట్టుబడి సంస్థకు వసూలు కాని లాభాలేవైనా ఉంటే అవి వాటాదారుడిపై పెద్దగా ప్రభావం చూపవు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని పెట్టుబడి సంస్థలవాటాల మూల్యనిర్ధారణ విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకుగాను ఆస్తిపన్ను చట్టానికి (1957) చెందిన మూడో షెడ్యూలులోని 12వ నిబంధనను సవరించాలని నేను ప్రతిపాదిస్తున్నాను" అని చెప్పారు. 1989లో దాన్ని ఉపసంహరించారు. మొత్తం నాలుగుసార్లు దాన్ని ఉపసంహరించారు. ప్రభుత్వం మళ్ళీ ఈ బిల్లులో దాన్ని తేవడానికి కారణమేమిటి? ఈ విషయంపై ఆలోచించి దాన్ని ఉపసంహరించవలసిందిగా గౌరవనీయులైన ఆర్థికమంత్రిని నేను కోరుతున్నాను.

కనీసం ప్రస్తుతానికి దాన్ని అమలు చేయకుండా ఆపి రాబోయే బడ్జెట్‌లోగా దీనికి సంబంధించిన వారితో చర్చించి వచ్చేసారి కొత్త ప్రతిపాదనలతో రండి. □

# విజయవాడ వద్ద టి.వి. స్టూడియో

7వ ప్రణాళికాంతానికి విజయవాడ వద్ద టి.వి. స్టేషన్ నిర్మిస్తామని దూరదర్శన్ నిర్ణయించింది. దీనికోసం 1989-90 వ సంవత్సరంలో పునాదిరాయి కూడా వేశారు. టి.వి స్టూడియోకి అవసరమైన పరికరాల దిగుమతి కోసం ఆదేశాలు జారీ చేశామని 1994-95లో టి.వి. స్టూడియో ప్రారంభమవుతుందని కేంద్రం చెబుతోంది. పరికరాలు ఇప్పటికే దిగుమతి చేసుకున్నప్పటికి వేరొక అవసరం కోసం వాటిని మళ్ళించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయాలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

# కుంభకోణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, ప్రజాజీవితంలో విలువల్ని కాపాడటానికి పి.వి. నరసింహారావు రాజీనామా చేయడం మంచిది. ప్రతిపక్షనాయకుడు సభలోనూ, బయట చేసిన ఆరోపణలు పరిశీలించి సభా సంఘం 'క్లీన్ చిట్' ఇచ్చే వరకు అధికారం నుంచి వైదొలగడం శ్రేయస్కరం.

సభ బయట వ్యతిరేకంగా వ్యాఖ్యానించినందుకు అటల్‌బిహారీ వాజ్‌పేయి పైన పరువు నష్టం దావా ఎందుకు వేయలేదు. కాబట్టి, పార్లమెంట్ ప్రొసీడింగ్స్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని నేను చెబుతున్నాను.

కనీసం ప్రజాస్వామ్య విలువలను రక్షించడానికి, పార్లమెంటరీ ప్రజా స్వామ్యాన్ని నిలబెట్టడానికి ప్రధాని దిగిపోవాలి.

ముద్గల్ కేసు నుంచి మౌలంకర్ స్వచ్ఛంగా బయటపడినట్లు, ఒక స్వతంత్ర

న్యాయ విచారణ సంఘం లేదా స్వతంత్ర్య కమిటీ 'క్లీన్ చిట్' ఇచ్చే వరకు ఆయన దిగిపోవాలి.

మనం బ్రిటీష్ వారి ప్రజాస్వామ్య విధానాన్ని అనుసరిస్తున్నా వారి స్ఫూర్తిని మాత్రం పొందలేకపోయామని గౌరవనీయ రబీరాయ్‌గారు ఇంతకు ముందే అన్నారు. హవాలా కేసులో చార్జిషీటు దాఖలు చేయడం ఒక వ్యక్తిని నేరస్థునిగా నిర్ణయించదని, ఆ అధికారం సుప్రీం కోర్టుకు మాత్రమే ఉందని ప్రధాన మంత్రి సెలవిచ్చారు. ఏమైనప్పటికీ 5వేలకోట్ల రూపాయల కుంభకోణం జరిగిందనేది వాస్తవం.

అధ్యక్ష్యా! దేశంలో కుంభకోణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మనదేశంలో చాలినంత చక్కెర నిల్వలు ఉన్నాకూడా ధర ఎక్కువైనా విదేశాల నుండి చక్కెరను దిగుమతి చేసుకున్నాం. ఇందులో వందల కోట్ల రూపాయల కుంభకోణం దాగి ఉంది. ఈ ఒప్పందంలో ఎక్కడి నుండి ఈ డబ్బు వచ్చింది? హవాలా ద్వారా కాదా? యూరియా ఒప్పందంలో కూడా ఇలాగే జరిగింది. టన్ను యూరియా ధర 202 డాలర్లు ఉన్నపుడు కొనలేదు కాని టన్నుకు 246 డాలర్లు ధర ఉన్నపుడు కొన్నాం. చంద్రస్వామిని అరెస్ట్ చేసిన తర్వాతే హవాలా డబ్బు ఎలా చేతులు మారిందో తెలిసింది.

అధ్యక్షా! ఈ మధ్య జరిగిన ఒక సీబీఐ కేసును ప్రస్తావించదల్చుకొన్నాను. గోవా మాజీ ముఖ్యమంత్రి సోదరుడైన ఒక స్మగ్లర్ 8 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తుండగా ఫెర్నాండజ్ అనే కస్టమ్స్ అధికారి అతన్ని పట్టుకోవడానికి వెంబడించగా ప్రజలు ఆ స్మగర్లను కాల్చి చంపారు. సీబీఐ మాత్రం ఆ కస్టమ్స్ అధికారికి వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. ఇలాంటి తప్పుడు కేసు పెట్టమని సీబిఐపై ఒత్తిడి తేవడానికి ముఖ్యకారణం గోవాలో ప్రభుత్వం నిలవడానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు అవసరం. జస్టిస్ అన్సారియా ఈ కేసుపై వ్యాఖ్యానిస్తూ " ఈ కేసు ద్వారా సీబీఐ తప్పుడు కేసులు బనాయించి అన్యాయం చేస్తున్నట్టుగా అర్థమవుతోంది" అని అన్నారు. ఈ ఆధారాలన్నీ సుప్రీంకోర్టు ముందున్నాయి.

అధ్యక్షా! నేను ఎక్కువ సమయం తీసుకోను. నాకు కేటాయించిన సమయాన్ని వృధా చేయదల్చుకోలేదు. దేశంలోని ప్రజలు మొదటిసారిగా తాము సరియైన వ్యక్తిని ఎన్నుకోలేదే అని బాధపడ్తున్నారు. అందువల్ల నేను మీ ద్వారా ఈ సభను కోరుతున్నదేమిటంటే సీబీఐ పై ఎవరి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పని చేసేలా మనం చూడాలి. సభ మొత్తం ఈ అంశంపై మద్దతివ్వాలి.

అధ్యక్షా! దేశంలో ఈ అంశంపై అయోమయం నెలకొంది. ఈ కేసులో సంబంధం ఉన్న వ్యక్తులు అందరికి తెలిసిన వారే. మళ్ళీ వారి పేర్లు ప్రస్తావించదల్చుకోలేదు. వారిలో కొందరు దివంగతులయ్యారు. ఈ హవాలా అంశం చాలా క్లిష్ట పరిస్థితులను సృష్టించింది. ఈ సంఘటన మనల్ని సభ్య ప్రపంచంలో తలెత్తుకోలేని విధంగా చేసింది. ఈ కేసువల్ల ప్రజల్లో కూడా రాజకీయ నాయకులు, ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులపై చులకన భావం ఏర్పడేటట్టు చేసింది. దేశంలో ముఖ్య దర్యాప్తు సంస్థయిన సీబీఐ పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. కాని ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. ఎమర్జెన్సీ లాంటి పరిస్థితుల్లో కూడా నెగ్గుకొచ్చిన సీబీఐ ఇప్పుడు ఇలా చేష్టలుడిగి పోవడం ప్రజలకు అర్థం కావడం లేదు. ఎమర్జెన్సీ తర్వాత మనమంటే ప్రజల్లో గౌరవం ఉండేది. కాని ఇంతకాలం మౌనంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఎలాంటి అనుమానాలకు తావివ్వని విధంగా ఇది నిర్ణయించబడింది కనుకనే తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తిస్తుంది. ప్రతి పక్షంగా ఆరోపించడం లేదు. మేము వారిపై నిందారోపణ చెయ్యడం లేదు.

లక్షలు, కోట్ల రూపాయలు తీసుకొన్నారు. పరిశోధనలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మనదేశంలోని జమ్మూకాశ్మీర్‌లోనూ, ఇతర ప్రాంతాలలోను ఉన్న జాతి వ్యతిరేక శక్తులకు, విచ్ఛిన్నకర శక్తులకు ఈ హవాలా కుంభకోణం డబ్బు అందుతుందనేది స్పష్టం. అంతేకాక ఉన్నత స్థానంలో ఉన్న రాజకీయ నాయకులకు కూడా డబ్బు అందజేసే స్థాయిలో కొందరు వ్యక్తులు ఉన్నారు.

సర్, కొందరు సీనియర్ కార్యదర్శులు, సీబీఐ మాజీ డైరెక్టర్ కూడా ముడుపులు తీసుకోవడం నిజంగా కలవరపాటు కలిగించేదే. ఇది ప్రమాదస్థాయిని తెల్పుతోంది. అధికారులు, రాజకీయ నాయకుల ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల నిర్ణయాలను విదేశీ కంపెనీలు ప్రభావితం చేయగలవని హవాలా కుంభకోణం నిరూపించింది. మార్చి 1న వచ్చిన సుప్రీంకోర్టు తీర్పుకూడా ఎలాంటి అనుమానం లేకుండా ఈ విషయాన్నే ధ్రువపర్చింది.

సర్, ప్రధానమంత్రి ఈ చర్చలో జోక్యం చేసుకున్నప్పుడు నేను శ్రద్ధగా విన్నాను. అసలు ఏ ముఖం పెట్టుకొని ఈ ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధానమంత్రి అధికారంలో కొనసాగుతున్నారో నాకు అర్థం కావడంలేదు. మీరు నన్ను క్షమించాలి. సుప్రీంకోర్టు తీర్పు జాగ్రత్తగా చదివితే, సీబీఐ మీద అధికారం కల్గి ఉండే

ప్రధానమంత్రిని తప్పుపట్టడం కనిపిస్తుంది. మళ్ళీ చెప్పడం నాకిష్టంలేదు. కాని పక్షపాత పూరితంగా వ్యవహరించనని, నమ్మకాన్ని కోల్పోవడం జరగదని ఆయన చెప్పాలి.

సీబీఐ నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందా లేదా, వివక్షతో ప్రవర్తిస్తోందా, ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకొందా, కొందరు ఉన్నతాధికారుల, రాజకీయనాయకుల పక్షాన పనిచేస్తోందా అని సుప్రీంకోర్టు ఒక అభిప్రాయానికి రావచ్చు. అందుకోసమే ఈ తీర్పునిచ్చింది. గతంలో, సుప్రీంకోర్టు ఇలాంటి తీర్పునివ్వలేదా? ఇది నిజంగా అవమానకరం కాదా? నేను దీనిని అర్థం చేసుకోలేక పోతున్నాను. ఈ రికార్డులను భద్రపర్చాలి. అంటే ఈ ముఖ్యమైన పత్రాలతో విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉందని అర్థం. ఇది సీబీఐ అసమర్థతకు అద్దం పడుతుందనడంలో సందేహం లేదు. గౌరవనీయ ప్రధాని సీబీఐ చార్జిషీట్లో ఉన్నాడు. సీబీఐ ప్రధాని ఆధీనంలోనే ఉంది. ప్రధాని విధులనెలా నెరవేరుస్తున్నారనటానికి సుప్రీంకోర్టు తీర్పు అద్దం పడుతోంది. ఇదే నేను చెప్పాలనుకుంది.

సుప్రీంకోర్టు తీర్పును ప్రధాని చదివారు. కాని సుప్రీంకోర్టు ఏ పరిస్థితుల్లో ఆ తీర్పు ఇచ్చిందనే విషయంపై ఆయన వివరణ ఇవ్వకుండా దాటవేశారు. నాకు చెప్పడానికి అవకాశం ఇస్తే, నేను సరళమైన భాషలో చెప్పినా ప్రధాని, సీబీఐకి ఆక్షేపణగానే ఉంటుంది.

సీబీఐ డైరెక్టరు గాని, అతని సహోద్యోగులు కాని, ఏ అధారిటీకి నివేదించనక్కరలేదని సొలిసిటర్ జనరల్ చెప్పిన విషయాన్ని మేం రికార్డు చేస్తాం. అని అతను చదివి వినిపించాడు. సీబీఐ గాని, డైరెక్టరు గాని ప్రధాన మంత్రికి 1.3.1996 వరకు నివేదించారా లేదా? అనే విషయం నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. అలాంటి వాదనను మేం ఎలా ఒప్పుకుంటాం. ప్రధాని తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని అర్థం. మరి ప్రధాని మౌనంగా ఎలా ఉండగలరు? పరిపాలనా పరంగా సీబీఐ అధికారులు నివేదించకుండా ఉండటానికి అతనెలా ఒప్పుకుంటాడు? ఈ ప్రత్యేక పద్ధతి ప్రకారం ప్రధానమంత్రి ఈ సభకు సమాధానం ఇవ్వాలి.

నిందారోపణను తప్పించుకొనేందుకు మార్చి 11,1995న ప్రతిపక్ష నాయకుడిపై విమర్శకు దిగుతున్నారు. ప్రధానమంత్రికి, అతను (ప్రధాని) సూచించిన

కొందరికి ముడుపులిచ్చిన ఎస్.జె.క్.జైన్ నాడు సీబీఐ ఎదుట సాక్ష్యమిచ్చారు. ప్రధానమంత్రి అవకాశవాదంతో వ్యవహరించడం దురదృష్టకరం.

ముద్గల్ అంశంపై మాజీ స్పీకర్ రబీరే చర్చను లేవనెత్తారు. జాతియావత్తు దీనిపై దృష్టిసారించింది. ఈ సందర్భంగా అది లేవనెత్తవలసిన అవసరం లేదు. దురదృష్టవశాత్తు, ఆయన వెళ్లిపోయారు. నా సలహా మేరకు అతను స్వచ్ఛందంగా పాల్గొనాలి, అదీ కనీసం మార్చి 1,1996న సుప్రీంకోర్టు తీర్పు అనంతరమైన జరగాలి. అతను ఆ స్థితిలో కొనసాగేందుకు ఒక్క నిమిషం కూడా వృధా చేయలేదు.

అధ్యక్షా!, నేను కొన్ని ప్రశ్నలను అడగదలచుకొన్నాను. నేను అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. మే 1991లో విచారించినపుడు, వారిపై దాడిచేసి డైరీలను, నోట్‌లను స్వాధీనం చేసుకొన్నా జైన్‌లను ఎందుకు అరెస్టు చేయలేదు. డైరీ, నోట్‌లలో ఉన్న అంశాలు వాస్తవమని తెలిసినా సీబీఐ వారినెందుకు అరెస్టు చేయలేదు. వారివద్దనున్న 52 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకోలేదు. పదిలక్షల రూపాయల విలువైన వికాస్ పారస్, ఇరవైవేల డాలర్ల విదేశీ మారక ద్రవ్యమున్న విషయాన్ని ప్రస్తావించారు. కొంతమంది అధికారులకు, వివిధ వ్యక్తులకు 52 కోట్ల రూపాయల దాకా ముడుపులిచ్చినట్లు (విదేశాల నుంచి వచ్చిన నిధులు) డైరీలో రాశారు. డిఫెన్స్, మినిస్ట్రీ, ఫెరా నిబంధనల ఉల్లంఘన, కోఫ్‌పోసా నిబంధనల కింద ఆర్థిక విభాగం ఎందుకు చర్య తీసుకోలేదు? దీనిపై గౌరవనీయులైన మంత్రి సమాధానం చెప్పాలి.

సర్, డైరీలో సూచించిన ప్రకారం డబ్బు స్వీకరించిన వ్యక్తి ఎవరో, సిబీఐ ప్రధాని ఆధ్వర్యంలో ఉంది కనుక అతనికి తెలుసు. డైరీలో సూచించిన కొందరు వ్యక్తులను మంత్రివర్గంలోకి తీసుకొన్నారు. జైన్‌ల నుంచి ముడుపులు స్వీకరించిన వ్యక్తులను క్యాబినెట్‌లోకి ఎందుకు తీసుకొన్నారు? హవాలా నిందుతులను క్యాబినెట్‌లోకి ఎందుకు తీసుకొన్నారు? దీనికిగాను, ప్రతి అంశంపై వివరణాత్మకంగా గౌరవమంత్రి సమాధానం చెప్పాలి.

సర్, అవినీతి నిరోధక చట్టం గురించి, ముడుపులు ఇచ్చినవారు, స్వీకరించిన వారు శిక్షలకు అర్హులు. వీటి గురించి మీకు తెలుసు. కాంట్రాక్టులను, కొన్ని ప్రాజెక్టులను పొందేందుకు ఉన్నతస్థాయిలోని అధికారులకు జైన్‌లు ముడుపులిచ్చారు. వారు ప్రాజెక్టును పొందారు. ప్రాజెక్టును పూర్తి చేసి వారు అవార్డు

లను పొందారు. ప్రభుత్వాధికారులకు లంచమివ్వడం నేరం. ముడుపులు స్వీకరించిన వారిపై ఇచ్చిన వారిపై, అవినీతి నిరోధక చట్టం కింద ఎందుకు చర్య తీసుకోలేదు. ఈ చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం ఇరువురిపై చర్య తీసుకోవాలి. దీనిపై ఎందుకు చర్యతీసుకోలేదు. దీనిపై వివరాలను నేను కోరుతున్నాను.

విచారణ సమయంలో డైరీలను స్వాధీనం చేసుకొన్న తర్వాత ప్రధాని, అతను సూచించిన కొందరికి ముడుపులు లిచ్చానని జైన్ అంగీకరించాడు. విచారణ ప్రస్తుతం ఏ దిశలో ఉంది. సుప్రీంకోర్టు దీనిపై వ్యక్తులపై వచ్చిన ఆరోపణలను కేటగిరీలవారీగా, వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా సమగ్రంగా విచారించాలని చెప్పిన విషయాన్ని ఉదయం ఇంద్రజిత్ గుప్తా తెలిపారు. దీనిని నేను పున: ప్రస్తావించను. కేసు ముగించే దశలో దీనిపై కోర్టుకు తెలియపరచిన తర్వాతే సీబీఐ ఏదైనా నిర్ణయం తీసుకొంటుంది. దేశప్రధానికి సంబంధాలున్నట్లు ఆరోపణలొచ్చిన ఈ కేసు ప్రగతి ఏమిటో, కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఉంటుంది.

సర్, ఇంతపెద్ద మొత్తంలో అమృత్‌భాయి ద్వారా జైన్‌లు అధికారులకు ముడుపులిచ్చిన కంపెనీ ఏదో నేను తెలుసుకోవాలి. కంపెనీ పేరేమిటో, అది నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్, నేషనల్ హైడ్రోపవర్ కార్పోరేషన్ లేదా మరేదైనా ప్రభుత్వ రంగ సంస్థలలో కాంట్రాక్టులకు ఆ సంస్థ ప్రయత్నిస్తుందా? అలా జరిగితే దానిని బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలి. లేదా ప్రభుత్వాధికారులకు, రాజకీయ నాయకులకు లంచాలివ్వడం చేసిన కంపెనీకి పూర్తి కాంట్రాక్టు లివ్వరాదు. దీనిని బ్లాక్ లిస్టులో ఉంచారో లేదో కేటగిరిల వారీగా సమాధానాన్ని నేను మంత్రివర్యుల నుంచి తెలుసుకోవాలి.

సర్, జైనుల నుంచి తీసుకొన్న ముడుపులను ఎన్నికలలో ఖర్చుచేసిన దానిపై నేను కొన్ని సూచనలు చేయదలచుకొన్నాను. కొందరు నాయకులు కావచ్చు లేదా కొన్ని రాజకీయ పార్టీలకు ఇందులో ప్రమేయం ఉండి ఉండవచ్చు, ఈ ముడుపులను ఎన్నికల్లో ఖర్చుచేయడమో, వారి మిత్రులకు బదిలీ చేయడమో జరగవచ్చు. ఏదేమైనా వారి వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించవచ్చు. ఇక్కడ ముఖ్యమైన విషయమేమిటంటే ఎన్నికల్లో ఆ డబ్బును వినియోగించటమన్నదే. హవాలా కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాతనైన ఎన్నికల సంస్కరణలు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల్లో చేసే ఖర్చు అభ్యర్థి సొంతంగా చేసే ఖర్చుగాకానీ, అతని బంధువులు, స్నేహితుల ద్వారా చేసిన లేదా

పార్టీ ఆ ఖర్చు భరించినా, నిబంధనల మేరకు చేయాల్సిన ఖర్చు పరిధిలోనికి రావటం లేదు. ఖర్చు అదుపులేకుండా పోవడంతో పాటు లెక్కలోకి రాకపోవడం జరుగుతోంది. ఇలా అభ్యర్థి గానీ, అతని బంధు మిత్రులుగానీ, పార్టీగానీ ఎన్నికల్లో చేసే ఖర్చును పరిగణనలోకి తీసుకోవాలి. నిబంధనలు అతిక్రమించడాన్ని మేం సహించం.

దానితో పాటే, ఎన్నికల్లో పార్టీలకిచ్చే నిధులపై నిబంధనలుండాల్సిన అవసరముంది. ఎన్నికల్లో ధనప్రవాహం వల్ల, నేటి రోజులలో మధ్యతరగతి మేధావివర్గం, కొందరు ప్రముఖులు ఎన్నికల్లో నెగ్గడం పోటీకి తట్టుకోవడం దుర్లభమవుతోంది.

□

# ఎయిడ్స్ అరికట్టాలి

ప్రభుత్వం దృష్టికి ఒక విషయం తీసుకురావాలనుకుంటున్నాను. కేరళలో ఎయిడ్స్ వ్యాధి విస్తరిస్తూ దేశ ప్రజలను ఆందోళన పరుస్తున్నది. ప్రతి సంవత్సరమూ ఎయిడ్స్ రోగులు సంఖ్య పెరుగుతున్నది. ఈ మధ్యనే ఎయిడ్స్‌తో ఒక వ్యక్తి చనిపోయాడు. దురదృష్టవశాత్తు భయంకరమైన ఎయిడ్స్ బారిన పడి అనధికార లెక్కల ప్రకారం అత్యధికంగా మృతి చెందుతున్నారు. ఈవిషయమై సాధ్యమైన అన్ని చర్యలు చేపట్టవలసిందిగా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గల్ఫ్‌లో పనిచేస్తున్నందున ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు కేరళలో ఎయిడ్స్ సంఘటనలు ఎక్కువగా ఉన్నాయి.

అవసరమైన చర్యలు చేపట్టవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే ఎక్కువ మంది విదేశాలలో, బొంబాయిలోను పనిచేస్తున్నారు. కేరళలో ప్రతిష్టాత్మక ఆసుపత్రులలో ఎయిడ్స్ బారినపడ్డ రోగులను ఉంచడానికి ప్రత్యేక వార్డులు లేవు. కనుక అవసరమైన అన్ని చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

దీని మూలంగా వ్యాధి విస్తరించి ప్రజలు అంటువ్యాధి పాలుకాకుండా అవసరమైన అన్ని మౌలిక వనరులను అక్కడ ఏర్పాటు చెయ్యవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

# బ్యాంకింగ్‌రంగం అవినీతికి ఆలవాలమయ్యింది

చోటుచేసుకున్న కుంభకోణం అనూహ్యమైనది. ఏదేని వ్యక్తుల, సంస్థల నుంచి బ్యాంకులు ఉంచుకున్న నగదు విలువలో రూ. 804 కోట్లు తరుగుదల ఉందని అంచనా. కొందరు బ్రోకర్లు బ్యాంకులను ఏవిధంగా ప్రభావితం చేయగలరో ఈ నివేదిక వెల్లడి చేస్తోంది. జాతీయ బ్యాంకులకేకాక, విదేశీ బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకూ వీరు టోకరా వేశారు. బ్యాంకు నిధులను, షేర్ మార్కెట్లోకి అక్రమంగా దారి మళ్ళించడంలో వీరు కృతకృత్యులయ్యారు. కొద్ది మంది లాభపడినప్పటికీ, అనేకులు వంచనకు గురిఅయ్యారు. అనేకులు తాము చెమటోడ్చి పొదుపు చేసిన ధనాన్ని కోల్పోయారు. ఈ ధనం ఎక్కడికి చేరింది, దీన్ని ఎవరు స్వాహా చేశారనే విషయాన్ని కనుగొనడంలో ఈ నివేదిక విఫలమయింది. అందువల్ల అత్యధికులు నిరాశకు గురయ్యారు. అందుకే ఈ విషయమై సూక్ష్మ పరిశీలన జరపడానికి నిపుణుల కమిటీని వేయాలని ఈ కమిటీ అభిప్రాయ పడింది.

బ్యాంకులనన్నిటినీ నియంత్రించే రిజర్వ్‌బ్యాంకే విఫలమవడం విచారకరం. 1986లోనే రిజర్వుబ్యాంక్ విఫలమవడం విచారకరం. 1986లోనే రిజర్వ్‌బ్యాంక్ సరైన

చర్యలు తీసుకొని ఉంటే, నేడు ఇంత భారీ స్థాయి కుంభకోణం జరిగేదికాదు. బ్యాంక్ ఆఫ్ కరడ్, మెట్రోపాలిటన్ కో - ఆపరేటివ్ బ్యాంక్‌లు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయగలగడం ఆశ్చర్యకరం. బి.ఆర్.లను జారీ చేసే అధికారం కూడా మెట్రోపాలిటన్ కో-ఆపరేటివ్ బ్యాంకుకు లేదు. ఎస్.జి.ఎల్ ఫారాలు కూడా అనేకం బౌన్స్ అయ్యాయి. ఇంత జరిగినప్పటికీ, ఈ విషయాన్ని బ్యాంకు అధికార గణం తీవ్రంగా పరిగణించలేదు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా దీనిపై దృష్టి నిలపలేదు.

బ్యాంకింగ్ రంగం అవినీతికి ఆలవాలమయింది. ప్రభుత్వ పథకాలను అమలు చేసే విషయంలో శాఖా స్థాయిలో జరిగే అవినీతి అందరికీ తెలిసిందే. రుణం తీసుకోవడానికి బ్యాంకును ఆశ్రయించే వారందరికీ ఎదురయ్యే ఇబ్బందులే ఇవి. అస్తవ్యస్త నిబంధనల వల్ల అనేక మంది ఉన్నతాధికారులూ లంచాల కోసం అర్రులు చాచ గలుగుతున్నారు. ఇలాంటి అవకతవకలను సహించడం సమంజసం కాదు. డా. మన్‌మోహన్‌సింగ్ పై మాకు ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయి. కానీ బ్యాంకుల చేత సక్రమంగా పనిచేయించే బాధ్యత ఆయన భుజస్కంధాలపై ఉంది.

ప్రస్తుత ప్రభుత్వ సరళీకరణ విధానాలు, ఇలాంటి అవకతవకలు పెరగటానికి తోడ్పడుతున్నాయనేది జగమెరిగిన సత్యం. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు విదేశీ బ్యాంకులతో లావాదేవీలు జరుపుతున్నాయి. వ్యవసాయదారుల లబ్ధికోసం రూ. 100 కోట్ల విలువగల ఇరిగేషన్ బాండులను విడుదల చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ, ఇందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అనుమతించలేదు. కానీ ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం రూ. 20,000 కోట్ల విలువకు బాండులను జారీ చేయగలిగాయి.

అధికార పక్షంలో వాళ్ళు అనేకసార్లు నేషనల్ ఫ్రంట్, జనతాదళ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతుల రుణాలను మాఫీ చేయడం వీరికి నచ్చలేదు. వేలకోట్ల రూపాయలను బ్రోకర్లు స్వాహా చేసినప్పటికీ, ఈ ప్రభుత్వానికీ చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ అవకతవకలలోని నిజాలను వెలికితీయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక ప్రభుత్వం ఉపేక్షించి లాభం లేదు. పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించాలి. ఈ అవకతవకలకు కారకులైన వారందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలి. తన విహిత కర్తవ్యాన్ని నర్వర్తించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది. తన

సొంత నిర్ణయాలను అమలు చేయడంలో సైతం ప్రభుత్వం అచేతనంగా ఉండిపోయింది. కాబట్టి ప్రభుత్వం రాజీనామా చేయాలి.

ఈరోజు కన్‌ఫినా దాదాపు రూ. 850 కోట్ల నష్టాన్ని చవిచూసింది. అనేక ఇతర సంస్థల సంగతీ ఇదే. ఈ డబ్బు ఎవరిది? ఈ నివేదిక పేర్కొన్న కొద్దిమంది బ్రోకర్లు వేల కోట్ల రూపాయల ధనాన్ని దిగమింగగలిగారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలి. సమయం మించి పోక ముందే విచారణ చేపట్టాలి. యదార్థాలను వెలికి తీయాలి. సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఎత్తి చూపిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి. అవకతవకలకు బాధ్యులను కఠినంగా శిక్షించాలి. వారు బ్యాంకు ఉద్యోగులైనా, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వారైనా, ఆర్థిక సంస్థలకు చెందిన వారైనా, మంత్రులైనా సరే, వారిపై తీవ్ర చర్యలు చేపట్టాల్సిందే.

డా. మన్‌మోహన్‌సింగ్ ఉన్నత వ్యక్తిత్వం కలవారనే విషయాన్ని నేను సమ్మతిస్తాను. అయినప్పటికీ ఆయనకు, ఈ అవకతవకల విషయంలో నైతిక బాధ్యత ఉంది. తలచుకుంటే ప్రభుత్వం ఈ అవకతవకలను నివారించి ఉండేది. బ్యాంకు నిధులను, ప్రభుత్వ ధనాన్ని మదుపరుల, ప్రజల ప్రయోజనార్థం ఉపయోగించి ఉండేది. తన ఈ బాధ్యతను నిర్వర్తించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమయింది. తన సొంత నిర్ణయాలను అమలు చేయలేక పోయింది. కాబట్టి ప్రభుత్వం రాజీనామా చేయాలి. అవకతవకలకు బాధ్యులైన వారందరిపైనా చర్యలు తీసుకోవాలి.

□

## బహిరంగంగా అమ్మాలి

ఖాయిలాపడిన పరిశ్రమల అమ్మకంలో గోప్యత కన్పిస్తోంది. పరిశ్రమలు ఉన్న భూమికి చెల్లించాల్సిన భారీ మొత్తాల్లో అవకతవకలు జరుగుతున్నాయి. ఇలాంటి భూముల అమ్మకాలను బహిరంగంగా అమ్మడం ద్వారా ఎక్కువ మొత్తాలను పొందవచ్చు. ఇలా వచ్చిన డబ్బును నష్టాల్లో ఉన్న ఆయా సంస్థల అభివృద్ధిచే వినియోగించుకోవచ్చు.

# అవినీతిపరులకు ప్రభుత్వమే పెద్దరక్షణ కవచం

ఎన్టీపీసీ, ఎన్.హెచ్.పి.సి., ఇతర పెద్ద ప్రభుత్వ రంగ సంస్థల్లో నిర్ణయాలు రాజకీయ నాయకులు, బ్యూరో క్రాట్స్ ప్రభావంతో జరుగుతున్నాయన్న విషయం సిబిఐ దాడులవల్ల వెలుగుచూసింది.

ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో నేను తెలుసుకోవాలను కుంటున్నాను. ఎందుకంటే నూతన ఆర్థిక సరళీకరణ వల్ల వీటిపై పెట్టే వ్యయం 7 కోట్లు నుండి ఒక్కొక్క సారి 10 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. ఇటువంటి హవాలా చర్యలని అరికట్టకపోతే ఇంకా ఎంత మొత్తాలు చేతులు మారేవో మనం ఊహించవచ్చు. మీకు ఎన్రాన్ ప్రాజెక్టుని గూర్చి తెలుసు. ప్రస్తుత మున్న ప్రభుత్వం మహారాష్ట్రలో అధికారంలోకి రావడానికి ముందుగా కొన్ని సంప్రదింపులు జరిగాయి. దీంతో ప్రాథమిక అంచనాల్లో కొన్ని కోట్ల రూపాయలు తగ్గించడానికి అ సంస్థ ఒప్పుకుంది. దీన్ని బట్టి మనకి ఏం అర్థం అవుతుంది. అలాగే మిగిలిన ప్రాజెక్టులు కూడా. చివరికి వీటి భారాన్ని వినియోగదారుడు భరిస్తాడు. కనుక ఇటువంటి అవినీతికి ఉన్న అవకాశాన్ని అరికట్టాలి. పారదర్శకతని పెంచాలి. ఇట్లా లాలూచీ పడిచేసే ఒప్పందాలని అరికట్టడానికి సరైన పద్ధతులు అవసరం.

పార్లమెంట్ చట్టం ద్వారా సిబిఐ రంగంలోకి దిగాలి. సిబిఐ అధికార పరిధిని సూచిస్తూ ఇంతకు ముందు కమిటీ కొన్ని సూచనలు చేసింది. అలాగే జనాతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ పోలీస్ కమీషన్ కూడా ఉపయోగమైన సూచనలు

చేసింది. ఇవన్నీ ధూళిని పోగుచేస్తున్నాయి. జాతీయ పోలీస్ కమీషన్ చేసిన సూచనలని ప్రభుత్వం అమలుచేస్తుందో లేదో తెలుసుకోవాలను కుంటున్నాను. ప్రధాని స్వచ్ఛందంగా మెట్టుదిగిరావడానికి ఇది సరైన సమయం. ఈ సభలో చేసిన రెండు మూడు అంశాలు ఈ సందర్భంగా నాకు గుర్తుకు వస్తున్నాయి. ఒకరోజు విదేశీ వ్యవహారాల మాజీమంత్రి మనల్ని కలుసుకున్నారు. మరొకసారి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆయన్ని కలుసుకున్నారు. బోఫోర్సు కేసులో సంబంధం ఉన్న వారి పేర్లు మనకు అందనున్నాయని ఆయనే చెప్పారు. మనల్ని కలుసుకోమని గాని, మరో పదిహేనురోజుల్లో పేర్లు అందనున్నాయని గాని చెప్పమని మనంతట మనంగా ఆయన్ని కోరలేదు. ఇప్పుడు ఆ పేర్ల సంగతి ఏముంది? వాళ్ళకి వాస్తవాలని వెలుగులోకి తేవడం ఇష్టం లేదు. బోఫోర్సు ముడుపుల వెనుక ఉన్న వారి పేర్లను కూడా బయటికి తేవడానికి వారికిష్టంలేదు.

అన్ని పార్టీలకు చెందిన రైల్వే పునర్విభజన కమిటీ సభ్యులు అక్కడే ఉన్నారు. ఎలక్ట్రికల్ లోకోమోటెవ్స్ ఒప్పందాన్ని ఏషియా బ్రౌన్ బ్రోవరి కివ్వాలని వారంతా సూచించారు. కానీ వారు దాని బి.హెచ్.ఇ.యల్ కిచ్చారు. తర్వాత ఏమయిందోకాని, ఈ నిర్ణయాన్ని బుట్టదాఖలుచేసి, ఏషియాబ్రౌన్ బోవేరికి తిరిగి ఆర్డరు ఇచ్చారు. ఆ కారణాలేంటో ఆ భగవంతుడికే తెలియాలి.

మీకు ఈ పంచదార కుంభకోణం గూర్చి కూడా తెలుసు. ఒక రోజున ఆహారశాఖ మాజీమంత్రి కోపంతో ఊగిపోతున్నారు. అయినా ఆ కోట్లాది రూపాయల కుంభకోణానికి కారకులెవరో మీ అందరికీ తెలుసు. బాగా ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులతో పరిచయమున్న వ్యక్తులే దీనికి కారణము.

ఈ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల పదినెలల నుండి అధికారంలో ఉంది. పలు కుంభకోణాలు జరిగాయి. కుంభ కోణాల రూపంలో కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము పోయింది. ఈ సొమ్మంతా ఎక్కడికి పోతుంది. లాభపడుతుందెవరో ప్రభుత్వం తెలుసుకొని తీరాలని సంయుక్త పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. అయినా దీన్ని పట్టించుకోలేదు. ఈ స్కామ్స్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. అవినీతి పరులకు ప్రభుత్వం పూర్తిగా రక్షణ కవచంగా మారింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కొన్ని లోపాలున్నప్పటికీ మనము రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకుల పట్ల, ఎమ్మెల్యేలు, ఎం.పి.ల పట్ల విశ్వాసంతో ఉన్నాము. ప్రజల్లో విశ్వాసాన్ని పాదుకొల్పటానికి ప్రధానమంత్రి ముందుకు రావడానికి ఇదే సరైన సమయం. ఎందుకంటే మార్చి 1న సిబిఐ తన విధులని నేరుగా నిర్వహించడానికి తీర్పుకూడా వెలువడింది. □

# బ్యాంకులలో జరిగే కుంభకోణాలను నివారించాలి

నాకు మాట్లాడే అవకాశాన్నిచ్చినందుకు ధన్యవాదాలు. నా సహచరులు చెప్పినదాన్నే నేను మళ్ళీ చెప్పను. నేనొక కొత్త విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను. నిబంధనల స్థానాల గురించి, ఇతర విషయాలగురించి శ్రీ జస్వంత్‌సింగ్, శ్రీ ఇంద్రజిత్ గుప్తా చెప్పి నందున నేను మంత్రిగారి నుంచి ఒకేఒక వివరణ అడగాలనుకుంటున్నాను. ఇప్పటికే నెలకొన్న సంప్రదాయాలను, ఆచారాలను ప్రభుత్వం ఉల్లంఘించదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి పేర్కొన్నారు. పూర్వకాలం నుంచీ ఉన్న సంప్రదాయ ఆచారాల పట్ల తనకు దృఢ విశ్వాసం ఉందని ప్రభుత్వం చెబుతోంది. నేను ప్రభుత్వం నుంచి ఒక వివరణ కోరదలచాను. 3 కోట్ల రూపాయల చిన్న కుంభకోణానికి సంబంధించిన ముంద్రా వ్యవహారం కేసులో జవహర్లాల్ నెహ్రూకు అత్యంత విశ్వసనీయుడు, గొప్ప ఆర్థికవేత్త అయిన నాటి ఆర్థిక మంత్రి శ్రీ కృష్ణమాచారి పదవినుంచి దిగిపోవాల్సివచ్చింది. కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు నష్టమైనా, కాబినెట్ సభ్యులెవరూ రాజీనామా చేయలేదు.

బ్యాంకు లావాదేవీలు, సెక్యూరిటీల విధానంలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితులపై విచారణ చేసిన జాయింట్ కమిటీ నివేదిక - షేర్ మార్కెట్‌లో ఇంతకు ముందెన్నడూ లేని విధంగా అతిపెద్ద కుంభకోణం జరిగింది. దీనివల్ల బ్యాంకులు విడుదల చేసిన బాండ్ల విలువలో దాదాపు రూ. 804 కోట్ల తరుగుదల ఏర్పడిందని అంచనా వేశారు. జాతీయ బ్యాంకులను, విదేశీ బ్యాంకులను బ్రోకర్లు ఎలా ప్రభావితం చేస్తున్నారు? ఆర్థిక సంస్థలు తమ నిధులను విచక్షణా రహితంగా షేర్ మార్కెట్లలో ఎలా వినియోగిస్తున్నారు? ఇటువంటి అంశాలపై నివేదిక దృష్టి సారించింది. షేర్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టడం వల్ల కొద్ది మంది మాత్రమే లాభం పొందుతున్నారు. ఇన్వెస్టర్లు తమ డబ్బును పోగొట్టుకుంటున్నారు. వారిలో చాలామంది తాము కష్టించి సంపాదించిన మొత్తాన్ని కోల్పోతున్నారు. షేర్ మార్కెట్ల కుంభకోణాల వల్ల తాము నష్టపోయిన డబ్బు ఎక్కడికి వెళుతోంది? దానివల్ల ఎవరు లాభం పొందుతున్నారనే అంశాలపై నివేదిక సరైన వివరణ ఇవ్వలేదని చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికిగాను నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని జాయింట్ కమిటీ ప్రతిపాదించింది.

ప్రజల్లో ఉన్న సందేహాలను తొలగించటానికి మీరు చొరవ తీసుకుని కుంభకోణంపై నివేదికను పార్లమెంట్ సభ్యులందరికీ అందుబాటులో ఉంచాలి. దోషులనెవరినీ వెనకేసుకురావాలనే ఆలోచన నిజంగా మీకు లేనట్టయితే, మీరు ఆ నివేదిక ప్రతులను పార్లమెంటు సభ్యులందరికీ అందుబాటులో ఉంచాలన్నదే నా సూచన. □

# కోట్ల రూపాయిల ప్రజాధనాన్ని దోచుకు తింటున్నారు

అధ్యక్షా, మార్కెట్ విలువకన్నా తక్కువ విలువకే వాటాలను అమ్మినట్టు తెలిసింది. మా సమాచారం ప్రకారం ఆస్తులను సరిగా విలువ కట్టలేదు. ఎక్కువ ప్రభుత్వ రంగ సంస్థలు చాలాకాలం క్రితమే ఆస్తులను సమకూర్చుకున్నాయి. ఉదాహరణకు భూములు. తక్కువ ధరకు ఎప్పుడో వాటిని కొని పెట్టుకున్నారు.

కాని ఇప్పుడు వాటి విలువ ఎన్నెన్నో రెట్లు పెరిగింది వాటిని తక్కువగా వెలకట్టారు.

సరిగా వాటాల విలువ లెక్కకట్టకుండానే వాటిని అమ్మేస్తున్నారు. ప్రయోజనం పొందాల్సిన సామాన్య జనం, కార్మికులు కాకుండా బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు దానివల్ల లాభం పొందుతున్నారు. అందుకే ప్రభుత్వాన్ని కోరేదేమిటంటే వాటాల విలువను సరిగా లెక్కగట్టండి. సామాన్య జనానికి, ఏళ్ల తరబడి ఆయా కంపెనీలలో పనిచేస్తున్న కార్మికులకు ప్రాధన్యత ఇవ్వండి. వారెవరూ ముందుకు రాకపోతే ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వండి. ప్రభుత్వ సంస్థల, ప్రభుత్వ రంగ సంస్థల, దేశపౌరుల ప్రయోజనాలను కాపాడడానికి చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. కృతజ్ఞతలు.

నాకు మాట్లడడానికి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. గౌరవనీయ ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన ప్రత్యేక న్యాయస్థానాల బిల్లు అసాధారణ నేరాలకు పాల్పడిన ముద్దాయిలను, శిక్షంచడానికి ఉద్దేశించారు. బ్రోకర్లు, బ్యాంకు అధికార్లు, బ్రోకర్లకు సహకరించేవాళ్లు సంతకాలు, ష్యూరిటీలు తీసుకోకుండా వందల కోట్ల రూపాయలు ఇస్తుంటే బిల్లుద్వారా ఆయన ఏం సాధించదలచుకున్నారని అడుగుతున్నాను.

ఈ అధికార్లు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వారికి సహాయం చేస్తున్నారు. ఈ బిల్లు ద్వారా అటువంటి వారిమీద ఏం చర్య తీసుకుంటారు? బ్యాంకులకు రిజర్వ్‌బ్యాంక్ సరైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రాథమిక స్థాయిలో వాటిని అమలు చేయడం ఆయన బాధ్యత. పైగా ప్రభుత్వ, ప్రజల ప్రయోజనాలను కాపాడుటకు బ్యాంకులలో వాటిని ఆచరింపచేయాలి. ఇలా జరుగుతున్నదా అని మంత్రిని అడుగుతున్నాను.

సెక్షన్ 9 ప్రకారం ''నేరస్థుడిగా నిర్ధారితమైన వ్యక్తికి ప్రత్యేక కోర్టు చట్టప్రకారం తగు శిక్ష విధించాలి'' దీన్ని బట్టి ప్రవేశపెట్టిన బిల్లులో లోపాలున్నాయని భావిస్తున్నాను. దీనికి ఒక ఉదాహరణ చెపుతాను. చైనాకు పొగాకు ఎగుమతి అయింది. అది నాణ్యత తక్కువని తేలింది. పొగాకు వ్యాపారులతో మాట్లాడిన వారిని చైనా ప్రభుత్వం ఉరి తీసింది. పంపిన పొగాకు నాణ్యత చాలా తక్కువగా ఉంది. అటువంటి దెప్పుడు పంపించకూడదు.

ఇక్కడ వందల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము దోచుకుంటున్నారు. ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇక్కడ స్పష్టతలేని శిక్ష ఉంది. 'శిక్ష' అని చెప్పడమే కాని అది అమలవడానికి ఎన్ని గండాలో? పవన్ కుమార్ బన్సాల్ ప్రతిపాదించిన సవరణను ఆమోదించాలని మంత్రిని కోరుతున్నాను. డబ్బు విషయంలో మోసపుచ్చిన వ్యక్తి నుంచి బ్రోకర్‌తోగానీ, ఇతరులతోగానీ కుమ్మక్కయిన వారినుంచి డబ్బును తిరిగి రాబట్టాలి. కాని ఇపుడు జరుగుతున్నదేమిటి? సీబీఐ విచారణ చేస్తున్నది. ఈ పద్ధతి ఇంతకు ముందు నుంచి ఉన్నదే. వందల కోట్ల రూపాయలు పోతూనే ఉన్నాయి.

కాని ఆ డబ్బెక్కడికి వెళుతున్నదో మనకు తెలియదు. ఇండియాలో ఉంటున్నదా, లేదా అనే విషయం కూడా తెలియదు. అటువంటి డబ్బును తిరిగి రాబట్టాలి. అలాంటి బ్రోకర్లు, బ్యాంకు అధికార్లనుంచి తిరిగి రాబట్టడానికి నిబంధన చేయాలి.

ఈ నిబంధన పెట్టటం కోసం దీనికి సవరణ చేయాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను. అటువంటి ఆర్థిక నేరస్థులకు కఠిన శిక్షలు పడటానికి సవరణ తీసుకువచ్చి వందలకోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరుతున్నాను.

ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. □

**RYTHU VANI** *Vadde Sobhanadreeswara Rao*



- తాను విశ్వసించిన రాజకీయ సిద్ధాంతాల కోసం ప్రతికూల పరిస్థితులలో రాజకీయరంగ ప్రవేశం చేసి, ప్రజల్లో చైతన్యాన్ని కొనిరావడానికి ప్రయత్నిస్తూ, పిడివాద సిద్ధాంతాలను, విధానాలను అనేక రీతుల్లో నిరంతరం వ్యతిరేకించిన మేధావి.

- సమాజంలోని రైతుల, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం తపన చెందుతూ తాను చేసే ప్రతిపనీ వారికి మేలు చేకూర్చుతుందా లేదా అని నిరంతరం సమీక్షించుకొంటూ, ప్రజల ప్రేమాభిమానాలను పుష్కలంగా పొందుతున్న నేత.

- లక్ష్యంతోపాటు, దాన్ని సాధించడానికి అనుసరించే మార్గాలుకూడా పవిత్రంగా వుండితీరాలన్న అచంచల విశ్వాసంతో తన రాజకీయ జీవితాన్నంతటినీ నిర్మలంగా, నిష్కళంకంగా తీర్చిదిద్దుకోకల్గిన ఆదర్శ వాది.

- తాను ప్రాతినిధ్యం వహించే నియోజక వర్గ సమగ్ర అభివృద్ధికోసం అనేక కార్యక్రమాలు ప్రారంభించి, వాటిని చివరి వరకూ సమీక్షించుతూ వాటిలో ప్రజల్నే భాగస్వాముల్ని చేస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి అవిరళ కృషి చేసే ఆదర్శ ప్రజాప్రతినిధి.

- స్వేచ్ఛా విధానాల ముసుగులో జరిగే కుంభకోణాలను చీల్చిచెండాడి, దశాబ్దం క్రిందటే డంకల్ ప్రతిపాదనలు, ప్రపంచవాణిజ్య సంస్థ నిబంధనలు రైతాంగాన్ని ఎంతగా దెబ్బతీస్తాయో వెల్లడించి, పత్రికా రచనలు, సమావేశాల ద్వారా కూడా రైతులవాణిని శక్తివంతంగా వినిపించిన రైతు పార్లమెంటేరియన్.